
'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 193

గురువారం 3-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎవరిదో కిరీటం!

యూఏఈలో నేటి నుంచి మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ. -16లో



9 నెలల్లో 110.57 లక్షల కోట్లు

దలాల్ స్ట్రీట్ రికార్డు ర్యాలీ ప్రభావం. భారీగా పెరిగిన ఇన్వెస్టర్ల సంపద -17లో



తగ్గుతున్న హిందువులు

జార్ఖండ్‌లో హిందువులు, ఆదివాసీల జనాభా తగ్గిపోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



5,600 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

ఢిల్లీలో గతంలో ఎన్నడూ లేనంత పెద్ద మొత్తంలో 560 కిలోల కొకైన్‌ను పట్టుకున్నట్లు ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.

వివరాలు 6లో ▸



'కవచ్'కు లైన్ క్లియర్

ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు వచ్చినప్పుడు ప్రమాదాన్ని నిరోధించే 'కవచ్'ను అన్ని చోట్లా ఏర్పాటు చేసేందుకు రైల్వే సిద్ధమైంది.

వివరాలు 8లో ▸



ఎస్‌బీఐ విస్తరణ బాట

2024-25లో దేశవ్యాప్తంగా 600 బ్రాంచీలను ప్రారంభించాలని ఎస్‌బీఐ ప్రణాళికలు వేసింది.

వివరాలు 17లో ▸

చౌకబారు రాజకీయం!

అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌పై మంత్రి సురేఖ అనుచిత వ్యాఖ్యలు

- సమంత విడాకులు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్ మెయిల్ ఆరోపణలతో కలకలం
- సురేఖ మాటలు సరికాదంటూ రాజకీయ, సినీ ప్రముఖుల నుంచి విమర్శలు
- రాజకీయాల కోసం సినీ పరిశ్రమ మహిళలపై దుష్ప్రచారం చేయొద్దంటూ మండిపాటు
- కొండా సురేఖ మెడలో నూలు దండ వేసిన ఘటనపై బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ట్రోలింగ్‌తో వివాదం మొదలు
- బట్టలూడదీసి కొడతామన్న సురేఖ.. ఫినాయిల్‌తో నోరు కడుక్కోవాలన్న కేటీఆర్
- అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై సురేఖ ఆక్షేపణీయ వ్యాఖ్యలు
- తీవ్రస్థాయిలో విరుచుకుపడిన బీఆర్‌ఎస్ శ్రేణులు.. లీగల్ నోటీసు ఇచ్చిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య.. మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి కేటీఆర్‌ల మధ్య రాజకీయ వివాదం 'చౌకబారు' మలుపు తీసుకుంది. సినీనటి సమంత విడాకులు, రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను లేవనెత్తుతూ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బాధ్యతగల మంత్రి హోదాలో ఉన్న ఆమె.. నైతికతను పట్టించుకోకుండా అక్కినేని నాగార్జున కుటుంబంపై ఆక్షేపణీయ వ్యాఖ్యలు చేయడం, దానికి కేటీఆర్ బాధ్యుడంటూ ఆరోపణలు చేయడంతో కలకలం మొదలైంది. రాజకీయ నేతలు, సినీ ప్రముఖులు కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. రాజకీయపరమైన వివాదాల్లోకి సంబంధం లేని ఓ కుటుంబ అంతర్గత వ్యవహారాన్ని లాగడం, ఉచితానుచితాలను పట్టించుకోకుండా ఇష్టం వచ్చిన ఆరోపణలు చేయడం సరికాదని మండిపడుతున్నారు. తెలంగాణలో మహిళలంతా సంబురంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ వేళ.. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు, మహిళలే ఆక్షేపణీయ విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

అసలేమైందంటే...!

ఈ మొత్తం వివాదం వెనుక ఇటీవల మంత్రి కొండా సురేఖ మెదక్ పర్యటన సందర్భంగా జరిగిన ఘటన, దానిపై బీఆర్‌ఎస్ పేరిట సోషల్ మీడియాలో జరిగిన ట్రోలింగ్‌తో బీజం పడింది. అక్కడ జరిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఒక నూలు దండను మంత్రి సురేఖ మెడలో వేశారు. కొందరు ఈ ఫోటోను పెట్టి అసభ్య భావంతో ట్రోలింగ్ చేశారు. దీనిపై కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. సురేఖపై ట్రోలింగ్‌కు నిరసనగా కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు, చేనేత కార్మికులు తెలంగాణ భవన్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేస్తూ కొండా సురేఖను విమర్శించారు. తనను ట్రోల్ చేశారంటూ సురేఖ దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని వ్యాఖ్యానించారు. అనంతరం కొండా సురేఖ

మిగతా 2వ పేజీలో ▶



రాజకీయం కోసం ఇంత దిగజారుడు వ్యాఖ్యలా?

-అక్కినేని అమల



అసహ్యమేస్తోంది: నాని

- వివరాలు 2లో▶



'ఏంటీ సిగ్గులేని రాజకీయాలు.. సినిమాల్లో నటించే ఆడవాళ్లంటే చిన్న చూపా? జస్ట్ ఆస్కింగ్'

- ప్రకాశ్‌రాజ్



కొండా సురేఖ వ్యాఖ్యలు అసంబద్ధం. తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

'ఎక్స్'లో నాగార్జున



విడాకులు నా వ్యక్తిగత విషయం. సినీ పరిశ్రమలో ఓ మహిళ ఉండటానికి, బయటికి వచ్చి నిలబడి పోరాడటానికి చాలా ధైర్యం, బలం కావాలి కొండా సురేఖ. దయచేసి చిన్నచూపు చూడకండి.

'ఇన్‌స్టా'లో సమంత

ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన బీరుట్‌లోని భవనాలు



యుద్ధ భయం

ప్రపంచయుద్ధం దిశగా పశ్చిమాసియా ఘర్షణలు!

ఇజ్రాయెల్, ఇరాన్ రగడపై సర్వత్రా ఆందోళనలు

లెబనాన్, యెమన్, గాజాల్లో ఇప్పటికే కుంపట్లు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ కురిపించిన క్షిపణుల వర్షం రక్షణ నిపుణులతో పాటు ప్రపంచ దేశాలన్నింటినీ ఆందోళనకు గురి చేస్తోంది. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి ఆరంభ సూచికేనంటూ వెల్లువెత్తుతున్న విశ్లేషణలతో ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది. రెండు రోజులుగా సోషల్ మీడియాలో ఇదే ట్రెండింగ్ టాపిక్‌గా మారింది.

ఇజ్రాయెల్‌కు ప్రాణనష్టం

హెజ్‌బొల్లాపై యుద్ధంలో 8 మంది సైనికులు మృతి

ఇరాన్, కాచుకో!

ఇరాన్ దిద్దుకోలేని తప్పు చేసిందన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

ఇరాన్‌కు వెళ్లొద్దు

భారతీయులెవరూ ఇరాన్‌కు వెళ్లొద్దని సూచించిన విదేశాంగ శాఖ

గాజాపై భూతల దాడులు

దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ సేనలు చేస్తున్న భీకర భూతల దాడుల్లో 51 మంది మరణించారు.



- వివరాలు 6లో▶



నేలంతా పూబంతి

తీరొక్క పూలు.. ఊరూవాడా సంబురాలు.. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. వరంగల్ వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో వేలాది మంది మహిళలు పాటలు పాడుతూ, కోలాటమాడుతూ గౌరీదేవిని కొలిచారు.

- హనుమకొండ కల్చరల్

ఇజ్రాయెల్‌లో మా వాళ్లు ఎలా ఉన్నారో?

- ఇరాన్ దాడుల నేపథ్యంలో తెలుగువారి ఆందోళన
- ఇజ్రాయెల్‌లో నివాసం ఉంటున్న 5 వేల మంది తెలుగు వారు
- తెలంగాణ నుంచి 800 మంది కార్మికులు
- ఫోన్లు చేసి క్షేమ సమాచారం కనుక్కుంటున్న కుటుంబ సభ్యులు

7 లో



బంకర్‌లో తల దాచుకున్న నిజామాబాద్ జిల్లా వాసులు



ఢిల్లీకి డబ్బు కట్టల కోసమే హైడ్రా

రాహుల్‌గాంధీ చెప్పినందుకే మూసీ ప్రాజెక్టు చేపట్టారు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు
- హైడ్రా, ఆర్‌ఆర్ ట్యాక్స్‌తో హైదరాబాద్ సిటీలో 35 లక్షల మంది ఉపాధి గల్లంతు
- మంత్రి కొండా సురేఖ ఏడుపులు, పెడబొబ్బలు ఎందుకో చెప్పాలి
- గతంలో ఆమె చేసిన ఆరోపణలతో తమ ఇంట్లో మహిళలు బాధపడ్డారన్న కేటీఆర్
- సీఎం రేవంత్ నోటిని మంత్రులు ఫినాయిల్‌తో కడగాలని వ్యాఖ్య

2 లో

దామగుండం.. రాడార్ గండం!



వికారాబాద్ జిల్లాలోని రిజర్వ్ ఫారెస్టులో నేవీ రాడార్ నిర్మాణానికి సర్కారు అనుమతి

- ఈ నెల 15న శంకుస్థాపన?.. 2,900 ఎకరాలను స్వాధీనం చేసుకోనున్న తూర్పు నావికాదళం
- 12 లక్షల చెట్లను నరికివేస్తారంటూ ప్రచారం
- తమ ప్రాంతంలోనే తాము పరాయివారిగా మారిపోతామంటున్న స్థానికులు
- పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతుందంటున్న పర్యావరణవేత్తలు
- చుట్టుపక్కల గ్రామాలతో పాటు హైదరాబాద్‌పైనా ప్రభావం!
- వ్యూహాత్మకంగా చాలా అనువైన ప్రాంతం అంటున్న నేవీ.. ఎవరికీ నష్టం వాటిల్లబోదని వెల్లడి
- 1.5 లక్షల చెట్లు తొలగించే అవకాశం ఉందని అటవీ శాఖ అంచనా.. ప్రత్యామ్నాయంగా 17.5 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: దామగుండం.. అడవుల్లో నేవీ రాడార్ నిర్మాణం ప్రతిపాదనతో ఈ ప్రాంతం వార్తలకెక్కింది. తమ ఉనికికి ముప్పు వాటిల్లుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తుండటంతో చర్చనీయాంశంగా మారింది. జీవ వైవిధ్యానికి ముప్పు పొంచి ఉందని, అడవుల విధ్వంసానికి పాల్పడితే భవిష్యత్తు తరాలకు అన్యాయం చేసిన వాళ్లమవుతామని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీనే దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని సమాచారం.

ఔషధ మొక్కలకు నిలయం.. వందల ఏళ్ల ఆలయం

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం రిజర్వ్ ఫారెస్టు పచ్చని చెట్లతో జీవవైవిధ్యానికి మారుపేరుగా ఉంటుంది. వందల ఏళ్లుగా ప్రజలకు జీవనాధారంగా, జంతు జాతులు, పక్షులకు ఆలవాలంగా ఉంది. దాదాపు 206 రకాల జాతుల పక్షులకు ఈ అడవులు నెలవుగా ఉన్నాయని పలు పరిశోధనలు చెబుతున్నాయి. ఎన్నో ఔషధ గుణాలున్న మొక్కలకు ఈ అడవి నిలయం. ఈ అడవుల మధ్యలోనే 400 ఏళ్ల నాటి రామలింగేశ్వర ఆలయం కూడా ఉంది. చుట్టుపక్కల

మిగతా 14వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ప్రశ్నించడమే రాజకీయం



ప్రజాస్వామ్యం సజీవంగా ఉండాలన్నా, దానిని కాపాడుకోవాలన్నా మేధావులు చర్చిస్తేనే సాధ్యం అవుతుందని మంథన్ సంవాద్ వేదికగా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 'మంథన్ సంవాద్'13వ ఎడిషన్ బుధవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికపై జరిగింది.

- వివరాలు 14లో▶

పన్ను ఆదాయం 35 శాతమే



ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 5 నెలల తర్వాత కూడా రాష్ట్ర బడ్జెట్ అంచనాల్లో 35.11 శాతం మాత్రమే పన్ను రాబడులు వచ్చాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.64 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, ఆగస్టు 31 నాటికి రూ.57వేల కోట్లు మాత్రమే వచ్చింది.

- వివరాలు 8లో▶

'ఈశాన్య' సీజన్‌లోనూ జోరు వానలు



ఈశాన్య రుతుపవనాల సీజన్‌లోనూ వానలు జోరుగా ఉంటాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ సీజన్‌లో సగటు వర్షపాతం 11.32 సెం.మీ. కాగా, సీజన్ ముగిసేనాటికి ఇంతకుమించి నమోదవుతుందని అంచనా.

- వివరాలు 7లో▶

పూర్తవని కూడికలు, తీసివేతలు



రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ పోస్టుల భర్తీ మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఏ యూనివర్సిటీకి ఎవరిని నియమించాలనే అంశంపై కసరత్తు దాదాపు పూర్తయినప్పటికీ, కూడికలు, తీసివేతలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



మన 'టైం' బాగుంటే మనకే వస్తుంది సార్!

క్లుప్తంగా...

రాహుల్‌గాంధీపై నింద మోపుతావా?

ఆయనది త్యాగాల కుటుంబం... నీది చిల్లర కుటుంబం: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్న పదేళ్ల రాజభోగాలు అనుభవించిన కేటీఆర్ మరో పదేళ్ల ఓపిక పట్టాలని, ఆవేశపడి మాట్లాడటం మానుకోవాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కేటీఆర్ అపరిపక్వతతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గాంధీ కుటుంబం గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...52 ఏళ్ల ఈ దేశాన్ని పాలించిన గాంధీ కుటుంబ ఆస్తులు, పదేళ్లు తెలంగాణను పాలించిన కేసీఆర్ కుటుంబ ఆస్తులేంటో ప్రజలకు బాగా తెలుసన్నారు. అందరూ వారిలాగానే సంపాదిస్తారని అనుకోవద్దని, గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమైతే, కేసీఆర్ కుటుంబం చిల్లర కుటుంబమని వ్యాఖ్యానించారు. మూసీ డబ్బులతో బతకాలని రాహుల్ అనుకుంటాడా అని ప్రశ్నించారు. కొండా సురేఖ విషయంలో ఆమె తప్పేమీ లేదని, పార్టీ సోషల్‌మీడియాను నియంత్రించకపోవడం కేటీఆర్ తప్పు అని అన్నారు.

రేవంత్‌రెడ్డి కుట్రలకు పావులుగా పోలీసులు

బీఆర్‌ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోలీస్ యంత్రాంగం రేవంత్‌రెడ్డి కుట్రలకు పావులుగా మారుతోందని బీఆర్‌ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో మంగళవారం పట్టపగలు కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి జరిగిందని, పోలీసులు కనీసం స్పందించలేదని అన్నారు. కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న వారిని పోలీసులు ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ భవన్ వద్దకు కాంగ్రెస్ నేతలు వచ్చి దిష్టిబొమ్మను దగ్ధం చేసే ప్రయత్నం చేశారని, అడ్డుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలపైన కేసులు పెట్టారని అన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఆగిన మూసీ నిర్వాసితుని గుండె



మృతుడు కుమార్

అంబర్‌పేట: గూడు కూలుస్తారన్న వార్తలతో ఓ వ్యక్తి గుండె ఆగింది. ఈ ఘటన బుధవారం అంబర్‌పేట నియోజకవర్గం మూసీ పరీవాహక ప్రాంతమైన లంక బస్తీలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గనాథా కుమార్ (51) చిన్నపాటి ఇంట్లో ముగ్గురు కుమారులతో కలిసి ఉంటున్నారు. గత 15 రోజులుగా ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఇళ్లు కూల్చివేస్తుందని ప్రచారం జరుగుతోంది. దీంతో గనాథా కుమార్ తీవ్ర మనస్తాపం చెందాడు. దానికితోడు అధికారులు కొద్దిరోజుల క్రితం మార్కింగ్ కూడా చేశారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన కుమార్‌కు బుధవారం ఉదయం గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందాడు. బస్తీలో నిర్వాసితులకు భరోసా ఇచ్చేందుకు వచ్చిన సీపీఎం నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మృతుని నివాసానికి వచ్చి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కూల్చివేతల అంశంపై బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అదానీతో భేటీ ఆంతర్యమేంటి?

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్‌లో అదానీతో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో నంబర్ 2గా చెప్పుకొంటున్న మంత్రి ఎందుకు కలిశారు? మరీ ముఖ్యంగా సునీల్ కనుగోలు ఈ భేటీలో ఏం చేస్తున్నారు?.. అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. రాయదుర్గంలోని విలువైన 84ఎకరాల భూమిని ఆక్రమించేందుకే అదానీ, కాంగ్రెస్ నడుమ దోస్తీ కుదిరిందా? అని ఆయన ప్రశ్నించారు.

చౌకబారు రాజకీయం!

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.

అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావిస్తూ..

గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముడికి నివాళులర్పించిన అనంతరం బాపూఘాట్ వద్ద, గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. తన వ్యక్తిత్వాన్ని హత్య చేయాలని బీఆర్‌ఎస్ నేతలు చూస్తున్నారని.. అలాంటప్పుడు తాను దొంగ ఏడుపులు ఎందుకు ఏడుస్తానని ప్రశ్నించారు. సినీ నటి సమంత, నాగార్జున కుమారుడు నాగచైతన్య విడిపోవడానికి కేటీఆరే కారణమని.. ఆయన చాలా మంది హీరోయిన్లను బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''నాగచైతన్య, సమంత విడిపోవడానికి కారణం కేటీఆరే. చాలా మంది హీరోయిన్లు సినిమా ఫీల్డ్ నుంచి తప్పుకుని త్వరగా పెళ్లిళ్లు చేసుకోవడానికి కారణం కూడా కేటీఆరే. ఆయన డ్రగ్స్‌కు అలవాటు పడి, వాళ్లకూ డ్రగ్స్ అలవాటు చేశారు. వాళ్ల జీవితాలతో ఆడుకునేలా బ్లాక్‌మెయిల్ చేసి ఇబ్బందులు పెట్టారు. వాళ్లను డ్రగ్స్ కేసులో ఇరికించి ఆయన తప్పుకున్నారు. వాళ్ల ఫోన్లు ట్యాప్ చేసి, రహస్యంగా మాట్లాడుకున్న విషయాలను రికార్డు చేసి వాళ్లకు వినిపించేవారు. ఆ రికార్డులను అడ్డుపెట్టుకుని బెదిరించేవారు'' అని కొండా సురేఖ ఆరోపించారు. నిజానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ తనను ట్రోల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, కానీ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి గురించి, మంత్రి సీతక్క గురించి కూడా గతంలో ఇలాంటి పోస్టులే పెట్టారని.. ఇప్పుడు తనపై పెడుతున్నారని మండిపడ్డారు. తనపై ట్రోలింగ్ చేసినవారు, వారి వెనుక ఉండి నడిపిస్తున్న వారిపై కేసులు పెడుతున్నామని చెప్పారు.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్..

కొండా సురేఖపై ట్రోలింగ్, ఆమె చేసిన వ్యాఖ్యల వ్యవహారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల మంటలు రేపుతోంది. మెదక్ ఘటనపై సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ అనుయాయులు చేసిన ట్రోల్స్‌పై కొండా సురేఖ, ఇతర కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న మంత్రుల నోర్లు ఫినాయిల్‌తో కడుక్కోవాలని వ్యాఖ్యానించారు. మరో మంత్రి సీతక్క తిరిగి కేటీఆర్ నోరే యాసిడ్‌తో కడుక్కోవాలని విమర్శించారు. కొండా సురేఖతో పెట్టుకోవడం అంత సులువు కాదని, కేటీఆర్ రెచ్చగొట్టి మరీ ఆమెతో తన్నించుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కేటీఆర్ మహిళా మంత్రుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటూ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు విమర్శలు గుప్పించారు. మరోవైపు కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలపై.. బీఆర్‌ఎస్ మహిళా నేతలు తీవ్రంగా మండిపడ్డారు. కొండా సురేఖ నోటి దురుసు గురించి అందరికీ తెలుసని, ఇంకోసారి మాట్లాడితే కోర్టుకు ఈడుస్తామంటూ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, నేత తుల ఉమ హెచ్చరించారు. మహిళా మంత్రులను శిఖండులుగా పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

కొండా సురేఖ వ్యాఖ్యలు అసంబద్ధం

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను మీ ప్రత్యర్థులపై విమర్శల కోసం వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

– 'ఎక్స్'లో సినీ నటుడు నాగార్జున

నా విడాకులకు, రాజకీయ కుట్రకు సంబంధం లేదు

విడాకులు నా వ్యక్తిగత విషయం. దాని గురించి ఊహాగానాలు చేయడం మానుకోవాలని అభ్యర్థిస్తున్నా. సినీ పరిశ్రమలో ఓ మహిళ ఉండటానికి, బయటికి వచ్చి నిలబడి పోరాడటానికి చాలా ధైర్యం, బలం కావాలి కొండా సురేఖ. ఈ ప్రయాణం నన్ను మార్చినందుకు గర్వపడుతున్నాను. దయచేసి చిన్నచూపు చూడకండి. ఒక మంత్రిగా మీ మాటలకు విలువ ఉందని మీరు గ్రహించారని ఆశిస్తున్నాను. వ్యక్తిగత విషయాలపై మాట్లాడేప్పుడు బాధ్యతగా, గౌరవంగా ఉండాలని నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను. నా విడాకులు పరస్పర అంగీకారం, సామరస్యపూర్వకంగా జరిగాయి. ఎటువంటి రాజకీయ కుట్రకు ప్రమేయం లేదు. దయచేసి నా పేరును రాజకీయ పోరాటాలకు దూరంగా ఉంచండి. నేను ఎప్పుడూ రాజకీయాలకు అతీతంగా ఉంటాను. అలానే ఉండాలని కోరుకుంటున్నాను.

– 'ఇన్‌స్టా'లో నటి సమంత పోస్ట్

సీఎం రేవంత్ స్పందించాలి..



అక్కినేని కుటుంబంపై తెలంగాణ మహిళా మంత్రి చేసిన కామెంట్స్ చూసి షాక్ తిన్నాను. ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. నేను ఎంతగానో గౌరవించే సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలి. బాధ్యతారహిత, కించపరిచే వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖతో క్షమాపణ చెప్పించాలి. సినీ రంగం మొత్తం ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాలి.

– సినీ రచయిత
కోన వెంకట్

రాజకీయం కోసం ఇంత దిగజారుడు వ్యాఖ్యలా?

ఒక మహిళా మంత్రి రాక్షసిలా మారి చేసిన వ్యాఖ్యలు విని షాక్ అయ్యాను. హుందాగా ఉండే పౌరులను రాజకీయం కోసం వాడు కోవడం దారుణం, దిగ్భ్రాంతికరం. సిగ్గు లేకుండా నా భర్త గురించి తప్పుడు ప్రచారా లు చేస్తున్న అలాంటి వారిని నమ్ముతారా? ఇలాంటి ప్రచారాలు నిజంగా సిగ్గుచేటు. నాయకులు తమను తాము దిగజార్చుకుని నేరస్తుల్లా ప్రవర్తిస్తే మన దేశం ఏమవుతుంది? రాహుల్ గాంధీ.. మీకు వ్యక్తుల హుందాతనం మీద నమ్మకం ఉంటే దయచేసి మీ నేతలను అదుపులో ఉంచుకోండి. ఆ మహిళా మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, నా కుటుంబానికి క్షమాపణ చెప్పమనండి. ఈ దేశ పౌరులను రక్షించండి.

– అక్కినేని అమల

సురేఖ వ్యాఖ్యలు ఆమోదనీయం కాదు



విడాకులు తీసుకోవాలనే నిర్ణయం జీవితంలో బాధా కర నిర్ణయాలలో ఒకటి. జీవిత లక్ష్యాలు భిన్నంగా ఉన్న కారణంగా.. చాలా ఆలోచించుకుని నేను, నా మాజీ జీవిత భాగస్వామి విడిపోవాలని నిర్ణయించుకున్నాం. ఇప్పటివరకు దీనిపై ఎన్నో నిరాధార వదంతులు వచ్చాయి. నా మాజీ జీవిత భాగస్వామి మీద, నా కుటుంబం మీద ఉన్న గౌరవంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయాను. ఇవాళ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అబద్ధం, ఏమాత్రం ఆమోదనీయం కాదు.

– అక్కినేని నాగచైతన్య

అసహ్యమేస్తోంది

రాజకీయ నాయకులు ఎలాంటి అవాస్తవాలు మాట్లాడినా తప్పించుకోవచ్చని అనుకోవడం చూస్తే అసహ్యమేస్తోందని నటుడు నాని వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మంత్రి మాటలు చాలా బాధ్యతారహితంగా ఉన్నప్పుడు.. ప్రజల పట్ల ఆమెకు ఏదైనా బాధ్యత ఉంటుందని ఆశించడం తెలివితక్కువ పని.. అని వ్యాఖ్యానించారు. ఇది కేవలం నటులు లేదా సినిమా గురించి కాదని.. ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని స్పష్టం చేశారు. గౌరవప్రదమైన హోదాలో ఉన్న వ్యక్తి మీడియా ముందు ఇలా నిరాధారమైన మాటలు మాట్లాడడం సరైంది కాదని పేర్కొన్నారు. సమాజాన్ని చెడుగా ప్రతిబింబించే ఇలాంటి ఆచారాన్ని మనందరం ఖండించాలని నాని విజ్ఞప్తి చేశారు.

– నటుడు నాని

బహిరంగ క్షమాపణ చెప్పాలి

రాజకీయ మైలేజీ కోసం తెలుగు చిత్ర పరిశ్రమలోని మహిళలపై దుష్ప్రచారాలు చేయకండి. ఈ విషయంపై మంత్రి కొండా సురేఖ బహిరంగ క్షమాపణలు చెప్పాలని మేం డిమాండ్ చేస్తున్నాం. స్టాప్ దిస్ నాన్సెన్స్.

– వాయిస్ ఆఫ్ విమెన్ ఇన్ టీఎఫ్ఐ
(తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ)

హైడ్రా పేరిట వసూళ్లు నిరూపిస్తే మూసీలో దూకుతా

నిరూపించలేకపోతే నువ్వు దూకుతావా?

- కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సవాల్
- మహిళలను బీఆర్‌ఎస్‌లో ఎదగనివ్వరు: మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏం చదువుకున్నారో అర్థం కావడం లేదని, రాహుల్ గాంధీకి, మూసీకి, హైడ్రాకు ఏం సంబంధముందని ఆయన మాట్లాడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. హైడ్రా పేరిట వసూళ్లు చేసినట్టు నిరూపిస్తే తాను పురానాపూల్ బ్రిడ్జి మీద నుంచి మూసీలో దూకుతానని, లేదంటే కేటీఆర్ దూకాలని ఆయన సవాల్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలసి ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ నేతలు యథేచ్ఛగా కబ్జాలు చేశారని, అందుకే హైడ్రా అనగానే భయాందోళనలకు గురవుతున్నారని వ్యా ఖ్యానించారు. చెట్లు, లిక్కర్, ఇరిగేషన్ పేరు మీద దోచుకుని రా ష్ట్రాన్ని లూటీ చేశారని, ఇప్పుడు ఆ సొమ్ముతో సోషల్‌మీడియాలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడిస్తున్నారని ధ్వజమెత్తారు. మూసీ చుట్టూ ఉన్న ఒక్క ఇల్లును కూడా ఇప్పటివరకు తొలగించలేదని, ఒకవేళ తొలగించాల్సి వచ్చినా చట్టబద్ధంగా నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. అసలు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు, హైడ్రాకు సంబంధం లేని, డీపీఆర్ తయారు కాకుండానే మూసీ అభివృద్ధికి ఎంత ఖర్చవుతుందో ఎలా చెప్తామని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణకు సమయం పడుతుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ గురించి అసభ్యంగా ట్రోల్ చేసిన విషయంలో బావకు ఉన్న సోయి బావమరిదికి లేదని, అందుకే కేటీఆర్ ట్రోల్స్‌ని ఖండించలేదని అభిప్రాయపడ్డారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని మహేశ్‌గౌడ్ ఈ సందర్భంగా చెప్పారు.

మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది: మంత్రి సురేఖ



బీఆర్‌ఎస్‌లో రాజకీయంగా మహిళలను ఎదగనివ్వరని మంత్రి కొండా సురేఖ అన్నారు. అందుకే బొడిగె శోభ, రేఖానాయక్‌తో పాటు తనకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. కుటుంబ పాలన నడవాలి కాబట్టే తమకు పదవులు ఇవ్వలేదని చెప్పారు. తనపై సోషల్‌మీడియాలో చేసిన కామెంట్లను మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుందని చెప్పారు. తాము బీఆర్‌ఎస్ లాగా సోషల్‌మీడియాను దుర్వినియోగం చేయబోమన్నారు. మూసీ చుట్టూ ఉన్న ఇళ్లను కూల్చకముందే బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించిన సురేఖ.. బతుకమ్మ పండుగకు ఏమివ్వాలన్న దానిపై ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

పేదల కష్టార్జితంపై ప్రభుత్వం దౌర్జన్యం

అంబర్‌పేట గోల్నాకలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన



నిర్వాసితులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

అంబర్‌పేట (హైదరాబాద్): మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లు కూలుస్తామంటే తాము అడ్డుకుంటామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని మూసీ పరీవా హక ప్రాంతాల్లో పర్యటించి నిర్వాసితులకు ఆయన భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని ఓదార్చారు. కిషన్‌రెడ్డితో బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతంలో ప్రజలు కబ్జాలు చేయలేదని, వారి కష్టార్జితంతో ఇళ్లు కట్టుకున్నారని అన్నారు. ఈ ఇళ్లను ప్రభుత్వం అభివృద్ధి పేరిట కూల్చివేస్తామంటే బీజేపీ అడ్డుగా నిలుస్తుందని హెచ్చరించారు. మూసీ అభివృద్ధి కోసం రూ. 1.50 లక్షల కోట్లతో పనులు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, వాస్తవానికి ప్రభుత్వం దగ్గర అంత ఆర్థిక స్తోమత ఉందా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 1.30 లక్ష కోట్లతో కాళేశ్వరం నిర్మించి అవినీతికి పాల్పడిందని ఆయన ఆరోపించారు.

షార్ట్ ఫిల్మ్‌ను విడుదల చేసిన కిషన్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు మంచి ఆలోచనతో ముందుకెళ్లాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సామాజిక స్పృహతో నగర విద్యార్థిని స్ఫూర్తి థియావేదుల 'టుమారో విల్ నాట్ కేర్ ఆఫ్ ఇట్సెల్ఫ్'అనే సందేశాత్మక లఘు చిత్రాన్ని కిషన్‌రెడ్డి విడుదల చేశారు. స్ఫూర్తి వేదులను అభినందించారు.

ఢిల్లీకి డబ్బు కట్టల కోసమే హైడ్రా

రాహుల్‌గాంధీ చెప్పినందుకే మూసీ ప్రాజెక్టు చేపట్టారు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు
- బీజేపీ నేతల ఒత్తిడితోనే హైడ్రా ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించారు
- మంత్రి కొండా సురేఖ ఏడుపులు, పెడబొబ్బలు ఎందుకో చెప్పాలి
- సీఎం రేవంత్ నోటిని మంత్రులు ఫినాయిల్‌తో కడగాలని వ్యాఖ్య



బీఆర్‌ఎస్ భవన్‌కు వచ్చిన బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, పల్లా తదితరులు

సాక్షి, హైదరాబాద్: ''డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టుకు రాహుల్ గాంధీ అనుమతి ఇచ్చారు. ఢిల్లీకి కావాల్సిన డబ్బు కట్టల కోసమే రాహుల్ గాంధీ హైడ్రాను సృష్టించారు. ఆయనే రేవంత్‌రెడ్డి వెనుక ఉండి పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపి కూల్చుతున్నారు. మూసీ ప్రాజెక్టు పనులను ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారనే వివరాలు కూడా త్వరలో బయటపెడతా..'' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. కర్ణాటక సీఎం స్కాముల్లో చిక్కుకున్నారని.. డీకే శివకుమార్ తనకు సీఎం పదవి ఇస్తేనే డబ్బులు ఇస్తానని చెప్తున్నారని... దీంతో డబ్బుల కోసం తెలంగాణను లూటీ చేయాలని రాహుల్ అనుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇది మూసీ బ్యూటిఫికేషన్ కాదని, లూటిఫికేషన్ అని వ్యాఖ్యానించారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్‌కు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పెద్దల ఒత్తిడితోనే గవర్నర్ ఆమోదం తెలిపారని ఆరోపించారు.

'మూసీ'పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

''కేవలం రూ.16 వేలకోట్లు ఖర్చయ్యే మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు బంగారం తాపడం చేసినా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు కావు. ప్రాజెక్టు వ్యయం విషయంలో సీఎం, మంత్రులకు సఖ్యత లేక తలా ఓ రకంగా చెప్తున్నారు. హైడ్రా, ఆర్‌ఆర్ ట్యాక్స్ మూలంగా ఇప్పటికే హైదరాబాద్‌లో 35 లక్షల మంది కార్మికుల ఉపాధి గల్లంతయింది. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి కనీసం డీపీఆర్ కూడా లేదు. ఈ ప్రాజెక్టును రిజర్వు బ్యాంకుగా మార్చుకునేందుకు రేవంత్ ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాన్ని బయటపెడతాం. ఒకట్రెండు రోజుల్లో ప్రజలకు అర్థమయ్యేలా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం..''అని కేటీఆర్ తెలిపారు. హైడ్రాపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది పేదలను ఆక్రమణదారులుగా, దొంగలుగా చిత్రీకరిస్తూ అన్యాయం చేస్తే తాము ఊరుకోబోమన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మూసీ ప్రాజెక్టు గురించి అవగాహనే లేదని దమ్ముంటే మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించాలని సవాల్ చేశారు.

కొండా సురేఖ దొంగ ఏడుపులు దేనికి?

అవమానించేలా పోస్టులు పెట్టారంటూ మంత్రి కొండా సురేఖ దొంగ ఏడుపులు, పెడబొబ్బలు పెడుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ''గతంలో కొండా సురేఖ ఆరోపణలు చేసినవారు మహిళలు కాదా? వారికి మనోభావాలు లేవా? మా మీద అడ్డగోలు ఆరోపణలు చేసినప్పుడు మా ఇంట్లో మహిళలు బాధపడలేదా? ఏడవలేదా? మా పార్టీ తరఫున ఎవరూ కొండా సురేఖపై తప్పుగా మాట్లాడలేదు. గతంలో సోషల్ మీడియాలో మాపై ట్రోలింగ్ పేరిట దాడి జరిగింది. అప్పుడు సురేఖ మాట్లాడిన బూతు మాటలను గుర్తు తెచ్చుకోవాలి. నేను హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేశానంటూ కామెంట్లు చేశారు. గతంలో కొండా సురేఖ మాట్లాడిన వీడియోలు కావాలంటే మీడియాకు పంపిస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన బేకార్ మాటలను కూడా మీడియాకు, మంత్రులకు పంపిస్తాం. మంత్రులు కొండా సురేఖ, సీతక్క వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటిని ఫినాయిల్‌తో కడగాలి..'' అని పేర్కొన్నారు.

కొండా సురేఖ క్షమాపణలు చెప్పాల్సిందే..: హరీశ్‌రావు



మంత్రి కొండా సురేఖ చేసిన అవమానకర వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాల్సిందేనని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'మీపై ఎవరైనా వ్యక్తిగత దాడి చేస్తున్నారంటే వారి వద్ద చర్చించేందుకు ఒక్క రాజకీయ వాదన కూడా లేదని అర్థం' అన్న బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరేట్ థాచర్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. ''వాదనలో విఫలమయ్యే వారే వ్యక్తిగత దాడులు చేస్తారు. వారి అబద్ధాలను సమర్థించుకోలేని సందర్భంలో మీ వ్యక్తిత్వంపై దాడి చేస్తారు''అనే సూక్తిని గుర్తుంచుకోవాలన్నారు.

''కాంగ్రెస్‌వి థర్డ్ రేట్ రాజకీయాలు.. అమాయకులైన మహిళలు, వారి కుటుంబాలపై నిరాధార ఆరోపణలతో వివాదాల్లోకి లాగడం సరికాదు..'' అని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు.

కొండా సురేఖ మర్యాద ఇచ్చి పుచ్చుకోవాలి: సబితా ఇంద్రారెడ్డి



మర్యాద అనేది ఇచ్చుపుచ్చుకోవడంలో ఉంటుందని.. కేటీఆర్ గురించి కొండా సురేఖ వ్యాఖ్యలు ఆక్షేపణీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ''రాజకీయాల్లో వ్యక్తిగత ఆరోపణలు చేయకూడదు. తిరిగి ఆస్కారం ఇవ్వకూడదు. వ్యవస్థలో లోటుపాట్ల గురించి మాట్లాడాలి. ఆదర్శంగా ఉండాలి. కొండా సురేఖ చేసిన ఆరోపణల వల్ల కేటీఆర్ అమ్మ, భార్య, బిడ్డ, చెల్లి బాధపడరా? వాళ్లు ఆడబిడ్డలు కారా? తోటి మహిళగా ఆలోచించారా? పదవిలో ఉండి కూడా బాధ్యతారహితంగా మాట్లాడడం బాధాకరం''అని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డి శిఖండి రాజకీయం ఇది: సత్యవతి రాథోడ్



మహిళా మంత్రులను అడ్డుపెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. వారితో సంస్కారహీనంగా మాట్లాడిస్తూ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ''సినిమా పరిశ్రమలోని మహిళలతో సంబంధాలు అంటగడతారా? దీనిపై సినిమా పరిశ్రమలో ఉన్న మహిళలు స్పందించాలి. మేం బతుకమ్మకు చీరలు పంపిణీ చేస్తే.. కొండా సురేఖ బజారు భాష మాట్లాడుతోంది..''అని మండిపడ్డారు.

ఇలా మాట్లాడితే నాలుక చీరేస్తాం: మాలోత్ కవిత



కొండా సురేఖ వ్యాఖ్యలపై ఒక మహిళగా సిగ్గుపడుతున్నానని మాజీ ఎంపీ మాలోత్ కవిత పేర్కొన్నారు. నాగార్జున, సమంత కుటుంబాన్ని ఎన్నిసార్లు రోడ్డుకు ఈడుస్తారని ప్రశ్నించారు. కేటీఆర్‌పై మరోమారు ఈ తరహా వ్యాఖ్యలు చేస్తే నాలుక చీరేస్తామని హెచ్చరించారు.

ఇంత హేయమైన వ్యాఖ్యలు చేస్తారా?: రోజా



అక్కినేని కుటుంబంపై ప్రత్యేకించి సమంతపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏపీ మాజీ మంత్రి, సినీనటి రోజా పేర్కొన్నారు. ''కొండా సురేఖపై బీఆర్‌ఎస్ పార్టీ అనుయాయులు చేసిన పోస్టులను సమాజం వ్యతిరేకించింది. కానీ కొండా సురేఖ అంతకన్నా హేయమైన వ్యాఖ్యలు చేశారు. మీకు, మీ ప్రత్యర్థులకు ఉన్న రాజకీయ వివాదాల్లోకి సంబంధం లేని మహిళను తీసుకురావడం దుర్మార్గం..''అని తెలిపారు.

కొండా సురేఖకు కేటీఆర్ లీగల్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ తనపై చేసిన వ్యాఖ్యల పట్ల బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం లీగల్ నోటీసులు పంపించారు. తన గౌరవానికి భంగం కలిగించాలనే దురుద్దేశంతోనే ఆమె వ్యాఖ్యలు చేశారని నోటీసులో పేర్కొన్నారు. ''కేవలం రాజకీయ కక్షతో, రాజకీయ ప్రయోజనాల కోసం నా పేరును కొండా సురేఖ వాడుకుంటున్నారు. ఒక మహిళ అయి ఉండీ మరో మహిళ పేరును, సినిమా నటుల పేరును వాడుకొని వారి వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడడం దురదృష్టకరం. నాకు సంబంధమే లేని ఫోన్ ట్యాపింగ్, ఇతర అంశాలపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు పూర్తి అసత్యం. ఒక మంత్రిగా కొండా సురేఖ తన హోదాను దుర్వినియోగం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆమె చేసిన అసత్య వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ఆ వ్యాఖ్యలను సాధారణ ప్రజలు నిజాలుగా భ్రమపడే అవకాశం ఉంది. ఒక మంత్రిగా తన సహచర అసెంబ్లీ సభ్యుడనే సోయి కూడా లేకుండా కొండా సురేఖ మాట్లాడటం ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలో ఇవే అడ్డగోలు మాటలు మాట్లాడిన కొండా సురేఖకు ఈ ఏడాది ఏప్రిల్‌లో నోటీసులు కూడా పంపాను. ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక కూడా చేసింది. అయినా ఆమె దురుద్దేశపూర్వక వ్యాఖ్యలను కొనసాగిస్తున్నారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. బహిరంగ క్షమాపణ చెప్పాలి. భవిష్యత్తులోనూ ఇలాంటి దురుద్దేశపూర్వక, చిల్లర మాటలు మాట్లాడవద్దు. 24 గంటల్లోపు క్షమాపణ చెప్పకుంటే చట్టప్రకారం పరువు నష్టం దావా వేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదుకు ఫిర్యాదు చేస్తాను..'' అని లీగల్ నోటీసులో కేటీఆర్ పేర్కొన్నారు.

'మూసీ సుందరీకరణతో ప్రజల్లో ఆందోళన'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో తీసుకుంటున్న చర్యలు పేద, మధ్య తరగతి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మూసీ రివర్‌బెడ్ ఏరియాలో ఇళ్లు కట్టుకుని నివాసముంటున్న ప్రజలపై 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్'పోలీసులను, అధికారులను ప్రయోగిస్తున్నదన్నారు.. ఎప్పుడు బుల్డోజర్లు వచ్చి కూలగొడతాయోనని ప్రజలు ఆందోళనలో ఉన్నారని తమ్మినేని లేఖలో సీఎంకు తెలిపారు.

కేటీఆర్ నోటినే యాసిడ్‌తో కడగాలి

పండుగల పూట మహిళలను కించపరచడం ఫ్యాషన్ అయింది

మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్ర వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆడబిడ్డల పండుగ బతుకమ్మ మొదటి రోజే మహిళా మంత్రులను కించపరిచి.. కేటీఆర్ తన నైజం చాటుకున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. 'ఎంగిలిపూల బతుకమ్మ రోజే కేటీఆర్ గలీజ్ మాటలు వినాల్సి రావటం మన దురదృష్టం. మా నోళ్లను ఫినాయిల్‌తో కడగాలని మాట్లాడిన కుసంస్కారి కేటీఆర్. పండుగ పూట మహిళల పట్ల చీప్ కామెంట్ చేసిన కేటీఆర్ నోటినే యాసిడ్‌తో కడగాలి'అని ఆమె మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై బుధవారం ఓ ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పండుగల పూట మహిళలు, మహిళా మంత్రులను కించపరచడం కేటీఆర్‌కు ఫ్యాషన్ అయింది. రాఖీ పండుగ రోజు బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు చేసుకోవచ్చు అన్నారు. బతుకమ్మ మొదటి రోజు చిట్ చాట్ పేరుతో మా గురించి చులకనగా మాట్లాడారు. అదే విషయం మీడియా ముఖంగా చెప్పి ఉంటే మహిళలే మీకు బుద్ధి చెప్పేవారు'అని హెచ్చరించారు. మహిళా మంత్రులను పదే పదే కించపరుస్తూ.. తన దొర దురంకారాన్ని కేటీఆర్ చాటుకుంటున్నారని ధ్వజమెత్తారు. చాటుమాటుగా నాలుగు గోడల మధ్య మాట్లాడటం కాదని.. ధైర్యముంటే బహిరంగంగా మాట్లాడాలని అన్నారు. తానెప్పుడూ వ్యక్తిగతంగా ఎవరినీ దూషించలేదని, దూషణలకు, బూతులకు బ్రాండ్ అంబాసిడరే కేటీఆరేనని ఎద్దేవా చేశారు. తాను కేటీఆర్‌ను వ్యక్తిగతంగా దూషించినట్లు ఆధారాలు చూపిస్తారా? అని ప్రశ్నించారు. తాము రాజకీయాల్లో ఉండకూడదన్న లక్ష్యంతోనే బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ద్వారా తమపై పదేపదే అభ్యంతరకర కామెంట్స్ చేయిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ ఇదేవిధంగా తన వ్యాఖ్యలతో రెచ్చిపోతే భవిష్యత్‌లో ఆయన కుటుంబ సభ్యులు తలదించుకోవాల్సి వస్తుందని అన్నారు.

క్లుప్తంగా...



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ మావూరి వెంకటరమణ, చిత్రంలో మంత్రులు, మేయర్, నాయకులు

సీఎంఆర్ గ్రూపు రూ.25 లక్షల విరాళం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయనిధికి సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెలర్స్ సంస్థ రూ.25 లక్షల విరాళాన్ని అందజేసింది. సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ మావూరి వెంకటరమణ.. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం మేయర్ పి.నీరజ సమక్షాన బుధవారం సీఎం ఎ.రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు చెక్‌ను అందజేశారు.

'విట్టీలీక్స్' పుస్తకావిష్కరణ



'విట్టీలీక్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్ట్ ఎ.సాయి శేఖర్ రాసిన 'విట్టీలీక్స్' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. జర్నలిస్టుగా తన అనుభవాలు, జ్ఞాపకాలను సాయి శేఖర్ 'విట్టీలీక్స్' పేరుతో పుస్తకంగా రూపొందించారు. ప్రముఖ వ్యక్తులతో సరదా సంఘటనలు ఈ పుస్తకంలో ఉన్నాయి. రాజకీయ నేతలు ఎన్టీ రామారావు, మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, చంద్రబాబు నాయుడు, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, కె.రోశయ్య, ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కె.చంద్రశేఖరరావు, రేవంత్‌రెడ్డి, పీవీ నరసింహారావు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బంగారప్ప తదితరుల వార్తలను కవర్ చేసే సమయంలో ఎదురైన హాస్య సంఘటనలు, అనుభవాలను ఇందులో పొందుపరిచారు.

ఐదు ఆయిల్‌పామ్ కంపెనీలకు షోకాజ్ నోటీసులు

పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచకపోవడంపై సర్కారు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచడంలో విఫలమైన ఐదు కంపెనీలకు సర్కారు తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది లక్ష ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 20 వేల ఎకరాల వరకే చేరుకోవడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. ఆయా కంపెనీల వ్యవహారశైలి పట్ల కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసుల కంటే ముందు పలుమార్లు ఆయా కంపెనీల ప్రతినిధులను మందలించినా ఏమాత్రం మార్పు లేకపోవడంతో నోటీసులిచ్చారు. 14 ప్రైవేట్ కంపెనీలకు పామాయిల్ సాగుకవసరమైన ఏర్పాట్లు చేసే బాధ్యత అప్పగించింది. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు స్థాపించడం, ప్రభుత్వం నిర్దేశించిన భూముల్లోని రైతులను ఒప్పించి మొక్కలను వేయడం, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, పంట వచ్చిన తర్వాత కొనుగోలు చేయడం వంటి వాటిలో విఫలం కావడంతో ఈ ఐదు కంపెనీలకు షోకాజ్ జారీ చేశారు.

సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా దర్శన్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం (సీపీఎస్) రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షునిగా లింగమొల్ల దర్శన్ గౌడ్ ఎన్నికయ్యారు. దర్శన్ గౌడ్ రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం, కందవాడ జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. 12 ఏళ్లుగా సీపీఎస్ ఉద్యమంలో తొలి దశ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పని చేస్తున్నారు.

పూర్తవని కూడికలు, తీసివేతలు

వీసీల నియామకంలో జాప్యం!	వివిధ స్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిళ్లు	అనుభవజ్ఞులు, పదవికి గౌరవం తెచ్చేవారికి ప్రాధాన్యం	ఉన్నత విద్యామండలిలోనూ మార్పులు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ పోస్టుల భర్తీ మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఏ యూనివర్సిటీకి ఎవరిని నియమించాలనే అంశంపై కసరత్తు దాదాపు పూర్తయినప్పటికీ, కూడికలు, తీసివేతలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వీసీల కూర్పు నేపథ్యంలో పలు రకాల ఒత్తిళ్లు వస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. వాస్తవానికి అక్టోబర్ 3, 4 తేదీల్లో ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీలు భేటీ కానున్నాయి. ఈ కమిటీలు వీసీల నియామకంపై ప్రభుత్వానికి అవసరమైన సిఫార్సులు చేస్తాయి. ఒక్కో వీసీ పోస్టుకు ముగ్గురిని సూచిస్తాయి. వీటిల్లో ఒకరిని ప్రభుత్వం గుర్తించి, జాబితాను గవర్నర్‌కు పంపాల్సి ఉంటుంది. కాగా, సెర్చ్ కమిటీల భేటీ తర్వాత తుది నిర్ణయం తీసుకునేందుకు సమయం పట్టొచ్చని అధికారులు చెబుతున్నారు. దసరా సెలవులు, ఆ తర్వాత కూడా కొన్ని సెలవులు ఉండటం



వల్ల అనుకున్న వ్యవధిలో వీసీల నియామకం జరగకపోవచ్చని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రక్షాళన తప్పదా?

అనుభవజ్ఞులు, పదవికి గౌరవం తెచ్చే వారితోనే ఈసారి వీసీల నియామకం ఉంటుందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మీడియాకు తెలిపారు. ఈ దిశగా అనేక మంది పేర్లు పరిశీలించినట్టు చెప్పారు. అయితే, ఈ క్రమంలో ఉన్నత విద్యా మండలిలోనూ భారీ ప్రక్షాళన ఉండొచ్చని అధికార వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి. మండలిలో అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమందిని కొనసాగించే ప్రతిపాదన కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఒక్కసారిగా మండలిని కొత్తవారితో నింపడం సరి కాదని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలుస్తోంది. మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి నేతృత్వంలో కార్యకలాపాలన్నీ సాఫీగా, ఎలాంటి వివాదాలు లేకుండా సాగుతున్నాయన్నది అధికారుల అభిప్రాయం. ఈ కారణంగా లింబాద్రిని కొనసాగించడమా? లేదా అనే దానిపై స్పష్టత రాలేదు. ఒకవేళ లింబాద్రి స్థానంలో వేరే వ్యక్తిని నియమిస్తే, ఆయనను ఏదైనా యూనివర్సిటీకి వీసీగా నియమించే అవకాశముందని తెలుస్తోంది. మండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల మార్పు తప్పదనే వాదన వినిపిస్తోంది. మండలి కార్యదర్శిగా ఉన్న శ్రీరాం వెంకటేశ్ కొన్ని నెలల క్రితమే ఆ పోస్టులోకి వచ్చారు. ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పోస్టులో కొనసాగించే వీలుంది. కాగా, కీలకమైన జేఎన్‌టీయూహెచ్‌కు పోటీ తీవ్ర స్థాయిలో ఉంది. దీనికి ఎన్ఐటీలో ఉన్న ఓ ప్రొఫెసర్ పేరు బలంగా వినిపిస్తోంది. ఢిల్లీ స్థాయిలో వచ్చే సిఫార్సులను కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సి వస్తోందని సమాచారం. ఉస్మానియా వర్సిటీ వీసీ పోస్టుకు ఉన్నతాధికారులు పాత వీసీనే సిఫార్సు చేస్తున్నారు. మరో నలుగురు కూడా వివిధ మార్గాల్లో ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ స్థానం ఎవరికి దక్కుతుందనేది కీలకంగా మారింది. మొత్తం మీద అన్ని వర్సిటీలకు కూడా పోటీ ఉందని, ఈ నేపథ్యంలో వీసీల కూర్పునకు కొంత సమయం తప్పదని అధికారులు అంటున్నారు.

• సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసం కేటీఆర్ కుటుంబాన్ని మైనంపల్లి హనుమంతరావు లక్ష్యంగా చేసుకున్నారని బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కొడుక్కి మంత్రి పదవి.. తనకు ఎమ్మెల్సీ పదవి కోసం మైనంపల్లి తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు.



బుధవారం గాంధీభవన్ ఎదుట ఆందోళన చేస్తున్న 317 జీవో బాధిత ఉద్యోగులు



ఆందోళనలో పాల్గొన్న బాధిత కుటుంబాల చిన్నారులు

స్థానికత ఆధారంగా కేటాయింపులు జరపాలి

- గాంధీభవన్ ఎదుట జీవో 317 బాధితుల ఆందోళన
- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్న బాధితులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లో భాగంగా తీసుకొచ్చిన జీవో 317 ద్వారా తీవ్రంగా నష్టపోయామంటూ బాధిత ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో జీవో 317 బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ పది నెలలైనా ఆ హామీని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికత ఆధారంగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేస్తూ బాధిత ఉద్యోగులు బుధవారం గాంధీభవన్‌ను ముట్టడించారు. గాంధీభవన్ ఎదుట రోడ్డుపైన ఉద్యోగులు బైఠాయించి నిరసన తెలిపారు. జీవో 317కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగి చదువుకున్న ప్రాంతాన్ని స్థానికతగా పరిగణించాలని, అలాకాకుండా సంబంధం లేని ప్రాంతాల్లో ఉద్యోగుల కేటాయింపులు జరిపి తమ భవిష్యత్తును ఆందోళనకరంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు గాంధీభవన్ వద్ద మోహరించారు.

నిర్ణయం తీసుకోకపోవడంపై ఆగ్రహం

జీవో 317 బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. బాధిత ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించిన ప్రభుత్వం.. వాటి పరిష్కారానికి సంబంధించిన బాధ్యతలను మంత్రివర్గ ఉపకమిటీకి అప్పగించింది. ఈ కమిటీ పలుమార్లు సమావేశమైనప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దాదాపు ఎనిమిది నెలలైనా ఈ అంశంపై నిర్ణయం తీసుకోకపోవడంతో ఆగ్రహించిన బాధిత ఉద్యోగులు ప్రస్తుతం ఆందోళనబాట పట్టారు.

పరిష్కారానికి మంత్రి, మహేశ్‌గౌడ్ హామీ

ఆందోళన చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ గాంధీభవన్ లోపలికి పిలిచి చర్చలు జరిపారు. జీవో 317పై ప్రభుత్వం సబ్‌కమిటీని నియమించిందని, పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ నెల 3న సబ్‌కమిటీతో ఉద్యోగ సంఘాల భేటీ ఉంటుందని హామీనిచ్చారు. దీంతో ఉద్యోగులు ఆందోళనను విరమించారు.

పీవీ మాడ్యూల్స్ పరిశ్రమలు నెలకొల్పండి

జపాన్ పర్యటనలో తోషిబా కంపెనీకి భట్టి ఆహ్వానం

- తెలంగాణను ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుస్తామని వెల్లడి



జపాన్‌లో తోషిబా సంస్థ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏర్పాటు చేసే సౌర విద్యుత్ ప్లాంట్లకు ఫోటో వోల్టాయిక్ (పీవీ) మాడ్యూల్స్ పెద్దసంఖ్యలో కావాల్సి ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్ సెల్ టెక్నాలజీని వినియోగించబోతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పీవీ మాడ్యూల్స్, ఫ్యూయల్ సెల్స్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని ప్రముఖ జపనీస్ కంపెనీ తోషిబాను ఆహ్వానించారు. జపాన్ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన టోక్యో శివార్లలోని తోషిబా ప్రధాన కార్యాలయంలో ఫ్యూయల్ సెల్, న్యూక్లియర్ పవర్/థర్మల్ పవర్ టర్బైన్లు, జనరేటర్ల తయారీ యూనిట్లను పరిశీలించారు. కంపెనీ ఉన్నతాధికారి హిరోషి కనేట, వైస్ ప్రెసిడెంట్ షిగేరిజో కవహర.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ఉత్పత్తులను వివరించారు. తెలంగాణను ఎలక్ట్రానిక్ హబ్‌గా మార్చనున్నామని, ఫ్యూచర్ సిటీలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట వేస్తామని భట్టి విక్రమార్క వారికి చెప్పారు. సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా లిథియం, ఇతర ఖనిజ తవ్వకాల రంగంలోకి ప్రవేశించనుందన్నారు. లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సింగరేణితో కలిసి ముందుకు పోవచ్చని సూచించారు. భారత్‌లో మూడు రాష్ట్రాల్లో తమ యూనిట్లను నెలకొల్పామని, అందులో తెలంగాణలోని యూనిట్ అత్యంత ముఖ్యమైనదని తోషిబా ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి భాగస్వామ్యంతో తమ పరిశ్రమలను విస్తరించేందుకు సానుకూలంగా ఉన్నామన్నారు.

రాష్ట్రంలో బులెట్ ట్రైన్ ఏర్పాటు చేయాలి

భట్టి విక్రమార్క బుల్లెట్ ట్రైన్‌లో 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒసాకా పట్టణాన్ని 2.2 గంటల్లో చేరుకున్నారు. ఈ తరహా రవాణా వ్యవస్థను తెలంగాణలోనూ అభివృద్ధి చేయాలని రైల్వేశాఖను కోరనున్నట్లు ఆయన తెలిపారు. అక్కడి పానసోనిక్ ప్రధాన కార్యాలయాన్ని భట్టి సందర్శించనున్నారు. పర్యటనలో ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ కె.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా మాఫీపై శ్వేతపత్రం ఇవ్వాలి

సీఎం రేవంత్‌కు బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు పంట రుణాలను ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు లక్షలకు మించి రుణాలున్న రైతులకు కూడా రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసి, ఆపై మొత్తం రుణాన్ని బ్యాంకులకు చెల్లించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయొద్దన్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా మొత్తం ఎంతమంది రుణాలు తీసుకున్నారు, ఎంత మందికి, ఎంత మేర రుణాలు మాఫీ అయ్యాయి తదితర వివరాలతో వెంటనే ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎవరి ఖాతాలో రూ.17,933 కోట్లు వేశారో జాబితా విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతుల రుణాలను వారంలోగా మాఫీ చేయాలని కోరారు. ఈ మేరకు సీఎంకు రాసిన బహిరంగ లేఖను ఏలేటి బుధవారం మీడియాకు విడుదల చేశారు.

తుమ్మల పదవి తుమ్మితే ఊడే ముక్కు..

బుధవారం బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'బీజేపీ రైతులకు అండగా ఉంటుందని ఇందిరాపార్కు దీక్ష ద్వారా భరోసా కలిపించాం. వడ్లకు బోనస్ ఇవ్వడం లేదు. ఇతర పంటలకు ఇస్తానన్న బోనస్ మర్చిపోయారు' అని విమర్శించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీజేపీపై, కేంద్రంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తుమ్మల మంత్రి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదని వ్యాఖ్యానించారు.



ఇతరుల పట్ల అసూయ పడేవాడు మనశ్శాంతిని పొందలేడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

గురువారం, 3 అక్టోబర్ 2024

ప్రమాదంలో ప్రపంచం

వరస సంక్షోభాలతో నిరంతరం నెత్తురోడే పశ్చిమాసియా అందరూ చూస్తుండగానే పూర్తి స్థాయి యుద్ధంలోకి జారుకున్నట్టు కనబడుతోంది. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్, మరో ప్రధాన నగరం జెరూసలేంలపై మంగళవారం రాత్రి ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడటం, ఆ వెంటనే హెజ్బొల్లా మిలిటెంట్లు టెల్‌అవీవ్‌లోని మొసాద్ ప్రధాన కార్యాలయంపై క్షిపణులతో దాడిచేయటం ...ఇజ్రాయెల్‌కు దన్నుగా తాము సైతం రంగంలోకి దిగుతామని అమెరికా హెచ్చరించటం పరిస్థితులు వికటిస్తున్నాయన్న సంకేతాలిస్తున్నాయి. ఇరాన్–ఇజ్రాయెల్ నేరుగా తలపడటం ఇక లాంఛనం. ఒకపక్క తన కవ్వింపు చర్యలే ఇరాన్‌ను ప్రతీకారదాడికి పురిగొల్పాయని బట్టబయలైనా ఇరాన్ దాడిని వ్యతిరేకించలేదన్న కారణంతో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌ను 'అవాంఛిత వ్యక్తి'గా ప్రకటించి, తమ దేశంలో అడుగుపెట్టనీయబోమని నిషేధం విధించటం ఇజ్రాయెల్ తెంపరితనానికి నిదర్శనం. శరపరంపరగా వచ్చిపడుతున్న క్షిపణులను పూర్తిగా నిరోధించటం ఇజ్రాయెల్ గర్వంగా చెప్పుకునే రక్షణ ఛత్రం ఐరన్ డోమ్ వల్ల కూడా కాలేదంటే ఇరాన్ దాడి తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. ప్రాణనష్టం పెద్దగా లేకపోయినా భారీ భవనాలు నేలమట్టం కావటం, పౌరులు కకావికలై పరుగులు తీయటం, ప్రభుత్వాదేశాలతో పది లక్షలమంది ప్రజలు బంకర్లలో తలదాచుకోవటం ఇటీవలికాలంలో ఇదే మొదటిసారి. గాజాలో తన లక్ష్యం పూర్తిచేయగలిగానని భావిస్తున్న ఇజ్రాయెల్... రెండురోజుల క్రితం లెబనాన్‌పై పంజా విసరడం ప్రారంభించింది. హెజ్బొల్లా నేత నస్రల్లాను హతమార్చింది. ఆ సమయానికి ఆయనతో పాటున్న తమ రెవల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాస్ నిల్ఫొరుషాన్ సైతం ప్రాణాలు కోల్పోవటం ఇరాన్ జీర్ణించుకోలేకపోతోంది. అందుకే అది తాజా దాడికి దిగింది. నిజానికి ఇరాన్‌ను ఏనాడూ ఇజ్రాయెల్ ప్రశాంతంగా ఉండనీయలేదు. అది అణ్వాయుధ దేశంగా మారవచ్చునన్న భీతితో గూఢచర్యం సాగిస్తూ పేరెన్నికగన్న శాస్త్రవేత్తలను... ప్రభుత్వంలో, సైన్యంలో కీలకపాత్ర పోషిస్తున్న వారిని హతమార్చటం ఇజ్రాయెల్ ఒక విధానంగా పెట్టుకుంది. మొన్న ఏప్రిల్‌లో సిరియాలోని డమాస్కస్‌లో ఇజ్రాయెల్ సాగించిన దాడిలో ఇరాన్‌కు చెందిన సైనిక నిపుణుడు, దౌత్యవేత్త మరణించారు. జూలైలో హెజ్బొల్లా నాయకుడు ఇస్మాయెల్ హనియేను ఇరాన్‌లో ఉండగా ఇజ్రాయెల్ హతమార్చింది. ఇలాంటి ఉదంతాలు జరిగిన ప్రతిసారీ డ్రోన్‌లతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగినా వాటివల్ల ఏనాడూ ఇజ్రాయెల్ పెద్దగా నష్టపోలేదు.

ఇరాన్ దాడి అనంతరం అంతర్జాతీయ మార్కెట్‌లో బుధవారం ముడి చమురు ధర భగ్గున మండిన తీరు సమీప భవిష్యత్తులో ముంచుకురాబోతున్న ఆర్థిక సంక్షోభాన్ని సూచిస్తోంది. ఇజ్రాయెల్ దాదాపు ఏడాదికాలంగా అన్ని రకాల వినతులనూ బేఖాతరు చేసి గాజా, వెస్ట్‌బ్యాంక్‌లలో సాగిస్తున్న నరమేధం తొలుత పశ్చిమాసియానూ, ఆ తర్వాత ప్రపంచాన్నీ యుద్ధం అంచుల్లోకి నెడుతున్నదని విశ్లేషకులు హెచ్చరిస్తూనే ఉన్నారు. నిరుడు అక్టోబర్ మొదటివారంలో ఇజ్రాయెల్ భూభాగంలోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి 1,200 మంది పౌరులను హతమార్చి, మరో 695 మందిని అపహరించుకుపోవటం ద్వారా హమాస్ దుస్సాహసానికి పాల్పడింది. ఇది ఉగ్రవాద చర్యగా ప్రకటించిన దేశాలు సైతం అనంతర ఇజ్రాయెల్ దాడులను అంగీకరించలేదు. ఐక్యరాజ్యసమితి ఖండించింది. అమెరికా కూడా గాజా నరమేధం విరమించుకోవాలని ఇజ్రాయెల్‌ను కోరిన మాట వాస్తవం. అలాగని అది ఏనాడూ ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా ఆపలేదు. ఫలితంగా ఇంతవరకూ దాదాపు 45,000 మంది గాజా పౌరులు మరణించారని అంటున్నారు.

ఒకసారంటూ యుద్ధం మొదలైతే దాని గమనం, ముగింపు ఎవరి చేతుల్లోనూ ఉండవు. దాని తోవ అది వెదుక్కుంటుంది. రెండో ప్రపంచ యుద్ధ పర్యవసానాలు చూశాక మళ్లీ ఆ ఉత్పాతం జరగనీయరాదని ప్రపంచ దేశాలు ప్రతినబూనాయి. ఎందుకంటే ఆ యుద్ధంలో అయిదున్నర కోట్ల మంది సాధారణ పౌరులు, మరో రెండున్నరకోట్లమంది సైనికులు మరణించారు. కోట్లాదిమంది క్షతగాత్రులయ్యారు. ఒక్క సోవియెట్ యూనియన్‌లోనే దాదాపు రెండున్నర కోట్లమంది మరణించారు. మరో 90 లక్షలమంది వరకూ వ్యాధుల బారినపడ్డారు. కానీ విస్తరణ కాంక్షతో తహతహలాడే అగ్రరాజ్యాలు తమ నైజం వదులుకోలేదు. ఆ వెనువెంటనే తమకు అలవాటైన యుద్ధ క్రీడ ప్రారంభించాయి. వర్తమాన పరిణామాలు దాని పర్యవసానమే. న్యూయార్క్ టైమ్స్ పరిశోధక పాత్రికేయురాలు అనీ జాకబ్‌సన్ యుద్ధం వల్ల మానవాళికి కలగబోయే హాని గురించి చెప్పిన అంశాలైనా అగ్రరాజ్యాల కళ్లు తెరిపించాలి. అణ్వాయుధ యుద్ధం కేవలం 72 నిమిషాల్లో భూగోళంపై 60 శాతం జనాభాను తుడిచిపెడుతుందని హెచ్చరించారామె.

ఇజ్రాయెల్‌కు అమెరికా అండదండలున్నట్టే ఇరాన్‌కు రష్యా, చైనాల ఆశీస్సులున్నాయి. దానికి హమాస్, హిజ్బొల్లా గ్రూపులు, యెమెన్‌లోని హౌతీలు, ఇరాక్, సిరియాల్లోని షియా మిలిటెంటు సంస్థలూ మరింత దగ్గరవుతాయి. ఇజ్రాయెల్‌తో సాన్నిహిత్యం నెరపుతున్న ఈజిప్టు, జోర్డాన్‌లకూ, ఆ తోవనే వెళ్తున్న సౌదీ అరేబియాకూ సంకటస్థితి ఏర్పడుతుంది. ఈ వైరిపక్షాలన్నీ కొంత హెచ్చు తగ్గులతో ప్రపంచాన్ని సర్వనాశనం చేయగల మారణాయుధాలతో సంసిద్ధంగా ఉన్నాయి. అందుకే పాలస్తీనా ఆవిర్భావానికి సహకరించటం, దుందుడుకు విధానాలకు స్వస్తిపలకడం వంటి చర్యలే పశ్చిమాసియాకూ... మొత్తం ప్రపంచానికీ ప్రశాంతతనిస్తాయని ఇజ్రాయెల్ గుర్తించాలి. అమెరికా వివేకంతో మెలిగి సామరస్య ధోరణులకు తోడ్పాటునందించాలి.

మన పునాది లౌకికం

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

భారతదేశం లౌకిక ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ఎవరికైనా తమ మతాన్ని అనుసరించే, మార్చుకునే హక్కు ఉంది. నిజానికి హిందూ మతంలో ఉన్న అనేక నియమాల వల్ల, దేవాలయాలకు శూద్రులను కొన్ని సందర్భాల్లో దూరం పెట్టడం వల్ల క్రైస్తవ మతం బాగా పెరిగింది. తర్వాత వీరశైవం, వీరవైష్ణవ ఉద్యమాలు శూద్రులను, అతిశూద్రులను దగ్గరకు తీశాయి. ప్రజలను పాలించేవారికి అన్ని మతాలవారు ఓట్లు వేస్తారు. 'నేను సనాతన ధర్మానికి బద్ధుడిని' అనేవాళ్లు పాలక వర్గంగా అందరి హక్కులను కాపాడే బాధ్యత నుండి పాక్షికమైన వాదనలకు దిగుతున్నారని అర్థం. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ద్వారా రాజకీయ పరివ్యాప్తి చెందాలి గానీ మతాంశాల ద్వారా కాదని మన నాయకులు గ్రహించాలి.

భారతదేశ చరిత్ర, సంస్కృతి, నాగరికత అతి ప్రాచీనమైనవి. మెసపటోమియా నాగరికతతో, గ్రీకు ఫిలాసఫీతో పోల్చదగిన స్థాయిలో భారతదేశ చరిత్ర, నాగరికతలు ఉన్నాయి. అందుకనే ప్రపంచ దేశాల చరిత్ర కారులు, పురాతత్వవేత్తలు, భాషాతత్వవేత్తలు ఇంకా ఈ మూలాల్లోకి వెళ్ళి పరిశోధనలు చేస్తూనే ఉన్నారు.

భారతీయ గతంలోకి దర్యాప్తు తూర్పు భాషలు నేర్చిన ఇండాలజిస్టులతో ప్రారంభమైంది. ముఖ్యంగా భారతీయ చరిత్ర, మరీ ముఖ్యంగా భారతీయ భాషలను తమ అధ్యయనంగా ఎంచుకున్న ఐరోపా పండితులతో ఇది మొదలైంది. వివిధ పాలనాపరమైన హోదాలలో ఈస్టిండియా కంపెనీ నియమించిన విలియం జోన్స్, కోల్‌బ్రూక్, హెచ్.హెచ్.విల్సన్ వంటివాళ్లు ఇండాలజిస్టులలో కనిపిస్తారు. వారంతా ఐరోపా ప్రాచీన సంప్రదాయంలో శిక్షణ పొందినవారు. ప్రాచీన భాషల పట్ల ఆసక్తి పెంచుకుని, కొత్త రంగంలో నైపుణ్యం సాధించేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. పాలనావేత్తలుగా వారికి సంప్రదాయ భారతీయ చట్టం, రాజకీ యాలు, సమాజం, మతం పట్ల ప్రత్యేక జ్ఞానం కలిగి ఉండాలి. ఇదే వారిని సంస్కృతం, పర్షియన్ సాహిత్యం వైపు నడిపించింది. ఈ విషయాలను ప్రసిద్ధ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ తన 'ఐడియాలజీ అండ్ ది ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ ఎర్లీ హిస్టరీ' అనే గ్రంథంలో చెప్పారు.

భారతదేశంలోని మానవజాతుల పరిణామాలను పరిశీలించినట్లయితే, మానవజాతి పరిణామానికి సంబంధించిన ప్రాచీన పరిణామ దశలన్నీ దళితుల్లో కనిపిస్తున్నాయి. మోర్గాన్ చెప్పినట్లు మానవజాతి పరిణామంలో జీవనోపాధి, ఆహారం, పాలనాంగం, ప్రభుత్వం, భాష, కుటుంబం, మతం, గృహ నిర్మాణం, సంపద కీలక పాత్ర వహిస్తాయి. ఈ దశలన్నీ ఇప్పటికీ దళితుల జీవన విధానంలో కనిపించడం వలన, భారతదేశంలో మానవజాతి పరిణామ లక్షణాలన్నీ దళిత జాతుల్లో ఉండటం వలన బి.ఆర్. అంబేడ్కర్ నిర్వచించినట్లు వీరు ఆది భారతీయులనేది నిర్ధారణ అవుతుంది. డేనిష్ పురాతన శాస్త్రవేత్తలు నిర్వచించినట్లు శిల, కాంస్య, ఇనుప యుగలక్షణాలు కూడా భారత సమాజంలోని ఆదిమ జాతుల్లో ఉన్నాయి.

నిజానికి భారతదేశంలో సింధునది వారసులు దళితులు. ఆ తర్వాత వచ్చిన ఆర్యులు వీరిని ప్రాచీనులు అని వాడారు. వారికి ఆ తర్వాత వచ్చినవారు అర్వాచీనులు అవుతారు. ఏది సనాతనం? ఏది అధునాతనం? అనే దగ్గర ఋగ్వేద ఆర్యులే ఋగ్వేదాన్ని సనాతనం అయిందనీ, అధర్వణ వేదాన్ని అధునాతనమైనదనీ ప్రస్తావించారు. పూర్వం కంటే ఉత్తర బలీయమైనదనేది శాస్త్రం. అందుకే ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం... ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి వచ్చి ముందుదాని కంటే తర్వాత దానిలో ఇంకా



విస్తృతి ఉంది అని చెప్పబడింది.

మొట్టమొదటి ఇటుకల చైత్యగృహం, అశోకుని కాలం నాటిది, రాజస్థాన్‌లో బైరాత్ దగ్గర బయల్పడింది. ఇటుకల చైత్యగృహాలు ఆంధ్రదేశంలో పలుచోట్ల బయల్పడినాయి. కానీ వాస్తు వైశిష్ట్యం ఉన్న కళాఖండాలుగా ప్రసిద్ధి చెందినవి గుహాలయాలే. వీనిలో చాలా భాగం మహారాష్ట్రలోనే ఉన్నాయి. బుద్ధగయ చెంత బరాబర్ కొండల్లో అశోకుడు తొలిపించిన సుదామ– లోమశ ఋషి గుహలే మన దేశంలో మొదటి గుహలు. అదే కాలానికి చెందినవి గుంటుపల్లి గుహాల యాలు. క్రమంగా గుహాలయ వాస్తు భాజా, బేడ్సే, జున్నార్, పితల్‌ఖోరా, కన్హేరీ, కార్లాలలో వికసించి అజంతా – ఎల్లోరాలలో పరిణతి పొందింది. గుహాలయాలన్నింటిలో తలమానికం వంటిది కార్లా చైత్యాలయం.

ఆంధ్రుల చరిత్ర సంస్కృతి రచించిన బి.ఎస్.ఎల్. హనుమంత రావు గారు ఆంధ్రులు బౌద్ధ సంస్కృతి వికాసితులు అని చెప్పారు. దక్షిణ భారతదేశంలో ప్రాచీనంగా బౌద్ధం విస్తరిల్లిందని విశ్లేషించారు. బౌద్ధ దర్శన ప్రభావం సుమారు ఆరు శతాబ్దాల కాలం దేశ ప్రజలపై, ప్రభుత్వాలపై స్పష్టంగా కన్పిస్తుంది. ఇంచుమించు భారతదేశాన్ని సమైక్యం చేసి తన ప్రభుత్వానికి ధర్మాన్ని గీటురాయిగా చేసిన అశోక మౌర్యుడు దండ సమత, వ్యవహార సమత నెలకొల్పాడు. దీన్ని బట్టి చూస్తే శిక్షాస్మృతి విషయంలో అందరూ సమానులేననే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు అతని శాసనాలు చాటుతున్నాయి.

ఆర్య ఋషులు ఈ దేశంలోకి పశుపాలకులుగా ప్రవేశించారు. గోపాలకులు (గోవులను పాలించే వారు), గవేషణ (గోవులను వెదకడం), గోపతి (గోవుల కధిపతి), గోమేధం (గోవులతో చేయు యజ్ఞం), గోఘ్నుడు (అతిథిగా వచ్చి గోవులను చంపించువాడు), గోత్రం (గోశాల) అని వారిని వెన్నాడుతూ వచ్చిన ఈ విశేషణాలే వారి వృత్తిని ప్రకటిస్తున్నాయి అని రాహుల్ సాంకృత్యాయన్ చెప్పారు. ఆర్యులు గోపాలకులనీ, బౌద్ధం ప్రభావానికి గురయ్యేవరకూ వారు గోవును యజ్ఞయాగాల్లో బలి ఇచ్చారనీ చెప్పబడింది.

తైత్తరీయ బ్రాహ్మణంలో చెప్పిన కామేష్టి యజ్ఞాలలో గోవృషభాలను బలి ఇవ్వటమే కాకుండా, ఎలాంటి వాటిని బలి యివ్వాలో కూడా ఉంది. విష్ణువుకి పొట్టి వృషభాన్ని, ఇంద్రుడికి వాలిన కొమ్ములు, ఎర్రని రంగు నుదురుగల వాటినీ, శని దేవుడికి నల్ల ఆవును, రుద్రుడికి ఎర్రగోవుని – ఆ రకంగా బలి ఇవ్వాలని నిర్దేశింపబడింది. అందులోనే 'పంచశరదీయ' సేవ అనే మరో రకమైన బలిని గూర్చి కూడా ప్రస్తావించబడింది. అందులో ముఖ్యాంశం ఏమంటే – ఐదేళ్ల వయసున్న 17 పొట్టి గిత్తల్నీ, అదే సంఖ్యలో మూడేళ్ళు నిండని పొట్టి లేగల్నీ బలి ఇవ్వాలని చెప్పబడింది.

నిజానికి అమరావతి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బౌద్ధ క్షేత్రం. అందుండి బౌద్ధం గురించి మాట్లాడటం ఆంధ్రుల చారిత్రక కర్తవ్యం. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ అమరావతిని ఆంధ్రుల రాజధానిగా శ్రీకృష్ణ కమిటీకి ప్రతిపాదించిన దానిలో అర్థం అదే. ఆంధ్రులు వైదికేతర మతాలను, ధర్మాలను అన్నింటినీ ఆహ్వానించారు. ముఖ్యంగా బౌద్ధాన్ని, జైనాన్ని, ఇస్లాంను, క్రైస్తవాన్ని, ఇంకా అనేక మతాలను, ధర్మాలను ఆహ్వానించారు. ఆంధ్రదేశంలో శిల్పరూపం క్రీ.పూ. 2వ శతాబ్దికి ముందు లేదు. క్రీ.పూ. 2వ శతాబ్దానికి ముందు నిరాకార తత్వాలే ఉన్నాయి. ఆ తర్వాత శిల్పరూపాలు వచ్చినాక కూడా ఒకరి నొకరు గౌరవించుకోవడమే ఎక్కువ కాలం ఉంది. అంబేడ్కర్ భారత రాజ్యాంగంలో మతం మార్చుకునే హక్కు పొందుపరిచాడు. నిజానికి హిందూ మతంలో ఉన్న అనేక నియమాల వల్ల, దేవాలయాలకు శూద్రులను కొన్ని సందర్భాల్లో దూరం పెట్టడం వల్ల క్రైస్తవ మతం బాగా పెరిగింది. తర్వాత వీరశైవం, వీరవైష్ణవ ఉద్యమాలు శూద్రు లను, అతిశూద్రులను దగ్గరకు తీశాయి. ప్రజలను పాలించే వారికి అన్ని మతాలవారు ఓట్లు వేస్తారు. 'నేను సనాతన ధర్మానికి బద్ధుడిని' అనేవాళ్లు పాలక వర్గంగా అందరి హక్కులను కాపాడే బాధ్యత నుండి పాక్షికమైన వాదనలకు దిగుతున్నారని మనకు అర్థం అవుతుంది. అందుకే భారతదేశాన్ని లౌకిక ప్రజాస్వామ్య దేశంగా చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవడం ద్వారా రాజకీయ పరివ్యాప్తి చెందాలి గానీ మతాంశాల ద్వారా కాదు అని రాజ్యాంగం చెప్తుంది. రాజ్యాంగంలోని 25, 26, 27, 28వ అధికరణాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

అంబేడ్కర్ 'విముక్తి అంటే ఏమిటి?' అని చెప్తూ, 1835 అక్టోబర్ 13న చేసిన ప్రకటనలో మతం మారే హక్కు అందరికీ ఉందన్నారు. నిజానికి ఆంధ్ర దేశం భౌతికవాద తత్వాలతో ప్రభావితమైన దేశం. నార్ల వేంకటేశ్వరరావు, గుర్రం జాషువా, మహాకవి వేమన హేతువాదాన్ని బోధించారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితో నడుస్తూ మానవతా వాదాన్ని ప్రజ్వలింపజేసే కర్తవ్యంలో భాగస్వాములం అవుదాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒక భావన



గాంధీజీ కేవలం ఒక మనిషి కాదు. ఆయన అప్పుడూ. ఇప్పుడూ సత్యం కంటే బలమైన శక్తి లేదన్న ఒక భావన, ఒక విశ్వాసం. సత్యం కోసం నిలబడ్డ ధైర్యం. సత్యం కోసం పోరాడిన భయంలేని తనం. అత్యంత నైతిక శక్తిగల సత్యానికి సాయంగా ఉన్నది అహింస. (అక్టోబర్ 2న గాంధీ జయంతి)

– స్వర భాస్కర్, నటి, యాక్టివిస్ట్

ఇజ్రాయెల్ వెనుక...



చాలా ఏళ్లుగా పాలస్తీనా, లెబనాన్‌లలోని ఇజ్రాయెల్ దండ యాత్రలకు సౌదీ, యూఏఈ ప్రభుత్వాలు నిధులు సమకూర్చుతున్నాయని నేను నమ్మకంగా చెప్పగలను. 1985లో బీర్ అల్–అబెద్ (బీరుట్)లో జరిగిన కారు బాంబు పేలుడు (షియా మతగురువు సయ్యద్ మహమ్మద్ హుస్సేన్ ఫడ్లల్లాను లక్ష్యంగా చేసుకున్నది) అమెరికన్లు, ఇజ్రాయెలీలు, ఫలంజీలు(లెబనాన్ రైటిస్ట్ క్రిస్టియన్ పార్టీ), సౌదీ ప్రభుత్వాల పని అని మరవొద్దు.

– అసద్ అబూఖలీల్, ప్రొఫెసర్

మంచి పనేనా?



ప్రపంచ పశుగణంలో మూడింట ఒక వంతు ఇండియాలోనే ఉంది. ఇక్కడి ప్రతి రైతు పాలు అమ్మి డబ్బు సంపాదించేలా, నగరాలలోని పౌరులందరికీ సురక్షితమైన ఆ పాలు అందేలా వర్గీస్ కురియన్ విశిష్టమైన కృషి జరిపారు. ఇది దేశంలో ప్రొటీన్ పోషకాహార లోపాన్ని గణనీయంగా తగ్గించింది. అయినప్పటికీ సోషల్ మీడియా మొత్తం ప్యాక్‌డ్ మిల్క్‌పై అపోహల్ని కుమ్మరిస్తోంది!

– క్రిష్ అశోక్, టెకీ

కొంతైనా గౌరవం



ఆయన్ని జైల్లో ఎందుకు ఉంచటం? బయటే ఉంచి ఆయన కోరుకున్నప్పుడు జైలును సందర్శించేలా ఏర్పాట్లు చేయవచ్చు కదా! ఇలా చేస్తే ఈ విదూషక పట్టణానికి కొంతైనా గౌరవం మిగిలి ఉంటుంది. (హరియాణాలోని సునారియా పట్టణ జైల్లో ఉన్న డేరా బాబాకు తరచూ పెరోల్ లభిస్తుండటంపై).

– రితుపర్ణా ఛటర్జీ, పాత్రికేయురాలు

వార్తల్లో దేశాలు



పోయి నేడాది ఉక్రెయిన్ నుంచి పక్కదారి పట్టించేదిగా ఇజ్రాయెల్ ఉండేది. ఈ ఏడాది ఇజ్రాయెల్ నుంచి దృష్టి మళ్ళించేదిగా ఉక్రెయిన్ ఉంటోంది.


– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

సాంస్కృతిక కళా వికాసమూర్తి

పిఠాపురం మహారాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్ (1885–1964) రసజ్ఞత కలిగిన కవి, రచయిత, తత్వవేత్త. నిరంతర పాఠకుడు, సద్విమర్శకుడు. వివిధ రంగాల్లో సూర్యారావు చేపట్టిన కార్యక్రమాలు ఎన్నదగ్గవి. తెలుగు జాతిని సంస్కరణల మార్గంలో నడిపేందుకు తన గురువు దివాన్ మొక్కపాటి సుబ్బారాయుడు చూపిన అభ్యుదయ మార్గంలో ఆయన అలుపెరుగక శ్రమించారు.

దక్షిణాఫ్రికాలోని భారతీయుల కోసం గాంధీజీ పిలుపునందుకుని పాతిక వేల రూపాయలు అందించారు. రవీంద్రనాథ్ టాగోర్ స్థాపించిన శాంతినికేతన్ అభివృద్ధి కోసం, కలకత్తాలోని సిటీ కాలేజీ అభివృద్ధి కోసం పిఠాపురం రాజావారు సాయం చేశారు. రాజమండ్రిలోని ఆస్తిక కళాశాల, టౌన్ హాలు నిర్మాణాలకు ఆర్థికంగా ఆయన అందించిన సేవలు అనన్య సామాన్యమైనవి.

సంఘ సంస్కరణోద్యమానికి ఆదర్శంగా నిలిచిన బ్రహ్మసమాజ ఉద్యమ ప్రాచుర్యానికి తోడ్పాటునందించారు. దీనిద్వారా దక్షిణ భారతదేశంలో ఈ ఉద్యమానికి ఎనలేని సేవచేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. కేవలం దక్షిణాదినే గాక దేశంలోనే న భూతో న భవిష్యతి అనే విధంగా కాకినాడలో బ్రహ్మ సమాజ మందిరాన్ని నిర్మించారు. దీనికి బ్రహ్మసమాజ మేధావి హేమచంద్ర సర్కార్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. 1933లో బ్రహ్మసమాజ సూత్రధారి రాజారామ్మోహన్ రాయ్ శతవర్ధంతిని నిర్వహించారు. ఎన్నో మత సామరస్య, మానవీయ గ్రంథాల్ని ఈ సందర్భంగా ప్రచురించారు. మత సామరస్యం కొరకు అంకితభావంతో శ్రమించిన వీరు నాలుగవ అంతర్జాతీయ సర్వ మత సమ్మేళనానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ గౌరవాన్ని పొందిన రెండవ భారతీయ రాజుగా ఘనత సాధించారు.



పిఠాపురం మహారాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్

అసంఖ్యాక విశిష్ట గ్రంథాలను ప్రచురించారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తును మద్రాసులో స్థాపించి, దానికి శాశ్వత నిధిని ఏర్పాటు చేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ లాంటి సమగ్రమైన నిఘంటువు తెలుగులో కూడా అవసరమనే ఆశయంతో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' నిర్మాణాన్ని ఒక బృహత్కార్యంగా చేపట్టి తెలుగుజాతికి అందించారు.

దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి అనాథ ఆశ్రమంగా కరుణాలయం (అనాథాశ్రమం అని పిలవడం ఇష్టంలేక ఈ పేరు పెట్టారు) స్థాపించారు. మహాత్మాగాంధీ చేపట్టిన మద్యపాన నిషేధ ఉద్యమం కంటే ముందుగానే పిఠాపురం సంస్థాన పరిధిలో కల్లు తాగడాన్ని నిషేధించారు. కాకినాడలోని పి.ఆర్. కళాశాల ద్వారా దేశంలో అత్యున్నత విద్యనందించి తనదైన ప్రత్యేకతకు చాటుకున్నారు.

భాషాభివృద్ధి, సాహిత్యం, సంగీతం , తర్కం, తత్వశాస్త్రం, ఆధ్యాత్మికం, క్రీడలు, రాజకీయాలు వంటి వివిధాంశాల్లో ఎనలేని సేవలందించి తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవనానికి అనితర సాధ్యమైన కృషి చేసిన పిఠాపురం మహారాజా సూర్యారావును స్మరించుకోవడం తెలుగువారి బాధ్యత.

– ర్యాలి ప్రసాద్, రచయిత

(అక్టోబర్ 5న పిఠాపురం రాజా జయంతి)

జన వాణిగా నిలిచిన ఆచార్య

స్మరణ




మాడభూషి శ్రీధర్

ప్రముఖ రచయిత, 'వరంగల్ వాణి' దినపత్రిక, 'జనధర్మ' వారపత్రికల వ్యవస్థాపకుడు ఎం.ఎస్. ఆచార్య శత జయంతి 2024 అక్టోబర్ 3న! ఈ సందర్భంగా పుత్రుడిగా ఆయనకు నా నివాళి.

''ముప్పయ్యేళ్ల నాడు దిక్కు కోసం కొట్టుమిట్టాడుతున్న సామాన్యులకు, సాహిత్యోపజీవులకు మీ 'జనధర్మ' నిజానికి పెద్ద దిక్కే అయ్యి నిలిచింది. కాకతీయుల ఈ గడ్డ–ప్రతి యింటి పాత చుట్టమైంది.పెద్ద పత్రికలు చేయలేని పనిని చిన్న పత్రికలు చేసి చూపించగలవు అన్న సత్యాన్ని ఋజువు చేసిన ఘటికులు మీరు! తెలుగునాట ఓ కొత్త పత్రిక పుట్టడమే వింత! బట్ట కట్టి పదికాలాల పాటు బతకటం మరింత వింత! అలాంటి అస్తవ్యస్తపు శూన్యావరణంలో 'ఇదుగో నేనున్నా'నంటూ ఎగసివచ్చిన మీ 'జనధర్మ' ఇవాళ 'వరంగల్ వాణి' దినపత్రికగా ఎదిగిపోవడానికి కష్టాల గడగండ్లను చిరునవ్వుతో స్వీకరించే మీ స్థితప్రజ్ఞత కారణం'' అంటూ ఎం.ఎస్. ఆచార్య గురించి ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పెండ్యాల చిన రాఘవరావు పేర్కొన్నారు.

హైదరాబాద్ రాజ్యం నుంచి ప్రజల్ని విముక్తి చేయడానికి 1940ల కాలంలో జరిగిన ఉద్యమంలో ఎం.ఎస్.ఆచార్య పాల్గొన్నారు. తిరుగుబాటు రహస్యాలు, పోరాట సమాచారాన్ని నాయకుల కోసం సేకరించేవారు. అందుకు ఎన్నో సమస్యలను, కష్టాలను ఎదుర్కొన్నారు. మద్రాస్ నుంచి పత్రికల బండిల్ లోపల సైక్లో స్టైలింగ్ మెషీన్లను స్మగుల్ చేశారు. తెలుగు వార్తాపత్రికలను చేతిలో పట్టుకోవడమే ఆ కాలంలో పెద్ద నేరం. అలాంటిది పత్రికను నడపడమే గాక, ఎంతోమంది తిరుగుబాటు నేతలకు బార్డర్ క్యాంపుల నుంచి రహస్య విషయాలను చేరవేసేవారు.

రజాకార్ల దుర్మార్గపు చర్యలకు దొరకకుండా రక్షణ చర్యలు తీసుకుంటూనే ఇవన్నీ చేసేవారు. వ్యాయామ, కుస్తీ పోటీలనూ, కబడ్డీ పోటీలనూ నడిపిస్తూ వాళ్ల దృష్టిని మళ్లించేవారు. చివరకు వాళ్ల ప్రాణాలు తీసే పరిస్థితి వచ్చిన దశలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి వారిని గుంటూరు తరలించారు. ఆయన మాత్రం వరంగల్‌లోనే ఉండి పోయారు. ఒకరోజు సైకిల్ మీద కరపత్రాలతో వెళ్తున్న ఆచార్య మీద దాడి జరిగింది. ఇంతెజార్ గంజ్ (వరంగల్లు) దగ్గర నిజాం మిలిటరీ అధికారి మోటర్ బైక్‌ను తగిలించి, కింద పడేసి వెళ్లిపోయారు. అయితే, ఇరుకుల్ల శ్రీశైలం అనే వ్యక్తి వచ్చి కాపాడారు. మరో సందర్భంలో ఆయన్ని రజాకార్లు దొరికించుకుని లాఠీలతో, ఈటెలతో కొడుతూ ఉన్నా ఏ విషయాలూ చెప్పకుండా అలాగే మొండిగా ఉన్నారు. కొందరు చుట్టూ ఉన్న వర్తకులు గట్టిగా మాట్లాడి కాపాడారు.



ఎం.ఎస్. ఆచార్య

'జనధర్మ' పత్రికలో ఆచార్యతో పాటు ముస్త్యాల శంకర్ రావు కూడా భాగస్వామి. ఆయన కూడా సమర యోధుడు. అనేక పోరాటాలలో పాల్గొన్నారు. ముతక ఖాదీ బట్టలతోనే తన జీవితమంతా సాగించారు. ఆచార్య కూడా జాతీయ నాయకుడు మహాత్మాగాంధీ కార్యక్రమాల్లో పాల్గొని, ఖాదీ వస్త్రాలను తన చివరి క్షణం దాకా ధరించారు. శంకర్ రావును ఒకరోజు రజాకార్లు కిడ్నాప్ చేశారు. రజాకార్ల చెర నుంచి తన స్నేహితుడిని విడిపించుకోవడానికి ఆచార్య ఎన్నో ప్రయత్నాలు చేశారు. తన పరిచయాలను ఉపయోగించి ఆయన్ని రజాకార్ల నుంచి పోలీసు కస్టడీకి తరలింపజేశారు. అక్కడినుంచయితే బయటికి తేవడం సులభమని! తిరిగి అక్కడినుంచి బయటికి తెచ్చేందుకు అవసరమైన లంచం కోసం డబ్బులు పోగేసి ఎట్టకేలకు బయటికి తేగలిగారు.

ఆచార్యను చంపడానికి కూడా కుట్రలు జరుగుతున్నాయని తెలిసిన మిత్రులు ఆయన గుంటూరుకు తరలిపోవాలని నిర్ణ యించారు. అప్పటికే కుటుంబం అక్కడ ఉంది. 'ఆపరేషన్ పోలో' పేరుతో జరిగిన పోలీస్ చర్య తర్వాత, విముక్తమైన వరంగల్లుకు, తెలంగాణకు, హైదరా బాద్ రాష్ట్రానికి స్వేచ్ఛగా రాగలిగారు.

నాన్నకు ఒక చెవి పూర్తిగా పాడైపోయింది. అందుకే ఒక వినే యంత్రం ఉండేది. ఎన్నో సార్లు మంచి మెషిన్ కొనేందుకు మేము కలిసి వెళ్లాం. సికింద్రాబాద్ ప్యారడైజ్‌లో నాన్న నా స్కూటర్ వెనుక కూర్చుంటే తీసుకుపోయేవాడిని. పాడైపోయి ప్రతి సారీ మళ్లీ మళ్లీ బాగు చేయించడం కోసం తిలక్ కాలనీ, బాగ్ లింగంపల్లికి వెళ్లడం ఓ పనిలా సాగేది. ఖద్దరు ధరించేవారు కదా, ఆ మెషిన్ కోసం ఒక జేబు కొత్తగా కుట్టేవారు. బనీన్‌లోని జేబులో మెషిన్ అమర్చుకొని, దానిమీద ఖాదీ లాల్చీ వేసుకుని, ధోవతి కట్టుకునేవారు. చివరి దశలో కూడా ఆ పాత ఖాదీ బనీను, అందులో మెషిన్ జేబు, దాని మధ్య వేంకటేశ్వరుని చిన్న ఫోటో, అది ఎప్పుడూ హృదయానికి దగ్గరగా ఉండేది. చివరి రోజున నమస్కారం చేసి, సుప్రభాత శ్లోకాన్ని పఠించి కొద్ది సేపట్లో పరమపదించారు (1994 జూలై 12 నాడు).

వ్యాసకర్త ఆచార్య కుమారుడు; లా ప్రొఫెసర్

(ఎం.ఎస్. ఆచార్య శత జయంతి నేడు)

ప్రయాణంలో స్థిమితం

'నేను ఇంతగా ధ్యానం చేసినప్పటికీ, ఎందుకు మంచి ఫలితాలు రావటం లేదు? మార్గం చూపే సద్గురువు ఉన్నప్పటికీ నా మనస్సులో చెడు విచారాలు ఎందుకు కలుగుతున్నవి?' ఈ విధమైన ప్రశ్నలను చాలామంది సాధకులు లేదా భక్తులు ఎదుర్కొంటారు. అందువలన వారి మనశ్శాంతికి భంగం కలుగుతుంది. అయితే, ఆ విధమైన ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు. అలాంటి ప్రశ్నలను గురించి పరిశీలన చేయడం వలన జీవితం వృథా అవుతుంది. అలాగని మనస్సును నిర్బంధించవలసిన అవసరమూ లేదు. అన్ని రకాల ఆలోచనలను రేకెత్తించడమే మనస్సు యొక్క ప్రకృతి. కాకపోతే 'తొందర పడకే మనసా!' అని దానిని హెచ్చరిస్తూ ఉండాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

రైలులో ప్రయాణాన్ని ఒక ఉదాహరణగా తీసుకొందాం. రైలుబండికి తన లోపల ఏ విధమైన ప్రయాణికులు కూర్చొన్నదీ, ఏయే స్టేషన్లను దాటి వెళుతున్నదీ అన్న దానితో సంబంధం లేదు. మార్గంలోని కొన్ని స్టేషన్లు పెద్దవిగా, మరికొన్ని చిన్నవిగా ఉంటాయి. కొన్ని స్టేషన్లు చూడముచ్చటగా, పరిశుభ్రంగా ఉంటాయి; మరికొన్ని వీటికి భిన్నంగా ఉంటాయి. అయినప్పటికీ కేవలం గమ్యస్థానాన్ని చేరడమే రైలుకు గల సంబంధం (అనగా ఇతర విషయాలతో సంబంధం లేదు).

రైలు మాదిరిగా మనుషులు కూడా తమ గమ్యస్థానాన్ని చేరడమే జీవిత లక్ష్యంగా పెట్టుకోవాలి. తమ ప్రయాణం నందు పట్టుదల వదలకుండా ఉండాలి. విశ్వాసాన్ని కోల్పోకూడదు. మనస్సు ఆడుకొనెడి ఆటలతో భంగపాటు చెందకుండా ఉండాలి. 'జీవిత ప్రయాణం' కూడా రైలు ప్రయాణం వంటిదే! రైలులోనే ఓపికగా, నమ్మకంగా కూర్చుని ప్రయాణించినట్లుగానే, జీవిత ప్రయాణంలో కూడా సహనంతో, విశ్వాసంతో స్థిమితంగా ఉండాలి. గురువు అనే డ్రైవరు నీ జీవిత ప్రయాణంలో నిన్ను నీ గమ్యస్థానానికి నిక్షేపంగా చేరవేయగలడు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: శు.పాడ్యమి రా.12.52 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: హస్త ప.3.00 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం: రా.11.53 నుండి 1.37 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.52 నుండి 10.40 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.26 వరకు, అమృతఘడియలు: ఉ.8.19 నుండి 10.04 వరకు, శరన్నవరాత్రులు, దేవీ నవరాత్రులు ప్రారంభం.; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.54, సూర్యాస్తమయం: 5.47.


HONDA
happy navratri
Scooter అంటే
ACTIVA
With H-Smart Technology
Cashback of 5% up to ₹5000#
Low ROI @ 7.99%**
To enjoy the video, please Scan QR Code.
ACTIVA 3.25 CRORE*
For more information give a missed call on 7230032200
IDFC FIRST Bank
Bank**/Credit Card#
HDFC BANK
Credit Card#
TATA CAPITAL Two Wheeler Loans **
L&T Finance **
For dealer details scan the QR Code
BOOK ONLINE NOW!
CLICK BOOK RELAX

యుద్ధ భయం!

ప్రపంచయుద్ధం దిశగా పశ్చిమాసియా ఘర్షణలు!

ఇజ్రాయెల్, ఇరాన్ రగడపై సర్వత్రా ఆందోళనలు

లెబనాన్, యెమన్, గాజాల్లో ఇప్పటికే కుంపట్లు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ కురిపించిన క్షిపణుల వర్షం రక్షణ నిపుణులతో పాటు ప్రపంచ దేశాలన్నింటినీ ఆందోళనకు గురి చేస్తోంది. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి ఆరంభ సూచికేనంటూ వెల్లువెత్తుతున్న విశ్లేషణలతో ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది. రెండు రోజులుగా సోషల్ మీడియాలో ఇదే ట్రెండింగ్ టాపిక్‌గా మారింది. ఆన్‌లైన్‌లో లక్షలాది పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. అటు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం రెండేళ్లు దాటినా ఆగే సూచనలు కన్పించడం లేదు. ఇటు గాజాపై ఇజ్రాయెల్ తెరతీసిన దాడులకు ఏడాది నిండనుంది. అవీ ఇప్పట్లో ఆగే సూచనల్లేవు. ఇరాక్, యెమన్, సిరియాల్లోని ఉగ్రవాద సంస్థలు ఇప్పటికే పాలస్తీనాకు దన్నుగా ఇజ్రాయెల్‌పై అడపాదడపా దాడులకు దిగుతూనే ఉన్నాయి. తద్వారా ఆయా దేశాలను కూడా ఇజ్రాయెల్‌తో యుద్ధం దిశగా లాగుతున్నాయి. వీటికి తోడు లెబనాన్‌ను వైమానిక దాడులతో వణికించి హెజ్‌బొల్లా అగ్రనేతలను వరుసబెట్టి మట్టుపెట్టిన ఇజ్రాయెల్ తాజా భూతల దాడులకు కూడా దిగింది. ఆ వెంటనే ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలోకి చందంగా మారింది. తమపై క్షిపణి దాడులకు మర్చిపోలేని రీతిలో బదులిస్తామని ఇజ్రాయెల్ ఇప్పటికే హెచ్చరించింది. ఆ ప్రతీకార దాడులు బహుశా కనీవినీ ఎరగనంత తీవ్రంగా ఉండవచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా ఇరాన్ అణు కేంద్రాలను నేలమట్టం చేయడానికి దీన్ని అందివచ్చిన అవకాశంగా ఇజ్రాయెల్ భావిస్తోంది. అదే జరిగితే ఇరాన్, పశ్చిమాసియాలోని దాని మిత్ర దేశాలు మరింత తీవ్రంగా ప్రతిస్పందించే ఆస్కారముంది. మొత్తమ్మీద పశ్చిమాసియా యుద్ధక్షేత్రంగా మారిపోయింది. ''అక్కడి పరిస్థితి మందుపాతరను తలపిస్తోంది. ఇప్పుడు తేలాల్సింది దానిపై ముందుగా ఎవరు కాలేస్తారన్నదే!'' అని అంతర్జాతీయ రక్షణ నిపుణులు అంటున్నారు. తారస్థాయికి చేరుతున్న ఈ ఉద్రిక్తతలు మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తే ఆశ్చర్యం లేదన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

రంగం సిద్ధం...?

తమపై ప్రతిదాడులకు దిగితే మరింతగా విరుచుకుపడతామన్న ఇరాన్ హెచ్చరికలను ఇజ్రాయెల్ ఖాతరు చేసే అవకాశాలు లేనట్టే. క్షిపణి దాడులకు భారీ స్థాయి ప్రతీకారానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. అందుకు మిత్రదేశం అమెరికాతో పాటు నాటో కూటమి కూడా దన్నుగా నిలవడం ఖాయమే. మంగళవారం నాటి ఇరాన్ క్షిపణి దాడులను అడ్డుకోవడంలో అమెరికా సాయపడింది కూడా. మధ్యధరా సముద్రంలో మోహరించిన అమెరికా యుద్ధనౌకలు ఇరాన్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని పేల్చేశాయి. అంతేగాక పశ్చిమాసియాలో ఇప్పటికే ఉన్న తమ సైనికులకు తోడుగా మరికొన్ని వేలమందిని పంపుతామని అమెరికా ప్రకటించింది. యుద్ధ విమానాల మోహరింపునూ పెంచనుంది. ఇరాన్‌పై దాడిలో కూడా ఇజ్రాయెల్‌కు అమెరికా, నాటో దన్నుగా నిలిస్తే దాని పరిణామాలు తీవ్రంగానే ఉంటాయి.

> **అవున్నిజమే**
>
> మనమిప్పుడు కచ్చితంగా మూడో ప్రపంచ యుద్ధపు ముంగిట్లో నిలిచాం. ప్రపంచంలో ఏ మూల చూసినా ఎటు చూసినా యుద్ధమో, యుద్ధ భయాలో, యుద్ధపు హెచ్చరికలో కన్పిస్తున్నాయి. అమెరికాను పాలిస్తున్న అసమర్థులు (అధ్యక్షుడు బైడెన్, ఉపాధ్యక్షురాలు హారిస్‌లను ఉద్దేశించి) ఏమీ చేయలేకపోతున్నారు
>
> \- అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ఎరుపెక్కిస్తున్న ఎర్రసముద్రం

యెమన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రాన్ని గుప్పెట్లో పెట్టుకున్న వైనం ప్రపంచ దేశాలన్నింటినీ ప్రభావితం చేస్తోంది. ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే నౌకలను చెరబడుతూ, లూటీ చేస్తూ హౌతీలు కలకలం రేపుతున్నారు. దీనివల్ల అంతర్జాతీయ వర్తకం, ప్రపంచ వ్యాప్తంగా సరుకు రవాణా భారీగా ప్రభావితమవుతున్నాయి. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. అంతేగాక దేశాల నడుమ ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలను ఈ పరిణామం మరింతగా ఎగదోస్తోంది.

అగ్ర రాజ్యాలు చెరోవైపు!

అపార చమురు నిల్వలకు ఆలవాలమైన పశ్చిమాసియాపై పట్టు కోసం అమెరికా, రష్యా ప్రయత్నాలు ఇప్పటివి కావు. అగ్ర రాజ్యాలు రెండూ ప్రాంతీయ శక్తులనే పాచికలుగా మార్చుకుని ఎత్తులూ పై ఎత్తులు వేస్తూ వస్తున్నాయి. సౌదీకి అమెరికా దన్నుంటే ఇరాన్, సిరియా తదితరాలకు రష్యా ప్రాపకముంది. వ్యూహాత్మక, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా పశ్చిమాసియా వరకు రష్యాకు చైనా, ఉత్తర కొరియా కూడా మద్దతుగానే ఉంటున్నాయి. నాటో ముసుగులో తన ముంగిట్లో తిష్ట వేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చెక్ పెట్టడానికే ఉక్రెయిన్‌పై రష్యా ఆక్రమణకు దిగింది. ఆ పోరుకు అంతం ఇప్పట్లో కనిపించడం లేదు. పశ్చిమాసియా రగడ ముదిరితే తమ మిత్ర దేశాలకు మద్దతుగా అటు అమెరికా, ఇటు రష్యా కూడా రంగంలోకి దిగాల్సిన పరిస్థితులు తలెత్తవచ్చు.

పర్యవసానాలు ఊహించలేం

ఈ అణ్వస్త్ర యుగంలో మూడో ప్రపంచ యుద్ధమంటూ వస్తే దాని పర్యవసానాలు ఊహించలేనంత భయంకరంగా ఉంటాయి. కనుక యుద్ధజ్వాలలను ఆ స్థాయికి రగిల్చే దుస్సాహసానికి ఏ దేశమూ ఒడిగట్టకపోవచ్చు. ఒకవేళ అలాంటి పరిస్థితి తలెత్తినా ఉద్రిక్తతలను చల్లబరిచేందుకు భారత్‌తో సహా పలు దేశాలు శాయశక్తులా ప్రయత్నాలు చేస్తాయి కూడా. కనుక ఇప్పటికిప్పుడు మూడో ప్రపంచ యుద్ధం రాకపోవచ్చన్న అభిప్రాయాలకూ కొదవ లేదు. కాకపోతే పశ్చిమాసియా పరిణామాలు ఎటు దారి తీస్తాయో చెప్పలేని పరిస్థితి!

పశ్చిమాసియాలో ఎవరెటువైపు...!

పశ్చిమాసియాపై నానాటికీ యుద్ధమేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి చినికి చినికి గాలివానగా రూపుదాలుస్తోంది. అటు లెబనాన్‌కు పాకడంతో పాటు తాజాగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భారీ ఘర్షణలకు దారి తీస్తోంది. ఇది పూర్తిస్థాయి యుద్ధంగా మారితే అది రెండు దేశాలకే పరిమితం కాబోదు. మిగతా దేశాలన్నీ చెరో వైపు మోహరించడం ఖాయం. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా దేశాల్లో ఏవి ఎవరి వైపన్నది ఆసక్తికరం. దీనికి సంబంధించి గత ఏప్రిల్లోనే ట్రయిలర్ కనిపించింది. ఇజ్రాయెల్‌పై ఉన్నట్టుండి దాడికి దిగిన ఇరాన్‌కు లెబనాన్‌తో పాటు యెమన్ హౌతీలు పూర్తి దన్నుగా నిలిచారు. ఇజ్రాయెల్‌కు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి పాశ్చాత్య మిత్రులతో పాటు జోర్డాన్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి పొరుగు దేశాలు మద్దతిచ్చాయి.

ఇజ్రాయెల్ వైపు	ఇరాన్ వైపు
సౌదీ అరేబియా	సిరియా
యూఏఈ	యెమన్ (హౌతీలు)
(అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌తో పాటు నాటో దన్ను)	పాలస్తీనా (హమాస్)
	హెజ్‌బొల్లా (లెబనాన్)

తటస్థ దేశాలు

- ఖతర్ (ఇజ్రాయెల్ వైపు మొగ్గు)
- జోర్డాన్ (ఇజ్రాయెల్ వైపు మొగ్గు)
- ఈజిప్ట్ (ఇరాన్ వైపు మొగ్గు)
- తుర్కియే (ఇరాన్ వైపు మొగ్గు)

\- సాక్షి, నేషనల్ డెస్క్





ఇరాన్ క్షిపణి దాడితో ఇజ్రాయెల్‌లోని గెదెరాలో కుప్పకూలిన ఓ స్కూలు భవనం వద్ద ఏర్పడ్డ భారీ గొయ్యిని పరిశీలిస్తున్న అధికారులు

ఇజ్రాయెల్‌కు ప్రాణనష్టం

హెజ్‌బొల్లాపై యుద్ధంలో ఎనిమిది మంది సైనికులు మృతి

టెల్ అవీవ్: దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా మిలిటెంట్లను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా సైనిక ఆపరేషన్ చేపట్టిన ఇజ్రాయెల్‌కు ప్రాణనష్టం సంభవించింది. హెజ్‌బొల్లాపై యుద్ధంలో తమ జవాన్లు ఎనిమిది మంది మరణించినట్లు ఇజ్రాయెల్ సైనికాధికారులు బుధవారం ప్రకటించారు. రెండు వేర్వేరు ఘటనల్లో వీరు మృతి చెందినట్లు తెలిపారు. తాము వెనుకడుగు వేయబోమని, హెజ్‌బొల్లాపై దాడులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. మరోవైపు హెజ్‌బొల్లా సైతం వెనక్కి తగ్గడంలేదు. ఇజ్రాయెల్ సేనలపై విరుచుకుపడుతోంది. లెబనాన్-ఇజ్రాయెల్ సరిహద్దుల్లోని రెండు ప్రాంతాల్లో ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య హోరాహోరీ పోరు సాగుతున్నట్లు తెలుస్తోంది. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ పదాతి దళానికి అండగా యుద్ధ ట్యాంకులు సైతం రంగంలోకి దిగాయి. ఇజ్రాయెల్ దాడుల్లో తమ సభ్యులు కొందరు గాయపడ్డారని హెజ్‌బొల్లా తెలియజేసింది.

50 గ్రామాలు, పట్టణాలు ఖాళీ!

దక్షిణ లెబనాన్ మొత్తం యుద్ధక్షేత్రంగా మారిపోవడంతో జనం తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సరిహద్దు నుంచి 60 కిలోమీటర్ల లోపు ఉన్న గ్రామాలు, పట్టణాలను వెంటనే ఖాళీ చేయాలని ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించారు. దీంతో జనం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఇప్పటికే వేలాది మంది తరలిపోయారు. దాదాపు 50 గ్రామాలు, పట్టణాలు ఖాళీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. గత రెండు వారాల్లో ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో దాదాపు వెయ్యి మంది మరణించినట్లు సమాచారం. హెజ్‌బొల్లా కబంధ హస్తాల నుంచి లెబనాన్ ప్రజలకు విముక్తి కల్పించడానికే సైనిక చర్య ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. లక్ష్యం నెరవేరేదాకా దాడులు ఆగవని అంటోంది.

ఇరాన్, కాచుకో!

నెతన్యాహు హెచ్చరిక



క్షిపణి దాడుల ద్వారా ఇరాన్ దిద్దుకోలేని తప్పు చేసిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. త్వరలోనే అందుకు భారీ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. ''మాపై ఇరాన్ దాడులు విఫలమయ్యాయి. కాకపోతే వాటికి తెగబడ్డందుకు బాధాకరమైన గుణపాఠం తప్పదు. అదెలా ఉంటుందో లెబనాన్, గాజాల్లో మా శత్రువులు ఇప్పటికే రుచిచూశారు'' అన్నారు. ''మాపై ఎవరు దాడికి దిగినా ఉపేక్షించబోం. ప్రతిదాడికి దిగి తీరతాం'' అని స్పష్టం చేశారు. ఇరాన్ దాడి నేపథ్యంలో నెతన్యాహు అత్యవసరంగా కేబినెట్‌ను సమావేశ పరిచి పరిస్థితిని సమీక్షించారు. మంగళవారం రాత్రి ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ 200 పై చిలుకు క్షిపణులు ప్రయోగించడం తెలిసిందే. వాటిలో 90 శాతానికి పైగా లక్ష్యాలను ఛేదించాయని ఇరాన్ చెప్పుకోగా దాదాపుగా అన్నింటినీ అడ్డుకుని నిర్వీర్యం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు. ఎవరికీ కనీసం గాయాలు కూడా కాలేదని ఇజ్రాయెల్ పేర్కొంది. ఇరాన్ దాడి విఫలమైందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. మధ్యధరా సముద్రంలోని తమ యుద్ధ నౌకలు యూఎస్ఎస్ కోల్, యూఎస్ఎస్ బల్కెలీ రంగంలోకి దిగి పలు క్షిపణులను అడ్డుకుని నిర్వీర్యం చేసినట్టు చెప్పారు. ఇజ్రాయెల్‌కు పూర్తిగా దన్నుగా నిలుస్తామని పునరుద్ఘాటించారు. ఇరాన్ క్షిపణి దాడులను ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తీవ్రంగా ఖండించారు. పశ్చిమాసియాలోని అమెరికా దళాల భద్రత కోసం ఎలాంటి చర్యకైనా వెనకాడబోమని ఇరాన్‌ను ఆమె హెచ్చరించారు.

గుటెరస్‌కు 'నో ఎంట్రీ'

ఇజ్రాయెల్ ప్రకటన



దియర్ అల్-బలాహ్ (గాజా స్ట్రిప్): ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌ను తమ దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నట్లు ఇజ్రాయెల్ బుధవారం ప్రకటించింది. పక్షపాత ధోరణిని కనబరుస్తున్నారని, ఇజ్రాయెల్ వ్యతిరేక వైఖరితో ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నారని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఆరోపించారు. గుటెరస్‌ను ఇజ్రాయెల్‌లో ప్రవేశించడానికి అనుమతి లేని వ్యక్తిగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. తాజా చర్యతో ఐరాస- ఇజ్రాయెల్ మధ్య అంతరం మరింత పెరగనుంది. మంగళవారం రాత్రి కాల్పుల విరమణ పాటించాలని పిలుపునిచ్చిన గుటెరస్.. ఇరాన్ క్షిపణి దాడుల ప్రస్తావన తేకపోవడం ఇజ్రాయెల్‌కు కోపం తెప్పించింది. ఇజ్రాయెల్‌లో తన ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించాక గుటెరస్ బుధవారం స్పందించారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులను ఖండించారు. పశ్చిమ ఆసియాలో దెబ్బకు దెబ్బ అన్నట్లుగా సాగుతున్న హింసకు తెరపడాలన్నారు.

ఇరాన్‌కు వెళ్లొద్దు: భారత్

న్యూఢిల్లీ: అత్యవసరమైతే తప్పితే భారతీయులెవరూ ఇరాన్‌కు వెళ్లొద్దని విదేశాంగ శాఖ బుధవారం సూచించింది. ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను, పశ్చిమాసియాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది.

ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి భద్రత పెంపు

తుగ్లక్ రోడ్డులో ఉన్న ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి ఢిల్లీ పోలీసులు భద్రతను పెంచారు. అదనపు సిబ్బందిని మోహరించడంతో పాటు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం ప్రాంగణంలో రెండు భవంతుల చుట్టూ పలు అంచెల్లో భద్రతా వలయాలను ఏర్పాటు చేసినట్లు ఒక పోలీసు అధికారి చెప్పారు. గతంలో రెండుసార్లు రాయబార కార్యాలయం వద్ద పేలుళ్లు జరిగిన నేపథ్యంలో ఇదివరకే సీసీటీవీ కెమెరాలతో గట్టి నిఘా పెట్టామని వివరించారు.

రూ. 5,600 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఎత్తున కొకైన్ పట్టుబడింది. గతంలో ఎన్నడూ లేనంత పెద్ద మొత్తంలో 560 కిలోల కొకైన్‌ను పట్టుకున్నట్లు ఢిల్లీ పోలీసులు బుధవారం ప్రకటించారు. అలాగే 40 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. దీని విలువ దాదాపు రూ. 5,620 కోట్లు ఉంటుందని తెలిపారు. దక్షిణ ఢిల్లీలోని మహిపాల్‌పూర్‌లో ఢిల్లీ పోలీసు స్పెషల్ టీమ్ నలుగురి అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మొత్తం 602 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుందని ఏసీపీ పి.ఎస్.కుష్వాహ వెల్లడించారు. తుషార్ గోయల్, హిమాంశు కుమార్, ఔరంగజేబ్ సిద్దిఖీ, భరత్‌కుమార్ జైన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఖరీదైన వసంత్ విహార్‌లో నివసించే తుషార్ గోయల్.. భారత్‌లోనే ప్రముఖ డ్రగ్స్ సరఫరాదారు అని చెప్పారు. ముంబైకి చెందిన భరత్‌కుమార్ 15 కిలోల కొకైన్‌ను తీసుకోవడానికి తుషార్ గోయల్ వద్దకు వచ్చాడని, మహిపాల్‌పూర్‌లో ఒక గోడౌన్ బయట ఈ నలుగురిని మంగళవారం అరెస్టు చేశామని వివరించారు.

గాంధీజీపై కంగన వివాదాస్పద పోస్ట్

న్యూఢిల్లీ: తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే బాలీవుడ్ నటి, బీజేపీ మండీ ఎంపీ కంగనా రనౌత్ గాంధీజీ జయంతి సందర్భంగా వివాదాస్పద పోస్ట్ చేశారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా కంగన బుధవారం ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక పోస్ట్ చేశారు. ''దేశానికి జాతిపిత అంటూ ఎవరూ ఉండరు. ముద్దు బిడ్డలు మాత్రమే ఉంటారు. భరతమాత బిడ్డలుగా పుట్టిన వీళ్ల జన్మలు ధన్యమయ్యాయి'' అని పోస్ట్‌చేశారు. ''దేశంలో స్వచ్ఛత కోసం పాటుపడుతూ ప్రధాని మోదీ సైతం గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తున్నారు'' అని మరో పోస్ట్‌చేశారు. అయితే జాతిపిత ఉండరంటూ చేసిన పోస్ట్‌పై విమర్శలు వెల్లువెత్తాయి.

నైజీరియాలో పడవ బోల్తా

100 మందికిపైగా జాడ గల్లంతు

అబూజా: నైజీరియా వాయవ్య ప్రాంతంలో రాత్రి ఉత్సవాలకు వెళ్లి తిరిగొస్తున్న జనం ప్రయాణిస్తున్న పడవ బోల్తాపడింది. కిక్కిరిసిన ప్రయాణికుల కారణంగా ఈ పడవ బోల్తాపడినట్లు తెలుస్తోంది. పడవ బోల్తా ఘటనలో ఏకంగా 100 మందికిపైగా జాడ గల్లంతయిందని అధికారులు బుధవారం వెల్లడించారు. సోమవారం రాత్రి మోక్వా జిల్లాలో ఈ ఘటన జరిగింది. 100 మంది మాత్రమే ప్రయాణించడానికి అనువైన పడవలో ఏకంగా 300 మంది ఎక్కారని వార్తలొచ్చాయి.

జార్ఖండ్‌లో తగ్గుతున్న హిందువులు, ఆదివాసీల జనాభా

- ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- జేఎంఎం కూటమి ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం

హజారీబాగ్: జార్ఖండ్‌లో హిందువులు, ఆదివాసీల జనాభా తగ్గిపోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. జేఎంఎం కూటమి ప్రభుత్వం ప్రమాదకరమైన ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఓట్ల కోసం, రాజకీయ లబ్ధి కోసం చొరబాటుదారులను నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తూ జార్ఖండ్ గుర్తింపు, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. జార్ఖండ్ మాటీ, బేటీ, రోటీని(మట్టి, బిడ్డ, రొట్టె) కాపాడుకోవడానికి దుష్టశక్తులను దూరంగా తరిమికొట్టే సమయం వచ్చిందని ప్రజలకు పిలుపునిచ్చారు. అవినీతిని అంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జార్ఖండ్‌లో 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5,400 కిలోమీటర్ల మేర బీజేపీ చేపట్టిన పరివర్తన్ యాత్ర బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. జేఎంఎం కూటమి ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ప్రజలను కోరారు. పరివర్తన్ యాత్ర మార్గంలో సేకరించిన మట్టిని నింపిన కలశాన్ని ప్రధాని మోదీకి మహిళలు బహూకరించారు. గిరిజన మహిళలతో ఆయన సమావేశమయ్యారు.

గిరిజనులు ఈ దేశ ఆస్తి

జార్ఖండ్‌లో రూ.83,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. గిరిజనులు ఈ దేశ ఆస్తి అని మహాత్మా గాంధీ చెప్పారని గుర్తుచేశారు. అందుకే గిరిజనుల పురోభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. రూ.79,150 కోట్లతో అమలు చేసే 'ధర్తి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'కు మోదీ శ్రీకారం చుట్టారు. దేశ వ్యాప్తంగా గిరిజనుల సమగ్రాభివృద్ధే ఈ పథకం లక్ష్యం. ఈ పథకం కింద 65 వేల గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు.



గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలో స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న మోదీ

అతిపెద్ద ప్రజా ఉద్యమం

స్వచ్ఛ భారత్‌పై ప్రధాని మోదీ హర్షం

న్యూఢిల్లీ: స్వచ్ఛ భారత్ మిషన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. 21వ శతాబ్దంలో అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ప్రజా ఉద్యమం స్వచ్ఛ భారత్ అని స్పష్టంచేశారు. ప్రజా ఆరోగ్యం, ప్రజా సంక్షేమంపై ఈ కార్యక్రమం ఎనలేని ప్రభావం చూపిందని అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. చీపురు చేతబట్టి చిన్నారులతో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. స్వచ్ఛభారత్‌లో ప్రజల భాగస్వామ్యం దేశానికి సౌభాగ్యాన్ని చేకూర్చే సరికొత్త మార్గంగా రూపాంతరం చెందిందని ప్రశంసించారు. ప్రజల చొరవతోనే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. సేవా పఖ్వాడాలో భాగంగా కేవలం 15 రోజుల్లో 27 లక్షలకుపైగా స్వచ్ఛతా వేడుకలు జరిగాయని, 28 కోట్ల మందికిపైగా జనం భాగస్వాములయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించారని వివరించారు. నిరంతర ప్రయత్నాలే మన దేశాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతాయని తేల్చిచెప్పారు. మరో వెయ్యి సంవత్సరాల తర్వాత అప్పటి మనుషులు 21వ శతాబ్దం నాటి భారతదేశం గురించి మాట్లాడుకుంటే, అందులో స్వచ్ఛ భారత్ ప్రస్తావన తప్పనిసరిగా ఉంటుందని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్, అమృత్ 2.0 మిషన్ల కింద రూ.10,000 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రారంభించారు. ఇందులో తాగునీరు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఉన్నాయి.

టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిన హెలికాప్టర్

- ఇద్దరు పైలట్లు సహా ముగ్గురి మృతి
- పుణే జిల్లాలో ఘటన

పుణే: ఢిల్లీ కేంద్రంగా పనిచేసే హెరిటేజ్ ఏవియేషన్ సంస్థకు చెందిన ఒక హెలికాప్టర్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కొండ ప్రాంతంలో కూలిపోయింది. మహారాష్ట్రలోని పుణే జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఇద్దరుపైలట్లుసహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. షెడ్యూల్ ప్రకారం పుణె జిల్లా నుంచి ఆ హెలికాప్టర్ ముంబైకి చేరుకున్నాక ఈ హెలికాప్టర్‌లోనే తాను రాయ్‌గఢ్‌కు ప్రయాణించాల్సి ఉందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ సునీల్ తట్కారే తర్వాత ప్రకటించారు. కూలిన హెలికాప్టర్ నుంచి మంటలు చెలరేగడంతో హెలికాప్టర్‌లోని ఇద్దరు పైలట్లు, ఒక ఇంజనీర్ చనిపోయారని పింప్రి ఛించ్వాడ్ పోలీస్ కమిషనర్ వినయ్ చౌబే చెప్పారు. బుధవారం ఉదయం 7.40గంటలకు ఆక్స్‌ఫర్డ్ కౌంటీ గోల్ఫ్‌కోర్స్ నుంచి బయల్దేరిన అగస్టా109 రకం హెలికాప్టర్ కొద్దిసేపటికే బావ్‌ధాన్ ప్రాంతంలోని కొండప్రాంతంలో కూలిపోయింది. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది. అయితే మార్గంలోని కొండల్లో దట్టంగా కమ్ముకున్న భారీ పొగమంచు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతులను గిరీశ్ కుమార్, సింగ్ భరద్వాజ, పరమ్‌జీత్ సింగ్‌లుగా గుర్తించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ఘటనపై మహారాష్ట్ర ఎన్సీపీ నేత సునీల్ తట్కారే స్పందించారు. '' ఈ హెలికాప్టర్‌ను ఎన్సీపీ పార్టీ అద్దెకు తీసుకుంది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో కార్యక్రమానికి ఇందులోనే వెళ్లా. ఈరోజు ముంబై నుంచి రాయ్‌గఢ్‌కు వెళ్లాల్సి ఉంది. అంతలోనే ఇలా జరిగింది'' అని ఆయన అన్నారు.

బావ్‌ధాన్‌లో హెలికాప్టర్ శకలాల నుంచి ఎగసిపడుతున్న మంటలు, పొగ



బిహార్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్



బిహార్‌లో భారత వాయుసేనకు చెందిన వరదబాధితులకు సహాయక సామగ్రిని అందించి వస్తున్న ఒక ఆర్మీ హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అయింది. ముజఫర్‌పూర్ జిల్లాలోని ఔరాయి బ్లాక్ పరిధిలో వరదనీరు నిల్చిన చోట ఇది ల్యాండయింది. స్థానికులు వెంటనే ఆ హెలికాప్టర్‌లోని వారందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారని సీనియర్ ఎస్పీ రాకేశ్ చెప్పారు.

గాజాపై భూతల దాడులు

ఇజ్రాయెల్ దుశ్చర్య.. 51 మంది మృతి

డెయిర్ అల్ బాలాహ్: లెబనాన్‌తో కయ్యానికి కాలుదువ్విన ఇజ్రాయెల్ మరోవైపు గాజాలో భూతల దాడులను ఉధృతం చేసింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ సేనలు బుధవారం ఉదయం నుంచి చేస్తున్న భీకర భూతల దాడుల్లో 51 మంది మరణించారు. 82 మందిగాయపడ్డారు. చనిపోయిన వారిలో మహిళలు, చిన్నారులు సైతం ఉన్నారని పాలస్తీనాలోని వైద్యాధికారులు బుధవారం ప్రకటించారు. లెబనాన్, ఇరాన్‌లపై దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ గత ఏడాదికాలంగా గాజాపై భూతల, గగనతల దాడులను కొనసాగిస్తున్న విషయం విదితమే. బుధవారం ఉగ్రస్థావరాలపై మాత్రమే దాడులు చేశామని ఇజ్రాయెల్ చెబుతోంది. అయితే ఏఏ ప్రాంతాలపై దాడులు చేశామనే వివరాలను ఇజ్రాయెల్ వెల్లడించలేదు. ఖాన్ యూనిస్ పొరుగున ఉన్న మూడు ప్రాంతాలపైనా ఇజ్రాయెల్ సేనలు దాడులు చేశాయని స్థానికులు చెప్పారు.

ట్రంప్ అసమర్థుడు: వాల్జ్

- ప్రపంచానికి భద్రతనిచ్చారు: వాన్స్
- ఉపాధ్యక్ష అభ్యర్థుల వాడీవేడి డిబేట్



వాషింగ్టన్: అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ విధానాలన్నీ అమెరికాకు తీవ్రంగా చేటు చేశాయని డెమొక్రాట్ల ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్ విమర్శించారు. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి అత్యంత సమీపానికి వచ్చిందంటే ఆయన అసమర్థతే కారణమన్నారు. ఈ ఆరోపణలను ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జె.డి.వాన్స్ తోసిపుచ్చారు. అధ్యక్షునిగా ట్రంప్ పాలనా దక్షత వల్లే ప్రపంచం ఇప్పుడింత సురక్షితంగా ఉందని చెప్పుకొచ్చారు. ఆయన హయాంలో ప్రపంచంలో ఎక్కడా యుద్ధాలు, యుద్ధ భయాలు తలెత్తలేదన్నారు. మంగళవారం రాత్రి సీబీఎస్ న్యూస్ వార్తా సంస్థ వేదికగా జరిగిన ఉపాధ్యక్ష అభ్యర్థుల డిబేట్‌లో వారిద్దరూ తలపడ్డారు. ''ట్రంప్ అస్థిర మనస్కుడు. పాలనకు పూర్తిగా అనర్హుడని ఆయనతో కలిసి పని చేసిన అత్యున్నత స్థాయి అధికారులంతా ముక్త కంఠంతో చెప్పారు. మా అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌లో గొప్ప నాయకత్వ లక్షణాలున్నాయి'' అని వాల్జ్ అన్నారు.



ఇరాన్ ప్రయోగించిన క్షిపణి పేలకపోవడంతో తొలగిస్తున్న ఇజ్రాయెల్ పౌరులు

ఇజ్రాయెల్‌లో మా వాళ్లు ఎలా ఉన్నారో?

- ఇరాన్ దాడుల నేపథ్యంలో తెలుగు వారి ఆందోళన
- ఇజ్రాయెల్‌లో నివాసం ఉంటున్న సుమారు 5 వేల మంది తెలుగు వారు
- తెలంగాణ నుంచి సుమారు 800 మంది కార్మికులు
- ఫోన్లు చేసి క్షేమ సమాచారం కనుక్కుంటున్న కుటుంబ సభ్యులు

ఆర్మూర్: ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో.. ఉపాధి కోసం ఇజ్రాయెల్ దేశానికి వలస వెళ్లిన తెలంగాణ కార్మికుల కుటుంబాలు ఇక్కడ భయాందోళనలకు గురవుతున్నాయి. తమ వారికి ఫోన్లు చేస్తూ ఎప్పటికప్పుడు క్షేమ సమాచారం తెలుసుకుంటున్నాయి. ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులు సైతం భారతీయులంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఊళ్లలో సరైన పనులు దొరక్క నిజామాబాద్, కరీంనగర్, నిర్మల్, మెదక్, జగిత్యాల జిల్లాలతో పాటు తెలంగాణవ్యాప్తంగా సుమారు 800 మంది ఇజ్రాయెల్‌లో ఉపాధి కోసం వలస వెళ్లారు. వీరిలో పలువురు ఇజ్రాయెల్ వాసుల ఇళ్లలో కేర్‌టేకర్లుగా పనులు చేస్తున్నారు. మరో వైపు ఆ దేశంలో సుమారు ఐదు వేల మంది తెలుగు వారు వివిధ వ్యాపారాలు, ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం నివాసం ఉంటున్నారు. కోవిడ్ సమయంలో అనేక ఇబ్బందులు పడ్డ కార్మికులు ఇప్పుడు ఏడాది కాలంగా యుద్ధ పరిస్థితులతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఇజ్రాయెల్‌లోని రమద్‌గాన్ పట్టణం తలవిల ప్రాంతంలో అత్యధికంగా తెలంగాణ వాసులు నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ఇజ్రాయెల్ బాంబుల మోతతో దద్దరిల్లుతోందని తెలంగాణ వాసులు 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. కాగా, ఇజ్రాయెల్ ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల్లో భాగంగా బాంబుల దాడి సమయంలో అధికారులు సైరన్ మోగిస్తారు. వెంటనే ప్రజలు ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో పటిష్టంగా నిర్మించిన బాంబ్ సేఫ్టీ రూంలో తలదాచుకుంటారు.

కొత్త సంవత్సర వేడుకల్లో ఉన్నాం..



బుధవారం ఇక్కడ నూతన సంవత్సరం. అందరం సామూహిక ప్రార్థనల్లో ఉన్నాం. ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి టెల్ అవీవ్ పరిసరాల్లో సుమారు ఐదువేల మంది వరకు ఇక్కడ వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతానికి మాకు భయమేమీ లేదు. భద్రంగానే ఉన్నాం. ఏదైనా ముప్పు ఉంటే ముందే హెచ్చరిస్తారు. బంకర్లు సిద్ధంగా ఉన్నాయి. – లాజరస్ కొల్లాబత్తుల(ఇజ్రాయెల్), మల్కిపురం, కోనసీమ జిల్లా, ఏపీ

రక్షణ చర్యలు చేపట్టారు



ఇజ్రాయెల్ ప్రభుత్వం పౌరుల రక్షణకు గట్టి చర్యలు చేపట్టింది. దాడులు జరుగుతున్న ప్రాంతం మా నివాస ప్రాంతాలకు దూరంగా ఉండటం వల్ల తెలంగాణ వాసులు పెద్దగా భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు. – సోమ రవి, తెలంగాణ – ఇజ్రాయెల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నాము..



ఇజ్రాయెల్ ప్రభుత్వం సూచించిన ప్రకారం భద్రతాపరమైన చర్య లను తీసుకుంటున్నాం. దాడులు సరిహద్దుల్లోనే జరుగుతున్నాయి కాబట్టి మాకు ప్రాణభయం లేదు. కోవిడ్‌లో ఉపాధి లభించక ఇబ్బందులు పడ్డాము. ఇప్పుడు యుద్ధం కారణంగా ఎన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని భయంగా ఉంది. – శ్రీనివాస్ (ఇజ్రాయెల్), అమ్దాపూర్, నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ మండలం

మహాత్ముడి సాక్షిగా.. మద్యం మానేస్తాం

మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ప్రతిజ్ఞ



మద్యం మానేస్తాం అని ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు..

దండేపల్లి: మంచిర్యాల నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏడాది పాటు మద్యం మాన్పించే బృహత్తర కార్యక్రమానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శ్రీకారం చుట్టారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 733 మంది నాయకులు, కార్యకర్తలు, యువకులతో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు. ''కాంగ్రెస్ పార్టీ నాయకులం, కార్యకర్తలమైన మేము, మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మద్యం తాగబోమని, ఇతర మాదకద్రవ్యాలు తీసుకోబోమని, నేను నమ్మిన దేవుని మీద ప్రమాణం చేస్తున్నాను. గాంధీజీ కన్నకలలు సాకారం చేయడానికి మద్యానికి దూరంగా ఉంటాం. కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా జీవనం సాగిస్తామని, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆశయాలకనుగుణంగా నడుచుకుంటామని, కుల, మత తేడాలు, కక్షలు, గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తామని, నేను నమ్మిన దేవుని మీద ప్రమాణం చేస్తున్నాను..''అని ప్రతిజ్ఞ చేశారు.

'ఈశాన్య' సీజన్‌లోనూ జోరు వానలు

- రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం
- ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు
- అక్టోబర్‌లో పలు చోట్ల భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు
- ఈశాన్య రుతుపవనాల అంచనాలు విడుదల చేసిన వాతావరణ శాఖ



సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రాన్ని ముంచెత్తిన వానలు.. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లోనూ అంతే స్థాయిలో జోరుగా ఉంటాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని ఈశాన్య రుతుపవనాల సీజన్‌గా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో మూడు నెలల కాలంలో వర్షాలు, ఉష్ణోగ్రతలపై వాతావరణ శాఖ తాజాగా అంచనాలు విడుదల చేసింది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో సాధారణ సగటు వర్షపాతం 11.32 సెంటీమీటర్లుకాగా, సీజన్ ముగిసేనాటికి ఇంతకు మించి వర్షాలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. నార్త్–ఈస్ట్ మాన్‌సూన్ సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే 12 శాతం అధికంగా వర్షాలు నమోదు కావొచ్చని పేర్కొన్న ఐఎండీ.. అక్టోబర్‌లో మాత్రం 15 శాతం అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 73.86 సెంటీమీటర్లు కాగా, సీజన్ ముగిసే నాటికి 96.26 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాగా, సీజన్ మారుతున్న సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల నిష్క్రమణ, ఈశాన్య రుతుపవనాల ఆగమనం నేపథ్యంలో మూడు, నాలుగు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయన్నారు.

4 ఉమ్మడి జిల్లాల్లో భారీ వర్షాలు..

ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో జోరు వానలు కురుస్తాయన్న వాతావరణ శాఖ.. నాలుగు ఉమ్మడి జిల్లాలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కానున్నట్లు తెలిపింది. ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అక్టోబర్ నెలలో భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు నమోదు కావొచ్చని తెలిపింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక వర్షాలు నమోదు కాగా.. ఖమ్మం, భద్రాచలం, ములుగు, సూర్యాపేట జిల్లాల్లో వరదలు పోటెత్తి తీవ్ర నష్టాల్ని మిగిల్చాయి. ఈశాన్య సీజన్‌లో ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే అధికంగా నమోదు కావొచ్చని, గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటే.. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణ స్థితిలో ఉంటాయని వాతావరణ శాఖ వివరించింది.

ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో సాధారణ వర్షపాతం ఇలా..

నెల	వర్షపాతం (సెం.మీ.)
అక్టోబర్	8.92
నవంబర్	1.99
డిసెంబర్	0.41





తాబేలు–కుందేలు మళ్లీ పోటీ పడితే..

తాబేలు కుందేలు కథ.. మనందరికీ తెలిసిందే. ఆ కథలో కుందేలును తాబేలు పరుగు పందెంలో ఓడిస్తుంది. కథలో ఓడించింది సరే.. మరి నిజంగా ఓడించగలదా.. ఇదే డౌటు బీజింగ్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకులకు వచ్చింది. దాంతో వాటి మధ్య నిజంగానే పరుగు పోటీని పెట్టారు. విషయం విని చాలా మంది వచ్చారు. ఆశ్చర్యకంగా కథే నిజమైంది. తొలుత కుందేలు ఎప్పట్లాగే వేగంగానే వెళ్లింది. తర్వాతే సీన్ మారింది. తాబేలు తన దృష్టి లక్ష్యం మీదే పెట్టి.. నెమ్మదిగా దాని దిశగా వెళ్తూ పోయింది. కుందేలు దృష్టి మాత్రం చెదిరింది. లక్ష్యాన్ని మరిచింది. అక్కడున్న జనాన్ని చూస్తూ ఉండటం మొదలుపెట్టింది. దీంతో తాబేలు నెమ్మదిగానే అయినా విజయాన్ని పొందింది. సో.. నీతి అన్నది అప్పటి కథ నుంచే కాదు.. ఇప్పటి కథ నుంచి కూడా తీసుకోవచ్చు. మన దృష్టి ఎప్పుడూ లక్ష్యం మీదే ఉంటే.. ఆలస్యమవ్వొచ్చు. కానీ విజయం మాత్రం తథ్యం.



స్వయంపాకం ఇచ్చేందుకు క్యూకట్టారు

➤ పెత్తరమాస రోజున బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పెద్దబజార్‌లో ఓ అయ్య వారి ఇంటి వద్ద సాహిత్యం ఇవ్వడానికి జనం వరుసకట్టారు. పెత్తరమాస నాడు తమ దివంగతులైన కుటుంబ పెద్దలను స్మరించుకుని, వారికి ఇష్టమైన ఆహారం వండి, నైవేద్యాలు పెట్టి వారి దీవెనలు ఉండాలని మొక్కుకుంటారు. అంతేగాకుండా వారివారి ఆచారాన్ని బట్టి జంగమయ్యకు, అయ్యవార్లు, బ్రాహ్మణులకు సాహిత్యం (స్వయంపాకం) ఇస్తారు. బుధవారం ప్రత్యేకమైన రోజు కావడం, సాహిత్యం తీసుకునే బ్రాహ్మణుల సంఖ్య తగ్గిపోవడంతో డిమాండ్ ఏర్పడింది. వండుకునేందుకు కావలసిన బియ్యం, పప్పుదినుసులు, కూరగాయలు ఇలా వంటకు కావలసిన దాదాపు అన్ని వస్తువులు సాహిత్యంలో ఉంటాయి.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

పన్ను ఆదాయం 35 శాతమే


అంచనా రూ.1.64 లక్షల కోట్లు.. 5 నెలల్లో వచ్చింది రూ.57 వేల కోట్లే
గత ఏడాదితో పోల్చినా పన్ను ఆదాయంలో తగ్గుదల

గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఆదుకోలేదు.. రాష్ట్ర పన్నుల్లో వాటా రాలేదు

రూ.30 వేల కోట్ల అప్పు చేస్తే.. రూ.10వేల కోట్లు వడ్డీ చెల్లింపులకే...

ఆగస్టు నాటికి ఐదు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా లెక్కలు వెల్లడించిన కాగ్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది రాష్ట్ర పన్ను ఆదాయం ఆపసోపాలు పడుతోంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 5నెలల తర్వాత కూడా బడ్జెట్ అంచనాల్లో కేవలం 35.11% మాత్రమే పన్ను రాబడులు వచ్చాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1.64 లక్షల కోట్లు పన్ను ఆదాయం కింద వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేయగా, ఆగస్టు 31 నాటికి కేవలం రూ.57వేల కోట్లు మాత్రమే వచ్చింది. గత ఏడాది ఐదు నెలల పన్ను ఆదాయంతో పోలిస్తే ఇది ఒక శాతం తక్కువ కావడం గమనార్హం. ఇందులో వస్తు సేవల పన్ను (జీఎస్టీ), అమ్మకపు పన్ను ద్వారానే రూ.33,987 కోట్లు వచ్చాయి. ఎక్సైజ్ ఆదాయం ఆశించిన మేర రాకపోవడం, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ల రూపంలో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు మోక్షం కలగకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ పట్టిక ఇబ్బందులు పడుతోందని ఇటీవల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి. పన్ను ఆదాయం రాని కారణంగా అప్పులు కూడా భారీగానే చేయాల్సి వచ్చిందని ఈ లెక్కలు చూస్తే అర్థమవుతుంది. తొలి అర్థ సంవత్సరంలో ఐదు నెలలు ముగిసేసరికి సుమారు రూ.30వేల కోట్ల అప్పు చేయాల్సి వచ్చింది. బహిరంగ మార్కెట్ ద్వారా ఈ రుణాలను సేకరించగా, అందులో రూ.10వేల కోట్లకు పైనే గతంలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకే కట్టాల్సి వచ్చింది. ఇక, ఈ ఏడాది మూల ధనవ్యయం కింద రూ.32 వేల కోట్లు ఖర్చు పెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఐదు నెలల్లో కేవలం రూ. 8,327కోట్లు మాత్రమే వెచ్చించడం గమనార్హం. ఇక, ప్రధాన ఖర్చుల్లో రెవెన్యూ పద్దు కింద రూ.35వేల కోట్లకు పైగా ఖర్చయింది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు రూ.18,152 కోట్లు, పింఛన్లకు రూ.7,165 కోట్లు, వివిధ రకాల ప్రభుత్వ సబ్సిడీల కింద రూ.5,396 కోట్లు ఖర్చయ్యాయని కాగ్ గణాంకాలు చెబుతున్నాయి.



ప్రశాంత వాతావరణంతోనే అభివృద్ధి

సీఎం రేవంత్‌రెడ్డి



శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీకి నమస్కరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో శ్రీధర్‌బాబు

దుండిగల్: రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావర ణం నెలకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా దుండిగల్‌లోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో కొత్తగా నిర్మించిన దత్తసభ మంటపాన్ని ఆయన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలసి ఆవి ష్కరించా రు. అంతకు ముందు ఆశ్రమంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లా డుతూ దేవీ నవరాత్రి ఉత్సవాలను స్వామీజీ ప్రతి ఏడాది మైసూర్‌లో నిర్వహించేవారని, ఈ సంవత్సరం తెలంగాణలో నిర్వహించడం ప్రజల అదృష్టమన్నారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను, ధర్మాన్ని కాపాడాలని ఉపదే శించే సచ్చిదానంద స్వామిజీ ప్రవచనాలను ప్రపంచమంతా చాటాలన్నారు. రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు సచ్చిదానంద స్వామిజీకి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకోగా.. వారిని స్వామీజీ సత్కరించారు.

హైదరాబాద్‌లో 'ఆరెక్స్ బెనిఫిట్స్' సామర్థ్య కేంద్రం

సాక్షి, హైదరాబాద్: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఆరెక్స్ బెనిఫిట్స్ అనే సంస్థ దేశంలోనే మొదటిసారి హైదరాబాద్‌లో గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. బుధవారం ఆరెక్స్ బెనిఫిట్స్ ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. వచ్చే రెండేళ్లలో ఆరెక్స్ బెనిఫిట్స్ సంస్థ ఈ కేంద్రం ద్వారా 300 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని సమావేశం అనంతరం మంత్రి తెలిపారు. ఈ సంస్థ తనకు క్లయింట్లుగా ఉన్న ఫార్మసీ కంపెనీలకు లాభాలు పెంచుకోవడంలో తోడ్పడుతుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత అపారంగా ఉన్నందున బహుళ జాతి సంస్థలు ఇక్కడికి వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఆరెక్స్ బెనిఫిట్స్ సీఈవో వెండీ బార్నెస్, సీఎఫ్‌వో థాడ్ క్వియాట్ కొస్కి, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ శేఖర్ ఖేరా, సమిట్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రతినిధి సందీప్ శర్మ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ ప్రతినిధి శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

విన్సిబ్ ఆధ్వర్యంలో హాకథాన్



విన్సిబ్ నిర్వహించిన హాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: టీ–హబ్ సహకారంతో అమెరికా కంపెనీ విన్సిబ్ బుధవారం హాకథాన్ నిర్వహించింది. 24 గంటల ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి 35 బృందాలు, 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 600 మంది విద్యార్థుల దరఖాస్తులనుంచి వీరిని ఎంపిక చేసినట్లు విన్సిబ్ వ్యవస్థాపక సభ్యుడు జయంతి సుబ్రమణ్యం, రాజని కాసు, మధుసూదన్‌రెడ్డి రఘునాయకుల ఓ ప్రకటనలో తెలిపారు. హాకాథాన్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థుల బృందాన్ని జ్యూరీ ఎంపిక చేయనుందని తెలిపారు. విద్యార్థుల్లో సృజనను ప్రోత్సహించి వారిలో స్ఫూర్తిని నింపడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. తమ సంస్థ కేవలం వెబ్‌సైట్లు, యాప్స్ తయారీకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు.

'కవచ్'కు లైన్ క్లియర్

వచ్చే రెండేళ్లలో ద.మ.రైల్వే పరిధిలో 3 వేల రూట్ కి.మీ.లలో అందుబాటులోకి
ఇటీవల కవచ్ 4.0 వెర్షన్ విజయవంతం.. ఆ వెంటనే వ్యవస్థ ఏర్పాటుకు ఆమోదం
రైలు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం

సాక్షి, హైదరాబాద్: భారీ రైలు ప్రమాదాలు చోటు చేసుకున్న తర్వాత ఎట్టకేలకు రైల్వే శాఖ మేల్కొంది. ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు వచ్చినప్పుడు అవి పరస్పరం ఢీకొనకుండా నిరోధించే అత్యాధునిక 'కవచ్'ను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. దాదాపు దశాబ్ద కాలం పాటు ప్రయోగాలు, పరీక్షలు అంటూ కాలయాపన చేసిన తర్వాత ఆ పరిజ్ఞానాన్ని ట్రాక్ మీద, లోకోమోటివ్‌లలో ప్రత్యక్షంగా ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచింది. ఈ పరిజ్ఞానానికి సంబంధించి 4.0 వెర్షన్ ప్రయోగాలు విజయవంతం కావటంతో, దాన్ని దశలవారీగా అన్ని జోన్లలో ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా వచ్చే రెండేళ్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 3 వేల రూట్ కిలోమీటర్లలో ఈ పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. దీంతో రైలు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం జోన్ పరిధిలో 1,465 రూట్ కి.మీ.లలో ఆ వ్యవస్థ ఉండగా, కొత్తగా మరో 1,618 రూట్ కి.మీ.లలో ఏర్పాటుకు తాజాగా రైల్వేశాఖ టెండర్లు పిలిచింది.

దక్షిణ మధ్య రైల్వేతో శ్రీకారం..: దేశంలో తొలిసారి కవచ్ పరిజ్ఞానాన్ని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఏర్పాటు చేశారు. కవచ్ పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు 2014–15లో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సనత్‌నగర్–వికారాబాద్–వాడి సెక్షన్‌లను ఎంచుకున్నారు. 250 కి.మీ. పరి ధిలో పలు దశల్లో పరీక్షించారు. 2015–16లో ప్యాసింజర్ రైళ్లలో క్షేత్రస్థాయి ట్రయల్స్ నిర్వ హించారు. 2017–18లో కవచ్ స్పెసిఫికేషన్ వెర్షన్ 3.2ను విజయవంతంగా ముగించారు. 2018–19లో ఈ పరిజ్ఞానానికి ఆర్‌డీఎస్‌ఓ ఆమోదం తెలిపింది. 2022 మార్చి నాటికి జోన్ పరిధిలో 1,465 రూట్ కి.మీ.లలో, 200 లోకోమోటివ్స్‌లో ఏర్పాటైంది. ఇప్పుడు కవచ్ మేజర్ వర్షన్ అయిన 4.0 ద్వారా ఆ పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వర్షన్ ట్రయల్స్ కోసం సనత్‌నగర్–వికారాబాద్ సెక్షన్ పరిధిలో 65 రూట్ కి.మీ.లలో ఏర్పాటు చేశారు. ఇటీవలే ఈ పరీక్షలు విజయవంతం కావడంతో ఈ పరిజ్ఞానాన్ని హై డెన్సిటీ నెట్‌వర్క్ పరిధిలో ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయించారు. ఇందుకోసం బల్లార్షా–కాజీపేట–విజయవాడ, విజయవాడ–గూడూరు, విజయవాడ–దువ్వాడ, వాడి–గుంతకల్–ఎర్రగుంట్ల–రేణిగుంట కారిడార్లలో ఏర్పాటు చేస్తారు. ఈ రూట్‌లలో మొత్తం 1,618 రూట్ కి.మీ.లలో ఏర్పాటుకు ఇటీవల టెండర్లు పిలిచారు.



కవచ్‌తో ఇవీ లాభాలు

- ఒకే ట్రాక్‌మీద రెండు రైళ్లు వచ్చినప్పుడు లోకోపైలట్ బ్రేక్ వేయకపోయినా, ఆ పరిజ్ఞానం వల్ల రైలు తనంతట తానుగా బ్రేక్ వేసుకుంటుంది.
- ఎక్కడైనా రెడ్ సిగ్నల్ ఉన్నప్పుడు లోకోపైలట్ పట్టించుకోకుండా రైలును ముందుకు నడిపినప్పుడు లోకోపైలట్‌ను ఈ వ్యవస్థ అప్రమత్తం చేస్తుంది. అప్పటికీ రైలును ఆపకపోతే తనంతట తానుగా బ్రేక్ వేస్తుంది.
- అవసరమైన ప్రాంతాల్లో హారన్ మోగించనప్పుడు ఇది తనంతట తానుగా ఆ పని చేస్తుంది.



కూకట్‌పల్లిలో..

గరిష్టం/కనిష్టం
34.0/24.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.



కూకట్‌పల్లిలో..






కొత్త కోడలికి 'బంగారు' బహుమతి

కొత్త కోడలికి అత్త బంగారు బతుకమ్మను బహుమతిగా ఇచ్చి ఆశ్చర్యపరిచారు. కూకట్‌పల్లిలోని ఇందూ ఫార్చ్యూన్ విల్లాలో బుధవారం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడే నివాసం ఉండే అర్కనపల్లి శ్యామల..తన ఇంటికి కొత్త కోడలుగా వచ్చిన శ్రేయకు బంగారు పూలతో ప్రత్యేకంగా రూపొందించిన బతుకమ్మను బహుమానంగా ఇచ్చి సంతోషాన్ని పంచుకున్నారు. బంగారు బతుకమ్మతో వీరు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. – కూకట్‌పల్లి

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

నగర వ్యాప్తంగా బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకల్ని ఘనంగా జరుపుకొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు కూడళ్లకు తరలివచ్చి.. ఆట పాటలతో సందడి చేశారు. కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, ఉప్పల్, మియాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. ఇక రవీంద్ర భారతిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. – సాక్షి, సిటీబ్యూరో



మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద..





రవీంద్రభారతిలో బతుకమ్మ వేడుకలు

పదే పదే టెండర్లు!

జీహెచ్ఎంసీలో వింత పరిస్థితి

- అభివృద్ధి పనులకు ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- గతంలో ఎగబడి.. ప్రస్తుతం వెనుకబడి
- బిల్లుల చెల్లింపుల్లో జాప్యమే కారణం ?

సాక్షి, సిటీబ్యూరో:

- జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్‌లో అవెన్యూ ప్లాంటేషన్ పనుల కోసం దాదాపు రూ.20 లక్షల విలువైన పనులకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇప్పటికి 13 పర్యాయాలు టెండర్లు పిలిచారు. అలా ఆ ఒక్క ప్రాంతంలో కాదు.. పలు ప్రాంతాల్లో అవెన్యూ ప్లాంటేషన్ల కోసం డజనుసార్లకు పైగా టెండర్లు ఆహ్వానించారు. అయినా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు.
- వర్షాలు కురిసినప్పుడు రోడ్లు చెరువులుగా మారుతున్న పరిస్థితి నివారణకు వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో సమస్యలు తొలగించేందుకు 50 ప్రాంతాల్లో రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్(రోడ్ల దిగువన సంపులు) నిర్మించాలనుకున్నారు. ప్రీ-కాస్ట్ విధానంలో వాటిని నిర్మించేందుకు అర్హమైన ఏజెన్సీల ఎంప్యానెల్‌మెంట్ కోసం ప్రతిపాదనలు ఆహ్వానించారు. అలా మూడు పర్యాయాలు ఆహ్వానించినా స్పందన లేదు.
- జంక్షన్ల తదితర ప్రాంతాల్లో సుందరీకరణ పనుల కోసం అర్హమైన కాంట్రాక్టర్లను ఎంపికచేసేందుకు, పనులు పూర్తయ్యేంతదాకా బాధ్యత వహించేందుకు డిజైనర్లు, ఆర్కిటెక్టుల ఎంప్యానెల్‌మెంట్ కోసం మూడు పర్యాయాలు ఆర్ఎఫ్‌పీ టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు.

...ఇలా జీహెచ్ఎంసీలో కోట్ల విలువైన పనుల నుంచి లక్షల విలువైన పనులు చేసేందుకు సైతం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతుండటంతో ఒకటి కంటే ఎక్కువ సార్లు టెండర్లు పిలుస్తున్నారు. అలా డజనుకంటే ఎక్కువ పర్యాయాలు కూడా టెండర్లు పిలిచారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కన్సల్టెన్సీ సేవల వంటి వాటికోసం సైతం ఆసక్తి చూపడం లేదు. గతంలో జీహెచ్ఎంసీ పనులంటే ఎగబడి పోటీలు పడేవారు. గత మూడు నాలుగేళ్లుగా ఆ పరిస్థితి లేదు. జీహెచ్ఎంసీ రాబడి నిధుల్లో సింహభాగం ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తుండటంతో కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే పలు పర్యాయాలు కాంట్రాక్టర్లు ఆందోళనలు, ధర్నాలు నిర్వహించారు.

బిల్లులు చెల్లించకపోవడం వల్లే..

జీహెచ్ఎంసీలో గతంలో మాదిరిగా వెంటనే బిల్లుల చెల్లింపులు జరగనందువల్లే పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ల నుంచి బిల్లుల కోసం ఒత్తిడి రాకుండా ఉండేందుకు టెండరు నిబంధనల్లోనే పనులు పూర్తయ్యాక సీనియారిటీ కనుగుణంగా జీహెచ్ఎంసీలో నిధుల లభ్యతను బట్టే చెల్లిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈమేరకు టెండరు నిబంధనల్లో స్పెషల్ కండీషన్స్ విధించారు. అంతేకాదు. పార్ట్ బిల్లులపై ఆధారపడకుండా పనులు వేగంగా చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రూ.20 లక్షల వరకు పనులకు కేవలం ఒకే బిల్లు ఫస్ట్ అండ్ లాస్ట్‌గా ఉండేలా ప్రత్యేక నిబంధనలు విధించినందువల్లే గతంలో మాదిరిగా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. జీహెచ్ఎంసీ ఖజానాలో ఎప్పుడు నిధులుంటాయో తెలియకపోవడం.. చెల్లింపుల కోసం ఒత్తిడి తెచ్చే అవకాశాల్లేకపోవడంతో పెట్టుబడులు పెట్టలేక కూడా చిన్న కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, గత సంవత్సరానికి సంబంధించిన బిల్లుల చెల్లింపులు కూడా జరిగాయని చెబుతున్నారు. గతంలో బిల్లులు మాత్రం విడతల వారీగా ముందస్తుగానే పొందుతూ పనుల్లో జాప్యం చేసేవారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఒక్కరే ఎన్నో పనులకు టెండర్లు వేయడం.. ఏవీ సకాలంలో పూర్తిచేయకపోవడం వంటి సందర్భాలున్నాయని సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.



బ్యాంకులకు 'హైడ్రా' గండం!

గృహ రుణాల జారీపై తర్జనభర్జనలు



జల వనరుల సమీపంలోని భవనాలకు ఇచ్చేదెలా?

- ఇప్పటికే లోన్లు మంజూరు చేసిన ప్రాజెక్ట్‌లపై పునఃసమీక్ష
- కూల్చేసిన నిర్మాణాల రుణాలపై 'న్యాయ' కసరత్తు
- నిధుల కొరతతో నత్తనడకన భవన నిర్మాణాల పనులు

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు హైడ్రా గండం పట్టుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో వాణిజ్య, గృహ రుణాలు మంజూరు చేయాలంటే ఇవి జంకుతున్నాయి. నీటి పారుదల శాఖ, మున్సిపల్, హెచ్ఎండీఏ వంటి విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు తీసుకున్నా సరే..ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలు ఉన్నాయని హైడ్రా కూల్చివేస్తోంది. దీంతో రుణ సంస్థలలో గందరగోళం నెలకొంది. కొత్త ప్రాజెక్ట్‌లకు రుణ వితరణలో కఠినంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే రుణాలు ఆమోదం పొందిన ప్రాజెక్ట్‌ల డాక్యుమెంట్లనూ పునఃసమీక్షిస్తున్నాయి. దీంతో నిధుల కొరతతో భవన నిర్మాణ పనులు నత్తనడకనసాగుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు తమ రిటైల్ పోర్ట్‌పోలియోలో గృహ, వాణిజ్య రుణాలు, ప్రాజెక్ట్ ఫైనాన్స్‌లే అత్యధికంగా ఉంటాయి. గృహ కొనుగోలుదారుల ఆదాయం, డెవలపర్ల విక్రయాలు, నిర్మాణ అనుమతులు, ప్రాపర్టీ డాక్యుమెంట్లు వంటివన్నీ పక్కాగా పరిశీలించిన తర్వాతే రుణాలను మంజూరు చేస్తుంటాయి. అయితే తాజాగా నిర్మాణ అనుమతులు ఉన్నా, రిజిస్ట్రేషన్ అయిన భవనాలను సైతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు ఉన్నాయని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ మరియు అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటికే మంజూరు చేసిన రుణాల డాక్యుమెంట్లను పునఃసమీక్షిస్తున్నాయి. ఆయా రుణ గ్రహీతలతో మరోసారి మాట్లాడి అనుమతుల ప్రక్రియ, డాక్యుమెంట్లను మరోసారి నిర్ధారించుకుంటున్నాయి.

కొత్త నిబంధనలపై కసరత్తు

కొత్త ప్రాజెక్ట్‌లు, గృహ రుణాల నిబంధనల సవరణలపై జాతీయ బ్యాంకులు కసరత్తు చేస్తున్నాయి. దుండిగల్, అమీన్‌పూర్, అప్పా, మాదాపూర్, పటేల్‌గూడ వంటి పలు ఎంపిక చేసిన ప్రాంతాలలో ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆర్థికసాయం చేయడానికి సంకోచిస్తున్నాయి. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా వంటి అనుమతులు ఉన్నా సరే రుణాల మంజూరులో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. గతంలో బ్యాంకులు అసెస్‌మెంట్ల కోసం ఇంజనీర్లు, ఫీల్డ్ ఆఫీసర్లపై మాత్రమే ఆధారపడేవారు. కానీ, ఇప్పుడు నీటి వనరులకు సమీపంలోని ప్రాజెక్ట్‌లను క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసిన తర్వాత రుణ దరఖాస్తులను ఆమోదించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

ఈఎంఐ చెల్లించాల్సిందే..

ఇప్పటికే హైడ్రా కూల్చివేసిన అనేక ప్రాపర్టీలు తనఖాలో ఉన్నాయి. రుణ గ్రహీతలు నెలవారీ వాయిదా (ఈఎంఐ)లు చెల్లించని పక్షంలో బ్యాంకులు ఆయా ఆస్తిని స్వాధీనం చేసుకొని, వేలం ద్వారా బకాయిలను తిరిగి పొందవచ్చు. అయితే హైడ్రా నిర్మాణాలను కూల్చివేసిన తర్వాత ఆయా భూములను స్వాధీనం చేసుకుంటోంది. దీంతో బ్యాంకులకు ప్రభుత్వ భూములను వేలం వేసే అవకాశం లేకుండా పోయింది. కూల్చివేసిన తర్వాత కూడా బ్యాంకులకు రుణాలను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత రుణ గ్రహీతలదే కాబట్టి బ్యాంక్‌లు క్రిమినల్ చర్యలకు ఉపక్రమించే హక్కు ఉంటుందని స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) అధికారి ఒకరు తెలిపారు. రుణ గ్రహీతలకు చెందిన ఇతర ఆస్తులు అటాచ్ చేయడంతో పాటు ష్యూరిటీ పెట్టిన వారు కూడా చట్టపరమైన చిక్కులు ఎదుర్కోక తప్పని పరిస్థితి. మరోవైపు ఈఎంఐ కట్టలేక రుణ గ్రహీతల సిబిల్ స్కోర్‌పై ప్రభావం పడుతుంది.

రుణాల జారీలో గందరగోళం



గ్రేటర్‌లో భూముల ధరలు ఖరీదైన నేపథ్యంలో ప్రాజెక్ట్ ఫైనాన్స్ లేకుండా భవనాలను నిర్మించలేని పరిస్థితి. గృహ విక్రయాల ఆధారంగా డెవలపర్లకు బ్యాంక్‌లు ప్రాజెక్ట్ ఫైనాన్స్‌లను అందిస్తుంటాయి. కానీ, గత ఆరేడు నెలలుగా విక్రయాలు లేవు. దీంతో కొత్త ప్రాజెక్ట్‌లకు నిధుల కొరత ఏర్పడింది. ఎన్‌ఓసీలు, అనుమతులు ఉన్నా రిటైల్, ప్రాజెక్ట్ లోన్ల జారీలో గందరగోళం నెలకొంది.

– పి.నర్సిరెడ్డి, ఎండీ, ఐరా రియల్టీ

నిర్మాణాలు ఆలస్యం



నిర్మాణ దశలను బట్టి బ్యాంకులు రుణాలను విడుదల చేస్తుంటాయి. అయితే ఇప్పటికే రుణం ఆమోదం పొందిన ప్రాజెక్ట్‌లను సైతం బ్యాంకులు పునఃసమీక్షిస్తున్నాయి. దీంతో లోన్ల విడుదల ఆలస్యం అవుతోంది. దీంతో కొనుగోలుదారులకు ఇచ్చిన గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయడం కష్టం అవుతుంది.

– డాక్టర్ కిరణ్, సీఈఓ, సుచిరిండియా

జలమండలిలో బినామీ దందా!

కాంట్రాక్టర్లుగా పనుల పర్యవేక్షణ అధికారులు

- కుటుంబ సభ్యులు, మిత్రుల పేరిట కంపెనీలు, సంస్థల ఏర్పాటు
- టెండరు ప్రక్రియలో చేతివాటం
- అర్హత లేకున్నా పనులు అప్పగింత
- మరోవైపు బడా కంపెనీల నుంచి సబ్ కాంట్రాక్టు పనులు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో బినామీ దందా బాహాటంగా సాగుతోంది. వివిధ విభాగాల్లో పనుల పర్యవేక్షణాధికారులు, ఉద్యోగులు కొందరు కాంట్రాక్టర్ల అవతారమెత్తి తిమ్మిని బమ్మి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల పేరిట కంపెనీలు, సంస్థలు ఏర్పాటు చేసుకొని కాంట్రాక్టు పనులు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. టెండర్ ప్రక్రియలో సైతం చేతివాటం ప్రదర్శించి అర్హత ఉన్నా.. లేకున్నా..పనులు దక్కించుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. తమ బినామీ కంపెనీల సామర్థ్యానికి మించి అంచనా వ్యయం గల టెండర్లు ఉంటే మాత్రం బడా సంస్థల దగ్గర సబ్ కాంట్రాక్టు తీసుకొని పనులు చేస్తున్నారనే ప్రచారం గుప్పుమంటోంది. మరోవైపు..విధి నిర్వహణలో సైతం నిర్లక్ష్యం వహిస్తూ తమ ప్రైవేటు వ్యవహారం పైనే అధిక సమయం కేటాయిస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

ఇదో మచ్చుతునక..

జలమండలి ప్రధాన కార్యాయలంలో ప్రస్తుతం ఐటీ విభాగంలో మేనేజర్‌గా పని చేసే ఇంజనీరు ఒకరు గత కొన్నేళ్ల క్రితం తన భార్య, మిత్రుడి భార్య డైరెక్టర్లుగా సమాన భాగస్వామ్యంతో ఒక ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వివిధ విభాగాల్లో టెండర్ ప్రక్రియలో పాల్గొని పనులు దక్కించుకుంటూ కార్యాకలాపాలు సాగిస్తూ వస్తున్నారు. గత రెండేళ్ల క్రితం విషయం బయటికి పొక్కడంతో ముందు జాగ్రత్తగా తన భార్యను డైరెక్టరు పదవి నుంచి తొలగించి..ఆ స్థానంలో మరొకరిని భర్తీచేసి బినామీ కాంట్రాక్టు పనులకు మరింత మార్గం సుగమం చేసుకున్నారు.

- ప్రస్తుతం బినామీ కంపెనీ ఐటీకి సంబంధించిన సాఫ్ట్‌వేర్ యాప్ డెవలప్‌మెంట్, మొబైల్ యాప్, జియో మ్యాపింగ్, కాల్ డేటా, రికార్డింగ్, ఆటోమేటిక్ వెహికిల్ ట్రాకర్ సిస్టం తదితర పనులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.
- మరోవైపు ఎంఎఆర్ మీటర్ల ఏర్పాటు, మీటర్ డేటా మేనేజ్‌మెంట్‌తో పాటు కొన్ని డివిజన్లలో ఎస్టీపీ ద్వారా శుద్ధి అయిన నీరు సరఫరా పనులకు సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి
- గతంలో జలమండలి బిల్లింగ్ కోసం ప్రత్యేకంగా డెవలప్ చేసిన స్టాఫ్‌వేర్ కోడ్‌ను సదరు ఇంజనీరు అధికార దుర్వినియోగంతో మరో సంస్థ బిల్లింగ్ టెండర్‌ను తన బినామీ సంస్థ ద్వారా దక్కించుకున్నాడనే ఆరోపణలు లేకపోలేదు. ఒక సంస్థ డెవలప్ చేసిన సాఫ్ట్‌వేర్‌కోడ్ ఇతర సంస్థలకు వినియోగించడం సైబర్ నేరంగా పరిగణిస్తారు. అయినప్పటికీ బాహాటంగా ప్రస్తుతం రెండు చోట్ల ఒకే సాఫ్ట్‌వేర్ కోడ్‌తో కూడిన యాప్ వినియోగంలోకి ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.
- ఏఎంఆర్ మీటర్ల బిగింపు విషయంలో సైతం సదరు అధికారి చేతివాటం ప్రదర్శిస్తూ మెకానికల్ డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.
- సరిగ్గా ఏడాది క్రితం జలమండలి ప్రధాన కార్యాలయానికి సమీపంలోని సోమాజిగూడలో తన బినామీ ఆఫీస్‌ను తరలించి ఎక్కువ సమయం అక్కడే కేటాయిస్తున్నాడనే ఆరోపణలు వినవస్తున్నాయి.



విచారణ జరుపుతాం

జలమండలి ఎండీ

ఉద్యోగుల బినామీ దందా విషయాన్ని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఉద్యోగులు కాంట్రాక్టు పనులు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు.. అధికార దుర్వినియోగానికి పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. బినామీ కాంట్రాక్టు పనులపై సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఇంకుడు గుంత వద్ద మేయర్ విజయలక్ష్మి, అధికారులు

బంజారాహిల్స్: నగరంలోని ప్రతి ఒక్కరు తమ తమ నివాసాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతీ వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాల్సిన అవసరం ఉందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఐసీఐసీఐ బ్యాంకు ఎదురుగా జలమండలి అధికారులు ఏర్పాటు చేసిన ఇంజెక్షన్ బోర్‌వెల్ హార్వెస్టింగ్ పిట్(ఇంకుడు గుంత)ను ఆమె బుధవారం జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్‌సీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. మురుగు నీటిరహిత నగరంగా నగరాన్ని తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా జలమండలి అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే ఉన్న ఇంకుడు గుంతలను కూడా రిస్టోరేషన్ చేయాలని సూచించారు. జలమండలి జీఎం హరి శంకర్ మాట్లాడుతూ 15 ఫీట్ల పొడవు, 6 ఫీట్ల వెడల్పు, 10 ఫీట్లు లోతుతో 200 ఫీట్లు కలిగిన ఇంజెక్షన్ బోర్‌వెల్‌ను ఏర్పాటు చేశామని, దీని వల్ల ఈ రోడ్డులో కురిసిన వర్షం నీరు ఈ ఇంకుడు గుంత ద్వారా భూమిలోకి వెళ్లి భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా పని చేస్తున్న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్, గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్, వినోబానగర్ డెవలప్‌మెంట్‌సొసైటీ స్వచ్ఛంద సంస్థలను జలమండలి సీజీఎం ప్రభు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవోపి విజయరావు, డీజీఎం షీలా రాణి, జలమండలి సెక్షన్ మేనేజర్లు రాంబాబు, శివ, సిబ్బంది బోస్ రవి తదితరులు పాల్గొన్నారు.

పూల ధరలకు రెక్కలు



సాక్షి, సిటీబ్యూరో: ఒక వైపు బతుకమ్మ వేడుకలు...మరో వైపు దేవీన వరాత్రులు..వెరసి పూలు, గుమ్మడికాయ ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పూల ధరలు అమాంతం పెంచేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో బంతి హోల్ సేల్ ధర కేజీ రూ.70–80 పలుకుతుండగా, చామంతి, గులాబి రూ.100 నుంచి 120 పలుకుతోంది. అదే బహిరంగ మార్కెట్లో బంతి రూ.100–120 పలుకుతుండగా, చామంతి, గులాబి కేజీ ధర రూ.250 నుంచి రూ.300 పలుకుతోంది. ఇక మంచి మంచి గుమ్మడితో పాటు బూడిద గుమ్మడి కాయ సైజును బట్టి ధర రూ.150 నుంచి రూ.200 ఉంది. బతుకమ్మలను పేర్చేందుకు మహిళలు పెద్ద ఎత్తున పూలు కొనుగోలు చేస్తుంటారు. దేవీ నవ రాత్రుల్లో భాగంగా ప్రతి ఒక్కరూ ఇళ్లు, వ్యాపారవాణిజ్య సంస్థలు, వాహనాలకు ఆయుధ పూజలు చేయడం ఆనవాయితీ. పూలు, పండ్లు, కొబ్బరి కాయలు, గుమ్మడి కాయలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. దీంతో డిమాండ్ పెరిగి వ్యాపారులు ధరలు పెంచేశారు.

మూసీ నిర్వాసితులకు సామగ్రి తరలింపు చార్జీలు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరివాహక ప్రాంత నివాసితులకు ప్రభుత్వం పూర్తిగా సహకరించాలని నిర్ణయించింది. ఇళ్ల తొలగింపునకు స్వచ్ఛందంగా అంగీకరించి..ఇక్కడి నుంచి తరలి వెళ్లేందుకు సిద్ధమైతే ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇంటితోపాటు ఇంటి సామగ్రి రవాణా చార్జీల కింద రూ. 25 వేల పారితోషికం ప్రభుత్వం చెల్లిస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

చేనేత వృత్తిని కాపాడుకోవాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

శ్రీనగర్‌కాలనీ: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన చేనేత వృత్తి అతి పురాతనమైనదని, చేనేత వృత్తిని మనం కాపాడుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం అమీర్‌పేట కమ్మసంఘంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో' పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత వృత్తులు కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా ఉంటుందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ అందించేలా కృషిచేస్తామన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, చేనేతవృత్తి కోసం పాటుపడిన అంజయ్య సలహాలు, సూచనలు తీసుకొని చేనేతవస్త్ర పరిశ్రమను అభివృద్ధిపథంలో తీసుకువస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ చేనేత ప్రదర్శన వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో కమ్మసంఘం ఫౌండర్ సీవీరావు, స్టేట్ హ్యాండ్లూమ్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేషమ్, శ్రీజన్ సిల్క్ ఇండస్ట్రీస్ ప్రతినిధి శివకుమార్, పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ టి.రమేష్ పాల్గొన్నారు.



చేనేతమగ్గాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాచకొండలోనూ డీజేలపై నిషేధం

- నిబంధనలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు
- కమిషనర్ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ మతపరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై నిషేధం విధిస్తూ పోలీస్ కమిషనర్ జీ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో పాటు చిన్నపిల్లలకు శాశ్వత వినికిడి సంబంధ సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఇకపై రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఊరేగింపుల్లో డీజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫయర్, బాణాసంచా ఉపయోగించడాన్ని నిషేధిస్తూ సీపీ కీలక నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై బీఎన్ఎస్ 223, 280, 292, 293, 324, బీఎన్ఎస్ఎస్ 152, పర్యావరణ పరిరక్షణ చట్టం–సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని తెలిపారు. ఈ ఉత్తర్వులు పూర్తి స్థాయిలో అమలు చేయాలని రాచకొండ పరిధిలోని అన్ని జోన్ల అధికారులకు సీపీ ఆదేశాలు జారీ చేశారు.

ముగిసిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్



గచ్చిబౌలి: నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ పోలీసులు ఆటల పోటీలతో సేదదీరారు. బెటాలియన్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న పోలీస్ కానిస్టేబుళ్లకు మూడు రోజులపాటు నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ముగిశాయి. 8వ బెటాలియన్ కమాండెంట్ సి సన్నీ పర్యవేక్షణలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సి సన్నీ మాట్లాడుతూ... స్పోర్ట్స్ అండ్ గేమ్స్ స్నేహ పూరిత వాతావరణంలో జరిగాయన్నారు. నిత్యం శిక్షణలో బిజీగా ఉండే వారికి ఆటవిడుపుగా స్పోర్ట్స్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలని, తమకు నచ్చిన క్రీడల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ కె.వీరయ్య, బి.వి.రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్స్ బి.సిత్రం, పార్థసారథిరెడ్డి, ఎం.నాగభూషణం, బి.రాంబాబు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

సీటొచ్చింది సరే.. కాలేజీ ఎక్కడ..?



మెడికల్ కాలేజీపై అయోమయం

- అడ్మిషన్ పొందిన అభ్యర్థుల అన్వేషణ
- వెతుక్కుంటూ మహేశ్వరానికి రాక
- నిరాశతో వెనుదిరుగుతున్న అభ్యర్థులు
- శేరిగూడలో తరగతులు, వనస్థలిపురంలో శిక్షణ
- పునరాలోచనలో అడ్మిషన్ పొందిన అభ్యర్థులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం మెడికల్ కాలేజీ విషయంలో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. కాళోజీ వర్సిటీ ఇటీవల నిర్వహించిన మెడికల్ కౌన్సెలింగ్‌లో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు కాలేజీ, హాస్టల్ భవనాన్ని వెతుక్కుంటూ మహేశ్వరం నియోజకవర్గం, కందుకూరు మండలం, మీర్‌ఖాన్‌పేటకు చేరుకుంటున్నారు. తీరా అక్కడ కాలేజీ, హాస్టల్ భవనం కనిపించక పోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఇంతకీ తరగతులు ఎక్కడ నిర్వహిస్తారంటూ? కాలేజీ అడ్రస్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో ఒకలా..క్షేత్రస్థాయిలో మరోలా ఉండటంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ అంశంపై అభ్యర్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే వారు కూడా ఏమీ చెప్పాలో అర్థం కాక తల పట్టుకుంటుండటం విశేషం.

ఆశతో వచ్చి..నిరాశతో వెనుతిరిగి:

జాతీయ వైద్య మండలి రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది కొత్త వైద్య కళాశాలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహేశ్వరం మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. కందుకూరు మండలం, మీర్‌ఖాన్ పేట్ సర్వే నంబర్ 112లో 20 ఎకరాలు కేటాయించింది. రూ.560 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన మెడికల్ కాలేజీ భవనం, ఆస్పత్రి భవనం, వసతి గృహాలకు గత ఏడాది అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు అక్కడ తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించి ఆ మేరకు శేరిగూడ సమీపంలోని ఐదు అంతస్తుల 1.20 లక్షల చదరపు అడుగుల సామర్థ్యం ఉన్న ఓ ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. జాతీయ వైద్య మండలి బృందం ఈ భవనాన్ని తనిఖీ చేసింది. మౌలిక సదుపాయాలు లేక పోవడంతో అడ్మిషన్లకు అనుమతి ఇచ్చేందుకు తొలుత నిరాకరించింది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి హామీ లభించడంతో కౌన్సెలింగ్‌కు అనుమతి ఇచ్చింది. ఇటీవల కౌన్సెలింగ్ కూడా ప్రారంభమైంది. కన్వీనర్ కోటా కింద అడ్మిషన్ పొందిన అభ్యర్థులు తమ ప్రవేశపత్రం వెంట తీసుకుని తల్లిదండ్రులతో సహా మహేశ్వరానికి చేరుకుంటున్నారు. తీరా అక్కడ శంకుస్థాపన చేసిన శిలాఫలకం తప్ప..కాలేజీ భవనం కన్పించక పోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. నిజానికి వైద్యకళాశాల ఏర్పాటు చేయాలంటే అనువైన భవనం, అను బంధ ఆస్పత్రి సహా ఐదేళ్లకు సరిపడా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. కానీ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా మౌలిక సదుపాయాలు కూడా సరిగా లేని ఓ ప్రైవేటు భవనాన్ని ఎంపిక చేయడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం నెలవారి అద్దెల చెల్లింపు రూపంలో వచ్చే కమీషన్ల కోసమే అధికారులు ఇలా చేశారనే విమర్శలు లేకపోలేదు.



మీర్‌ఖాన్‌పేటలో మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

వనస్థలిపురంలో ప్రాక్టీసు

తొలి ఏడాది 50 సీట్లు భర్తీ చేయనుంది. శేరిగూడలో ఎంపిక చేసిన ప్రైవేటు భవనంలో తరగతులు నిర్వహించి, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ప్రాక్టీసు చేయించనున్నారు. తాత్కాలిక ప్రతిపాదికన ఫ్యాకల్టీ, ఇతర సిబ్బంది నియామక ప్రక్రియను ఇటీవల చేపట్టింది. 22 మంది సీనియర్ రెసిడెంట్‌లతో పాటు ఐదుగురు డ్యూటీ డాక్టర్లు, 27 మంది టెక్నీషియన్లు, ఇతర సిబ్బందిని ఎంపిక చేసింది. తరగతులు ఒక చోట, వసతి మరో చోట..ప్రాక్టీస్ ఇంకో చోట నిర్వహిస్తుండటంతో ఇక్కడ అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థులు వెనుకాడుతున్నారు. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేని కొత్త కాలేజీలో చేరి భవిష్యత్తులో ఇబ్బంది పడేకంటే..దీనికి దూరంగా ఉండటమే ఉత్తమమని భావిస్తున్నారు. ఇప్పటికే అడ్మిషన్ పొందిన వారు పునరాలోచనలో పడ్డారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీటు దక్కించుకున్న వారు..రెండో దశ కౌన్సెలింగ్‌కు వెళ్లి..అవకాశం ఉంటే మరో కాలేజీని ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డిపై ఫోర్జరీ కేసు

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి సంతకం ఫోర్జరీ
- విజన్ రిసార్ట్స్ పార్ట్‌నర్ రాజశేఖర్ రావు ఫిర్యాదు
- మాదాపూర్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, పరకాల మాజీ శాసనసభ సభ్యులు చల్లా ధర్మారెడ్డితో పాటు డెవలపర్ పురుషోత్తం నాయుడుపై ఫోర్జరీ కేసు నమోదయింది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తన సంతకాన్ని ఫోర్జరీ చేశారంటూ విజన్ రిసార్ట్స్ పార్ట్‌నర్ గంటా రాజశేఖర్ రావు ఆరోపించారు. ధర్మారెడ్డి తన ఇంట్లోకి అక్రమంగా చొరబడి కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేశారని, సంతకాలు పెట్టకపోతే తనను చంపేస్తానని హెచ్చరించారని మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు ధర్మారెడ్డి, పురుషోత్తం నాయుడులపై ఫోర్జరీ కేసులు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు.

మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు సీఎం పరామర్శ



ఉప్పల్: నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. గత ఆదివారం బొంతు మాతృమూర్తి బొంతు కమలమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి చర్లపల్లిలోని బొంతు నివాసంలో ఆయనను, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని పరామర్శించి బొంతు కమలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీఎం వెంట ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలుడిపై వీధి కుక్కదాడి



గాయపడిన జశ్వంత్

దుండిగల్: వీధి కుక్క ఏడేళ్ల బాలుడిపై దాడి చేసిన సంఘటన బుధవారం దుండిగల్ మున్సిపాలిటీ, బౌరంపేట్‌లో చోటు చేసుకుంది. బౌరంపేట్‌కు చెందిన జేమ్స్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అతని కుమారుడు జశ్వంత్(07) స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం అతను కిరాణ దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా వీధి కుక్క అతడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు అతడిని నారాయణగూడ ఆస్పత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందడంతో దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ వెంటనే అక్కడికి చేరుకుని బాలుడిని పరామర్శించారు. బ్లూ క్రాస్, మున్సిపల్ సిబ్బందితో కుక్కలను పట్టించారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం



మెట్టు సాయికుమార్

అఫ్జల్‌గంజ్: మత్స్యకారులకు అండగా ఇందిరమ్మ రాజ్యం నిలుస్తుందని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. గతంలో మత్స్యకారులను బీఆర్ఎస్ ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులను దగా చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మత్స్యకారులందరికీ ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మత్స్యకారులకు అండగా ఉండి వారి అభివృద్ధికి, సంక్షేమానికి అన్నివిధాల సహకరిస్తుందన్నారు. ప్రతి మత్స్యకారుడు అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అప్పట్లో ప్రతి ఇంటా ఇందిరాగాంధీ ఫొటో ఉండేదని ఇప్పుడు ఆయా ఇళ్లల్లో ప్రజలంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోను పెట్టుకుంటున్నారని మెట్టు సాయికుమార్ అన్నారు. ఉచిత చేపపిల్లల పంపిణీ పారదర్శకంగా చేపడుతామన్నారు.

విహార యాత్రలో విషాదం

షాద్‌నగర్: మిత్రులతో కలిసి సరదాగా విహార యాత్రకు వెళ్లిన వైద్యుడు ట్రెక్కింగ్ చేస్తూ గుండెపోటుకు గురై ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన బుధవారం ఉదయం హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన డాక్టర్ లాల్ కుమార్ (52) కొన్నేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. భార్య, పిల్లలతో పట్టణంలోని సీఎస్‌కే విల్లాలో నివాసం ఉంటున్నారు. అంతకు ముందు పరిగిలో మాగ్నా ఆస్పత్రిని ఏర్పాటు చేసి, అనస్తీషియన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్‌గా కొనసాగారు. ఇదిలా ఉండగా తనతో పాటు మెడిసిన్ చదివిన మిత్రులతో కలిసి గత నెల 28న హిమాచల్‌ప్రదేశ్ వెళ్లారు. టూర్‌లో భాగంగా బుధవారం ఉదయం మనాలీ చేరుకున్నారు. ఇక్కడి కొండ ప్రాంతాలపై ట్రెక్కింగ్ చేస్తూ గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

డ్రగ్స్, గంజాయిని సమూలంగా నిర్మూలించాలి

సాక్షి,సిటీబ్యూరో: మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది గత నెలలో భారీగా గంజాయి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు ధూల్‌పేట్‌లో గంజాయి మూలాలను తుదిముట్టించడం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రవాణా నియంత్రణకు తీసుకున్న చర్యలు సఫలం కావడంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి సిబ్బందిని అభినందించారు. గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేపట్టిన చర్యలపై బుధవారం ఎక్సైజ్ భవన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఖమ్మం, ధూల్‌పేట్ ప్రాంతాల్లో భారీగా గంజాయి పట్టుబడడం, హైదరాబాద్ మహానగరంలో పలు ప్రాంతాల్లో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పనితీరు అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు.

ధూల్‌పేట్ గంజాయి దందాకు కళ్లెం...

గత కొన్నేళ్లుగా గంజాయి రవాణా కేంద్రంగా ఉన్న దూల్ పేటలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించారన్నారు. గత నెలలో దూల్ పేటలో ఎక్సైజ్ శాఖ 43 కేసులు నమోదు చేసి అందులో 134 మందిని అరెస్టు చేయడంతోపాటు 715 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న భార్యాభర్తల అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, సెల్‌ఫోన్లు

నాగోలు: గంజాయి విక్రయిస్తున్న భార్యాభర్తలను ఎస్ఓటీ, ఎల్‌బీనగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, దుర్గి మండలం, ముటుకూరు గ్రామానికి చెందిన యాపర్తి గోపి, మాచర్ల గ్రామానికి చెందిన చల్లా ఉమామహేశ్వరి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. స్థానికంగా చిన్న చిన్న పనులు చేసి జీవనం సాగించేవారు. తద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో నేరాల బాట పట్టారు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలో గంజాయి సరఫరా చేసే శివనాగరాజుతో వారికి పరిచయం ఏర్పడింది. అతడి నుంచి హోల్‌సేల్‌గా కేజీల చొప్పున గంజాయి కొనుగోలు చేసే వీరు చిన్న ప్యాకెట్లుగా చేసేవారు. నగరానికి వచ్చి వివిధ ప్రాంతాల్లో అవసరమైన వారికి గంజాయి సరఫరా చేస్తున్నారు. మంగళవారం రాత్రి బైక్‌పై ఎల్‌బీనగర్‌కు వచ్చిన వారు గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, ఎల్‌బీనగర్ పోలీసులు ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు గంజాయి కొనుగోలు చేస్తున్న తంగెళ్ల ప్రభుచరణ్, ఎరుకల నగేష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 930 గ్రాముల గంజాయి, బైక్, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు చల్లా శివ నాగరాజు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

శాంతి మార్గమే సమస్యలకు పరిష్కారం

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతి మార్గమే సకల సమస్యలకు పరిష్కారమని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జాతిపిత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అహింస, సత్యాగ్రహంతో ముఖ్యపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడే హంతకుడా..?

- యువతి హత్య కేసులో వీడని మిస్టరీ
- దర్యాప్తు చేస్తున్న మియాపూర్ పోలీసులు

మియాపూర్: మియాపూర్ దీప్తీశ్రీనగర్ కాలనీలో సోమవారం జరిగిన హత్యకేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. దీప్తీశ్రీనగర్ కాలనీ, సీబీఆర్ ఎస్టేట్‌లో బండి స్పందన అనే యువతి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. స్పందన తల్లి నమ్రత, సోదరుడితో కలిసి సీబీఆర్ ఎస్టేట్‌లోని ఫ్లాట్ నంబర్ 110 ఉంటోంది. స్పందన కూకట్‌పల్లిలోని ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్న సమయంలో వినయ్‌కుమార్ అనే యువకుడిని ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకుంది. పెళ్లైన కొద్ది రోజులకు వారి మధ్య విభేదాలు తలెత్తడంతో వేర్వేరుగా ఉంటున్నారు. స్పందన వినయ్ కుమార్‌ను పెళ్లి చేసుకోక ముందునుండే అదే కళాశాలకు చెందిన మనోజ్ అనే యువకుడు ఆమెను ప్రేమించాడు. అయితే స్పందన వినయ్ వేరుగా ఉంటున్నట్లు తెలియడంతో అతను స్పందనకు దగ్గరై ప్రతిరోజు ఆమె ఇంటికి వచ్చి వెళ్లేవాడని సమాచారం. ఈ క్రమంలోనే అతను పెళ్లి చేసుకుంటానని వేధిస్తుండటంతో ఆమె అతడిని దూరం పెట్టింది. దీంతో ఆగ్రహానికి లోనైన మనోజ్ సోమవారం ఉదయం తన వెంట తెచ్చుకున్న టూల్ కిట్‌లోని సుత్తితో స్పందన తలపై మోది ముఖంపై స్క్రూకల్ డ్రైవర్‌తో విచక్షణ రహితంగా పొడిచి హత్యచేసినట్లు సమాచారం. అపార్ట్‌మెంట్, కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీ, ఫోన్ కాల్స్ ఆధారంగా మియాపూర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సాక్షి,సిటీబ్యూరో: వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో వాటిని పూడ్చుకునేందుకు డ్రగ్స్, గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..కూకట్‌పల్లి గాయత్రినగర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల వెనుక ఓ ఇంట్లో గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్‌డీ బుధవారం గేదెల రుషికేశ్వర్ రావు అనే వ్యక్తి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 7 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్, 185 గ్రాముల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పాత పట్నం ప్రాంతానికి చెందిన రుషికేశ్వరరావు వ్యాపారంలో నష్టాలు రావడంతో వాటి నుంచి గట్టెక్కేందుకు డ్రగ్స్, గంజాయి అమ్మకాలు చేపడుతున్నట్లు విచారణలో వెల్లడయ్యింది.

విద్యార్థి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: పరీక్షల ఒత్తిడితో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన నవీన్‌కుమార్ కుమారుడు రాహుల్‌రాజు(22) లా చదువుతున్నాడు. కళాశాలలో పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన రాహుల్‌రాజు బుధవారం బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమోషన్ ప్లీజ్..!

- గగ్గోలు పెడుతున్న 2012 బ్యాచ్ ఎస్సైలు
- నిబంధనల ప్రకారం ఆరేళ్లకే పదోన్నతికి అర్హత
- 12 ఏళ్లు దాటినా మూడో వంతుకూ ప్రమోషన్ రాని వైనం
- ఖాళీల భర్తీ, అప్‌గ్రేడేషన్‌లో ప్రభుత్వ నిర్లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: పోలీసు విభాగంలో పదోన్నతి అనేది ఓ పెద్ద ప్రహసనమే. ప్రభుత్వ విధాన లేమి, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, కోర్టు వివాదాలు... ఇలా కారణమేదైనా ప్రమోషన్లు మాత్రం చాలా ఆలస్యం. ఇప్పటికే అనేక సందర్భాల్లో ఈ విషయం రూఢీ కాగా... తాజాగా 2012 బ్యాచ్ ఎస్సైల వంతు వచ్చింది. మల్టీజోన్–1లో ఉన్న ఈ బ్యాచ్ అధికారుల్లో దాదాపు అందరూ ఇప్పటికే ఇన్‌స్పెక్టర్లు అయిపోగా... నగరంతో పాటు మల్టీజోన్–2కు చెందిన వారికి మాత్రం ప్రమోషన్లు ముక్కుతూ మూలుగుతూ వస్తున్నాయి.

అత్యధికులు మల్టీజోన్–2కే...

ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన 2012 బ్యాచ్ ఎస్సైల ఎంపిక సందర్భంలో 1000 మందికి పైగా ఎంపికయ్యారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇక్కడ ఉన్న రెండు జోన్లకు కలిపి వీరి నుంచి 582 మంది కేటాయింపు జరిగింది. 2018లో జోనల్ వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించిన తర్వాత రాష్ట్రంలో ఉన్న ఐదు, ఆరో జోన్లు... మల్టీజోన్–1, మల్టీజోన్–2గా మారాయి. ఆ ప్రకారం సిబ్బంది పంపకాలు జరగ్గా... 2012 బ్యాచ్ ఎస్సైల్లో మల్టీజోన్–2కు 360 మంది మిగిలారు. మల్టీజోన్–1లో వివిధ జిల్లాలతో పాటు సిద్దిపేట, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, రామగుండం కమిషనరేట్లు ఉన్నాయి. మల్టీజోన్–2 పరిధిలో కేవలం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు మాత్రమే మిగిలాయి.

అక్కడ వేగంగా... ఇక్కడ నత్తనడకగా...

పోలీసు విభాగంలో ఎస్సైగా ప్రవేశించిన అధికారి ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందడానికి అర్హుడు అవుతాడు. 2012 బ్యాచ్‌కు 12 ఏళ్లు నిండినా... ఇప్పటికీ మల్టీజోన్–2కు సంబంధించిన అధికారుల్లో అత్యధికులు ఎస్సైలుగానే ఉండిపోయారు. కమిషనరేట్లు ఎక్కువగా ఉండటంతో పాటు ఖాళీలను సద్వినియోగం చేసుకోవడంతో మల్టీజోన్–1లో ప్రమోషన్లు వేగంగా వస్తున్నాయి. అక్కడ పదోన్నతులు రావాల్సిన వాళ్లు 30 నుంచి 50 మంది వరకే ఉండగా... ఇక్కడ మాత్రం ఆ సంఖ్య 300 వరకు ఉంది. ఇటీవలే ఈ బ్యాచ్‌కు చెందిన తొమ్మిది మందికి పోలీసు విభాగం పదోన్నతులు ఇచ్చింది. ఖాళీలు లేవంటూ మిగిలిన వారి విషయం పట్టించుకోవట్లేదు. ఇదే పంథాలో ప్రతి ఏడాదీ ప్రమోషన్లు ఇస్తూ పోతే... తమ బ్యాచ్‌లో అత్యధికులు ఎస్సైగానే రిటైర్ అయిపోతారని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



తమ బ్యాచ్ వారికి సెల్యూట్ చేయాల్సిందే...

మల్టీజోన్–2కు చెందిన 2012 బ్యాచ్ ఎస్సైలు మల్టీజోన్–1లో తమ బ్యాచ్‌కే చెందిన, ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన వారికి సెల్యూట్ కొట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా మొదటి పదోన్నతిలో వెనుకబడి పోతే... ఆ ప్రభావం తమ సర్వీసు మొత్తం ఉంటుందని అధికారులు వాపోతున్నారు. ఈ కారణంగా భవిష్యత్తులో పదోన్నతులు సమయంలో కొన్ని న్యాయపరమైన వివాదాలు, పిటిషన్లు తప్పవని, ఇవి కొత్త తలనొప్పులకు కారణమై బ్యాచ్ మొత్తం ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే డీఎస్పీలుగా ఉన్న కొన్ని బ్యాచ్‌ల మధ్య ఇలాంటి వివాదాలే వచ్చి విషయం కోర్టు వరకు వెళ్లిందని చెప్తున్నారు. ఫలితంగా అనేక మంది ప్రమోషన్లు ఆగిపోవడంతో పాటు ఆ ప్రభావం వారి తర్వాత బ్యాచ్‌లపై పడుతోందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించాలని కోరుతున్నారు.

దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి...

ప్రస్తుతం రాష్ట్రంలో హోమ్‌శాఖకు మంత్రి లేరు. ఈ విభాగం సైతం ముఖ్యమంత్రి ఆధీనంలోనే ఉంది. కొన్నాళ్ల క్రితం ఆయనే ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ప్రకటించారు. సైబరాబాద్ కమిషనరేట్ విభజన నేపథ్యంలో దాన్ని పునర్ వ్యవస్థీకరిస్తూ, కొత్తగా కొన్ని ప్రాంతాలను కలుపుతూ సైబరాబాద్, రాచకొండలకు రూపమిచ్చారు. అయితే కొత్తగా కలిసిన పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయలేదు. ఈ రెండు అంశాలతో పాటు రోడ్ సేఫ్టీ విభాగంలో ఉన్న 26 ఖాళీలు పదోన్నతులతో పూరించడం, రాజధానిలోని మూడు కమిషనరేట్లలో అవసరమైన స్థాయిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయడం, హైడ్రాకు అవసరమైన ఇన్‌స్పెక్టర్లను పదోన్నతి పద్ధతిలో కేటాయించడం చేయాలని కోరుతున్నారు. కనీసం సూపర్ న్యూమరరీ పోస్టులైనా సృష్టించి తమకు పదోన్నతులు కల్పించాలని 2012 బ్యాచ్ మల్టీజోన్–2 ఎస్సైలు వేడుకుంటున్నారు.



దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి ఆలయంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో తొమ్మిదిరోజులపాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.
–బంజారాహిల్స్



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు



నివాళి అర్పిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు



నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బాపూజీ బాటలో పయనిద్దాం..!

వాడవాడలా జాతిపిత. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు | చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు

జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో గాంధీజీ, బహదూర్ శాస్త్రీ చిత్రపటాలకు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొని మహాత్మాగాంధీ ప్రతిమకు నివాళులు అర్పించారు. దేశానికి గాంధీజీ చేసిన సేవలను ఆమె కొనియాడారు. శాంతిమార్గంలో ఏదైనా సాధించవచ్చునని నిరూపించిన మహనీయుడు గాంధీజీ అని అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. తెలంగాణ భవన్‌లో మహాత్మాగాంధీ జయంతితో పాటు మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను ఖైరతాబాద్ బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి మహనీయుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో బంజారాహిల్స్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు బి. నర్సింహారెడ్డి, అభిషేక్‌రెడ్డి, నారికేళ్ళ నరేష్, మంకాల దాసు తదితరులు పాల్గొన్నారు.
బంజారాహిల్స్



లిబర్టీలో...



రక్తదాన శిబిరంలో బంజారాహిల్స్ కాంగ్రెస్ నేతలు



తెలంగాణ భవన్‌లో...



వెంకటేశ్వరనగర్‌లో...



మహిళలకు చీరలు అందజేస్తున్న సీఎన్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య



నివాళులు అర్పిస్తున్న భవాని శంకర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

బర్లింగ్టన్ ఇంగ్లీష్ మీడియా, సౌత్‌ఈస్ట్ ఆసియా ఎండీ అమిత్ బవేజా

బంజారాహిల్స్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం లక్ష్యమని బర్లింగ్టన్ ఇంగ్లీష్ ఇండియా సౌత్ ఈస్ట్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ బవేజా తెలిపారు. ఇందు కోసం జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా విద్యా నాణ్యతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకులకు శిక్షణ ఇచ్చే లక్ష్యంతో «బర్లింగ్టన్ ఇంగ్లీష్ 100 ఈడీ ఫెస్ట్–24» నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్ష మందికి చేరువ కావాలన్నదే ధ్యేయమన్నారు. దక్షిణాసియాలో వంద నగరాలను కవర్ చేయనున్నామని తెలిపారు. ఇది 21వ నగరమని చెప్పారు. అత్యాధునిక తరగతి గదులు, అభ్యాస అనుభవాలు మార్చడం, వినూత్న బోధనా పద్ధతులు అన్వేషించడం దీని ఉద్దేశమన్నారు. సంపన్నమైన సాంస్కృతిక వారసత్వం, బలమైన విద్యా ఫ్రేమ్‌వర్క్‌కు పేరుగాంచిన నగరానికి ఈ ఫెస్ట్ తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. మాస్టర్ ట్రైనర్ ఆండ్రూ స్టీలే మాట్లాడుతూ బర్లింగ్టన్ ఇంగ్లీష్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందన్నారు.

పాఠశాలను శుభ్రం చేసిన బీజేపీ నేతలు



పాఠశాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

ఫిలింనగర్: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రధానీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ నేతలు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఫిలింనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని శుభ్రం చేయడంతో పాటు అక్కడ సేకరించిన చెత్తను వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా స్థానికులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ మెంబర్ బోజిరెడ్డి, నీరజ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో హైడ్రాకు వ్యతిరేకంగా ప్లకార్డులు



ప్లకార్డులు పట్టుకొని బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బంజారాహిల్స్: బతుకమ్మ వేడుకల్లో హైడ్రా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలు నిరసన గళమెత్తారు. బుధవారం ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు మహిళలు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లలో నిర్మించుకున్న నివాసాలను కూల్చవద్దంటూ ప్లకార్డులు పట్టుకొని బతుకమ్మ పాటలు పాడుతూ కనిపించారు. వీరి నిరసనకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మద్దతు తెలిపారు.

అన్నదానం చేయడమంటే దేవునికి సేవ చేయడమే..

రహమత్‌నగర్ వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

వెంగళరావునగర్: నిరుపేదలకు పట్టెడన్నం పెట్టడమంటే దేవునికి సేవ చేయడమేనని పలువురు రహమత్‌నగర్ నాయకులు పేర్కొన్నారు. రహమత్‌నగర్ వర్తక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లైబ్రరీ సెంటర్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తక సంఘం నేతలు మాట్లాడుతూ ప్రతి అమావాస్య నాడు నిరుపేదలక తమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొలుత అమ్మవారికి, మహాశివునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా నేతలు తాడికొండ కృష్ణమూర్తి గుప్తా, ఎం.శ్యాం రావు, బి. భవానీశంకర్, నటరాజ్, నరేష్‌కుమార్, నాగార్జున, ప్రభు, స్వస్తిక్ కిరణ్, ఆంజనేయులు యాదవ్, సీవీ బ్రహ్మానందం సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా మాకు ఇళ్లు ఇప్పించు..!

కమలానగర్‌లో బాధితుల వినూత్న ఆందోళన

రహమత్‌నగర్: కమలానగర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల బాధితులు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వినూత్న ఆందోళన నిర్వహించారు. ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్ డబుల్ బెడ్‌రూం నివాసాల్లో ఇళ్లురాని 46 మంది బాధితులు బస్తీ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు నేతృత్వంలో బుధవారం గాంధీ చిత్రపటానికి వినతి పత్రం సమర్పించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం నివాసాల కోసం ఇళ్లు కోల్పోయిన వారు తొమ్మిది ఏళ్లుగా అద్దె గృహాల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్‌లు స్పందించి బాధితులకు నివాసాలు కేటాయించాలని కోరారు.

రక్తదాన శిబిరం

లక్డీకాపూల్: గాంధీ జయంతిని పురస్కరించుకొని నిమ్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిమ్స్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప, మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం డైరెక్టర్ మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐటీ అండ్ స్టాటిస్టిక్స్ ట్రైనీ అధికారులు దాదాపు 100 మంది రక్తదానం చేశారు.

ఐఐఎంసీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా



స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు

ఖైరతాబాద్: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం స్వచ్ఛతా హీ సేవా–2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం గాంధీజీ సూక్తులతో కూడిన ఇన్‌స్పైరింగ్ థాట్స్ అనే పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, మాజీ ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావులు ఆవిష్కరించి వలంటీర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కూర రఘువీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా ఉద్యమంలో పాల్గొనాలన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్–1 అండ్ 2 ప్రోగ్రాం ఆఫీసర్లు ఇ.రామకృష్ణ, సత్యనారాయణ, ఎన్‌సిసి ఆఫీసర్ వసంత్ కుమార్ ఆధ్వర్యంలో 45 మంది వలంటరీలు, 80 మంది కళాశాల ఆవరణను, తరగతి గదులను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్ శ్యామ్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాండ్ పేరెంట్స్ కుటుంబాలకు మూల స్తంభాలు





గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకల్లో చిన్నారులతో అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు

ఫిలింనగర్: కుటుంబాలకు మూల స్తంభాలు గ్రాండ్ పేరెంట్స్ అని, చిన్నారులు వారి ఎంతో నేర్చుకోవాలని భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమం ప్రిన్సిపాల్ అరుణశ్రీ అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమంలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వారి కోసం కవితలను చదివి వినిపించడం ముచ్చటగొల్పింది. అనంతరం తాతల పాటలకు చిన్నారులు స్టెప్పులతో అదరగొట్టారు. చదరంగం, లూడో, క్యారమ్స్ తదితర ఇండోర్ గేమ్స్‌తో ఉత్సాహంగా గడిపారు. వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటోబూత్‌లో తాతయ్యలు తమ ప్రియమైన వారితో కలిసి ఫొటోలు దిగి ఆనందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ శ్రీ, వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటలక్ష్మీ, మాధవీలత, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో పరిపూర్ణ వ్యక్తిత్వం

వెంగళరావునగర్: నిరంతర పుస్తక పఠనం, తద్వారా లభించే అక్షర జ్ఞానం ద్వారా మనిషి పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందగలడని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ తెలియజేశారు. శాస్త్రి సేవా నికేతన్ లైబ్రరీ 42వ వార్షికోత్సవ వేడుకలు యూసుఫ్‌గూడ టీజీఎస్‌పి ఫస్ట్ బెటాలియన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ పుస్తక పఠనం అనేది దేవుడు మానవునికి ఇచ్చిన మహా వరమని తెలియజేశారు. యువత స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవాలని అన్నారు.

ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో స్వాతిరెడ్డి డిజైనర్ దుస్తులు

బంజారాహిల్స్: ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో 2024లో నగరానికి చెందిన ప్రముఖ డిజైనర్ స్వాతిరెడ్డి తన డిజైన్లతో అదరగొట్టింది. భారతీయ సంస్కృతి చరిత్రను మేళవించి రూపొందించిన లెహంగా కలెక్షన్ కట్టిపడేసింది. తాజాగా జరిగిన ఈ ఫ్యాషన్‌వీక్ వివరాలను నగరానికి తిరిగివచ్చిన ఆమె బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన స్టూడియోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. స్ప్రింగ్ సమ్మర్ 2025 లెహంగా కలెక్షన్‌ను ఆమె అక్కడ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని రెక్స్ ఫెర్నాండో ఆధ్వర్యంలో ఆసియన్ యూరోపియన్ ఫ్యాషన్ వీక్ జరిగింది. ప్రపంచ స్థాయి వేదికపై మన భారతీయ సంప్రదాయాలను సంస్కృతిని చరిత్రను తన డిజైనర్ దుస్తులు స్వాతిరెడ్డి ప్రదర్శించారు. ఇక్కడ ప్రదర్శించిన ప్రతి లెహంగా భారతీయుల కళాత్మకతను, పనితనాన్ని తెలియజేసింది.



మహిళాభ్యున్నతిపై సదస్సు



మహిళా సదస్సులో మహిళా ప్రతినిధులు

బంజారాహిల్స్: మహిళలు ప్రస్తుత సమాజంలో ఎన్నో అటుపోట్లను ఎదుర్కొంటున్నారని కానీ దేనిని భయపడకుండా తమ లక్ష్యాలను సాధించాలని చర్చి పాస్టర్ల ప్రతినిధి జయ ప్రభుదాస్ అన్నారు. మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో బుధవారం మహిళాభ్యున్నతిపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. శాంతి మార్గంలో స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన మహాత్ముడికి నివాళులు అర్పించిన అనంతరం చర్చి పాస్టర్ల ప్రతినిధి జయ ప్రభుదాస్ మాట్లాడుతూ మహిళలు ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్ళు, సాధించిన విజయాలను ప్రస్తావించారు. సమాజంలో ఆదర్శవంతంగా జీవించేందుకు మహిళలకు ఎన్నో అవకాశాలున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సరళ, ప్రమీల, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

• కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్



ర్యాలీలో బాబా ఫసియుద్దీన్. నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర ఇన్‌చార్జి విజయలు

రహమత్‌నగర్ (బోరబండ): తమ నివాసాలతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బోరబండ డివిజన్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ మనకేంటి అన్న భావన విడనాడి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇకపై వారంలో ఒకరోజు తాను కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందితో కలిసి పాల్గొంటానని ప్రకటించారు. అనంతరం అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు వివిధ బస్తీల్లో ఏర్పాటు గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని జాతిపితకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర ఇన్‌చార్జి విజయ, హైద్రాబాద్ ఇన్‌చార్జి కుష్బూ, జిల్లా అధికారి యాదగిరి, వెల్ఫేర్ ప్రెసిడెంట్ మొఘల్ ఎజాజ్, మొఘల్ ఖాసీంబేగ్, డి ఫరీదుద్దీన్, షేక్ సమీర్, అహ్మద్, జావిద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది రక్షణ కిట్లు కచ్చితంగా ధరించాలి

• జలమండలి సీజీఎం ప్రభు



జలమండలి సిబ్బందికి సూచనలిస్తున్న సీజీఎం ప్రభు

బంజారాహిల్స్: జలమండలి ఉద్యోగులు, సిబ్బంది ఖచ్చితంగా సేఫ్టీ ప్రోటోకాల్ పాటించాలని రక్షణ చర్యలు పాటించని సిబ్బందితో పాటు సంబంధిత ఏజెన్సీకి కఠిన చర్యలు తప్పవని జలమండలి సీజీఎం ప్రభు హెచ్చరించారు. బుధవారం ఆయన బంజారాహిల్స్‌లో డీవోపి విజయారావు, జీఎం హరిశంకర్‌తో కలిసి మురుగునీటి కాల్వల శుద్ధి కార్యక్రమంలో పాల్గొంటున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వల్లో దిగినప్పుడు, వ్యర్థాలు తొలగించేటప్పుడు గ్లౌజ్‌లు, షూస్, యూనిఫాం, రక్షణ టోపీ ఖచ్చితంగా ధరించాలని నిబంధనలు అతిక్రమించిన ఏజెన్సీకి రూ. 20 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

మంత్రి కొండా సురేఖకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

బంజారాహిల్స్: మహిళ అని గౌరవం కూడా లేకుండా కేటీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదని, ఆయన వెంటనే కొండా సురేఖకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. కేటీఆర్ సభ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. మంత్రి కొండా సురేఖను ఉద్దేశించి అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసి మహిళల మనోభావాలు దెబ్బతీసేవిధంగా ప్రవర్తించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వ్యతిరేకంగా ఎన్ఎస్‌యూఐ నేతలు నినాదాలు చేస్తూ బుధవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు కూడలి వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వచ్చిన ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు కేటీఆర్‌కు, హరీశ్‌రావు, కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించడమే కాకుండా దిష్టిబొమ్మ దహనం చేశారు.



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నేతలు

ఒక్కేసి పువ్వేసి చందమామ..!

ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభం | బస్తీలు, కాలనీల్లో ఆడిపాడిన మహిళలు

ఒక్కేసి పువ్వేసి చందమామా.. ఒక్కజాము లాయే చందమామ.. అంటూ మహిళలు పాదం పాదం కదుపుతూ (పూల పండుగ) బతుకమ్మ వేడుకలను నేత్రపర్వంగా ప్రారంభించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాలనీలు, బస్తీలు, మైదానాల్లో పెద్దఎత్తున మహిళలు బుధవారం సాయంత్రం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. బంజారాహిల్స్ రిక్రియేషన్ సెంటర్‌లో ఎమ్మెల్యే కాలనీ మహిళలు, ఫిలింనగర్ బీజేఆర్‌నగర్ బస్తీలో, గౌరీ శంకర్ నగర్ బస్తీలో వేడుకలు అంబరాన్ని తాకాయి.
బంజారాహిల్స్







మహాత్ముడికి నివాళి



మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి

నేటి నుంచి నాదబ్రహ్మోత్సవ్

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో దసరా దేవీన వరాత్రుల సందర్భంగా గురువారం నుంచి నాదబ్రహ్మోత్సవ్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈనెల 12వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నాదబ్రహ్మోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దసరా దేవీనవరాత్రుల సందర్భంగా అమ్మవారి విజయానికి సంకేతంగా ఆత్మవిశ్వాసం, అంకిత భావంతో కూడిన తమ సేవలతో సమాజంలో మార్పునకు కారణమైన ఓ మహిళా మూర్తిని ధైర్య అవార్డుతో సత్కరించనున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులైన గోరుకంటి మేఘన, సౌమ్య వారణాసి, సాందీప్, కవితాచక్ర, స్వరజ, రామాచారి, నిహాల్, డి.సాత్విక, సురేఖ మూర్తి తదితరులు సంకీర్తనలతో అలరించనున్నారు.

గ్రామీణ క్రీడాకారులను చాంపియన్లుగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్–2024 నిర్వహించాలని సన్నాహాలు చేస్తున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి అన్నారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా క్రీడాకారులకు ఎటువంటి ప్రోత్సాహంలేదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రపంచ చాంపియన్లుగా మలిచేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. మొక్కుబడిగా సీఎం కప్ నిర్వహించకుండా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహకాన్ని అందిస్తామని తెలిపారు.

నేడు క్రీడాజ్యోతి ప్రారంభం..

క్రీడాకారులకు స్ఫూర్తిని కలిగించాలని రాష్ట్రవ్యాప్తంగా టార్చ్ రిలే (క్రీడాజ్యోతి) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3వ తేదీన ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ రిలేను ప్రారంభిస్తారని వెల్లడించారు. హైదరాబాద్ నుండి ప్రారంభమై 16 రోజుల పాటు 33 జిల్లాలను కవర్ చేస్తూ చివరకు హైదరాబాద్ చేరుకుంటుందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల సహకారంతో ఈ టార్చ్ రిలే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలియజేశారు. అంతకు ముందు జాతిపిత మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రీల జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నగరవాసికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి , సిటీబ్యూరో: నగరంలోని ఇంటర్నేషనల్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ ప్రతిష్టాత్మక కోల్‌కత్తా యువశక్తి మీడియా హౌస్ ఆధ్వర్యంలోని 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'ను అందుకున్నారు. ఐపీఎస్ అమిత్ వర్మ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ధన్వంతి తివారీ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అందించే ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, యువతను ప్రపంచ నాయకులుగా మార్చడానికి ప్రేరేపిస్తూ, మార్గనిర్దేశం లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. పబ్లిక్ రిలేషన్స్, సోషల్ సర్వీసెస్ విభాగాల్లో వినూత్న ప్రణాళికలతో పలు కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ఇందులో భాగంగానే లండన్‌లోని బ్రిటిష్ పార్లమెంట్‌లో అంతర్జాతీయ భారత్ గౌరవ్ అవార్డు లభించిందని పేర్కొన్నారు.

వీసీల నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి



జాజుల లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకాల్లో బీసీ ప్రొఫెసర్లకు ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని పది వర్సిటీలలో ఐదు వీసీ పోస్టులను బీసీలకు కేటాయించి సామాజిక న్యాయం పాటించాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందని ఇప్పటికైనా జనాభా దామాషా ప్రకారం 5 వీసీ పోస్టులను బీసీలకు కేటాయించాలన్నారు. గాడితప్పిన వర్సిటీల పాలనను చక్కదిద్దేందుకు అనుభవం గల ప్రొఫెసర్లను ఎంపిక చేయాలన్నారు. బోధన, పరిశోధనతో పాటు విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అకాశాల పై శ్రద్ధ చూపే వీసీలు కావాలన్నారు. వీసీల నియమకంలో పారదర్శకత లోపించకుండా అన్ని కోణాలను పరిగణలోకి తీసుకొని సమర్థవంతమైన సీనియర్ ప్రొఫెసర్లను నియమించాలన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి బంధుప్రీతి, రాజకీయ అండదండలు ఉన్నవారు కాకుండా ఉన్నత విలువలుగా అధ్యాపకులను వీసీలుగా నియమించాలని సీఎం రేవంత్ రెడ్డిని, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరారు.

మురుగునీరు, ఇంకుడు గుంతలపై

స్పెషల్ డ్రైవ్ షురూ

90 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు



సరోజిని దేవి ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



సీవరేజీ స్పెషల్ డ్రైవ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

- ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణం
- సీఎం చేతులు మీదుగా పోస్టర్ ఆవిష్కరణ
- ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం
- క్షేత్ర స్థాయిలో అమలుకు జలమండలి శ్రీకారం

సాక్షి, సిటీ బ్యూరో: మహా నగరంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణం పై జలమండలి 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. బుధవారం బాపూఘాట్ వద్ద జాతిపిత మహాత్మ గాంధీకి నివాళులు అర్పించిన అనంతరం స్పెషల్ డ్రైవ్ కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.అంతకుముందు సరోజిని దేవి ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించి సీవరేజీ స్పెషల్ డ్రైవ్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి వర్షపు చుక్కను భూగర్భ జలంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా, పునర్వినియోగించుకోవాలని సూచించారు.భూగర్భజలాలను పెంపొందించుకుంటే మండు వేసవిలో సైతం నీటి కొరత ఉండబోదన్నారు. నగరవాసులు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో నీటి కరవు రాకుండా.. ఖాళీ ప్రదేశాల్లో వీటిని నిర్మించుకోవాలని పేర్కొన్నారు. నగరవాసులు డ్రైనేజీల్లో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే విధంగా ఎలాంటి వ్యర్థాలు వెయ్యొద్దని సూచించారు. హైదరాబాద్ నగరాన్ని ' సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ' గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రతి పౌరుడు దీన్నొక బాధ్యతగా తీసుకుని చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ లక్ష్యం

హైదారాబాద్ ను సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ గా మార్చాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని, అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపకల్పన చేసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. స్పెషల్ డ్రైవ్ లో ప్రధానంగా దీర్ఘకాలికంగా ఉన్న సివరెజ్ సమస్యల నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణం అంశాలపై దష్టి పెట్టినట్లు చెప్పారు. వాటర్ ట్యాంకర్ డిమాండ్ తగ్గించడానికి వినియోగదారులు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జలమండలి ఈడీ మాయంక్ మిట్టల్, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం.. జలమండలి ఓ అండ్ ఎం అన్ని కార్యాలయాల్లో స్పెషల్ డ్రైవ్ ను ప్రారంభించారు.

నగరంలో నేడు

- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలోని సెంట్రల్ టెన్నిస్ కోర్టులో చీఫ్ మినిస్టర్ కప్–2024 ప్రారంభోత్సవం. సాయంత్రం 4 గంటలకు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పాల్గొంటారు.
- హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో 'ఇన్ఫెక్షన్ల నివారణ, యాంటీమైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్'పై గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్. సాయంత్రం 5 గంటలకు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొంటారు.
- డాక్టర్ ఎం చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బేగంపేటలోని నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్‌లో 'టీ హనుమంత రావు ఫోర్ వాటర్ కాన్సెప్ట్ ఫర్ అల్టిమేట్ వాటర్ సెక్యూరిటీ ఇన్ తెలంగాణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం. ఉదయం 10 గంటలకు.
- తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'యునైటెడ్ ఎడ్యుకేషన్ మూవ్‌మెంట్ ఇన్ తెలంగాణ' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్వచ్ఛత ప్రతిరోజూ పాటించాలి

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్



కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదుట శుభ్రం చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

కాచిగూడ: స్వచ్ఛత అనేది కేవలం ఒకరోజు మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ప్రతిరోజూ పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం రైల్వేలో స్వచ్ఛభారత్ దివస్‌ను జరుపుకుంటున్నట్లు తెలిపారు. 'స్వచ్ఛత పఖ్వాడా' ప్రచారాన్ని అక్టోబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 'స్వభావ స్వచ్ఛత– సంస్కార్ స్వచ్ఛత' అనే నేపథ్యంపై పాటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో శ్రమదాన కార్యక్రమం చేసి రోడ్లను ఊడ్చి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. స్టేషన్‌లో 35 మంది సఫాయి మిత్రలను జనరల్‌మేనేజర్ ఘనంగా సత్కరించి అభినందించారు. రైల్వే జోన్ పరిధిలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. స్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు పరిశుభ్రత అంశంపై వీధి నాటకం ప్రదర్శించి ప్రజలకు స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించారు. స్వచ్ఛత అనే అంశంపై సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రైల్వేలో స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామని అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. రైళ్లు, రైల్వే స్టేషన్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఆయన అన్నారు. స్వచ్ఛ భారత్ దివస్ వేడుక కార్యక్రమ నిర్వహణలో హైదరాబాద్ డివిజన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

దక్షిణ మధ్య రైల్వే స్వచ్ఛతా పఖ్వాడా సందర్భంగా స్టేషన్లు, రైళ్లు, ట్రాక్‌లు, కాలనీలు, కార్యాలయ ఆవరణలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు తదితర వాటిపై ఆదేశాల మేరకు రైల్వేలో ప్రత్యేక డ్రైవ్‌లు, స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే వాటాదారుల భాగస్వామ్యంతో స్టేషన్లు, కార్యాలయాలు, వర్క్‌షాపులు, మెయింటెనెన్స్ డిపోలు, ఆసుపత్రులు, ఆరోగ్యకేంద్రాలు, కాలనీలు, రైళ్లలో పరిశుభ్రతపై స్పష్టమైన ప్రభావాన్ని చూపే దిశగా నిజమైన స్ఫూర్తితో కార్యకలాపాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛతాహీ సేవా ప్రచారం ప్రజలలో, రైలు వినియోగదారులలో, రైల్వే సోదరులలో 'స్వచ్ఛ రైల్ స్వచ్ఛ భారత్' మిషన్ యొక్క ప్రాముఖ్యలతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మంచి పరిశుభ్రత, అలవాట్లను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృతమైన అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మధుసూధన్ రావు, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జిఆర్ఎస్ రావు, ఆర్పిఎఫ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్; హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, రైల్వే ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు అక్రమాలను బయటపెడుతూనే ఉంటా

- రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్ని లీగల్ నోటీసులు పంపినా... పదేళ్లలో హరీష్‌రావు చేసిన అక్రమాలను బయటపెడుతూనే ఉంటానని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. బుధవారం సోషల్‌మీడియా (ఎక్స్)లో హరీష్‌రావుపై ప్రశ్నల వర్షం కురిపించారు. సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం రామంచ గ్రామంలో రంగనాయక సాగర్ ప్రాజెక్టు వద్ద ఆయనకు విలాసవంతమైన ఫాం హౌస్ ఉందన్నారు. రంగానాయక సాగర్ ప్రాజెక్టు కోసం సర్వే నంబర్ 402 లో ఆయన గెస్ట్ హౌస్ ఉన్న 2.36 ఎకరాల ప్రాంతాన్ని భూసేకరణ నుండి అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు మినహాయించిందని ప్రశించారు. అదే సర్వే నంబర్ 402 లో సామాన్య రైతులకు చెందిన 2.08 ఎకరాల భూములను మాత్రమే ఎందుకు సేకరించిందన్నారు. హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నందునే, ఆ భూమిని, భూసేకరణ నుండి మినహాయించారా..? అని ప్రశించారు. సర్వే నంబర్ 402 లో ఉన్న 2.36 ఎకరాల భూమిని రెండు విడతలుగా ఎలా కొనుగోలు చేశారని, దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

మహాత్ముడి మార్గంలో నడవాలి





- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్

చంచల్‌గూడ: ప్రతి ఒక్కరూ గాంధీ మార్గంలో నడవాల్సిన అవసరముందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా చంచల్‌గూడ పురుష, మహిళ జైళ్లల్లో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హింస వైపు వెళ్లడం బలహీనతకు చిహ్నమన్నారు. అహింసతోనే సమాజం మెరుగుపడుతుందన్నారు. అహింసా మార్గాన్ని అనుసరించిన గాంధీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను ఇతర రాష్ట్రాల వారు అనుసరిస్తున్నారన్నారు. అంతకుముందు జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ జైలు వార్షిక నివేదిక సమర్పించారు. మహిళ జైల్లో ప్రత్యేకంగా జరిగిన వేడుకలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జడ్జి వీ. బాల భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఖైదీలు తయారు చేసి ఉత్పత్తులను న్యాయమూర్తులు పరిశీలించారు. కార్యక్రమంలో ఐజీ మురళీబాబు, సూపరింటెండెంట్ వెంకటలక్ష్మీ, డిప్యూటీ సూపరింటెండెంట్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో దాండియాకు బ్రేక్

అనుమతి నిరాకరించిన బోర్డు అధికారులు



కంటోన్మెంట్‌లో గతేడాది నిర్వహించిన దాండియా ఉత్సవాలు (ఫైల్)

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో దాండియా ఉత్సవాలకు బ్రేక్ పడనుంది. కొన్నేళ్లుగా నగరంలోనే దాండియా ఉత్సవాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న కంటోన్మెంట్‌లో ఈ సారి వేడుకలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. వేలాది మంది పాల్గొనే భారీ ఉత్సవాల నిర్వహణపై ప్రతీసారి ఊగిసలాట కొనసాగుతూ ఉండగా, ఈ సారి మాత్రం ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని బోర్డు అధికారులు తేల్చి చెబుతున్నారు. ఓ పక్క హైకోర్టు నోటీసులు, మరో పక్క డీజేల వినియోగంపై పోలీసుల ఆంక్షలకు తోడు కమర్షియల్ ఈవెంట్‌లకు బోర్డు అధికారులు అనుమతి నిరాకరణతో ఈ పాటికే ఏర్పాట్లు చేసుకున్న నిర్వాహకులు ఆందోళనలో పడిపోయారు. గతేడాది దాండియా ఈవెంట్‌లలో జరిగిన గొడవల నేపథ్యంలోనూ బోర్డు అధికారులు ఈ దఫా సీరియస్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ముందే చేతులెత్తేసిన 'ఇంపీరియల్'

రెండు దశాబ్దాలుగా ఇంపీరియెల్ గార్డెన్స్, మల్లారెడ్డి గార్డెన్స్‌లో తొమ్మిదిరోజుల పాటు సాగే వేడుకలకు నగర వ్యాప్తంగా ప్రజలు పోటెత్తేవారు. నవరాత్రుల తొలి రోజు మొదలుకొని దసరా ముందు రోజు వరకు ప్రతీరోజూ వేల సంఖ్యలో దాండియా ఉత్సవాలకు హాజరయ్యే వారు. ఆయా గార్డెన్స్ పరిసరాలు ట్రాఫిక్ జామ్‌తో కిక్కిరిసిపోయే. అర్ధరాత్రి వరకు డీజేల హోరులో సాంప్రదాయ దుస్తుల్లో చేసే నృత్యాలతో పండుగ మరింత శోభాయమానంగా సాగేది. అదే సమయంలో నిర్వాహకుల అత్యుత్సాహంతో అడపదడపా గొడవలూ పరిపాటిగా మారింది. దీంతో దాండియా ఉత్సవాలపై ఫిర్యాదులూ వెల్లువెత్తాయి. గతేడాది ఇంపీరియెడ్ గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకలకు సంబంధించి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలైంది. దీంతో కోర్టు గార్డెన్స్ నిర్వాహకులతో పాటు, కంటోన్మెంట్ అధికారులకూ నోటీసులు జారీ చేశారు. ఇక రక్షణ శాఖ స్థలంలో నిర్మించిన మల్లారెడ్డి గార్డెన్స్‌కు బోర్డు అధికారులు గత మార్చిలోనే కూల్చివేత నోటీసులు జారీ చేశారు. దీనిపై కోర్టు స్టే ఇవ్వడంతో కూల్చివేతకు తాత్కాలిక బ్రేక్ పడినట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఆయా గార్డెన్స్‌లో దాండియా ఉత్సవాల ఏర్పాటుకు నిర్వాహకులు వెనుకంజ వేసినట్లు తెలుస్తోంది.

డోలాయమానంలో నిర్వాహకులు

రసూల్‌పురా హాకీ మైదానం, క్లాసిక్ గార్డెన్స్ ఆవరణలో దాండియా ఉత్సవాలు నిర్వహించేందుకు కొందరు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు 'బుక్‌మైషో' సహా పలు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వెబ్‌సైట్‌ల ద్వారా టికెట్‌ల అమ్మకాలు మొదలుపెట్టారు. తాజాగా ఆయా ఈవెంట్‌లకు అనుమతులు ఇచ్చేది లేదని బోర్డు అధికారులు తిరస్కరించడంతో నిర్వాహకులు డోలాయమానంలో పడ్డారు.

జేఎల్ పోస్టింగులు ఇవ్వాలి

ప్రభుత్వానికి జూనియర్ లెక్చరర్ అభ్యర్థుల విజ్ఞప్తి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేయాలంటే 1,392 జేఎల్ పోస్టుల తుది ఫలితాలు విడుదల చేసి, త్వరగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు. బుధవారం ఈ మేరకు పలువురు అభ్యర్థులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 9న టీచర్లకు నియామక పత్రాలు అందజేస్తామని, ఇటీవల డీఎస్సీ ఫలితాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని, కానీ కొన్ని నెలలుగా జేఎల్ ఆర్డర్ కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తయిందని, ఇప్పటికీ తుది ఫలితాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన తర్వాత జేఎల్ ఫలితాలు విడుదల చేస్తే.. టీచర్ పోస్టులు బ్యాక్‌లాగ్‌లో మిగిలిపోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా తుది ఫలితాలు విడుదల చేసి, జేఎల్ అభ్యర్థులతో పాటు డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

ట్రాఫిక్ రద్దీ తగ్గించే చర్యలు చేపట్టండి

రైల్వే అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సనత్‌నగర్‌లోని గూడ్స్ షెడ్ కారణంగా పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ తగ్గించే చర్యలు చేపట్టాలని రైల్వే శాఖను హైకోర్టు ఆదేశించింది. సాంకేతిక, ఆర్థిక కారణాలతో పిటిషనర్ల విజ్ఞప్తి తోసిపుచ్చడం సరికాదంది. సనత్‌నగర్ ప్రాంతంలో సరుకుల లోడ్‌తో పెరుగుతున్న వాహనాల రద్దీని రైల్వే అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ ప్రాంతంపై ఉన్న రవాణా ఒత్తిడి ఇతర గూడ్స్ షెడ్‌లకు తరలించి.. ప్రోత్సహించాలని ఆదేశించింది. 2009, 2016లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని.. ఆ నివేదికపై విధాన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. 2009, ఫిబ్రవరి 23న, 2016, డిసెంబర్ 20న సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ దాఖలు చేసిన నివేదికలపై రైల్వే అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదంటూ హైకోర్టులో సనత్‌నగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. 'రైల్వే గూడ్స్ షెడ్, వేర్‌హౌసింగ్ కార్యకలాపాల నిమిత్తం భారీ వాహనాలు సనత్‌నగర్ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీని కారణంగా తీవ్ర ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలకు దారితీస్తోంది. దేశంలోని అనేక గూడ్స్ షెడ్‌లను సామర్థ్యానికి మించి వినియోగిస్తున్నారని, అలాంటి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించాలని రైల్వే శాఖకు ఫిర్యాదు కూడా అందాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులు కూడా సనత్‌నగర్ అంశాన్ని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజల కష్టాలను తొలగించాలని లేఖ రాశారు. ఈ క్రమంలోనే సీనియర్ డివిజన్ ఆపరేషన్స్ మేనేజర్ నివేదికలు అందజేశారు. సనత్‌నగర్ గూడ్స్ షెడ్ నుంచి కార్యకలాపాలను మౌలా అలీ స్టేషన్, చర్లపల్లి స్టేషన్, నాగులపల్లి స్టేషన్ లేదా శంకర్‌పల్లి స్టేషన్‌కు మళ్లించాలని సిఫార్సు చేశారు. అయితే దీనిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు' అని పేర్కొన్నారు. సనత్‌నగర్ గూడ్స్ షెడ్ ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది వీణ, కేంద్ర తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

తరలిస్తే మరింత ట్రాఫిక్ ఇబ్బందులు..

'సనత్‌నగర్ గూడ్స్ షెడ్ అనేది ఆహార ధాన్యాలు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, ఉప్పు తదితర వస్తువులకు సంబంధించి ప్రధాన టర్మినల్. కంటైనర్ కార్పొరేషన్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఫర్టిలైజర్ కార్పొరేషన్, సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థల వస్తువుల తరలింపు ఇక్కడి నుంచి కొనసాగుతుంది. అనేక భారీ, మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలు ఈ గూడ్స్ షెడ్‌పై ఆధారపడుతున్నాయి. లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాల నిర్వహణ దాదాపు 1,500 హమాలీలు పనిచేస్తున్నారు. 500 లారీల ద్వారా రోజువారీ సరకు రవాణా జరుగుతోంది. ప్రస్తుతానికి దీనికి ప్రత్యామ్నాయ గూడ్స్ షెడ్ లేదు. గూడ్స్ షెడ్‌ను తరలిస్తే ట్రాఫిక్ తగ్గుతుందనేది అపోహ. స్థానికంగా, చుట్టు పక్క ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం ఈ గ్రూడ్స్ షెడ్‌పై ఆధారపడుతున్నాయి. ఒకవేళ దీన్ని వేరే ప్రాంతానికి తరలిస్తే అక్కడి నుంచి పరిశ్రమలకు భారీ వాహనాలు రావాల్సి వస్తుంది. తద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు మరింత పెరుగుతాయి. ముంబై, ఢిల్లీ లాంటి నగరాల్లో పెద్ద మొత్తంలో గూడ్స్ షెడ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేయాలి' అని రైల్వే అఫిడవిట్ దాఖలు చేసింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. సనత్‌నగర్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ పిటిషన్‌లో విచారణ ముగించారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, గురువారం, 3, అక్టోబర్, 2024

రేసింగ్ విత్ త'లుక్'!



సాక్షి, సిటీబ్యూరో: అందాల తారలు తళుక్కుమన్నారు. హార్స్ రేసింగ్ ట్రాక్‌పై ఫ్యాషన్ డిజైనర్లు, భామలు హొయలు పోయారు. బుధవారం హైదరాబాద్ రేస్ క్లబ్ వేదికగా ఈ ఫ్యాషన్ షో జరిగింది. రేస్ 2 విన్ డాట్‌కామ్ డెక్కన్ డెర్బీ-2024 ఈ ఎక్స్‌క్లూజివ్ ఈవెంట్ నిర్వహించారు. నగరంలో తొలిసారిగా ఐకానిక్ డిజైనర్లు శివన్, నరేశ్ ద్వయం డిజైన్ చేసిన దుస్తుల్లో మోడల్స్ మెరిశారు. అద్భుతమైన 'లెవీలాండ్ సిరీస్' కలెక్షన్ దుస్తులు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ ఫ్యాషన్ షోలో సినీతారలు శ్రుతిహాసన్, హెబ్బా పటేల్, వితికా షేరూతోపాటు పలువురు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు పాల్గొన్నారు. రాయల్ హార్స్ రేసింగ్‌ను ఫ్యాషన్‌తో కలిపి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని రేస్ 2 విన్ డాట్‌కామ్ వ్యవస్థాపకుడు గోపీరావు పేర్కొన్నారు. ఈ ఫ్యాషన్ షో విజేతలకు రూ.94 లక్షల ప్రైజ్‌మనీ చెక్కును నిర్వా...హకులు అందజేశారు.



పది చదివి.. పదుగురికి ఉపాధి



శ్రీనగర్‌కాలనీ: చదివింది పదే... కానీ, కష్టేఫలి అని నమ్మి, తనకు తానుగా నేర్చుకున్న పనితో ఇప్పుడు పదుగురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు హేమలత రామా. ప్రతిఒక్కరి స్వప్నం సొంతిల్లు. ఇంటిలోపల అన్ని సక్రమంగా సమకూర్చుకుంటాం. కానీ, బాల్కనీ, వరండాలను మాత్రం అంతగా పట్టించుకోం. వాటిని ఎందుకు అందంగా, అద్వితీయంగా మలచకూడదనే ఆలోచనే హేమలతను బాల్కనీ మేకింగ్ వ్యాపారానికి దారి చూపింది. అందులో ఆమె సూపర్ సక్సెస్ అయ్యారు. తన జీవితంలో ఎదుర్కొన్న ఒడిదొడుకుల గురించి, బాల్కనీ మేకింగ్ వ్యాపారం గురించి హేమలత రామా 'సాక్షి'తో పలు విషయాలు పంచుకున్నారు. ఆ వివరాలు... ఆమె మాటల్లో... మాది వరంగల్. పుట్టి పెరిగింది అక్కడే. పెళ్లి అయిన కొన్నేళ్లకు నా భర్త చనిపోయారు. ఒంటరితనం మనిషికి చాలా పాఠాలు నేర్పుతుంది కదా! అలాగే నాకు కూడా. కుమార్తె చదువుల నిమిత్తం 2017లో హైదరాబాద్ వచ్చాను. చదివింది పదో తరగతే, ఇంగ్లిష్ మాట్లాడాలనే కోరికతో స్పోకెన్ ఇంగ్లిష్‌లో చేరాను. అక్కడే బిజినెస్ ఆలోచనలు మొదలయ్యాయి. అలా 2019లో ప్లేస్కూల్‌ను ఏర్పాటు చేశాను. సక్సెస్‌కు చేరువవుతున్న వేళ కోవిడ్ లాక్‌డౌన్ వచ్చి పడింది. దీంతో ప్లే స్కూల్ మూసేశాం. రూ.లక్షల్లో నష్టం వచ్చింది. లాక్‌డౌన్ ఖాళీ సమయంలో యూట్యూబ్‌లో చూసి 150 మొక్కలతో మా బాల్కనీని నాకు నచ్చినట్లుగా డిజైన్ చేశాను. నాకు సంతృప్తితోపాటు అక్కడ గడిపే సమయం మరింత ఆనందాన్ని ఇచ్చింది. బాల్కనీ చాలా బాగా ఉందని నా స్నేహితులు మెచ్చుకున్నారు.

స్వర్గ బాల్కనీ మేకోవర్స్ ప్రారంభం

బతకడానికి ఏ ఇబ్బందీ లేదు. కానీ, ఏదో వెలితిగా ఉండేది. కుమార్తె బీటెక్ పూర్తి చేశాక తనకు నచ్చినట్టుగా పేస్ట్రీ బేకింగ్‌లో శిక్షణ నిమిత్తం యూఎస్ వెళ్లింది. మళ్లీ ఒంటరితనం. దీంతో ఏదో చేయాలన్న తపన. బాల్కనీ మేకింగ్ వ్యాపారం చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన తట్టింది. 'బాల్కనీలో మొక్కలతో ఎవరికివారే డిజైన్ చేసుకోలేరా.. మేకింగ్ కోసం నీ దాకా ఎందుకు వస్తారు' అని చాలామంది నిరుత్సాహపరిచారు. కానీ, నాలో ఏదో గట్టి నమ్మకం. అలా స్వర్గ బాల్కనీ మేక్ ఓవర్స్‌ని మొదలుపెట్టాం. లాక్‌డౌన్ తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌ను మొదలుపెట్టాను. అయితే ఎలా మార్కెటింగ్ చేయాలో తెలియదు. యూట్యూబ్ ఛానల్స్ ద్వారా నేను చేసిన బాల్కనీ మేకోవర్స్ వీడియోస్ పెట్టాను. వాటికి మంచి స్పందన వచ్చింది. ఆ తర్వాత కుటుంబసభ్యుల సహకారంతో ఇన్‌స్టాలో రీల్స్ ఎలా పెట్టాలి... వీడియోస్ ఎలా తీయాలనేది నేర్చుకున్నాను. కేవలం రీల్స్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా, తెలిసిన వారి ద్వారా బాల్కనీ మేకింగ్ కోసం ఆఫర్స్ రావడం మొదలయ్యాయి.

సెలబ్రిటీస్‌కి స్వర్గ బాల్కనీ మేక్‌ఓవర్స్....

చిన్నగా మొదలైన వ్యాపారం రూ.లక్షల్లోకి వెళ్లింది. పదుల సంఖ్యలో బాల్కనీ మేకింగ్ చేసుకోవడానికి ముందుకు వచ్చారు. మూడేళ్లలో ఇన్‌స్టాలో దాదాపు 5 లక్షల మంది ఫాలోవర్స్ వచ్చారు. బాల్కనీ మేకింగ్‌తోపాటు ఇంటీరియర్, స్టూడియోస్, క్రియేటివిటీ ఉన్న అన్ని పనులను 'స్వర్గ' ద్వారా చేస్తున్నాం. నటి శ్రీముఖి, దివి, నిహారిక కొణిదెల, మహబూబ్, నిఖిల్ విజయసింహాలకు డిజైన్స్ చేశాను. నా పని నాకు చాలా సంతోషాన్నిచ్చింది. సొంతంగా నేర్చుకున్న పని నేడు పదిమందికి ఉపాధికి కల్పించే స్థాయికి రావడం తృప్తినిస్తోంది.

ప్రతిభను గుర్తించాలి...

ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. దాన్ని గుర్తిస్తే విజయం మన సొంతమే. తల్లిదండ్రులు పిల్లలకు నచ్చిన రంగంలోకి వెళ్ళనిస్తే అందులో వారు తప్పక విజయాలు సాధిస్తారు. ఇంజనీరో, డాక్టరో కావాలంటూ మన భావాలను రుద్దకుండా వారిలోని ప్రతిభతోపాటు వారి ఇష్టాలను గౌరవించాలి. అప్పుడే అలాంటివారు మరొకరికి ఆదర్శంగా నిలిచేస్థాయిలో నిలబడతారన్నది నా అభిప్రాయం. కష్టపడితే ఏ రంగంలోనైనా సక్సెస్ లభిస్తుంది. బీటెక్ తర్వాత నా కుమార్తెను తనకు నచ్చిన పేస్ట్రీ బేకింగ్‌కు పంపించాను. యూఎస్‌లో శిక్షణ తర్వాత ఆమె హైదరాబాద్‌లో సొంతంగా వ్యాపారం మొదలుపెట్టి సంతోషంగా ఉంది.

ఫోక్.. కిరాక్




ఫోక్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన కిషన్‌రావు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో బుధవారం కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. శిల్పారామం, నాగపూర్ సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్, కేంద్ర సాంస్కృతిక శాఖ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న డివిజీనల్ లెవెల్ ఫోక్ ఫెస్టివల్‌ను శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు ప్రారంభించారు. తెలంగాణ జానపద నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఒగ్గుడోలు, డప్పు, పేరిణి, మాధురి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశంలోని చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఈ ఫెస్టివల్ సందర్భంగా అందుబాటులో ఉంచుతున్నారు. పోచంపల్లి, గద్వాల్, బనారస్ పట్టు, బెంగుళూరు సిల్క్, చెందేరీ, డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉంటాయి. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజిస్ట్ సూపరింటెండెంట్ డాక్టర్ సుమితా ఎస్.కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దీపక్ పాటిల్, అకౌంట్స్ ఆఫీసర్ ప్రజాపతి, శిల్పారామం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

"హమారా హైదరాబాద్.. ఎమోషన్స్‌కు స్పాట్. భిన్న మతాలు, విభిన్న అభిమతాలకే కాదు, చక్కని అనుభూతులకు, చిక్కని అనుబంధాలకు, తీయని ఆత్మీయతకు వేదిక. నగరవాసులే కాదు, నగరంతో అనుబంధం పెంచుకున్న ప్రతీ ఒక్కరికీ హైదరాబాద్ అంటే ఒక మోజు. అది సంస్కృతీ, సంప్రదాయల కూడలి. భావోద్వేగాల కడలి. ఆ గాలి సోకినా, ఆ నేల తాకినా, ఆ నీరు తాగినా ఆ అనుభూతే వేరు. ఎమోషన్స్ అనేకం.. వాటితో మమేకం అయిన తీరు అమోఘం. మహానగరంలో ఒక్కో ఎమోషన్‌కు ఒక్కో ప్రత్యేక ప్రాంతం ఉంది. ఛాయ్ తాగడానికి ఒక స్పాట్. బర్త్ డే కేక్ కటింగ్ కిక్‌ను ఆస్వాదించడానికి ఇంకో స్పాట్. సెల్ఫీల మోజు తీర్చుకోవడానికి మరో స్పాట్. సినిమా చూడటానికి వేరే స్పాట్. కళాత్మక వీక్షణంతో మనసు సేద తీరడానికి మరో ప్రదేశం. ఇలా ఒక్కో ఎమెషన్‌కు ఒక్కో కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆ స్పాట్స్ ఏవో, అవి ఎక్కడెక్కడ ఉన్నాయో ఓసారి చూద్దామా..! -సాక్షి, సిటీబ్యూరో"



కేక్ కటింగ్‌కు ట్యాంక్‌బండ్. ఛాయ్‌కి నీలోఫర్.. విజ్ఞానానికి ప్లానిటోరియం.. కళలకు రవీంద్రభారతి..

నగరవాసులే కాకుండా విభిన్న ప్రాంతాలవారికీ వీటితో అనుబంధం

జీవనశైలి పరిణామక్రమంలో కొత్త భావోద్వేగాలకు వేదికగా నగరం

స్పాట్స్ ఆఫ్ ఎమోషన్


ఒక్కో ప్లేస్‌తో ఒక్కో తీరుగా అనుభూతిని కలిగిన నగరవాసులు

సెల్ఫీ స్పాట్... కేబుల్ బ్రిడ్జ్

ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాక నగరంలో అత్యంత ఆదరణ పొందిన నూతన నిర్మాణం ఏదైనా ఉందంటే, అది ఖచ్చితంగా కేబుల్ బ్రిడ్జ్ మాత్రమే. యూఎస్, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని నగరాలకు ఏ మాత్రం తీసిపోని అద్భుతమైన ఆర్టిఫీషియల్ అందం దీని సొంత. మన మాదాపూర్, హైటెక్ సిటీ ఐటీ కంపెనీలు.. ఆ అద్దాల ప్రపంచంలోకి సాదరంగా స్వాగతించే ఆహ్వాన తోరణంలా అందరిచూపులను తనవైపు తిప్పుకుంది దుర్గం చెరువుపైన వేలాడే కేబుల్ బ్రిడ్జ్. అధునాతన హైదరాబాద్‌కు ఇది మరో ముఖ్యమైన అట్రాక్షన్ సెంటర్‌గా మారింది. హ్యాష్ ట్యాగ్‌లో సిటీల్లో ఎక్కువ సెల్ఫీలు తీసుకున్న ప్లేస్ అని సెర్చ్ చేస్తే ఇదే వస్తుందేమో..!?

కేక్ కట్.. ట్యాంక్ బండ్

మన నగరం రోజురోజుకూ విస్తరిస్తున్నా.. ఎప్పటికప్పుడు నవ్యతను సంతరించుకుంటున్నా.. రూపురేఖలను తీర్చిదిద్దుకుంటున్నా.. ఇప్పటికీ సిటీలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ ట్యాంక్ బండ్ అనే చెప్పుకోవచ్చు. ఒకప్పుడు హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుడిని చూడటానికో, దానికి అనుకొని ఉన్న లుంబినీ పార్క్‌ను, ఎన్‌టీఆర్ గార్డెన్‌ను సందర్శించడానికో లేదా ట్యాంక్‌బండ్‌పైన పాట్లం మిక్చర్ రుచి చూడటానికో ఇక్కడికి చాలామంది వచ్చేవారు. కానీ, ఇప్పుడు అది బర్త్ డే కేక్ కటింగ్ ప్లేస్‌గా మారింది. ముఖ్యంగా యువత అర్ధరాత్రి ట్యాంక్‌బండ్‌పై కేక్ కట్ చేస్తే ఆ కిక్కే వేరు అంటోంది. మనిషి ఉండేది గచ్చిబౌలి అయినా, ఎల్‌బీనగర్ అయినా సరే, మనసు ఉండేది ట్యాంక్‌బండ్‌పైనే. ఇక్కడే బర్త్ డే కేక్ కట్ చేయాలి. అదంతే! అంతలా బాండ్ పెంచుకుంది ఈ బండ్. రాత్రి సమయాల్లో ఇక్కడ తీవ్రమవుతున్న రద్దీ దృష్ట్యా పోలీసులు, ఇతర అధికారులు ఈ సందడిని, సంబరాలను సున్నితంగా వారించేందుకు ప్రయత్నించినప్పటికీ కేక్ కటింగ్‌ను కట్ చేయలేకపోతున్నారు.



నీలోఫర్ ఛాయ్.. చార్మినార్ అడ్డా...





మన చారిత్రక నగరంలో ఛాయ్ అంటే.. పదరా భాయ్.. అనే అంటారు అందరు. సిటీలో టాప్ స్టాల్స్ ఏంటని ఎవరిని అడిగినా టీ స్టాల్సే అని చెబుతారు. అవి వేలల్లో కాదు, లక్షకుపైనే ఉంటాయి. ఎన్ని టీ స్టాల్స్, కేఫ్స్ ఉన్నా నిలోఫర్ ఛాయ్‌నే మా ఫేవరెట్ అనేవారు ప్రతీ ఐదుగురిలో ఇద్దరు, ముగ్గురైనా ఉంటారు. హైదరాబాద్ ఒక కుటుంబం అయితే నిలోఫర్ వంటగది లాంటిది. అక్కడి 'టీ' అంతటి ప్రత్యేకతను సొంతం చేసుకుంది. నగరవాసుల ఒత్తిడి తగ్గించే మెడిసిన్‌లా అది మారిపోయింది. అంతే కాదు.. చార్మినార్ పక్కనే ఉన్న నిమ్రా కేఫ్‌లో రాత్రి 10 దాటాక తేనీరు తాగితే ఆ ఫీలే వేరని టీ లవర్స్ చెబుతున్నారు. టీతోపాటు ప్రత్యేకంగా ఐస్‌క్రీంను ఆస్వాదించాలని అనుకునేవారంతా మొజంజాహి మార్కెట్‌కు పరుగులు తీస్తారు. నగరంలో టాప్ ఐస్‌క్రీం బ్రాండ్ స్టోర్లు ఎన్నీ ఉన్నప్పటికీ చారిత్రక నిర్మాణం చెంతన, రాజసంగా ఐస్‌క్రీం తినడమే స్పెషల్ అని స్వీట్‌గా సెలవిస్తున్నారు ఛాయ్ ప్రేమికులు.

సినిమా అంటే ఐమ్యాక్స్..



దేశవ్యాప్తంగా హైదరాబాద్ అంటే 'త్రీ బీ' ఫార్ములా గుర్తొస్తుంది. అవే.. బిర్యాని, బ్యాడ్మింటన్, బాహుబలి! నగరంతో పెనవేసుకున్న అంశాల్లో సినిమా కూడా కీలకంగా మారింది. ఒకప్పుడు సినిమాలు అన్నా, రిలీజ్ సినిమా ఫస్ట్ షో అన్నా ఎవరికైనా గుర్తొచ్చేది చిక్కడపల్లిలోని ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్. ఇప్పుడు ట్రెండ్ మారింది. రిలీజయ్యే సినిమా మొదటి షోకు ఐమాక్స్ థియేటర్ అడ్డాగా మారింది. మూవీ రివ్యూల స్పాట్‌గానూ ఈ వేదిక నిలుస్తోంది. మొదటి షోనే కాదు., ఏ షో ఐనా ఐమ్యాక్స్‌లో, అదీ బిగ్ స్క్రీన్ పైన చూస్తే ఏదో తృప్తి. అలా ఐమ్యాక్స్ వెళ్లొస్తే చాలు, సినిమా, వినోదం, ఆకలి.. ఇలా మూడూ ఏకకాలంలో తీరుతాయి.

స్నేహితుల కలయిక.. డాగ్ పార్క్

ప్రతీ ఆదివారం జంతు ప్రేమికులంతా ఒక చోటుకు చేరుకుని తమ తమ విభిన్న బ్రీడ్‌ల కుక్కలను స్నేహితులకు పరిచయం చేస్తున్నారు. అదే నెక్లెస్ రోడ్‌లోని డాగ్ పార్క్. అది జంతు ప్రేమికులకు అత్యంత ఇష్టమైన ప్రదేశంగా మారింది. సాధారణ స్ట్రీట్ డాగ్స్ మొదలు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పలు రకాల శునకరాజాలు ఇక్కడ దర్శనమిస్తాయి. వివిధ కారణాలతో సాధుజంతువులు అంతగా అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ ఓసారి వాటిని చూసి ఆస్వాదిద్దాం అనుకునే వారు ఆదివారం వేకువనే ఇక్కడికి చేరుకుంటున్నారు.



వినోదం, విజ్ఞానం...



విజ్ఞానం, వినోదాన్ని ఇష్టపడే వారి ఆల్‌టైం ఫేవరెట్ స్పాట్‌గా బిర్లా ప్లానిటోరియం, సైన్స్ మ్యూజియం నిలుస్తున్నాయి. కోట్ల సంవత్సరాల డైనోసార్ శిలాజాలు మొదలు అంతరిక్షంలోని అద్భుతాల వరకు ప్రతి దానిని చూసి అనుభూతి చెందాలనుకునే ప్రతీ ఒక్కరి అడుగులు ఇటువైపే. శతాబ్దాల నాటి చరిత్ర సాక్ష్యాలైన శిల్పాలు, సాంస్కృతిక వైభవానికి నిదర్శనాలు, జీవన పరిణామక్రమం, ఏరోస్పేస్ వంటి తదితర శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందించే ప్రత్యేక సందర్శన సముదాయం ఇది. ముఖ్యంగా విదేశాల నుంచి నగరానికి పరిశోధనకు వచ్చే సైంటిస్టులకు సైతం ఇదే ఫేవరెట్ ప్లేస్.


సాహసాల వేదిక...

వినోదం కోసం నగర మోడ్రన్ కల్చర్.. పార్కులు, గార్డెన్ నుంచి అమ్యూజ్‌మెంట్ థీమ్ పార్కుల వైపు మళ్లింది. సాహస కృత్యాలను చూసి ఉబ్బితబ్బిబ్బైపోవాలనుకునే 'సిటీ'జనులు అడ్వెంచర్ గేమ్స్ వైపు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా అందరి ఫేవరెట్ స్పాట్‌గా శివార్లలోని వండర్లా మారింది. కాస్త దూరమైనా, టికెట్టు డబ్బులు ఎక్కువైనా ఈ అడ్వెంచర్ థీమ్ పార్కులోని అనుభూతులను, ఆనందాలను ఆస్వాదించడానికే ఎక్కువ మంది వస్తుంటారు. ఆ గేమ్స్‌లో ఉన్న వినోదం, సాహసాలు అలాంటివి మరి. ముఖ్యంగా అందులోని ఇంటర్‌స్టెల్లార్ అయితే అద్భుతం. అది అందరినీ ఆశ్చర్యపరుస్తుందని సందర్శకులు చెబుతున్నారు.

అభ్యుదయ వేదిక.. రవీంద్రభారతి

కళలు, సంస్కృతి, సాహిత్య ప్రేమికులకు రవీంద్రభారతి వేదికగా ఉంది. గత కొన్నేళ్లుగా రవీంద్రభారతి పూర్వవైభవాన్ని సంతరించుకుంది. నిత్యం ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమంతో కళాత్మకతను నింపుకుంటోంది. కవులు, కళాకారులతో నిత్యం కిటకిటలాడుతుంది. మళ్లీ నాటకాలు, స్టేజ్ ఆర్ట్ షోలు, రకరకాల నృత్య రీతుల ప్రదర్శనలతో విరాజిల్లుతోంది. ఈ రంగాలకు చెందిన వారంతా సాయంత్రాల వేళ రవీంద్రభారతికి చేరుకుంటారు.





బాపూజీకి ఘన నివాళి


బాపూ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


గాంధీజీకి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి, వీహెచ్ తదితరులు

లంగర్‌హౌస్ (హైదరాబాద్): మహాత్మా గాంధీ జయంతి వేడుకలు లంగర్‌హౌస్ త్రివేణి సంగమం ఒడ్డునున్న బాపూ ఘాట్‌లో ఘనంగా జరిగాయి. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని ఉదయాన్నే 6.15 గంటలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ బాపూఘాట్‌కు చేరుకున్నారు. గాంధీజీ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఉన్నారు. ఉదయం 10.50 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాపూ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం బాపూఘాట్ ప్రాంగణానికి చేరుకొని అక్కడి ధ్యాన మందిరంలో సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాఠశాల చిన్నారులను పలకరించి.. బాపూఘాట్ ప్రాంగణంలోని బాపూజీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం 'ఇంకుడు గుంతలు ఏర్పాటు చేద్దాం.. భూగర్భ జలాలను కాపాడుకుందాం 'నినాదంతో పోస్టర్లు, కరపత్రాలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రముఖులు పొన్నం ప్రభాకర్, కేశవరావు, మహేశ్‌గౌడ్, తుమ్మల నాగేశ్వర్‌రావు, మేయర్ విజయలక్ష్మి, పొంగులేటి సుధాకర్, జూపల్లి కృష్ణారావు, నిరంజన్, అనిల్‌కుమార్ యాదవ్, వి.హనుమంతరావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కలెక్టర్ అనిరుధ్ తదితరులు బాపూజీకి నివాళులర్పించారు.

గాంధీభవన్‌లో గాంధీ జయంతి వేడుకలు

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాపూ చిత్రపటానికి టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముని జయంతి సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ప్రారంభించారు. సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సేవాదళ్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున రక్తదానం చేశారు. రెనోవా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ చేసే విధానాన్ని ఆసుపత్రి డైరెక్టర్ నగేశ్ వివరించారు. అనంతరం టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సీపీఆర్ చేసే విధానాన్ని సాధన చేశారు. గాంధీ జయంతి వేడుకల్లో గ్రేటర్ హైదరాబాద్ మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు మచ్చా వరలక్ష్మితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమానవీయ పాలనపై ఢిల్లీ గాంధీలు స్పందించాలి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అమానవీయ పాలనపై ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు సోనియా, రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. పేదలపై కర్కశంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు అడ్డుకట్ట వేయాలన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలోని బలహీనులు, సమాజంపై ప్రభుత్వ వైఖరితోనే వ్యవస్థ గొప్పతనాన్ని అంచనా వేయొచ్చని మహాత్ముడు చెప్పడాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో గాంధీ జయంతి



మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం అసెంబ్లీ ఆవరణలోని ఆయన విగ్రహానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు అడ్లూరు లక్ష్మణ్, బీర్ల అయిలయ్య, శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, దయానంద్, అలీఖాన్, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

స్పీకర్ నివాళి: యూరప్ వ్యక్తిగత పర్యటనకు వెళ్లిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతశ్రేణుల్లోని జంగ్ ఫ్రాజోజ్ వద్ద మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పించారు.

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

హనుమకొండ జిల్లాలో ఇద్దరు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మరొకరు


ఇటుకాల నిర్మల (ఫైల్)


సోలెంక రమ (ఫైల్)


లక్ష్మి (ఫైల్)

ఆత్మకూరు/రేగొండ/కొత్తగూడ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధవారం సాయంత్రం వేర్వేరు చోట్ల జరిగిన పిడుగుపాటు ప్రమాదాల్లో ముగ్గురు చనిపోగా ఒకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపెల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఇటుకాల నిర్మల(51), సోలెంక రమ(45)చౌళ్లపెల్లి శివారులో పత్తి ఏరడానికి కూలి పనికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం రాగా ఇద్దరు సమీపంలోని చెట్టుకిందికి చేరుకున్నారు. నిర్మల, రమ ఉన్న చెట్టు మీద పిడుగుపడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.

వ్యవసాయ పనులు చేస్తున్న మహిళా రైతుపై..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కరట్లపల్లి లక్ష్మి(45) భర్త నగేశ్‌తో కలసి తమకున్న వ్యవసాయ భూమిలో మిరప పంటకు పిండి చల్లేందుకు పొలానికి వెళ్లారు. బుధవారం సాయంత్రం లక్ష్మిపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతిరాలికి భర్త నగేశ్‌తో పాటు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నాడు.

ఒకరు అస్వస్థత...: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయి గూడెం గ్రామానికి చెందిన బానోతు బాలు పొలం వద్ద పనులు చేస్తుండగా సమీపంలో పిడుగుపడటంతో అతడు స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు ద్విచక్రవాహనంపై పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసి నర్సంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

4 నెలల్లోనే అన్నింటా విఫలం

చంద్రబాబు అబద్ధాలు, మోసం పట్ల ప్రజల్లో ఆగ్రహం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంలో వైఎస్ జగన్



"కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైంది. సూపర్ సిక్స్ లేదు.. సూపర్ సెవన్ లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, అమ్మ ఒడి, రైతు భరోసా, స్కూళ్లు.. ఆస్పత్రుల అభివృద్ధి.. అన్నీ పోయాయి. మూడు నెలల్లో లక్షన్నర పింఛన్లు తగ్గించారు. నాణ్యమైన చదువులు లేవు.. వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందలేదు.. ఆర్బీకేల్లో సేవలు లేవు.. ఉచిత క్రాప్ ఇన్సూరెన్స్ లేదు.. అన్ని విషయాల్లోనూ ఈ ప్రభుత్వం విఫలమైంది. చంద్రబాబు అబద్ధాలు, మోసం పట్ల ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ప్రజల కోపాగ్నిలో కూటమి ప్రభుత్వం దహించుకుపోవడం ఖాయం. - వైఎస్ జగన్"

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీకి సంబంధించి దాదాపు 24 అనుబంధ విభాగాలను క్రియాశీలకం చేస్తున్నామని, తద్వారా ఏదైనా సాధించేలా పార్టీని గ్రామ స్థాయి వరకు మరింత పటిష్టంగా నిర్మిద్దామని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మనది.. మనందరిది అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మనందరం కలిసికట్టుగా పార్టీని మరింతగా పటిష్టం చేసుకుందామని చెప్పారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ పోషించే పాత్ర చాలా కీలకం అని.. పార్టీకి కాళ్లు, చేతులు ఈ విభాగాలేనని, ఇవి ఎంత బలంగా ఉంటే పార్టీ అంత బలంగా పరుగెత్తి పోరాడగలదన్నారు. అందుకే పార్టీని మరింతగా పటిష్ట పరిచేందుకు శ్రీకారం చుడుతున్నామని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. రానున్న రోజుల్లో పార్టీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించి.. భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. '15 సంవత్సరాలుగా పార్టీ బలంగా ఉంది. మరింత ఆర్గనైజ్డ్‌గా పని చేయాలి. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పార్టీకి అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు. వీరిని ఆర్గనైజ్డ్‌గా అనుబంధ విభాగాల్లోకి తీసుకొస్తే.. అప్పుడు మనం ఏదైనా సాధించగలుగుతాం. మనం చేసే కార్యక్రమాన్ని పద్ధతిగా తీసుకురావడంతో పాటు, గ్రామం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏ పిలుపునిచ్చినా మొత్తం కేడర్ కదులుతుంది. ఎప్పుడైతే కేడర్ అగ్రెసివ్‌గా కదులుతుందో అప్పుడే కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడగలుగుతాం. పార్టీ సంస్థాగతంగా బలంగా ఉంటేనే మనం ఈ పోరాటం చేయగలుగుతాం. మనం పిలుపునిస్తే.. ప్రతి గ్రామంలోనూ కార్యక్రమం జరగాలి. అప్పుడే మనం ఆర్గనైజ్డ్‌గా పని చేస్తున్నట్లు స్పష్టమవుతుంది' అని చెప్పారు.

ప్రశ్నించడమే రాజకీయం

మౌనంగా ఉండటమే అసలైన సమస్య
మెజారిటీ, మైనారిటీ రాజకీయ నాయకుల సృష్టి
ఒకరిపై ఒకరికి భయం సృష్టించడమే వారి లక్ష్యం
మంథన్ సంవాద్‌లో పలువురు వక్తల అభిప్రాయం

ప్రజాస్వామ్యం సజీవంగా ఉండాలన్నా, దానిని కాపాడుకోవాలన్నా మేధావులు చర్చిస్తేనే సాధ్యం అవుతుందని మంథన్ సంవాద్ వేదికగా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 'మంథన్ సంవాద్' 13వ ఎడిషన్ బుధవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికపై జరిగింది. మేధావులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, వారి ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మంథన్ 2005 నుంచి అక్టోబర్ 2న ఈ చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 470 కార్యక్రమాలు జరిగాయి. సింగర్ అనూజ్ గుర్వారా, నటుడు అజీజ్ నజీర్, సబాఖాన్ సహా 1,500 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.8 మంది వక్తలు పలు అంశాలపై తమ అభిప్రాయాలు, ఆలోచనలను పంచుకున్నారు. - సాక్షి, హైదరాబాద్

ముస్లిం జనాభా పెరుగుతుందనేది ఒక అపోహ: ఖురేషీ



దేశంలో ముస్లిం జనాభా పెరుగుతోందనేది ఒక అపోహ మాత్రమేనని కేంద్ర ఎన్నికల మాజీ కమిషనర్ ఖురేషీ చెప్పారు. మంథన్ సంవాద్‌లో భాగంగా 'దేశంలో ముస్లిం జనాభా పెరుగుదల-అపోహలు'అనే అంశంపై ఆయన మాట్లాడారు. 1951 నుంచి 2011 వరకు జనాభా లెక్కల ప్రకారం ముస్లిం జనాభా 13.6 కోట్లకు, హిందువుల జనాభా 67.6 కోట్లకు చేరిందని వివరించారు. ఈ గణాంకాలు చూస్తే..దేశ జనాభా పెరిగేందుకు హిందువులు కారణమని చెప్పారు. అదే కాలంలో హిందూ, ముస్లింల మధ్య జనాభా గ్యాప్ 26.7 కోట్ల నుంచి 80.8 కోట్లకు పెరిగిందన్నారు. హిందువులను ముస్లిం జనాభా దాటేస్తుందనేది ప్రచారం మాత్రమేనని కొట్టిపారేశారు. ఎక్కువ మంది జనాభాను కనాలని ఏ ముస్లిం నాయకుడు కానీ, మేధావి కానీ పిలుపునివ్వలేదని గుర్తు చేశారు. కుటుంబ నియంత్రణను ఖురాన్ ఎక్కడా నిషేధించలేదన్నారు.

ఒకే దేశం-ఒకే ఎన్నిక అసంబద్ధం : అరవింద్ దాతార్



ఒకే దేశం-ఒకే ఎన్నిక అనే ప్రతిపాదన అసంబద్ధమైనదని సీనియర్ అడ్వొకేట్ అరవింద్ దాతార్ అన్నారు. దీనివల్ల దేశంలో రాజ్యాంగా సంక్షోభం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. '75 ఏళ్ల రాజ్యాంగం'అనే అంశంపై ఆయన ప్రసంగించారు. రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థ అవసరంపై చర్చ జరగాలన్నారు. గవర్నర్లు ప్రతి బిల్లుకు కొర్రీలు పెడుతూ ఇబ్బందులు పెట్టడం సరికాదని చెప్పారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకు గవర్నర్ వ్యవస్థను వాడుకోవడమేంటని ప్రశ్నించారు.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ అవసరం: కిరణ్‌రావు



ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావొద్దంటే.. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని బాలీవుడ్ డైరెక్టర్ కిరణ్‌రావు సూచించారు. 'లింగ దృష్టి కోణం'అనే అంశంపై ఆమె ప్రసంగించారు. సినిమాల్లో స్త్రీల ను చూపించే విధానంలో మార్పులు రావాలని, అయితే మహిళల సమస్యల గురించి మహిళా డైరెక్టర్లతోపాటు కొందరు పురుషులు కూడా అద్భుతంగా తెరకెక్కించారని కిరణ్‌రావు పేర్కొన్నారు. పురుషులు కూడా చాలా సున్నితమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి గురించి కూడా చర్చించాలన్నారు. తనకు వనపర్తి అంటే చాలా ఇష్టమని, తాతయ్య వాళ్ల ఇంటికి వెళ్తుంటానని చెప్పారు. హైదరాబాద్‌తో తనకు మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే : శశికాంత్



మెజారిటీ, మైనారిటీ అనే అంశాన్ని రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ పేర్కొన్నారు. మెజారిటీ ప్రజలకు మైనారిటీలంటే లేనిపోని భయాలు కల్పించి ఎన్నికల్లో గెలుపొందడమే వారి లక్ష్యమని చెప్పారు. 'కౌంటరింగ్ మెజారిటేరియనిజం-తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. మెజారిటేరియనిజం అనేదే పెద్ద నకిలీదని, దీని వల్ల మెజారిటీ ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికే చాలా ప్రదేశాల్లో గుళ్లలోకి కొన్ని కులాలను వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో శాస్త్రీయంగా ముందుకు వెళ్లాల్సింది పోయి.. తిరోగమనం చెందడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కుటుంబం నుంచే రాజకీయాలు మాట్లాడకుండా తల్లిదండ్రులు పిల్లలను పెంచుతున్నారన్నారు.

పార్లమెంటరీ వ్యవస్థ నాశనం సంజయ్‌సింగ్



దేశంలో పార్లమెంటరీ వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని ఆమ్‌ఆద్మీ ఎంపీ సంజయ్‌సింగ్ విమర్శించారు. ఎంపీలను సస్పెండ్ చేసి, నియంతృత్వ పోకడతో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. 'పార్లమెంట్ వ్యవస్థ పతనం'అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పదేళ్ల యూపీఏ హయాంలో 150 మంది ఎంపీలను మాత్రమే సస్పెండ్ చేశారని, వారిలో 50 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నారని చెప్పారు. గత పదేళ్ల మోదీ పాలనలో 250 మందికిపైగా ఎంపీలను సస్పెండ్ చేస్తే వారిలో ఒక్కరంటే ఒక్క బీజేపీ ఎంపీ లేకపోవడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని, బయటకు వచ్చి మాట్లాడితే ఈడీ, సీబీఐతో దాడులు జరిపించి, జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వారు బీజేపీలో చేరగానే.. సత్యహరిశ్చంద్రులుగా మారుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో ప్రభుత్వం నడవకుండా చేసేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ అన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు.


'మంథన్ సంవాద్' సదస్సుకు హాజరైన ప్రతినిధులు

దామగుండం.. రాడార్ గండం!

▶ మొదటి పేజీ తరువాయి

గ్రామాల ప్రజలు తమ ఇలవేల్పుగా రామలింగేశ్వరుని కొలుస్తున్నారు. అడవి మధ్యలో దేవాలయానికి సంబంధించిన భూములు కూడా ఉన్నాయి. కాగా రాడార్ నిర్మాణం కోసం.. ఈ అడవుల్లోని 2,900 ఎకరాల భూమిని నావికాదళం అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు. అయితే ఈ క్రమంలో 12 లక్షల చెట్లను నరికివేస్తారంటూ ప్రచారం జరుగుతుండటంతో ఆందోళన వ్యక్తం అవుతోంది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు సమీపంలో ఉన్న హైదరాబాద్‌కూ తీవ్ర నష్టం వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు అంటున్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, పశు పక్షాదులకు నిలువ నీడ లేకుండా పోతుందని చెబుతున్నారు. ఇక రాడార్ చుట్టూ కంచె వేస్తే తాము ఆలయానికి వెళ్లి పూజలు చేసుకోవడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. తమ అడవిలో తాము పరాయివారిగా మారుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలేమిటీ నేవీ రాడార్?

నౌకలు, జలాంతర్గాముల (సబ్‌మెరైన్ల)తో సమాచార మార్పిడిని (కమ్యూనికేషన్) మెరుగుపరుచుకునేందుకు నావికాదళం వెరీ లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్లను నిర్మిస్తుంది. దామగుండం సముద్రమట్టానికి 460 మీటర్ల ఎత్తులో ఉన్నందున శత్రు దేశాల కళ్లు కప్పి సమాచార మార్పిడి చేసుకునే అవకాశం ఉంటుందని, వ్యూహాత్మకంగా ఈ ప్రాంతం ఎంతో అనుకూలమైనదని నేవీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు దేశంలో తమిళనాడులోని తిరునల్వేలిలో కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మాత్రమే ఉంది. దీన్ని 1990లో నిర్మించారు. వాస్తవానికి దామగుండంలో రెండో స్టేషన్ నిర్మించాలని ఏళ్ల క్రితమే నిర్ణయించినా ముందుకుసాగలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడమే కాకుండా ఇందుకోసం తూర్పు నావికాదళానికి కావాల్సిన 2,900 ఎకరాల భూమిని బదలాయించేందుకు అంగీకరించింది. ఈ స్టేషన్‌ను 2027 నాటికి పూర్తి చేయాలని నేవీ భావిస్తోంది. రాడార్ నిర్మాణంతో పాటు ఇక్కడ దాదాపు 3 వేల మంది నివాసం ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు.

రేడియేషన్ ముప్పు ఉండదంటున్న శాస్త్రవేత్తలు

సాధారణంగా రాడార్ వ్యవస్థ చాలా తక్కువ (3- 30 కిలోహెడ్జ్) రేడియో ఫ్రీక్వెన్సీతో పనిచేస్తుంది. పైగా ఇక్కడ దాదాపు 450 మీటర్ల ఎత్తు టవర్లు ఉంటాయని, వీటివల్ల చుట్టుపక్కల ఉండే ఏ వస్తువుకు కానీ, వ్యక్తికి కానీ ఎలాంటి ఇబ్బంది ఉండదని రక్షణ శాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సముద్ర జలాల గుండా చొచ్చుకుపోయే ఫ్రీక్వెన్సీ తరంగాల ఆధారంగా సబ్ మెరైన్లలోని సిబ్బందితో సమాచార మార్పిడి జరుగుతుందని పేర్కొంటున్నారు.

12 లక్షల చెట్లు తొలగింపు అవాస్తవం!

ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా 12 లక్షల చెట్లను తొలగిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఆటవీ శాఖ అధికారులు మాత్రం ఇది అవాస్తవం అంటున్నారు. నేవీకి అప్పగించే భూమిలో చాలావరకు చిన్న పొదలు, ఖాళీ ప్రదేశం మాత్రమే ఉందని, దట్టమైన అటవీ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టబోరని చెబుతున్నారు. కేవలం 1.5 లక్షల చెట్లు తొలగించే అవకాశం ఉన్నట్లు ఫారెస్టు శాఖ అంచనా వేస్తోంది. రాడార్ స్టేషన్ ఏర్పాటు చేసే ప్రాంతం, ఇతర నిర్మాణాలు చేపట్టే ప్రదేశాల్లో మాత్రమే చెట్లను తొలగిస్తారు. అయితే ఈ నష్టాన్ని పూడ్చేందుకు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏకంగా 17.5 లక్షల మొక్కలు నాటేందుకు ఆటవీ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.


రాడార్ స్టేషన్ ఏర్పాటు కానున్న ప్రాంతం

అరుదైన జాతులు కనుమరుగు



దామగుండం రాడార్ స్టేషన్ నిర్మాణంతో అడవుల్లో పచ్చదనం పోతుంది. అరుదైన జంతు జాతులు కనుమరుగవుతాయి. పర్యావరణానికి తీవ్రమైన ముప్పు వాటిల్లుతుంది. చెట్లను కాపాడుకోవాల్సిన పరిస్థితుల్లో లక్షలాది చెట్లను నరికేయడం చాలా దారుణం. సమీపంలోని హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వాతావరణం కూడా ప్రభావితం అవుతుంది. ఈ ప్రాజెక్టును వేరే ప్రాంతానికి తరలించాలి.
- రుచిత్ ఆశ కమల్, క్లైమేట్ ఫ్రంట్ ఇండియా

ఏం చేయలేని స్థితిలో ఉన్నాం



రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ఏళ్లుగా ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాం. మాకెవరూ సహకరించడం లేదు. అసలు రాడార్ స్టేషన్‌తో ఎలాంటి పరిణామాలు ఉంటాయో సరిగ్గా అవగాహన కల్పించే వాళ్లు కూడా లేరు. దీంతో అది నిర్మించిన తర్వాత నిజంగా ఏం జరుగుతుందో తెలియట్లేదు.
- పి.వెంకట్‌రెడ్డి, పూడూరు గ్రామవాసి

వాగులో నలుగురి గల్లంతు

- బండి కింద పడి ఒకరు మృతి
- ఎడ్లబండి సహా కొట్టుకుపోయిన వైనం
- ముగ్గురిని కాపాడిన స్థానికులు


గాంధీ భార్యను ఒడ్డుకు తీసుకొస్తున్న స్థానికులు


గాంధీ (ఫైల్)

టేకులపల్లి: అకస్మాత్తుగా వచ్చిన వరద ప్రవాహంతో ఎడ్లబండిపై ఉన్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వాగులో కొట్టుకుపోగా ముగ్గురిని స్థానికులు కాపాడారు. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా టేకులపల్లి మండలం కొత్తతండా(పి) గ్రామానికి చెందిన ఆంగోతు గాంధీ(36) తన భార్య రజిత, తల్లిదండ్రులు లక్ష్మా - జమ్మతో కలసి ఎడ్లబండిపై పత్తి, మిర్చి తోటలకు ఎరువుల బస్తాలతో బుధవారం ఉదయం వెళ్లారు. ఆ సమయంలో మార్గమధ్యలోని లక్ష్మీపురం వాగులో ప్రవాహం పెద్దగా లేదు. అయితే, సాయంత్రం పొలంలో పనులు ముగించుకుని ఇంటికి బయల్దేరారు. ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో వాగులో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. వరద ధాటికి ఎడ్లబండి అదుపు తప్పి వాగులో కొట్టుకుపోయింది. ఆ క్రమంలోనే బండి తిరగబడిపోగా గాంధీ కింద భాగంలో ఇరుక్కుపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వాగులోకి దిగి గాంధీ భార్య, తల్లిదండ్రులను ఒడ్డుకు చేర్చినా గాంధీ మాత్రం ఊపిరాడక మృతి చెందాడు. రెండు ఎడ్లలో ఒకటి గల్లంతైంది. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి గాంధీ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం కొత్తతండా(పి)కి వెళ్లి గాంధీ కుటుంబసభ్యులను పరామర్శించి కొంత ఆర్థిక సాయం అందజేశారు.

హక్కుల కోసం మహిళలు పోరాడాలి: విమలక్క



పాలకుర్తి టౌన్: హక్కుల కోసం మహిళలు పోరాడాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు, ప్రజా గాయని విమలక్క కోరారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం మంచుప్పుల గ్రామంలో బుధవారం నిర్వహించిన బహుజన బతుకమ్మ వేడుకల్లో ఆమె మాట్లాడారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను శిక్షించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ఇలాంటి సంఘటనలు దేశంలో రోజూ పదుల సంఖ్యలో జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అకృత్యాలను అడ్డుకునేందుకే బహుజన బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శభాష్

వృద్ధ జంటకు పోలీసులే అయినవారు



మైలార్‌దేవ్‌పల్లి: అయిదుగురు సంతానం ఉన్నా తల్లిదండ్రుల పోషణను పట్టించుకోకపోవడంతో పోలీసులే ఆ వృద్ధ దంపతులకు అయినవారయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం మాసన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, నర్సమ్మ దంపతులు ముసలి వారు కావడంతో కన్న పిల్లలు పట్టించుకోకుండా ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. దీంతో వీరు హైదరాబాద్ బస్సెక్కి ఆరాంఘర్‌లో దిగారు. దిక్కుతోచని స్థితిలో గగన్‌పహాడ్ అండర్‌పాస్ బ్రిడ్జి క్రింద తలదాచుకుంటున్నారు. తినడానికి తిండిలేక దీన స్థితిలో ఉన్న వీరిని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్సై రాజేందర్, హోంగార్డులు చిరంజీవి, శివకుమార్ చూసి ఆరాతీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంకటయ్య, నర్సమ్మలకు భోజనం పెడ్తూ కొడుకులకు కబురు పంపించగా...వారు సరిగ్గా స్పందించలేదు.

కమ్మగూడలో మా'స్టార్లు'

తుర్కయాంజాల్: ప్రతినెలా జీతాలు తీసుకుంటూ కూడా పాఠాలు చెప్పేందుకు ఆసక్తి చూపని టీచర్లు కొందరైతే... బడినే దేవాలయంగా భావిస్తూ పిల్లల భవిష్యత్ కోసమే తపించేవారు మరికొందరు. ఈ కోవలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ ఇద్దరు స్కూల్ టీచర్లు. రంగారెడ్డి జిల్లా కమ్మగూడ ఏకోపాధ్యాయ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న మస్కు జంగయ్య బుధవారం పెయింటర్ అవతారమెత్తారు. వెలిసిపోయిన స్కూల్ గోడలకు రంగు వేసేందుకు పెయింటర్‌ను సంప్రదించగా రూ.3 వేలు అడగటంతో తానే స్వయంగా రంగంలోకి దిగి బడికి రంగులు వేశారు. విరిగిపోయిన తలుపు స్థానంలో సొంత డబ్బులు ఖర్చుచేసి ఆదర్శంగా నిలిచారు. కాగా, పాఠశాలకు చెందిన 1,725 గజాల స్థలాన్ని అన్యాక్రాంతం చేసేందుకు కొంతమంది ప్రయత్నించగా.. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు భూపతిదాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన జస్టిస్ అలోక్ ఆరాధే, జె.అనిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం సమగ్ర విచారణకు ఆదేశించింది. అప్పటివరకూ ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోని అధికారులు హుటాహుటిన వచ్చి స్కూల్ స్థలాన్ని సర్వే చేయించారు. వెంటనే ప్రహరీ నిర్మించి ఆక్రమణను అడ్డుకున్నారు.





బెంగాలీ స్పెషల్

ఇక్కడ దసరా మామూలుగా ఉండదు

దసరా పండుగ దేశమంతా ఒక తీరున... బెంగాల్‌లో ఒక తీరున జరుగుతుంది. కోల్‌కతాలోని కుమార్‌తులి అనే వాడ అంతా దుర్గ విగ్రహాల తయారీ, కొనుగోళ్లతో కోలాహలంగా మారుతుంది. పురుషులతో పాటు స్త్రీలు కూడా విగ్రహాలు తయారు చేస్తారు. బెంగాలీల నవ రూప దుర్గలుగా కనిపించడానికి అక్కడ సెలబ్రిటీలు ఉవ్విళ్లూరుతారు. ఒక టీవీ చానెల్ స్పెషల్ షో కోసం ముస్తాబైన నవరూప దుర్గలు వీరు... ఆ అవతారాల పేర్లు, ఇతర బెంగాల్ దసరా విశేషాలు...

2024లో బెంగాల్‌లో దుర్గ పూజ వల్ల జరిగే సృజనాత్మకత ఆర్థిక లావాదేవీల అంచనా ఎంతో తెలుసా? 50 వేల కోట్లు. సృజనాత్మక ఆర్థిక లావాదేవీలు అంటే? దుర్గ విగ్రహాల తయారీ, మంటపాల ఏర్పాటు, అలంకరణ, వినోద కార్యక్రమాలు, పూజా సామగ్రి, భోజనాలు, పబ్లిసిటీ సామగ్రి, స్పాన్సర్‌షిప్‌లు, యాడ్‌లు, పుస్తకాల ప్రచురణ... ఇవన్నీ 50 వేల కోట్ల మేరకు జరుగుతాయి. పశ్చిమ బెంగాల్‌లోని ప్రతి కుటుంబం ఈ వేడుకల్లో పాల్గొంటుంది. కోల్‌కతా అంతా 3000కు పైగా దుర్గ మంటపాలు వెలుస్తాయి. హైదరాబాద్‌లో గణపతి మంటపాల్లాగే కోల్‌కతాలో అతి పెద్ద విగ్రహాలు పెట్టడానికి కూడా జనం ఉత్సాహపడతారు. నవరాత్రుల్లో నగరం నలుమూలలా పూజలు జరుగుతుంటే ప్రత్యేకంగా కోటి రూపాయల ఖర్చుతో జరిగే పూజలు కనీసం 200 ఉంటాయని గణాంకాలు చెబుతున్నాయి. అందుకే దసరా అంటే బెంగాల్ బెంగాల్ అంటే దసరా.

17వ శతాబ్దం నుంచి

దుర్గ పూజ ఒకప్పుడు బెంగాల్‌లో జమీందారుల పండగగా ఉండేది. అయితే 1610లో సబర్ణ రాయ్ చౌదరి అనే జమీందారు కుటుంబం ప్రజల మధ్యలో తెచ్చి దుర్గ పూజ వేడుకలు మొదలెట్టింది. ఆ తర్వాత జమీందార్లు, శ్రీమంతులు కోల్‌కతాలో దుర్గపూజ ఆర్భాటంగా చేయసాగారు. 1910లో కోల్‌కతాలో కొద్దిమంది సామాన్యులు చందాలు వేసుకొని మొదటి దుర్గా మంటపాన్ని నవరాత్రుల్లో మొదలెట్టారు. దాంతో జనం పోగయ్యి వాడవాడల దుర్గ మంటపాలు స్థాపించుకునే ఆనవాయితీ వచ్చింది. అయితే 1985లో ఆసియన్ పెయింట్స్ వారు కోల్‌కతాలోని దుర్గ మంటపాల్లో ఉత్తమమైన వాటికి బహుమతులు ఇవ్వడం ప్రారంభించే సరికి ఇక పోటాపోటీ మొదలయ్యి సృజనాత్మకంగా ఒకరికి మించి ఒకరు దుర్గ మంటపాలను విస్తృతం చేయసాగారు. ఆ తర్వాత కోల్‌కతాలోని ఎన్నో సంస్థలు నేడు దుర్గ మంటపాలకు అవార్డులు ఇస్తున్నాయి.





డాక్టర్ స్వప్న - ప్రముఖ గైనకాలజిస్ట్, 2015 వైద్య రత్న అవార్డు గ్రహీత. వైద్యసేవలు, మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లో గైనిక్ సొసైటీ ద్వారా కౌన్సెలింగ్‌తో మహిళలను శక్తిమంతం చేస్తూ వారిలో నిరంతరం స్ఫూర్తి నింపుతున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా రోజుకొక ప్రముఖ మహిళతో ముఖాముఖి
సాక్షి డిజిటల్ యూ ట్యూబ్‌లో...
https://www.youtube.com/watch?v=QlZTxhywjIA

స్త్రీల పండుగ

దుర్గ అంటే శక్తి. దసరా అంటే మహిళా శక్తికి ప్రతీక. అందుకే బెంగాల్‌లో స్త్రీలు దసరాను చాలా విశేషంగా జరుపుకుంటారు. ఈ పండగ రోజుల్లో ఎర్రంచు ఉన్న తెల్లచీర, ఎర్రగాజులు, కుంకుమ బొట్టుతో కళకళలాడతారు. నవ రాత్రుల్లో చివరి రోజు వీరంతా 'పుట్టింటికి వచ్చిన దుర్గమ్మ తిరిగి అత్తవారింటికి వెళ్లిపోతున్న' సందర్భంగా 'సిందూర్ ఖేలా' అనే ఆటను ఆడతారు. వివాహితలు ఒకరికి ఒకరు కుంకుమ బొట్టు పెట్టుకుని ఆనందిస్తారు. ఇలా చేస్తే తమ సౌభాగ్యం చెక్కు చెదరదని భావిస్తారు.

కుమార్ తులిలో విగ్రహాలు

మనకు ధూల్‌పేట ఉన్నట్టుగానే కోల్‌కతాలో కుమార్ తులి అనే ప్రాంతంలో దుర్గ విగ్రహాలు తయారవుతాయి. సంవత్సరం అంతా ఇక్కడ విగ్రహాలు తయారు చేస్తూనే ఉంటారు. ప్రతి బొమ్మను విలక్షణంగా తీర్చిదిద్దడమే కాదు ఆ విగ్రహానికి అమర్చే దుస్తులు, నగలు కూడా ప్రత్యేకంగా తీర్చిదిద్దుతారు. ఒక్కో విగ్రహం పది వేల నుంచి రెండు–మూడు లక్షల వరకూ ఉంటుంది. కుమార్ తులిలో చిన పాల్, నమితా పాల్, మాలా పాల్, కోకిలా పాల్ అనే నలుగురు అక్కచెల్లెళ్లు దుర్గ విగ్రహాల తయారీలో పేరు గడించారు.

నవ దుర్గలు

విగ్రహాలతో పాటు సెలబ్రిటీలు కూడా ఈ సందర్భంగా దుర్గ అవతారాలను ధరించి వివిధ షోలలో పాల్గొంటూ ప్రేక్షకులకు ఉత్సాహం కలిగిస్తారు. జీ బెంగాలీ చానల్ ఈ సంవత్సరం తమ సీరియల్స్‌లో నటించే నటీమణుల చేత నవ దుర్గల పాత్రలు ధరింప చేసి అందరినీ ఆకట్టుకుంది. బెంగాల్ వారు నవరాత్రుల సందర్భంగా మొదటి రోజు నుంచి చివరి రోజు వరకూ ఆవిష్కరించే నవ దుర్గలు వరుసగా మొదటి రోజు– శైలి పుత్రి, రెండోరోజు– బ్రహ్మచారిణి, మూడోరోజు – చంద్ర ఘంట, నాలుగోరోజు– కూష్మాండ, ఐదవరోజు – స్కందమాత, ఆరవ రోజు– కాత్యాయని, ఏడవ రోజు – కాళీ, ఎనిమిదవరోజు– మహిషాసుర మర్దిని, తొమ్మిదవ రోజు – సిద్ధిధాత్రి.

కిరణ్ రావు

మహిళ తనలోని ఖాళీలను కనుక్కోవాలి



'జెండర్‌ని కాదు పితృస్వామ్య వ్యవస్థను సవాల్ చేసేలా సినిమా తీయాలనుకున్నాను' అన్నారు చిత్ర నిర్మాత, స్క్రీన్ రైటర్, దర్శకురాలు కిరణ్‌రావు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో బుధవారం జరిగిన 'మంథన్ సమ్‌వాద్' చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు ఆమె. ఇటీవల ఆమె దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్' భారతదేశం నుంచి ఆస్కార్‌కి అధికారికంగా నామినేట్ అయింది. ఓటీటీ వేదికగా ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్న కిరణ్‌రావు 'ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను' అంటూనే జెండర్ దృష్టి కోణం నుంచి ఎన్నో విషయాలను ఈ వేదిక ద్వారా పంచుకున్నారు.

''మహిళలు తమలో అంతర్గతంగా ఉండే ఖాళీలను కనుక్కోవాలనే ఆలోచనను 'లాపతా లేడీస్' చిత్రం ద్వారా చెప్పే ప్రయత్నం చేశాను. ఇది నా రెండవ చిత్రం. జెండర్ తేడా లేకుండా అందరి నుంచి మంచి ఆదరణ లభించడం ఎంతో సంతోషంగా ఉంది.

మెరుగైన కృషి


మహిళల కోసం వారి ఆలోచనల్లో మార్పు తీసుకువచ్చే కథనాలు చాలా రావాలి. ఈ విషయంలో రచనల పరంగా కొంత లోటుగానే ఉంది. ఈ లోటును భర్తీ చేయడానికి చేసిన ప్రయత్నం మంచి ఫలితాన్నిచ్చింది. నా మొదటి సినిమా 'ధోబీ ఘాట్' నుంచి చాలా నేర్చుకున్నాను. ఆ వర్క్ నెక్ట్స్ సినిమాను మరింత మెరుగ్గా మార్చింది. కొత్త నటీనటులను గుర్తించి, వారిని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే ప్రక్రియ వెనక చాలా కృషి ఉంది. ఈ సినిమాకి యాభై శాతం ఆడవాళ్లు, యాభై శాతం మగవారు పనిచేశారు.

ఆడ-మగ .. వేరుగా చూడను

ఆడవాళ్ల మానసిక వేదనలు, వారికి సంబంధించిన సమస్యలు చాలా సెన్సిటివ్‌గా ఉంటాయి. అయితే, మగవారికి సంబంధించినవి కూడా అంత కన్నా సెన్సిటివ్‌గా ఉండటం చూస్తుంటాం. నేను ఆడ–మగ అని జెండర్ ప్రకారంగా వీళ్లు తక్కువ, వాళ్లు ఎక్కువ అని చెప్పలేను. మగవాళ్లు కూడా మహిళల కోణం నుంచి సెన్సిటివ్ విషయాలను రాయగలరు, చిత్రాలు తీయగలరు. మొన్నామధ్య వచ్చిన 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్'ను స్త్రీ కోణం నుంచి పురుష దర్శకుడే మనకు పరిచయం చేశారు. నేను ఒంటరితల్లిగా నా కొడుకును పెంచుతున్నాను. తల్లిగా వాడి మనోభావాలను కూడా గమనిస్తుంటాను కాబట్టి 'సెన్సిటివిటీ' ఇద్దరికీ ఒకేలా వర్తిస్తుంది. ఆడ–మగ అనే ఆలోచనతో కాకుండా మానవత్వం అనే కోణం నుంచే చూస్తాను.

ఫెమినిజం మెరుపు

'లాపతా లేడీస్' అని టైటిల్ చూసి ఫెమినిజం ఫైర్ ఉంటుంది కాబోలు అనుకోలేరు. కానీ, దాని తాలూకు ఒక మెరుపు కనిపిస్తుంది. అందువల్ల మగవారి నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. ఈ సినిమా కథనం పితృస్వామానికి విరుద్ధమే కానీ ఒక జెండర్‌కు మాత్రమే సంబంధించింది కాదు. నేను వివాహ వ్యవస్థకు అస్సలు వ్యతిరేకం కాదు. నిజానికి పెళ్లయినా, కుటుంబంలో అయినా సరే స్త్రీలు తమలోని ఖాళీలను కనుక్కొనేలా ప్రోత్సహించే విధంగా ఈ కథను చెప్పాలనుకున్నాను. అంతేకానీ ఏదో భారీ విప్లవాన్ని తీసుకొచ్చి సంబంధాలను విచ్ఛిన్నం చేయాలనుకోలేదు."



పితృస్వామ్యాన్ని సవాల్ చేస్తూ!

మహిళల కోణం నుంచి చూస్తే ముఖ్యంగా అమ్మాయిలకు వారి కలలను సాధించుకునే విషయంలో మన దగ్గర కొన్ని నిబంధనలు ఉన్నాయి. అందుకు ప్రధానమైనది మన పితృస్వామ్య వ్యవస్థ. ఆడపిల్ల సొంతంగా ఎదగడం కన్నా, పెళ్లి చేసేస్తే బాధ్యత తీరుతుంది అనుకుంటారు. ఆ కోణం నుంచి ఈ 'లాపతా లేడీస్' కథను చూపించాం. ఇద్దరు నవ వధువులు, భర్తలతో అత్తవారింటికి రైలులో బయల్దేరుతారు. మేలి ముసుగులు నిండా కప్పుకున్న వధువులు ఒక స్టేషన్‌లో దిగాల్సినది మరోచోట దిగుతారు. వాళ్లిద్దరిని ఇళ్లలోని వారు వెతుకుతుంటారు. ఎవరి కంటా పడకుండా ఒక వధువు తనకై తానుగా ఒక కొత్త ప్రపంచాన్ని ఏర్పరుచుకుంటుంది. మరొక వధువు చుట్టూ ఉన్న పితృస్వామ్యాన్ని సవాల్ చేస్తుంది. బరువైన సామాజిక సమస్యలను ప్రస్తావించినప్పటికీ, హాస్యాన్ని కూడా నేర్పుగా జత చేయడంతో అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని మధ్యప్రదేశ్, మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరించాం. వివాహం చేసుకోబోయే యువతులైనా, చదువుకోవడానికి చేసే ప్రయత్నమైనా వాళ్లు ఎదుర్కొనే అనేక రకాల పరిస్థితులు, కొత్త మార్గాన్ని అన్వేషించడానికి, సమస్యలను పరిష్కరించుకునే తీరు ఆలోచింపజేస్తుంది. మహిళలు వయసు పైబడినవారయినా సరే... మగవారిపైన ఆధారపడకుండా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొందాలి. అందుకు తగిన నైపుణ్యాలను పెంచుకోవాలి'' అని అన్నారు.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: **ఎస్.ఎస్.ఠాకూర్**

సురక్ష



హలో... హెల్ప్ చేస్తారా?

ఆమె ఆగ్రా ఏసిపి అర్ధరాత్రి 12 తర్వాత రైల్వేస్టేషన్ దగ్గర నిలబడి హెల్ప్‌లైన్‌కు కాల్ చేసింది 'ఒంటరి ప్రయాణికురాలిని... హెల్ప్ చేస్తారా?' అని. పోలీసులు ఎలా స్పందించారు? మహిళల రక్షణ విషయంలో పోలీసు అధికారుల ఇలాంటి ప్రయత్నాలు ఎలాంటి హెచ్చరికలు పంపుతాయి?

రెండు మూడు రోజుల క్రితం. ఆగ్రాలోని రైల్వేస్టేషన్ దగ్గర ఒక మహిళ నిలుచుని ఉంది. తెల్ల షర్టు, బ్లాక్ జీన్స్ ధరించి ఉంది. చేతిలో చిన్న బ్యాగ్ ఉంది. అప్పటికి రాత్రి ఒంటి గంట. ఉత్తర ప్రదేశ్ హెల్ప్‌లైన్ 112కు కాల్ చేసింది. 'నేను ఒంటరి ప్రయాణికురాలిని. ట్రెస్ మిస్ అయ్యాను. నాకు సాయం చేయగలరా?' అని అడిగింది. అవతలి వైపు పోలీసుల స్పందన ఎలా ఉంటుందో చూసింది. ఆ పోలీసులు వెంటనే స్పందించారు. 'మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి లేదా ఏదైనా జనం ఉండే చోట ఉండండి. మా వాళ్లు మీ కాంటాక్ట్‌లోకి వస్తారు' అని చెప్పారు. మరికొన్ని క్షణాల్లోనే మరో ఫోన్. 'మేం బయలుదేరాం. మీ లైవ్ లొకేషన్ పెట్టండి' అని. 'భేష్. మీరు రానక్కర్లేదు. నేను ఆగ్రా ఏసీపీ సుకన్య శర్మను' అని ఫోన్ పెట్టేసింది.

ఆ తర్వాత ఆటోను పిలిచింది. ఎక్కడకు వెళ్లాలో చెప్పి ఆటో ఎక్కింది. 'డ్రైవర్ భయ్యా... ఒంటరి మహిళలు ఈ టైమ్‌లో ఆటో ఎక్కడం సేఫేనా' అని అడిగింది. ఆటోడ్రైవర్ 'ఏం పర్లేదమ్మా. పోలీసులు ఆటోడ్రైవర్‌ల అన్ని వివరాలు తీసుకుంటున్నారు. ఖాకీ షర్ట్ లేకుండా డ్రైవింగ్ చేయవద్దంటున్నారు. మీకేం ఇబ్బంది లేదు' అని ఆమె కోరిన చోట దించాడు. అప్పుడు ఆమె తానెవరో చెప్పి 'స్త్రీలు మెచ్చే విధంగా ఉన్నావు. ఇలాగే అందరూ వ్యవహరించాలి' అని అభినందించింది.

పూర్వం ఎలా పాలన జరిగేదో చూడటానికి రాజులు మారు వేషాలు వేసేవారు. ఇలా అధికారులు కూడా సామాన్యుల్లా వ్యవహరించి తిరిగితే లోపాలు తెలిసి సమస్యలు దృష్టికి వచ్చి స్త్రీలకు మరింత రక్షణ ఏర్పాట్లు చేయవచ్చు. భేష్ సుకన్య మేడమ్.

చక్కెర తగ్గిస్తే... మేని మెరుపు!



చర్మం చాలాకాలం యౌవనంగా ఉండాటంటే... చక్కెర తక్కువగా తీసుకోవాలి. మిసమిసలాడే మేనికీ, చర్మానికీ సంబంధం ఏమిటో తెలుసుకోవాలంటే చర్మాన్ని బిగుతుగా ఉంచే కొలాజెన్‌ను చక్కెర ఏం చేస్తుందో తెలియాలి. చక్కెరతో చేసిన తీపి పదార్థాలు ఎక్కువగా తినేవాళ్లలో అది చర్మాన్ని బిగుతుగా ఉంచేందుకు సహాయపడే కొలాజెన్‌ను దెబ్బతీస్తుందనీ, దాంతో మితిమీరి తీపి తినేవాళ్ల చర్మం తన బిగువును కోల్పోవడం, దాంతో వయసు కంటే ముందరే సాగినట్లుగా అయిపోవడం జరుగుతుందని అమెరికాకు చెందిన డార్ట్‌మౌత్ మెడికల్ స్కూల్ అధ్యయనవేత్తలు చెబుతున్నారు. అందుకే చాలాకాలం పాటు బిగువైన చర్మంతో యౌవనంగా కనిపించాలనుకునేవాళ్లు తీపి పదార్థాలు కాస్త తక్కువగా తీసుకోవడమే మేలు.

తరచూ తలనొప్పా... నివారణ ఇలా!!

● కంప్యూటర్‌పై పనిచేసేవారు కంటిపై ఒత్తిడి పడకుండా యాంటీ గ్లేర్ గ్లాసెస్ ధరించవచ్చు. అలాగే ప్రతి గంట తర్వాత కంప్యూటర్ తెరపై నుంచి చూపు తప్పించి కాసేపు రిలాక్స్ అవాలి ● కంప్యూటర్‌పై పని చేసేవారు అదేపనిగా కనురెప్ప కొట్టకుండా చూడటం సరికాదు ● కుట్లు, అల్లికలు వంటివి చేసేవారు, అత్యంత సూక్ష్మమైన సంక్లిష్టమైన (ఇంట్రికేట్) డిజైన్లు అల్లే సమయంలో అదేపనిగా పనిచేయకుండా తరచూ బ్రేక్ తీసుకుంటుండటం మంచిది ● తమకు సరిపడని పదార్థాలు తీసుకోవడం ఆపేయాలి ● ఘాటైన వాసనలకు దూరంగా ఉండాలి. సరిపడని పెర్‌ఫ్యూమ్స్‌ను వాడటం సరికాదు ● కాఫీ, చాకొలెట్స్, కెఫిన్ ఎక్కువగా పదార్థాలను ఎక్కువగా తీసుకోకూడదు. కెఫిన్ మోతాదులు ఎక్కువగా ఉండే కొన్ని రకాల శీతల పానియాలకు దూరంగా ఉండాలి ● ఫలానా అలవాటు తలనొప్పిని దూరం చేస్తుందనే అపోహతో (ఉదాహరణకు టీ, కాఫీ తాగడం వంటివి) పరిమితికి మించి తీసుకోవడం సరికాదు ● రణగొణ శబ్దాలకు ఎక్స్‌పోజ్ కాకుండా చూసుకోవాలి. పరిసరాలు ప్రశాంతంగా ఉండటం వల్ల తలనొప్పులు రాకుండా నివారించవచ్చు ● రోజూ కనీసం ఎనిమిది గంటలపాటు కంటినిండా నిద్ర పోవాలి. కొన్నిసార్లు నిద్ర మరీ ఎక్కువైనా తలనొప్పి వస్తుంది. కాబట్టి తమ సౌకర్యం మేరకు నిద్రపోవడం మంచిది. ఒకవేళ ఈ సూచనల తర్వాత కూడా తలనొప్పి వస్తుంటే డాక్టర్‌ను సంప్రదించాలి.



మన(సు)లో మాట

పాప భీతి పీడిస్తోంది..!

నా వయస్సు 33 సం॥లు. నాన్‌వెజ్ అంటే నాకు చాలా ఇష్టం. కానీ ఒక సంవత్సరం నుంచి నాన్‌వెజ్ పూర్తిగా మానేశాను. నాన్‌వెజ్ ఆహారం అంటే జంతువధ అని, వాటిని చంపడం, రక్తపాతం లాంటి దృశ్యాలు నా మనసులోకి పదే పదే రావడం వాటిని తప్పించడానికి నేను మాటి మాటికీ చేతులు కడగడం ఇల్లంతా శుభ్రం చేయడం, భర్తను పిల్లలను అనవసరంగా కోపగించుకోవడం వల్ల ఇంట్లో అందరూ చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య ఎందుకొచ్చిందో, దీంట్లోంచి ఎలా బయటపడాలో తెలియడంలేదు. దయ చేసి మీరేదైనా మార్గం చెప్పండి!

– ఎ. పార్వతి, హైదరాబాద్



జంతువధ గురించి ఆలోచించి, మీ ఆహారపు అలవాట్లను మార్చుకోవడం మీ ఉన్నతమైన ఆలోచనను తెలుపుతుంది. అయితే మీ ఇంట్లో మాంసాహారం వండినప్పుడు, జంతువధ, రక్తపాతం లాంటి దృశ్యాలు మీ మదిలో మెదిలి, వీటి నుండి బయట పడేందుకు, చేతులు అతిగా కడగడం, ఇంటిని శుభ్రం చేయడం, ఇదంతా పాపంగా భావిస్తూ, ప్రార్థనలు చేస్తూ, మనోవేదనకు గురి కావడం... ఇవన్నీ 'అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్' అనే ఒక మానసిక వ్యాధి లక్షణాలు. మెదడులోని 'న్యూరో ట్రాన్స్‌మీటర్స్' అనే రసాయనిక పదార్థాల సమతుల్యంలో తేడాలొచ్చినప్పుడు కొందరికి ఇలాంటి మానసిక రుగ్మత వస్తుంది. ఇదేదో మీ బలహీనత గానీ, తప్పు గానీ కానే కాదు. అలా అని మీరు బాధపడవద్దు. శరీరానికి జబ్బు చేసినట్లే మనసుకు కూడా జబ్బులొస్తాయని గుర్తించండి. ఈ ఒ.సి.డి జబ్బును పూర్తిగా నయం చేసేందుకు మంచి ఔషధాలున్నాయి. వాటితోపాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ' అనే ప్రత్యేక కౌన్సెలింగ్, 'ఆర్.టి.ఎమ్.ఎస్'అనే ప్రత్యేక అధునాతన పరికరాలతో చికిత్స చేసి, మీ బాధ నుంచి మిమ్మల్ని పూర్తిగా విముక్తులను చేయవచ్చు. మీకు దగ్గర్లోని సైకియాట్రిస్ట్‌ను వెంటనే కలవండి. ఆల్ ది బెస్ట్.



- డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు,సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

గ్లో పెరుగుతుంది!

● పెరుగు మంచి ఎక్స్‌ఫోలియేటర్. ఇందులోని లాక్టిక్ యాసిడ్ మృతకణాలను తొలగిస్తుంది. రోజూ రాత్రి పడుకునే ముందు టీ స్పూన్ పెరుగు తీసుకుని చర్మానికి పట్టించి వలయాకారంగా వేళ్లతో మర్దనా చేసి వేడి నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే ముఖం మీద పొరలా పట్టిన మురికి వదులుతుంది. దుమ్ముతో మూసుకుపోయిన చర్మరంధ్రాలు శుభ్రపడతాయి.
● చర్మం పొడిబారినట్లనిపిస్తే టీ స్పూన్ పెరుగు రాసి మర్దన చేసి గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి.
● వార్ధక్యం దగ్గరయ్యే కొద్దీ చర్మం సాగేగుణాన్ని కోల్పోవడంతో చర్మం జారిపోతుంటుంది. పెరుగు రాయడం వల్ల చర్మంలో సాగేగుణం బాగుటుంది. చర్మం బిగుతుగా, కాంతివంతంగా యవ్వనంగా ఉంటుంది.
● పెరుగులోని యాంటీబయాటిక్ సుగుణాలు యాక్నేను తగ్గిస్తాయి. డీ విటమిన్, ప్రొటీన్, ప్రో బయాటిక్‌లు చర్మానికి పోషణనిస్తాయి. పెరుగులో ఇవి కూడా ఉండడం వల్ల పెరుగు మంచి బ్యూటీప్రొడక్ట్. మార్కెట్‌లో దొరికే అనేకరకాల సాధనాలకు బదులు పెరుగును వాడడం మంచిది. శనగపిండి, తేనె వంటి పదార్థాలతో వేసుకునే ఫేస్‌ప్యాక్‌లలో కూడా పెరుగును చేర్చుకోవచ్చు.



● చర్మం పొడిబారి మంటగా అనిపిస్తే ఓ కప్పు పెరుగు తీసుకుని చర్మమంతటికీ పట్టించి ఐదు నిమిషాల తర్వాత స్నానం చేయాలి.
● పిల్లలకు చర్మం మీద దద్దుర్లు వచ్చినప్పుడు క్రీమ్‌లు రాయడానికి ముందు ఒకసారి పెరుగు రాసి చూడండి.
● పెరుగు దేహ ఆరోగ్యానికి మంచి ఔషధం మాత్రమే కాదు, చర్మానికి మంచి పోషకం కూడా. రోజూ పెరుగుతో మర్దన చేస్తుంటే చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు అందంగా మెరుస్తుంది. క్రమంగా తెల్లదనం సంతరించుకుంటుంది.

ఎవరిదో కిరీటం!

నేటి నుంచి మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ



టి20 వరల్డ్‌కప్ ట్రోఫీతో 10 జట్ల కెప్టెన్లు

- బరిలో మొత్తం 10 జట్లు
- మరోసారి ఫేవరెట్‌గా ఆస్ట్రేలియా
- ఆశల పల్లకిలో భారత్
- తొలి రోజు రెండు మ్యాచ్‌లు
- స్టార్ స్పోర్ట్స్, డిస్నీ హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ధనాధన్ ఫార్మాట్‌లో విశ్వ కిరీటం కోసం మహిళల క్రికెట్ జట్లు మహా సమరానికి సిద్ధమయ్యాయి. టి20ల్లో తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ఆస్ట్రేలియా... అందని ద్రాక్షగా ఊరిస్తున్న టైటిల్‌ను ఈసారైనా సొంతం చేసుకునేందుకు భారత్.. రెండోసారి విశ్వవిజేతగా నిలిచేందుకు ఇంగ్లండ్, వెస్టిండీస్... అంచనాలను తలకిందులు చేసి సంచలనం సృష్టించాలనే లక్ష్యంతో న్యూజిలాండ్... నేటి నుంచి మొదలయ్యే టి20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగనున్నాయి. 18 రోజుల పాటు సాగనున్న ఈ ప్రతిష్టాత్మక మెగా టోర్నీలో మొత్తం 10 జట్లు పోటీ పడనున్నాయి. గత ఏడాది దక్షిణాఫ్రికాలో జరిగిన వరల్డ్‌కప్‌లో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన టీమిండియా... ఈసారి అస్త్రశస్త్రాలతో సిద్ధమైంది. సుదీర్ఘ విరామం తర్వాత భారత పురుషుల జట్టు ఇటీవల టి20 ప్రపంచకప్ నెగ్గగా... ఇప్పుడు మహిళల జట్టు కూడా అలాంటి ఆటతీరుతోనే అదరగొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు!

దుబాయ్: క్రీడాభిమానులను అలరించేందుకు మహిళల టి20 ప్రపంచకప్ రూపంలో మరో మెగా ఈవెంట్‌కు నేడు తెర లేవనుంది. ఆరోసారి ట్రోఫీ చేజిక్కించుకున్న ఆస్ట్రేలియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతుండగా... తొలిసారి 'విశ్వ విజేత' హోదా దక్కించుకోవాలని భారత మహిళల జట్టు పట్టుదలతో ఉంది. ఇప్పటి వరకు జరిగిన 8 ప్రపంచకప్‌లలోనూ పాల్గొన్న టీమిండియా ఒక్కసారి (2020లో) రన్నరప్‌గా నిలిచింది. ప్రతిసారిలాగే ఈసారి కూడా భారత జట్టు భారీ అంచనాలతో బరిలో దిగనుంది. షెడ్యూల్ ప్రకారం ప్రపంచకప్‌నకు బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉండగా... ఆ దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో వేదికను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి మార్చారు. పోటీల్లో భాగంగా గురువారం తొలి రోజు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి పోరులో స్కాట్లాండ్‌తో బంగ్లాదేశ్... రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో శ్రీలంక తలపడతాయి. శుక్రవారం న్యూజిలాండ్‌తో పోరుతో హర్మన్‌ప్రీత్ బృందం టైటిల్ వేట ప్రారంభించనుంది.

ఎదురులేని ఆస్ట్రేలియా

2009లో తొలిసారి మహిళల టి20 ప్రపంచకప్ నిర్వహించారు. ఇప్పటి వరకు మొత్తం ఎనిమిదిసార్లు ఈ టోర్నీ జరిగింది. ఆస్ట్రేలియా రికార్డు స్థాయిలో ఆరుసార్లు (2010, 2012, 2014, 2018, 2020, 2023లో) విజేతగా నిలిచింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో స్టార్ ప్లేయర్లు అందుబాటులో ఉండటం... చివరి బంతి వరకు ఓటమిని ఒప్పుకోని తత్వం ఆస్ట్రేలియా జట్టును మిగిలిన వాటికంటే భిన్నంగా నిలిపింది. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో ఆస్ట్రేలియాపై అడపాదడపా విజయాలు సాధించిన ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, భారత్ వంటి జట్లు... వరల్డ్ కప్‌లో మాత్రం ఆసీస్ ముందు నిలువలేకపోతున్నాయి. గత టోర్నీలో ఆస్ట్రేలియా జట్టుకు మెగ్ లానింగ్ సారథ్యం వహించగా... తాజా టోర్నీలో అలీసా హీలీ జట్టును నడిపించనుంది. ఆష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, ఎలీస్ పెరీ, బెత్ మూనీ వంటి ప్లేయర్లతో ఆస్ట్రేలియా దుర్భేద్యంగా కనిపిస్తోంది. వీరంతా కలిసి కట్టుగా కదం తొక్కితే ఆసీస్ మరోసారి ట్రోఫీ చేజిక్కించుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, శ్రీలంకలతో కలిసి ఆస్ట్రేలియా గ్రూప్ 'ఎ'లో ఉంది.

ఇంగ్లండ్ మెరిపించేనా?

తొలి మహిళల ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన ఇంగ్లండ్ ఆ తర్వాత మరోసారి చాంపియన్ కాలేకపోయింది. మరో మూడుసార్లు (2012, 2014, 2018లో) ఫైనల్‌కు చేరినా... ఆస్ట్రేలియా అడ్డంకిని అధిగమించ లేకపోయింది. సోఫీ ఎకెల్‌స్టోన్, కెప్టెన్ హీతర్ నైట్, అలీస్ కాప్సీ, అమీ జోన్స్, నటాలియా బ్రంట్, డానీ వ్యాట్‌తో కూడిన ఇంగ్లండ్ జట్టు తమదైన రోజున ఎంతటి మేటి ప్రత్యర్థినైనా మట్టికరిపించగలదు. బంగ్లాదేశ్, స్కాట్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌తో కలిసి ఇంగ్లండ్ గ్రూప్ 'బి'లో పోటీపడనుంది. ఒక్కసారి కూడా చాంపియన్‌గా నిలవలేకపోయిన దక్షిణాఫ్రికా తొలిసారి ఐసీసీ ట్రోఫీ ముద్దాడాలని చూస్తోంది. 2009, 2010లలో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు. ఇక ఇటీవల మహిళల ఆసియాకప్‌లో భారత జట్టుకు షాక్ ఇచ్చి చాంపియన్‌గా అవతరించిన శ్రీలంక సంచలన ప్రదర్శన కొనసాగించాలని భావిస్తోంది.

హర్మన్ సేన సాధించేనా?

అంతర్జాతీయ క్రికెట్‌లో నిలకడైన విజయాలు సాధిస్తున్న భారత మహిళల జట్టుకు ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షలాగే ఊరిస్తోంది. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న టీమిండియా... మెగా టోర్నీల్లో విజేతగా నిలవలేకపోతోంది. గత ఎనిమిది టోర్నీల్లోనూ పాల్గొన్న భారత్ కేవలం ఒక్కసారి (2020లో) రన్నరప్‌తో సరిపెట్టుకుంది. భారత్‌ను పోలి ఉన్న యూఏఈలో టోర్నీ జరుగుతుండటం భారత్‌కు సానుకూలాంశం. ఇప్పటి వరకు జరిగిన ఎనిమిది ప్రపంచకప్‌లలోనూ ఆడిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై అంచనాల ఒత్తిడి అధికంగా ఉంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధానతో పాటు షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, దీప్తి శర్మ సమష్టిగా సత్తా చాటాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇటీవల జరిగిన ఆసియాకప్ ఫైనల్లో ఓటమి అనంతరం ప్రత్యేక శిబిరంలో ఫీల్డింగ్, ఫిట్‌నెస్‌పై మరింత సాధన చేసిన హర్మన్ ప్రీత్ బృందం ఈ టోర్నీ ఎలాంటి ప్రదర్శన చేస్తుందో వేచి చూడాలి!

మహిళల టి20 ప్రపంచకప్ షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
అక్టోబర్ 3	బంగ్లాదేశ్ x స్కాట్లాండ్	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 3	పాకిస్తాన్ x శ్రీలంక	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 4	దక్షిణాఫ్రికా x వెస్టిండీస్	దుబాయ్	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 4	భారత్ x న్యూజిలాండ్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 5	బంగ్లాదేశ్ x ఇంగ్లండ్	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 5	ఆస్ట్రేలియా x శ్రీలంక	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 6	భారత్ x పాకిస్తాన్	దుబాయ్	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 6	వెస్టిండీస్ x స్కాట్లాండ్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 7	ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 8	ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 9	దక్షిణాఫ్రికా x స్కాట్లాండ్	దుబాయ్	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 9	భారత్ x శ్రీలంక	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 10	బంగ్లాదేశ్ x వెస్టిండీస్	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 11	ఆస్ట్రేలియా x పాకిస్తాన్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 12	న్యూజిలాండ్ x శ్రీలంక	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 12	బంగ్లాదేశ్ x దక్షిణాఫ్రికా	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 13	ఇంగ్లండ్ x స్కాట్లాండ్	షార్జా	మ. గం. 3:30 నుంచి
అక్టోబర్ 13	భారత్ x ఆస్ట్రేలియా	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 14	పాకిస్తాన్ x న్యూజిలాండ్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 15	ఇంగ్లండ్ x వెస్టిండీస్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 17	తొలి సెమీఫైనల్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 18	రెండో సెమీఫైనల్	షార్జా	రాత్రి గం. 7:30 నుంచి
అక్టోబర్ 20	ఫైనల్	దుబాయ్	రాత్రి గం. 7:30 నుంచి

మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు

ముకేశ్ పసిడి గురి




లిమా (పెరూ): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగో రోజు భారత షూటర్లు ఐదు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సొంతం చేసుకున్నారు. పురుషుల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ కుర్రాడు ముకేశ్ నెలవల్లి రెండు పసిడి పతకాలు సాధించాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ వ్యక్తిగత విభాగంలో 585 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకోగా...సూరజ్ శర్మకు రజతం లభించింది. ముకేశ్, సూరజ్ శర్మ, ప్రద్యుమ్న సింగ్‌లతో కూడిన భారత జట్టుకు స్వర్ణం దక్కింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కే చెందిన దివాంశి టీమ్, వ్యక్తిగత విభాగాల్లో బంగారు పతకాలు నెగ్గింది. దివాంశి, తేజస్విని, విభూతి భాటియాలతో కూడిన భారత జట్టు పసిడి పతకాన్ని దక్కించుకుంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లో శౌర్య, వేదాంత్ నితిన్, పరీక్షిత్ సింగ్‌లతో కూడిన భారత జట్టుకు స్వర్ణం లభించిది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

క్రైమ్... థ్రిల్


● రానా

ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వర రావు మనవడు పరుచూరి సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టర్ సెలెబ్రిటీ'. వరలక్ష్మీ శరత్‌కుమార్, శ్రీ దీక్ష, నాజర్, రఘుబాబు ఇతర పాత్రల్లో నటించారు. చందిన రవికిశోర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఆర్‌పీ సినిమాస్ బ్యానర్‌పై ఎన్. పాండు రంగారావు, చిన్న రెడ్డయ్య నిర్మించారు. ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో రానా విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మిస్టర్ సెలెబ్రిటీ'. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో విలన్ ఎవరన్నది చూపించకుండా ట్రైలర్‌ను కట్ చేసిన విధానం దర్శకుని ప్రతిభను కనబరుస్తోంది'' అని చిత్రబృందం పేర్కొంది.

జోడీ రిపీట్


● పూజా హెగ్డే, విజయ్

'బీస్ట్' (2022) తర్వాత హీరో విజయ్, హీరోయిన్ పూజా హెగ్డే మరోసారి జంటగా నటించనున్నారు. విజయ్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వంలో కెవిన్ ప్రొడక్షన్స్ సంస్థ ఓ భారీ సినిమాను తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. విజయ్ కెరీర్‌లోని ఈ 69వ చిత్రం షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ నెల మొదటి వారంలోనే ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరుగుతాయని, చిత్రీకరణ కూడా ఇదే నెలలో ప్రారంభం కానుందని తెలిసింది. కాగా ఈ చిత్రంలో హీరోయిన్లుగా పూజా హెగ్డే, 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు నటించనున్నట్లు చిత్రయూనిట్ బుధవారం ప్రకటించింది. ఈ సినిమా వచ్చే ఏడాది అక్టోబరులో రిలీజ్ కానుంది.

వారం రోజులు అక్కర్లేదు!


● రజనీకాంత్

''ఖైదు చెయ్ ఖైదు చెయ్... నేరస్తుణ్ణి ఖైదు చెయ్... ఖైదు చెయ్ ఖైదు చెయ్... నేరస్తుణ్ణి ఖైదు చెయ్'' అంటూ మొదలవుతుంది 'వేట్టయాన్: ద హంటర్' సినిమా తెలుగు ట్రైలర్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వేట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, రితికా సింగ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'వేట్టయాన్' ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. 'ఈ దేశంలో ఆడపిల్లలకు భద్రత లేదు. కానీ పోరంబోకులకు బాగా భద్రత ఉంది', 'నేరస్తుణ్ణి వెంటనే పట్టుకోవాలి. అందుకు ఏ యాక్షన్ అయినా తీసుకోండి', 'ఒక వారంలో ఎన్‌కౌంటర్ జరిగిపోవాలి' (రావు రమేశ్), 'అక్కర్లేదు సార్... వారం రోజులు అక్కర్లేదు... మూడే రోజుల్లో డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు వస్తుంది' (రజనీకాంత్), 'కాలం విలువ తెలిసిన మనిషి మాత్రమే ఏదైనా సాధించగలడు' (రానా), 'న్యాయం అన్యాయం అయినప్పుడు న్యాయంతోనే సరిచేయాలి. అంతేకానీ... ఇంకో అన్యాయంతో కాదు' (అమితాబ్ బచ్చన్), 'నన్ను ఏ పోస్ట్‌లోకి తిప్పికొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్... నా నుంచి వాడిని కాపాడటం ఎవ్వరి వల్ల కాదు (రజనీకాంత్)' అన్న డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.

గెలవండి.. గెలిపించండి

\- శ్రీవిష్ణు


● టీజీ విశ్వప్రసాద్, రీతూ వర్మ, హసిత్ గోలి, శ్రీవిష్ణు, దక్షా నగార్కర్

''తెలుగు ప్రేక్షకుల ప్రోత్సాహం వల్లే మేం గెలుస్తుంటాం. ఈసారి ప్రేక్షకులను గెలిపించాలనుకుంటున్నాను. దాని కోసం ఎంతో కష్టపడ్డాం. నిజంగా మీకు మా 'శ్వాగ్' సినిమా నచ్చితే అభినందిస్తూ రెండు చప్పట్లు కొట్టండి చాలు. ఈ నెల 4న థియేటర్స్‌కి వచ్చి మీరు గెలిచి, నన్ను గెలిపిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణు, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'శ్వాగ్'. మీరా జాస్మిన్, దక్షా నగార్కర్ కీలక పాత్రలు పోషించారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''మా బ్యానర్‌కి 'గూఢచారి, ఓ బేబీ, కార్తికేయ 2' సినిమాలు చాలా పెద్ద సక్సెస్ ఇచ్చాయి. 'శ్వాగ్' కూడా అలాంటి సక్సెస్ ఇస్తుంది. ఈ మూవీలో శ్రీవిష్ణు నటన చూశాక కమల్‌హాసన్‌గారితో పోల్చుతారు'' అని తెలిపారు. ''శ్రీ విష్ణు, వివేక్ ఆత్రేయ సపోర్ట్‌తోనే ఈ ప్రయాణం కొనసాగిస్తున్నాను. 'రాజ రాజ చోర' సినిమా తర్వాత రెండో సినిమా 'శ్వాగ్'ని విశ్వప్రసాద్‌గారి నిర్మాణంలో చేయడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు హసిత్ గోలి.

అందులో నిజం లేదు!


● త్రిప్తీ డిమ్రి

'యానిమల్' మూవీ ఫేమ్ త్రిప్తీ డిమ్రి వివాదంలో చిక్కుకున్నారు. ఓ ఈవెంట్‌కి హాజరయ్యేందుకు డబ్బులు తీసుకుని, తీరా రాలేదని కొందరు మహిళా వ్యాపారవేత్తలు ఆరోపిస్తుండగా, ఆ వేడుకలో పాల్గొనేందుకు త్రిప్తి డబ్బులు తీసుకున్నారనే వార్తల్లో నిజం లేదని ఆమె వ్యక్తిగత సిబ్బంది స్పష్టం చేశారు. ఇంతకీ విషయం ఏంటంటే... జైపూర్‌కు చెందిన కొందరు మహిళా వ్యాపారవేత్తలు ఎఫ్ఐసీసీఐ ఎఫ్ఎల్ఓ ఆధ్వర్యంలో ఓ ఈవెంట్ ఏర్పాటు చేశారట. ఈ వేడుకకి త్రిప్తీ డిమ్రిని అతిథిగా ఆహ్వానించగా... హాజరు అయ్యేందుకు ఆమె రూ. 5.5 లక్షలు తీసుకున్నారట. ఈవెంట్ ప్రారంభానికి ఐదు నిమిషాల ముందు వరకు కూడా వస్తానని చెప్పడంతో ఏర్పాట్లు ఘనంగా చేశారట. తీరా త్రిప్తి రాకపోవడంతో నిర్వాహకులు, మహిళా వ్యాపారవేత్తలు మండిపడ్డారు. ఆమె ఫొటోపై నల్లని పెయింట్ రాసి, నిరసన వ్యక్తం చేశారు. ఆమె సినిమాలను బ్యాన్ చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై త్రిప్తీ డిమ్రి వ్యక్తిగత సిబ్బంది స్పందించారు. ''త్రిప్తీ డిమ్రి నటించిన 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ప్రస్తుతం ఆ చిత్రం ప్రమోషన్లలో భాగంగా ఇంటర్వ్యూలు, సినిమా ఫంక్షన్స్‌కి హాజరవుతూ తన బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. సినిమా ప్రమోషన్స్ మినహా వ్యక్తిగతంగా ఎలాంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. ప్రైవేటు ఈవెంట్స్‌కి హాజరయ్యేందుకు అడ్వాన్స్ లేదా డబ్బులు తీసుకోవడం లేదు. అలాగే జైపూర్ వేడుకలో పాల్గొనేందుకు ఎవరి వద్ద నుంచి డబ్బులు తీసుకోలేదు'' అని స్పష్టం చేశారు.

ఎన్టీఆర్ సరసన..?


● రుక్మిణీ వసంత్

హీరో ఎన్టీఆర్, కన్నడ హీరోయిన్ రుక్మిణీ వసంత్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే సమాధానమే ప్రస్తుతం ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా 19వ శతాబ్దం నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ అనుకుంటున్నారని, ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా కనిపిస్తారని గతంలో ప్రచారంలోకి వచ్చింది. తాజాగా రుక్మిణీ వసంత్ పేరు వినిపిస్తోంది. మరి... ఎన్టీఆర్ సరసన హీరోయిన్‌గా ఎవరు నటిస్తారు? అనేది తెలియాలంటే ఓ నెల రోజులు ఆగాల్సిందే. ఎందుకంటే ఈ సినిమా చిత్రీకరణను ఈ నెలాఖర్లో ప్రారంభిస్తారు. అయితే జనవరి నుంచి మాత్రమే ఎన్టీఆర్ ఈ షూటింగ్‌లో పాల్గొంటారట. సో... హీరో లేని సన్నివేశాలతో ఈ నెలాఖరు షూట్ ఆరంభమవుతుందని అనుకోవచ్చు. ఈ సినిమాను 2026 జనవరి 9న రిలీజ్ చేయాలనుకుంటున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది.

ఫణి... ఓ సవాల్

\- కేథరిన్



వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న తాజా సినిమాకి 'ఫణి' అనే టైటిల్ ఖరారు చేశారు. ఇందులో కేథరిన్ ట్రెసా లీడ్ రోల్ చేస్తున్నారు. ఏయు–ఐ స్టూడియో పద్మనాభరెడ్డి సమర్పణలో ఓఎంజీ ప్రొడక్షన్ హౌస్‌లో మీనాక్షి అనిపిండి ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్‌ని డా. తోటకూర ప్రసాద్ విడుదల చేయగా, నిర్మాత అనిల్ సుంకర బ్యానర్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీఎస్ ఆదిత్య మాట్లాడుతూ– ''కేథరిన్ లేకుంటే మా 'ఫణి' లేదు. ఆమె ధైర్యానికి అభినందనలు'' అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్, నిర్మాత డా. మీనాక్షి అనిపిండి మాట్లాడుతూ– ''ఫణి' ఇప్పటికే 50 శాతం షూటింగ్ పూర్తయింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మా సినిమాను విడుదల చేయబోతున్నాం'' అని తెలిపారు. ''నా కెరీర్‌లో చేస్తున్న చాలెంజింగ్ క్యారెక్టర్ 'ఫణి' సినిమాలోనిదే. ఓ మంచి థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం'' అని కేథరిన్ ట్రెసా చెప్పారు.

కథ కొత్తగా అనిపించింది

\- కె. రాఘవేంద్ర రెడ్డి



''కరోనా ప్యాండమిక్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడే వారి సంఖ్య పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. మన దేశంలో కూడా ఎక్కువగానే ఉన్నాయంటున్నారు. అయితే ఆత్మహత్య ప్రయత్నం చేసే వ్యక్తిని ఎవరైనా అడ్డుకుని, వారి ఆత్మహత్య ఆలోచనను దూరం చేస్తే బాగుంటుంది. ఈ పాయింట్‌తో 'కలి' కథను శివ శేషు రాసుకున్నాడు. కథ విన్నప్పుడు కొత్తగా అనిపించింది. అందుకే సమర్పకుడిగా వ్యవహరించాను'' అని అన్నారు కె. రాఘవేంద్ర రెడ్డి. ప్రిన్స్, నరేష్ అగస్త్య లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కలి'. శివ శేషు దర్శకత్వంలో కె. రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో లీలా గౌతమ్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో కె. రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ– ''జీవితంలోని సమస్యలను ఎదుర్కోలేక ఆత్మహత్య చేసుకుందామనుకున్న శివరాజ్ జీవితంలోకి ఓ అపరిచిత వ్యక్తి రావడం వల్ల ఏం జరిగింది? అన్నదే ఈ చిత్రకథ. ప్రస్తుతం నేను రెండు కథలు రాస్తున్నాను'' అని అన్నారు.

వినోదం... సందేశం


● వైష్ణవి, ప్రవీణ్, మౌనిక

ప్రవీణ్ కేవీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మహీష'. యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి, మౌనిక ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రవీణ్ కేవీ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్ కేవీ మాట్లాడుతూ– ''మా సినిమాలో మంచి సందేశంతో పాటు వినోదం ఉంది. ప్రేక్షకులు మా సినిమాని చూసి, ఆదరించాలని కోరుకుంటున్నాం'' అన్నారు. ''ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న ఘటనల అంశాలతో పాటు ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు 'మహీష'లో ఉంటాయి'' అని మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ వెంకట్ తెలిపారు. ''నటిగా ఈ సినిమా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు శ్రీలత. ''మహీష' చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చేలా ఉంటుంది'' అని నటీనటులు మౌనిక, విజయ్ రాజ్, పి. రమణా రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్, సతీష్.

సాక్షి బిజినెస్
గురువారం
3-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽ 33	84,266
నిఫ్టీ ▽ 14	25,796

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,944	△	33
డోజోన్స్	42,186	△	29
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,291	△	14
డాక్స్	19,165	▽	48
షాంఘై సోమవారం ముగింపు	3,337	△	249
నికాయ్	37,809	▽	843

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.96	85.64
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.90	114.80
€	యూరో	ఎస్‌బీఐ	91.20	95.69
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.71	60.55
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.00	67.69
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.45	23.00
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.92	23.71
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.06	12.89

బుల్లి ఎస్‌యూవీలు.. భలే జోరు!

అమ్మకాల్లో టాప్ గేరు... / దూసుకుపోతున్న టాటా పంచ్, హ్యుందాయ్ ఎక్స్‌టర్ / బ్రెజా, వెన్యూ, నెక్సాన్ లకూ భారీ డిమాండ్ / హ్యాచ్‌బ్యాక్స్ సేల్స్ తగ్గుముఖం

దేశంలో స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీల) క్రేజ్ ఓ రేంజ్‌లో ఉంది! ఒకపక్క, కార్ల అమ్మకాల్లో మందగమనం నెలకొన్నప్పటికీ.. మైక్రో ఎస్‌యూవీలు మాత్రం దుమ్మురేపుతున్నాయి. కస్టమర్లు చిన్న కార్లు/హ్యాచ్‌బ్యాక్‌ల నుంచి అప్‌గ్రేడ్ అవుతుండటంతో వాటి సేల్స్ అంతకంతకూ తగ్గుముఖం పడుతున్నాయి. మరోపక్క, చిన్న ఎస్‌యూవీల సెగ్మెంట్ తగ్గేదేలే అంటూ టాప్ గేర్‌లో దూసుకుపోతోంది!


– సాక్షి, బిజినెస్ డెస్క్

గత కొంత కాలంగా దేశంలో ప్యాసింజర్ కార్ల అమ్మకాలు స్లో ట్రాక్‌లో వెళ్తున్నాయి. డీలర్ల వద్ద నిల్వలు పేరుకుపోతుండటంతో కంపెనీలు భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తూ వాటిని ఎలాగైనా వదిలించుకునేందుకు నానాతిప్పలు పడాల్సి వస్తోంది. అయితే, చిన్న ఎస్‌యూవీలు దీనికి మిన హాయింపు. హాట్ కేకుల్లా సేల్ అవుతూ దేశీ మార్కెట్లో అవి భారీ వాటాను కొల్లగొడుతున్నాయి. రూ.10 లక్షల వరకు ధర ఉన్న మైక్రో ఎస్‌యూవీలకు డిమాండ్ ఓ రేంజ్‌లో ఉంది. ముఖ్యంగా హ్యుందాయ్ ఎక్స్‌టర్, టాటా పంచ్ ఈ సెగ్మెంట్లో టాప్ లేపుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో (2024–25, ఏప్రిల్–జూలై) వీటి అమ్మకాలు 72 శాతం దూసుకెళ్లగా... మొత్తం దేశీయ ప్యాసింజర్ వాహన విక్రయాల్లో కేవలం 1.8 శాతం వృద్ధి మాత్రమే నమోదు కావడం దీనికి నిదర్శనం. ఈ నాలుగు నెలల్లో 1,75,350 (11 శాతం వృద్ధి) చిన్న ఎస్‌యూవీలు అమ్ముడవడం విశేషం. మరోపక్క, చిన్నకార్లు/హ్యాచ్‌బ్యాక్స్ సేల్స్‌లో 17 శాతం (69,936 యూనిట్లు) తగ్గుదల నమోదైంది. చిన్న ఎస్‌యూవీల కేటగిరీలోకి ఎక్స్‌టర్, పంచ్‌తో పాటు కాంపాక్ట్ మోడల్స్ అయిన మారుతీ బ్రెజా, హ్యుందాయ్ వెన్యూ, టాటా నెక్సాన్ ఎంట్రీ వేరియంట్లు ఉంటాయి.

క్యూ కడుతున్న కంపెనీలు...

ఈ సెగ్మెంట్ శరవేగంగా దూసుకుపోతుండటంతో ఇతర కార్ల దిగ్గజాలు సైతం ఇందులోకి అడుగుపెట్టేందుకు తహతహలాడుతున్నాయి. కియా మోటార్స్ తన తొలి మైక్రో ఎస్‌యూవీ 'క్లావియా'ను తీసుకొచ్చే ప్లాన్‌లో ఉండగా.. హ్యుందాయ్ మరో కాంపాక్ట్ ఎస్‌యూవీ 'బేయాన్'తో మార్కెట్ షేర్‌ను మరింత పెంచుకోవాలనుకుంటోంది. మారుతీ సుజుకీ ఫ్రాంక్స్‌తో ఈ విభాగంలో పోటీ పడుతోంది. ఇక ఫోక్స్ వ్యాగన్ గ్రూప్ కంపెనీ స్కోడా సైతం వచ్చే ఏడాది ఆరంభంలో తొలి కాంపాక్ట్ ఎస్‌యూవీ కైలాక్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఈ సెగ్మెంట్‌లోకి దూకనుంది. ప్రస్తుతం మైక్రో ఎస్‌యూవీల విభాగంలో పంచ్, ఎక్స్‌టర్ హవా కొనసాగుతుండటంతో మారుతీ కూడా ఈ విభాగంపై కన్నేసింది. కాంపాక్ట్ ఎస్‌యూవీ బ్రెజా కంటే తక్కువ ధరలో ప్రత్యేకంగా కొత్త మోడల్‌ను మారుతీ రూపొందిస్తోందని, రెండేళ్లలో రోడ్డెక్కనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఏప్రిల్-జూలై మధ్య రూ.10 లక్షల వరకు రేటున్న ప్యాసింజర్ వాహన విక్రయాలకు సంబంధించి విభాగాల వారీగా మార్కెట్ వాటా (%)





మారుతున్న ట్రెండ్...

హ్యాచ్‌బ్యాక్స్, సెడాన్ కార్లతో పోలిస్తే మరింత విశాలమైన స్పేస్, దృఢమైన రూపంతో ఆకర్షణీయంగా ఉండటంతో దేశంలో ఎస్‌యూవీల క్రేజ్ కేకపుట్టిస్తోంది. దీనికి తోడు ఎంట్రీ లెవెల్ మైక్రో ఎస్‌యూవీలు అందుబాటు ధరల్లో లభిస్తుండటం వల్ల గ్రామీణ కొనుగోలుదారులు కూడా వీటికే సై అంటున్నారని, దీంతో చిన్న ఎస్‌యూవీలకు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. 'ఈ ఏడాది అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విభాగంగా మైక్రో ఎస్‌వీయూల సెగ్మెంట్ అవతరించింది. ధర విషయానికొస్తే ఎక్స్‌టర్ వంటి చిన్న ఎస్‌యూవీలు కొన్ని హ్యాచ్‌బ్యాక్‌లతో సమానమైన ధరకే లభిస్తున్నాయి. దీనికితోడు పరిశ్రమలో తొలిసారిగా సన్‌రూఫ్, డాష్‌క్యామ్, 6 ఎయిర్ బ్యాగ్‌ల వంటి వినూత్న ఫీచర్లు చిన్న ఎస్‌యూవీల్లోనూ ఉండటం కూడా కస్టమర్లు వీటి వెంట పడటానికి మరో ప్రధాన కారణం. నచ్చిన ఫీచర్లు, డిజైన్ ఉంటే రేటెక్కువైనా కొనేందుకు వెనుకాడటం లేదు' అని హ్యుందాయ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ పేర్కొన్నారు. 2024 తొలి 8 నెలల్లో మైక్రో ఎస్‌యూవీల సేల్స్ 86% దూసుకెళ్లగా... మొత్తం ఎస్‌యూవీ విభాగం విక్రయాల వృద్ధి 19 శాతంగా ఉంది.

ఎస్‌బీఐ విస్తరణ బాట

ఈ ఏడాది 600 బ్రాంచీలు జత



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ విస్తరణపై దృష్టి పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం(2024–25)లో దేశవ్యాప్తంగా 600 బ్రాంచీలను ప్రారంభించే ప్రణాళికల్లో ఉంది. వృద్ధి చెందుతున్న బిజినెస్‌లపై ప్రధానంగా దృష్టిపెట్టి ఈ ఏడాది బ్రాంచీలను భారీగా విస్తరిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. చాలావరకూ రెసిడెన్షియల్ కాలనీలను ఎస్‌బీఐ కవర్‌చేయలేదని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీంతో బ్రాంచీల ఏర్పాటుతో బిజినెస్ విస్తరణకు తెరతీయనున్నట్లు తెలియజేశారు. గతేడాది ఎస్‌బీఐ 137 బ్రాంచీలను జత చేసుకుంది. 2024 మార్చికల్లా 22,542 బ్రాంచీలను కలిగి ఉంది.



- దలాల్ స్ట్రీట్ రికార్డు ర్యాలీ ప్రభావం
- భారీగా పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబై: దలాల్ స్ట్రీట్ రికార్డు ర్యాలీతో ఇన్వెస్టర్లకు లాభాల పంట పండింది. ఈ ఏడాది గడిచిన తొమ్మిది నెలల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.110.57 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ. 474.86 లక్షల కోట్లకు చేరింది. ''భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి బలమైన పనితీరు కనబరచడంతో పాటు దేశంలోని ద్రవ్య లభ్యత ఈక్విటీ మార్కెట్ల జైత్రయాత్రకు దోహదపడ్డాయి. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వెల్లువెత్తాయి. చిన్న, మధ్య తరహా సూచీలు అద్భుతమైన పనితీరు కనబరిచాయి. పలు స్టాకులు మల్టీబ్యాగర్లుగా మారి ఇన్వెస్టర్లకు సిరుల పంట పండించాయి'' అని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు సెన్సెక్స్ సూచీ 12,026 పాయింట్ల ర్యాలీ చేసింది. సెప్టెంబర్ 27న 85,978 వద్ద సరికొత్త రికార్డు నమోదు చేసింది. అదే రోజున ఇన్వెస్టర్ల సంపద రూ.477.93 లక్షల కోట్లతో జీవితకాల గరిష్టాన్ని తాకింది. ఇదే సమయంలో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 12,645 పాయింట్లు (34.32%), స్మాల్‌క్యాప్ 4,777 పాయింట్లు(34.62%) లాభపడ్డాయి. 'అమెరికా ఎన్నికలు, భౌగోళిక రాజకీయ అస్థిరతల కారణంగా స్టాక్ మార్కెట్ స్వల్ప కాలం పాటు దిద్దుబాటుకు లోనుకావచ్చు. కొన్ని కీలక రంగాల్లో ధరల వారీగా కరెక్షన్ చోటు చేసుకోవచ్చు. అయితే విపరీత ద్రవ్య లభ్యత ప్రభావంతో రంగాలవారీగా, స్టాక్ ఆధారిత కొనుగోళ్లకు అవకాశం ఉంది' అని స్టాక్ నిపుణులు చెబుతున్నారు.

సంపద పెరిగిందిలా..

2014 నవంబర్ 14	రూ.100 లక్షల కోట్లు
2021 ఫిబ్రవరి 4	రూ.200 లక్షల కోట్లు
2023 జూలై 5	రూ.300 లక్షల కోట్లు
2024 ఏప్రిల్ 8	రూ.400 లక్షల కోట్లు
2024 సెప్టెంబర్ 27	రూ.477.93 లక్షల కోట్లు (జీవితకాల గరిష్ఠ స్థాయి)

ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుతో పాటు ఆర్‌బీఐ కూడా అదే పంథా అనుసరించవచ్చనే అంచనాలతో ఇటీవల వారాల్లో అనూహ్య ర్యాలీ నెలకొంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.., ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియ ప్రారంభం భారత్ వంటి వర్ధమాన దేశాలకు కలిసొస్తుంది.

– ప్రశాంత్ తాప్సే, మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్

కాయం చూర్ణ ప్రచారకర్తగా కికు షర్దా



ముంబై: ఆయుర్వేద కంపెనీ 'కాయం చూర్ణ' తమ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ సినీ నటుడు కికు షర్దాను నియమించింది. అజీర్తి, మలబద్ధక సమస్యలను కాయం చూర్ణం సమర్థవంతంగా ఎదుర్కొంటుందని షర్దా తెలిపారు. 'జీర్ణ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగించి లక్షల మంది విశ్వాసం సంపాదించాం. కంపెనీ ఉత్పత్తులైన చూర్ణం, గ్రాన్యుల్స్, ట్యాబ్లెట్లు అన్ని వయస్సుల వారికి ఉపయోగపడతాయి' అని కంపెనీ వ్యవస్థాపకులు మోహిత్ సేథ్, వేదాంత్ సేథ్, ఫలక్ సేథ్ చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గ్లోబల్ మార్కెట్లలో బ్రాండ్ ఇండియాకు ప్రమోషన్ | ఐపీవోల సందడే సందడి

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

టీచర్ కొలువుకు మార్గం.. సీటెట్

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. సీటెట్‌గా సుపరిచితం! సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)జాతీయ స్థాయిలో.. నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష!! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. సీబీఎస్ఈ, ఎన్‌సీటీఈ, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలల్లో.. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టే అవకాశం లభిస్తుంది! తాజాగా సీటెట్-2024 డిసెంబర్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీటెట్ వివరాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» సీటెట్ డిసెంబర్-2024 నోటిఫికేషన్ విడుదల
» సీబీఎస్ఈ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహణ
» ఉత్తీర్ణత సాధిస్తే.. ఉపాధ్యాయ కొలువులకు అర్హత
» సీబీఎస్ఈ పాఠశాలల్లో బోధనకు సీటెట్ తప్పనిసరి

ఎన్‌సీటీఈ నిబంధనలు

నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచింగ్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం– ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనుకునే వారికి పాఠశాల స్థాయి, కేటగిరీతో సంబంధం లేకుండా బీఈడీ, డీఈడీ, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్)తోపాటు.. సీటెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి. దీంతో సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ వంటి వాటిలో అడుగు పెట్టాలంటే ముందుగా సీటెట్‌లో అర్హత పొందాలి.

సీటెట్.. రెండు పేపర్లు

- సీబీఎస్ఈ సీటెట్ పరీక్షను రెండు పేపర్లుగా (పేపర్-1, పేపర్-2) నిర్వహిస్తారు.
- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునే వారు పేపర్-1కు హాజరు కావాలి.
- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్ అభ్యర్థులు పేపర్-2లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరై ఉత్తీర్ణత సాధించాలి.
- ఈ పేపర్లు రాసేందుకు నిర్దేశిత విద్యార్హతలు కలిగుండాలి.

అర్హతలు

- **పేపర్-1:** ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత ఉండాలి.
- **పేపర్-2:** బీఏ/బీఎస్సీ/బీకామ్‌లలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) (లేదా) నాలుగేళ్ల బీఏ ఎడ్యుకేషన్/బీఎస్సీ ఎడ్యుకేషన్‌లలో ఉత్తీర్ణత ఉండాలి (లేదా) నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీలలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి (లేదా) బీఈ/బీటెక్‌లో 50 శాతంతో ఉత్తీర్ణత సాధించి బీఈడీ /బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



సీటెట్ డిసెంబర్ -2024

పేపర్-1కు 150 మార్కులు

ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునే వారికి నిర్వహించే పేపర్-1 పరీక్ష అయిదు విభాగాల్లో 150 మార్కులకు ఉంటుంది. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులు, మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు-30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

పేపర్-2 ఇలా:

- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించేందుకు అర్హతగా నిర్దేశించిన పేపర్-2ను రెండున్నర గంటల వ్యవధిలో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులు, మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులు, సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులు, లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-2, 30 ప్రశ్నలు-30 మార్కులకు ఉంటాయి.
- రెండు పేపర్లలోనూ లాంగ్వేజ్-1 విభాగంలో అభ్యర్థులు తాము ఏ మీడియంలో బోధించాలనుకుంటున్నారో ఆ మాధ్యమంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- పేపర్-2లో రెండో విభాగానికి మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచింగ్ అభ్యర్థులు, మూడో విభాగానికి సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్‌ను ఎంచుకుని పరీక్ష రాయాలి.

కనీస అర్హత మార్కులు

సీటెట్ పేపర్-1, పేపర్-2లలో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు పొందాలనే నిబంధన ఉంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో(90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో(70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో (60 మార్కులు) అర్హత పొందాలి.

జీవిత కాల గుర్తింపు

సీటెట్‌లో ఉత్తీర్ణత పొందితే ఆ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు కల్పించే విధానం అమలవుతోంది. దీంతో ఒకసారి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎప్పుడైనా టీచర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

రాత పరీక్షలో రాణించేలా



చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

ఈ విభాగంలో బోధన, అభ్యసనాలకు సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం -నాయకత్వం-గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి చదవాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి.

లాంగ్వేజ్ పేపర్లు

అభ్యర్థులు తాము బోధించాలనుకునే భాషలో నిర్వహించే లాంగ్వేజ్-1 విభాగంలో రాణించేందుకు.. అదేవిధంగా లాంగ్వేజ్-2 పేపర్‌లో మంచి మార్కులకు ఆయా భాషా విభాగాలకు సంబంధించి స్కూల్ స్థాయిలో సబ్జెక్ట్ పుస్తకాలను చదవాలి. లాంగ్వేజ్-2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్

పేపర్-1లో ఈ సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై ఒకటి నుంచి నుంచి అయిదో తరగతి స్థాయిలో.. పేపర్-2లో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపైనే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలోనూ ఉండే అవకాశముంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఈ విభాగంలో రాణించేందుకు బోటనీ బేసిక్స్‌తోపాటు, పర్యావరణం, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్-2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కొంత క్లిష్టంగానే అడిగారు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

సోషల్ స్టడీస్

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను అధ్యయనం చేయాలి. వాతావరణ, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన పరిణామాలతో అప్‌డేట్ చేసుకోవాలి.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు చివరి తేదీ:** 2024,అక్టోబర్ 16
- **దరఖాస్తు సవరణ అవకాశం:** అక్టోబర్ 21 నుంచి 25 వరకు
- **సీటెట్ పరీక్ష తేదీ:** 2024, డిసెంబర్ 15
- **ఫలితాల వెల్లడి:** జనవరి 2025
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ctet.nic.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌బీలో 14,298 టెక్నీషియన్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో టెక్నీషియన్ గ్రేడ్-1, టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14,298.
» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్(ఓపెన్ లైన్)-1,092, టెక్నీషియన్ గ్రేడ్-3(ఓపెన్ లైన్)-8,052, టెక్నీషియన్ గ్రేడ్-3(వర్క్‌షాప్ అండ్ పీయూఎస్)-5,154.

అర్హతలు:

» **టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్:** బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా (ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **టెక్నీషియన్ గ్రేడ్-3:** మెట్రిక్యులేషన్/ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ లేదా 10+2(ఫిజిక్స్, మ్యాథ్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18 నుంచి 36 ఏళ్లు, టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 నుంచి 15 ఏళ్ల వయసు సడలింపు ఉంటుంది.
» **ప్రారంభ వేతనం:** నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200, టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(సీబీటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** టెక్నీషియన్ గ్రేడ్-1 పోస్టులకు మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. జనరల్ అవేర్‌నెస్(10 ప్రశ్నలు-10 మార్కులు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(15 ప్రశ్నలు-15 మార్కులు), బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్స్ అండ్ అప్లికేషన్స్(20 ప్రశ్నలు-20 మార్కులు), మ్యాథమేటిక్స్(20 ప్రశ్నలు-20 మార్కులు), బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(35 ప్రశ్నలు-35 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం-90 నిమిషాలు.
» టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. మ్యాథమేటిక్స్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ సైన్స్(40 ప్రశ్నలు-40 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(10 ప్రశ్నలు-10 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.10.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 17.10.2024 నుంచి 21.10.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://rrbapply.gov.in/

ఐసీఏఆర్-ఎన్ఆర్‌సీబీలో 11 అప్రెంటిస్‌లు

తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)కు చెందిన నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా(ఎన్ఆర్‌సీబీ) అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 11. –శిక్షణ కాలం: ఒక సంవత్సరం.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-05, టెక్నీషియన్ అప్రెంటిస్-06.
» **విభాగాలు:** కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అగ్రికల్చర్, హార్టికల్చర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ (బీఎస్సీ /బీసీఏ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000. టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.8000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, సర్టిఫికేట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2024.
» **వెబ్‌సైట్:** https://nrcb.icar.gov.in/







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
గురువారం । 3-10-2024



సెప్టెంబర్ మొదటివారంలో కుండపోత వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో లక్ష ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ తేల్చింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో అధికంగా నష్టం జరిగిందని అంచనా వేసింది. వాస్తవానికి రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాలకు పైగా పంటనష్టం జరిగిందని స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా, వ్యవసాయశాఖ మాత్రం అందులో నాలుగో వంతే నష్టం జరిగిందని తేల్చడంపై విమర్శలు వస్తున్నాయి. పంట నష్టానికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదిక త్వరలో ప్రభుత్వానికి పంపిస్తామని అధికారులు చెబుతున్నారు.

- సాక్షి, హైదరాబాద్



పంటనష్టం లక్ష ఎకరాల్లోనే..

గత వరదలు, వర్షాలకు జరిగిన నష్టం ఇది

సీఎం 4.15 లక్షల ఎకరాల్లో నష్టమని పేర్కొంటే...

వ్యవసాయశాఖ అందులో నాలుగో వంతుకు తగ్గించింది

సాధారణ నష్టానికి ఎకరాకు రూ.10 వేలు... ఇసుకమేట వేస్తే అదనంగా సాయం

భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల్లో పంట పొలాలు మునిగాయి. ఖమ్మం వంటి చోట్ల ఊహించని వరదలు వచ్చాయి. ఆ సమయంలో వేసిన అంచనా ప్రకారమే రాష్ట్రంలో దాదాపు 15 లక్షల ఎకరాల వరకు పంటలు మునిగిపోయాయి. ఆ తర్వాత పొలాల నుంచి వరదనీరు బయటకు రావడం, చాలా పంటలు కోలుకోవడంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. సీఎం రేవంత్ సహా మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు నష్ట పరిహారం ఇస్తామని చెప్పారు. ఆ మేరకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేశారు. అయితే పంట నష్టం 33 శాతానికి మించి జరిగితేనే లెక్కలోకి తీసుకుంటామని, ఆ ప్రకారమే పరిహారం చెల్లిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. 33 శాతానికిపైగా నష్టం జరిగింది లక్ష ఎకరాల్లోనేనని అంటున్నారు.ఇదిలాఉంటే..లక్ష ఎకరాల్లో దాదాపు 25 వేల ఎకరాల వరకు పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయని తేల్చారు. సాధారణ పంటనష్టం జరిగిన ఎకరాకు రూ. 10 వేల చొప్పున ప్రభుత్వం సాయం చేస్తుందని, ఇసుక మేట వేస్తే ఇంకా అదనంగా సాయం అందుతుందని వ్యవసాయశాఖ అధికారి ఒకరు తెలిపారు.

33 శాతానికిపైగా నష్టం జరిగితేనే..

పలు జిల్లాల్లో చేతికొచ్చిన పంటలు తడిసిపోయాయి. పెసర పంట పెద్ద ఎత్తున తడవగా, పత్తి కాయల్లోకి నీరు చేరింది. దీంతో ఆయా పంటల దిగుబడి తగ్గి లేదా నాసిరకంగా ఉంది. అనేక పంటలు కూడా రంగు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నాసిరకంగా లేదా రంగు మారిన పంటలను కొనుగోలు చేసే విషయంపై ఇప్పటికీ వ్యవసాయశాఖ నిర్ణయం తీసుకోలేదు. ఉదాహరణకు పెసర దెబ్బతిన్నా దాన్ని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. నాణ్యమైన పెసరనే కొంటామని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలంటున్నారు.

తడిసిన పంటల పరిస్థితి ఏంటి?

పంట నష్టం జరిగినప్పుడు బీమా రైతులకు ధీమా ఇస్తుంది. ఈ వానాకాలం సీజన్ నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అందుకు కేంద్రం నుంచి కూడా అనుమతి లభించింది. అనంతరం సీఎం రేవంత్ కూడా ఆమోదం తెలిపారు. అయినా మార్గదర్శకాలు విడుదల చేయడంలోనూ, అమలు చేయడంలో విఫలమైంది. అయినా ఇప్పటి వరకు ఈ ప్రక్రియ టెండర్ వరకు వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. సీఎం ఆమోదం తర్వాత అమలు చేస్తే, ఇప్పటికే బీమా అమలులోకి వచ్చేది. ఇంత పెద్దఎత్తున నష్టం జరిగినప్పుడు రైతులకు పెద్దఎత్తున బీమాతో ప్రయోజనం జరిగి ఉండేది. కానీ వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు ఉన్నాయి. వచ్చే యాసంగి సీజన్‌లోనైనా అమలు చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు.

సీఎం ఆమోదించినా అతీగతీలేని పంటల బీమా


రాజకీయం కోసం ఈటల దిగజారుతున్నారు

- కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు ఇప్పించిన తర్వాత ఆయన ఏదైనా మాట్లాడాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: రాజకీయ అవసరాల కోసం మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ రోజురోజుకు దిగజారిపోతున్నారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తన వ్యక్తిత్వాన్ని చంపుకుని మరీ ఈటల మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎల్పీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...పార్టీ అధ్యక్ష రేసులో ముందుండే లక్ష్యం కారణంగా ఈటల నోటికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రిని సైకో, శాడిస్ట్ అని మాట్లాడి తనస్థాయిని తగ్గించుకుంటున్న ఈటల సైకోలా ఆనంద పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ దేశంలో శాడిస్టులు ఎవరో సైకోలెవరో ప్రజలందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వరద సాయం రూ.10 వేల కోట్లు అడిగితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది రూ.416 కోట్లు అని, ముందు కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి నిధులు తెచ్చి అప్పుడు ఈటల మాట్లాడాలన్నారు.

'నిజాంపేట' కమిషనర్‌కు ముందస్తు బెయిల్



సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారంటూ నమోదైన కేసులో నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రెండు వారాల సమయం ఇస్తున్నామని, ఆలోగా పోలీసుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. రూ.20 వేల పర్సనల్ బాండ్, ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని స్పష్టం చేసింది. అనంతరం నిందితుడిని విడుదల చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతి శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య 8 వారాలపాటు లేదా అభియోగ పత్రం దాఖలు చేసేదాకా పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని స్పష్టం చేసింది. హైడ్రా ఫిర్యాదుతో సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసులో నిజాంపేట మున్సిపల్ కమిషనర్ సి.రామకృష్ణారావుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది నిజాంపేట పరిధిలోని ఎర్రకుంట బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మాణాలకు అనుమతించారని హైడ్రా ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ కమిషనర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ రామకృష్ణారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు. మున్సిపాలిటీ హెచ్‌ఎండీఏ పరిధిలో ఉందని, అక్కడ వెయ్యి గజాల్లోపు స్థలాలకే అనుమతులు మంజూరు చేసే అధికారం పిటిషనర్‌కు ఉందని ఆయన తరపు న్యాయవాది పేర్కొన్నారు. అంతకు మించితే హెచ్‌ఎండీఏ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని, సర్వే నంబర్ 40, 48 ఎర్రకుంట పరిధిలో ఉందని కమిషనర్ చెప్పారన్నారు. ఆయన లేఖ మేరకు అథారిటీ అధికారులు మ్యాప్స్ ఇన్‌ఫ్రాకు నోటీసులు జారీ చేశారని, వారు హైకోర్టును ఆశ్రయించి అధికారులు జోక్యం చేసుకోరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకున్నారని వివరించారు. పిటిషనర్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారని, ఈ మేరకు దర్యాప్తు జరుగుతోందని ఏపీపీ రామచంద్రారెడ్డి వాదించారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేయరాదని విజ్ఞప్తి చేశారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. హెచ్‌ఎండీఏ నోటీసులు జారీ చేయడానికి పిటిషనర్ లేఖ రాయడమే కారణమని అభిప్రాయపడ్డారు. అన్ని అంశాలను పరిశీలించి పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేశారు.







బతుకమ్మ పండుగ వేళ బుధవారం హైదరాబాద్ నగరంలోని ప్రధాన పూల మార్కెట్లన్నీ కొనుగోళ్లు, అమ్మకాలతో సందడిగా మారాయి. పెద్దసంఖ్యలో కొనుగోలుదారులు పూలను కొనుగోలు చేశారు. హైదరాబాద్ మొజాంజాహీ మార్కెట్‌లో పూల అమ్మకాల దృశ్యం.



గాంధీభవన్‌లో లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదిరులు

లాల్ బహదూర్‌కు సీఎం నివాళి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ రఘువీర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



గాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలో నివాళులు అర్పిస్తున్న తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఇతర సిబ్బంది

కొండా సురేఖ వ్యాఖ్యలకు ఖండన

క్షమాపణలు చెప్పాలి



నా కుటుంబాన్ని, సమంతను ఉద్దేశించి, అమర్యాదగా ఓ మంత్రి మాట్లాడిన మాటలు విని నేను షాక్ అయ్యాను. ఆ మాటల్లో ఏ మాత్రం నిజం లేదు. అయినా రాజకీయ ప్రత్యర్థుల గురించి మాట్లాడేటప్పుడు, వారికి సంబంధం లేని ఇతర వ్యక్తులను బాధపెట్టేలా మాటలు ఉండకూడదు. ఈ తరహాగా రాజకీయాల్లోకి లాగకూడదు. అభ్యంతరకరమైన అలాంటి ప్రవర్తనను మనం ఖండించాలి. మంత్రి తన స్టేట్‌మెంట్‌ను వెనక్కు తీసుకుని, క్షమాపణలు చెప్పాలి

- నటుడు సుశాంత్

ఆమె మాట్లాడింది కరెక్ట్ కాదు



రంగస్థలం సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేశా. 365 రోజులు.. ప్రతిరోజూ సమంత మేడంని దగ్గరగా చూసిన ఒక అభిమానిగా చెప్తున్నా. సమంత మేడం తెలుగు సినిమా ఇండస్ట్రీకి దొరికిన వరం. ఒక ఆర్టిస్ట్ గానే కాదు , ఒక వ్యక్తి గా కూడా తను మా ఇంట్లో అక్కలా అనిపించేవారు. నాకు సురేఖ గారి గురించి కానీ, సమంత మేడం గురించి కానీ మాట్లాడే అర్హత లేదు. కానీ సురేఖ గారు మాట్లాడింది మాత్రం కరెక్ట్ కాదు.

- దర్శకుడు శ్రీకాంత్ ఓదెల

తిరుమల వెంకన్నకు గద్వాల ఏరువాడ జోడు పంచెలు

- బ్రహ్మోత్సవాల మొదటిరోజు, విజయదశమి రోజు స్వామివారికి అలంకరణ
- 41 రోజులుగా నిష్ఠతో పంచెలు నేసిన కార్మికులు
- గద్వాల సంస్థానాధీశుల కాలం నుంచి ఆనవాయితీ
- ఇటీవల టీటీడీ అధికారులకు అందజేత



గద్వాల టౌన్: గద్వాల సంస్థానాధీశుల కాలం నుంచి తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు నేత కార్మికులు నియమ నిష్ఠలతో తయారు చేసిన గద్వాల ఏరువాడ జోడు పంచెలను అందజేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. నాటినుంచి వస్తున్న ఈ ఆనవాయితీ మేరకు గద్వాలలో చేపట్టిన శ్రీవారి ఏరువాడ జోడు పంచెల నేత ఇటీవల పూర్తయింది. అక్టోబర్ 3వ తేదీ నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు జరిగే దసరా బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు శ్రీవారి అలంకరణకు గద్వాల ఏరువాడ జోడు పంచెలను ధరింపజేస్తారు. గద్వాల సంస్థానాధీశురాలు శ్రీలతాభూపాల్ లేఖను తీసుకొని పంచెల తయారీ నిర్వాహకుడు మహంకాళి కర్ణాకర్ ఇటీవల తిరుపతి వెళ్లారు. అక్కడ ఏరువాడ జోడు పంచెలను టీటీడీ అధికారులకు అందజేశారు. నలుగురు చేనేత కార్మికులు 41 రోజులుగా నిష్ఠతో శ్రీవారి ఏరువాడ జోడు పంచెలను తయారు చేశారు.

గద్వాల రాజుల వారసత్వంగా పంచెల సమర్పణ..

శతాబ్దాలుగా గద్వాల సంస్థానాధీశులు తమ వంశ పెద్దల ఆచారంగా శ్రీ వెంకటేశ్వరునికి ఏటా బ్రహ్మోత్సవాలకు గద్వాల ఏరువాడ జోడు పంచెలను అందజేస్తారు. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వెంకటేశ్వరుడికి ఉత్సవాల మొదటి రోజు, విజయ దశమి రోజున ఈ ఏరువాడ పంచెలను మూలవిరాట్‌కు ధరింపజేస్తారు. గద్వాల సంస్థానాధీశులలో ఒకరైన రాజు సీతారాంభూపాల్ తన వంశస్తుల ఇష్టదైవమైన శ్రీవెంకటేశ్వరునికి పంచెలను సమర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి శ్రీవారికి అందుతున్న ఏకైక కానుక ఏరువాడ జోడు పంచెలు కావడం విశేషం.

ఒక్కొక్క పంచె తయారీకి 20 రోజులు..

ఏరువాడ పంచెలు 11 గజాల పొడవు, రెండున్నర గజాల వెడల్పు, 15 అంగుళాల వెడల్పుతో అంచు ఉంటుంది. శ్రీవారికి సమర్పించే ఈ పంచెలపై ఎనిమిది కోటకొమ్మలు ఉంటాయి. ఒక్కొక్క పంచె తయారీకి దాదాపు 20 రోజుల సమయం పడుతుంది. జోడు పంచెలను లింగంబాగ్ కాలనీలో ప్రత్యేకంగా నిర్మించిన మగ్గంపై నలుగురు నేత కార్మికులు ప్రత్యేక నిష్ఠ, భక్తి శ్రద్ధలను పాటిస్తూ సిద్ధం చేశారు. ఏరువాడ పంచెల తయారీలో కార్మికులు గద్దె మురళి, సాక సత్యన్న, దామర్ల షణ్ముఖరావు, మ్యాడం రమేశ్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది



తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా గద్వాల సంస్థానాధీశులు అందించే ఏరువాడ జోడు పంచెలను మూలవిరాట్‌కు ధరింపజేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. 14 ఏళ్లుగా నా నివాసంలో ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు గర్వపడుతున్నాం. ఈ సేవలో గద్వాల నేత కార్మికులు పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాం. జోడు పంచెలను ఇటీవల టీటీడీ అధికారులకు అందజేశాం.

– మహంకాళి కర్ణాకర్, జోడు పంచెల తయారీ నిర్వాహకుడు

సారె తిరిగితేనే సాపాటు

- డి.సత్యనారాయణమూర్తి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

కడుపుకింత తిండి దొరకాలంటే సారె తిరగాల్సిందే. గ్రామీణ జీవనంలో ఒక వెలుగు వెలిగిన కుమ్మరి కులవృత్తి ఆధునికకాలంలో స్టీల్, ప్లాస్టిక్ వస్తువులతో పోటీపడలేక రోజురోజుకీ అంతరించిపోతోంది. కులవృత్తిని వదులుకోలేని కొందరు చాలీచాలని ఆదాయంతో నెట్టుకొస్తున్నారు. విజయనగరం రింగురోడ్డు కుమ్మరివీధిలో ఓ వృద్ధుడు మట్టితో పాత్ర తయారుచేస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.



తిరుపతికి బహ్మోత్సవ శోభ

- క్రిష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

బ్రహ్మండనాయకుని బ్రహ్మోత్సవాలకు తిరుమల సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ప్రధాన కూడళ్లన్నీ విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అలిపిరి సర్కిల్‌ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం



మహాత్ముని స్మరణలో..

- విజయక్రిష్ణ సాక్షి ఫొటో గ్రాఫర్, నెల్లూరు

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన వేడుకల్లో గాంధీజీ వేషధారణలో ఉన్న చిన్నారికి వందనం చేస్తున్న కళాకారులు.



ఉపమాక వెంకన్న బ్రహ్మోత్సవాలు

నేడు అంకురార్పణ



నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి ఆలయం బ్రహ్మోత్సవ శోభను సంతరించుకుంది. ఈ నెల 3 నుంచి స్వామివారి వార్షిక బ్రహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా కన్యా సంక్రమణంలో నిర్వహించే ఈ వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు 12 రోజులు పాటు జరగనున్నాయి. 12న సాయంత్రం ఉత్సవాలు పూర్తి అయిన తర్వాత ధ్వజావరోహణ కార్యక్రమం ఉంటుంది. అదేరోజు రాత్రి స్వామివారి ఆస్థాన మండపంలో ద్వాదశ తిరువారాధన, విశేషప్రసాద నివేదన, తీర్థగోష్టి నిర్వహించడంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

పురందేశ్వరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి

ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్

సాక్షి, అమరావతి: 'తిరుమల లడ్డూ ప్రసాదాల విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కనీస ఇంగితజ్ఞానం లేకుండా అత్యున్నత న్యాయస్థానాన్ని, న్యాయమూర్తులను తప్పు పడుతూ వారి ప్రతిష్టకు భంగం కలిగించేలా అగౌరవపరుస్తూ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం. కోర్టు ధిక్కారం... ఆమెపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.' అని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ పక్ష నాయకుడు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'పురందేశ్వరి మొత్తం మీద సుప్రీంకోర్టుదే తప్పు అని తేల్చారు. చంద్రబాబు రాజ్యాంగ పదవిలో ఉన్నాడు కాబట్టి ఆయన ఏదైనా అనొచ్చంట... ఏమమ్మా! మరి న్యాయవ్యవస్థ కూడా రాజ్యాంగ వ్యవస్థే కదా! తమరికి తెలియదా? అంత చిన్న విషయానికే న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేస్తారా? అని చిరాకు పడిపోయారు పురందేశ్వరి. ఆమెది భావాతీతమైన ఆవేదన అనుకోవాలి మరి. కోర్టులు, దేవుడి కంటే చంద్రబాబే గొప్పవాడు అన్నట్లుంది పురందేశ్వరి వైఖరి. ఈ వందేళ్లలో తిరుమల ఆలయానికి నారా, నందమూరివారు చేసిన డ్యామేజీ మరి ఎవరూ చేయలేదు. ఇంకెన్ని ఘోరాలు చూడాలో గోవిందా... గోవిందా.. లడ్డూ ప్రసాదాల విషయంలో చంద్రబాబు హిందువుల మనోభావాలను దెబ్బతీయటమే కాకుండా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారు.' అని విజయసాయిరెడ్డి మండిపడ్డారు.


ఏపీలో 'చెర'వులు.. 2,032!



చెరువుల సంఖ్యతో పాటు ఆక్రమణల్లోనూ అగ్రస్థానం రాష్ట్రానిదే..

- కబ్జా కోరల్లో 3,920 నీటి వనరులు
- రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లకు సైతం తప్పని ఆక్రమణల బెడద
- కేంద్ర జల్ శక్తి శాఖ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో అత్యధికంగా చెరువులున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.. అత్యధికంగా చెరువులు ఆక్రమణలకు గురైన రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశే అని కేంద్ర జల్ శక్తి శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తం 1,13,425 చెరువులను పరిశీలించగా.. వాటిలో 2,032 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని తెలిపింది. దేశంలో నీటి వనరులపై మొదటి సారిగా కేంద్ర జల్ శక్తి శాఖ విస్తృతంగా అధ్యయనం చేసింది. 2018–19లో ప్రారంభమైన ఈ అధ్యయనం రెండేళ్ల పాటు కొనసాగింది. ఇటీవల అధ్యయనం వెల్లడైన అంశాలపై నివేదిక విడుదల చేసింది. రాష్ట్రంలో చెరువులతో పాటు కుంటలు, రిజర్వాయర్లు, సరస్సులు(లేక్‌లు), చెక్‌డ్యామ్‌లు, ఊట కుంటలు వంటి మొత్తం 1,90,777 నీటి వనరులను పరిశీలించగా వాటిలో 3,920 కబ్జాకు గురైనట్లు తెలిపింది. కబ్జాకు గురైన వాటిలో 51.8 శాతం చెరువులేనని వెల్లడించింది. నీటి వనరులలో 75 శాతానికి పైగా ఆక్రమణకు గురైనవి 199 ఉండగా, 50 నుంచి 75 శాతం ఆక్రమణకు గురైనవి 186, 25 నుంచి 50 శాతం వరకు ఆక్రమణకు గురైనవి 249, 25 శాతం లోపు ఆక్రమణకు గురైనవి 1,828 ఉన్నట్లు చెప్పింది. నీటి వనరులు దేశవ్యాప్తంగా సగటున 1.6 శాతం ఆక్రమణకు గురైతే.. ఆంధ్రప్రదేశ్‌లో 2.06 శాతం కబ్జాకు గురయ్యాయని వెల్లడించింది. నీటి వనరుల ఆక్రమణలపై జల వనరుల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పోలీసులకు చేసిన ఫిర్యాదులు వందల్లో ఉన్నాయని తెలిపింది.



నిరుపయోగంగా ఉన్న నీటి వనరులు తక్కువేం కాదు..

రాష్ట్రంలోని నీటి వనరుల్లో 1,49,279 ఉపయోగంలో ఉన్నాయని, వీటిలో 8,475 కుంటలు, 1,03,952 చెరువులు, 60 సరస్సులు, 667 రిజర్వాయర్లు, 32,011 చెక్ డ్యామ్‌లు, ఊట కుంటలు, ఇతర వనరులు 4,114 ఉన్నాయని తెలిపింది. 41,498 నీటి వనరులు నిరుపయోగంగా ఉన్నట్లు కూడా ఆ నివేదిక పేర్కొంది. వీటిలో అత్యధికంగా చెరువులు 9,473 ఉండటం గమనార్హం. ఫీడర్ చానళ్లు (వంకలు, వాగులు) కబ్జాకు గురవడం వల్ల వర్షం నీరు చేరకపోవడంతో 9,473 చెరువులు ఎండిపోయి, నిరుపయోగంగా మారినట్లు చెప్పింది. ఇలా నిరుపయోగంగా మారిన చెరువులు ఏపీలోనే అత్యధికంగా ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో ఏటా పూర్తి స్థాయిలో నిండే నీటి వనరులు 79,320 ఉండగా.. సాధారణంగా నీటిని మళ్లించడం ద్వారా నిండేవి 18,198గా తెలిపింది. అరుదుగా నిండేవి 28,633, ఎప్పుడూ నిండని వనరులు 2,171 ఉన్నాయని పేర్కొంది.

తిరుమల వెంకన్నకు గద్వాల ఏరువాడ జోడు పంచెలు

- బ్రహ్మోత్సవాల మొదటిరోజు, విజయదశమి రోజు స్వామివారికి అలంకరణ
- 41 రోజులుగా నిష్టతో పంచెలు నేసిన కార్మికులు
- గద్వాల సంస్థానాధీశుల కాలం నుంచి ఆనవాయితీ
- ఇటీవల టీటీడీ అధికారులకు అందజేత

గద్వాల టౌన్: గద్వాల సంస్థానాధీశుల కాలం నుంచి తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు నేత కార్మికులు నియమ నిష్టలతో తయారు చేసిన గద్వాల ఏరువాడ జోడు పంచెలను అందజేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. నాటినుంచి వస్తున్న ఈ ఆనవాయితీ మేరకు గద్వాలలో చేపట్టిన శ్రీవారి ఏరువాడ జోడు పంచెల నేత ఇటీవల పూర్తయింది. అక్టోబర్ 3వ తేదీ నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు జరిగే దసరా బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు శ్రీవారి అలంకరణకు గద్వాల ఏరువాడ జోడు పంచెలను ధరింపజేస్తారు. గద్వాల సంస్థానాధీశురాలు శ్రీలతాభూపాల్ లేఖను తీసుకొని పంచెల తయారీ నిర్వాహకుడు మహంకాళి కర్ణాకర్ ఇటీవల తిరుపతి వెళ్లారు. అక్కడ ఏరువాడ జోడు పంచెలను టీటీడీ అధికారులకు అందజేశారు. నలుగురు చేనేత కార్మికులు 41 రోజులుగా నిష్టతో శ్రీవారి ఏరువాడ జోడు పంచెలను తయారు చేశారు.

గద్వాల రాజుల వారసత్వంగా పంచెల సమర్పణ..

శతాబ్దాలుగా గద్వాల సంస్థానాధీశులు తమ వంశ పెద్దల ఆచారంగా శ్రీ వెంకటేశ్వరునికి ఏటా బ్రహ్మోత్సవాలకు గద్వాల ఏరువాడ జోడు పంచెలను అందజేస్తారు. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వెంకటేశ్వరుడికి ఉత్సవాల మొదటి రోజు, విజయ దశమి రోజున ఈ ఏరువాడ పంచెలను మూలవిరాట్‌కు ధరింపజేస్తారు. గద్వాల సంస్థానాధీశులలో ఒకరైన రాజు సీతారాంభూపాల్ తన వంశస్తుల ఇష్టదైవమైన శ్రీవెంకటేశ్వరునికి పంచెలను సమర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి శ్రీవారికి అందుతున్న ఏకైక కానుక ఏరువాడ జోడు పంచెలు కావడం విశేషం.

గర్వంగా ఉంది

తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా గద్వాల సంస్థానాధీశులు అందించే ఏరువాడ జోడు పంచెలను మూలవిరాట్‌కు ధరింపజేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. 14 ఏళ్లుగా నా నివాసంలో ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు గర్వపడుతున్నాం. ఈ సేవలో గద్వాల నేత కార్మికులు పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాం. జోడు పంచెలను ఇటీవల టీటీడీ అధికారులకు అందజేశాం.

– మహంకాళి కర్ణాకర్, జోడు పంచెల తయారీ నిర్వాహకుడు

ఒక్కొక్క పంచె తయారీకి 20 రోజులు..

ఏరువాడ పంచెలు 11 గజాల పొడవు, రెండున్నర గజాల వెడల్పు, 15 అంగుళాల వెడల్పుతో అంచు ఉంటుంది. శ్రీవారికి సమర్పించే ఈ పంచెలపై ఎనిమిది కోటకొమ్ములు ఉంటాయి. ఒక్కొక్క పంచె తయారీకి దాదాపు 20 రోజుల సమయం పడుతుంది. జోడు పంచెలను లింగంబాగ్ కాలనీలో ప్రత్యేకంగా నిర్మించిన మగ్గంపై నలుగురు నేత కార్మికులు ప్రత్యేక నిష్ట, భక్తి శ్రద్ధలను పాటిస్తూ సిద్ధం చేశారు. ఏరువాడ పంచెల తయారీలో కార్మికులు గద్దె మురళి, సాక సత్యన్న, దామర్ల షణ్ముఖరావు, మ్యాడం రమేష్ పాల్గొన్నారు.

కాంచీపురం 'సోమస్కందర్' విగ్రహం అమెరికాలో గుర్తింపు

తమిళనాడుకు తెచ్చేందుకు పోలీసుల ప్రయత్నం



అన్నానగర్: కాంచీపురంలోని ఏకాంబరేశ్వర ఆలయంలో చాలాకాలం కిందట చోరీకి గురైన పురాతన సోమస్కందర్ విగ్రహాన్ని తమిళనాడు యాంటీ స్మగ్లింగ్ యూనిట్ పోలీసులు అమెరికాలో ఉన్నట్లు గుర్తించారు. ఈ విగ్రహాన్ని శాన్‌ఫ్రాన్సిస్కో ఏషియన్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించినట్లు వెబ్‌సైట్ ప్రచురించారు. దీంతో దర్యాప్తు చేపట్టి పురాతన సోమస్కందర్ విగ్రహాన్ని తిరిగి తీసుకువచ్చేందుకు తమిళనాడు డీజీపీ ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ బృందం ఇటీవల విచారణ చేసి సోమస్కందర్ విగ్రహం యూఎస్‌ఏలో ఉన్నట్లు నిర్ధారించింది. విగ్రహంపై తెలుగు అక్షరాలు కూడా ఉన్నాయని, శాసనాలను చదివిన తర్వాత, ఇది కాంచీపురంలోని ఏకాంబరేశ్వర ఆలయానికి చెందినదని ప్రకటించింది. ఈ విగ్రహం క్రీ.శ.1,500 నుంచి క్రీ.శ.1,600 మధ్య కాలంలో తయారు చేసినట్లు గుర్తించింది. అంతర్జాతీయంగా ఈ విగ్రహం విలువ రూ.8 కోట్లు ఉంటుందని నిపుణులు తెలిపారు. ఏకాంబరేశ్వర ఆలయంలో విగ్రహాన్ని దొంగిలించిన దుండగులు అమెరికాకు తరలించి అమ్మేసినట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఈ విగ్రహాన్ని త్వరలో తమిళనాడుకు తీసుకువచ్చి కాంచీపురంలోని ఏకాంబరేశ్వర ఆలయానికి అప్పగిస్తామని స్మగ్లింగ్ నిరోధక విభాగం పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమైంది. అంతరిక్ష పరిశోధన ఫలితాలను ప్రజలంతా తెలుసుకోవాలనే ఉద్దేశంతో సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్) కేంద్రంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా విద్యార్థులు, యువతను అంతరిక్ష కార్యక్రమాల వైపు ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో ఏడు చోట్ల వారోత్సవాలు నిర్వహించబోతోంది. తొలుత శ్రీహరికోటలోని షార్‌లో వారోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత ఈనెల 5, 7, 8 తేదీల్లో తిరుపతి శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో, శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో.. 7, 9 తేదీల్లో నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో, 6, 7 తేదీల్లో భీమవరంలోని విష్ణు స్కూల్‌లో, 7, 9 తేదీల్లో పల్నాడు జిల్లాలోని నరసారావుపేట ఇంజినీరింగ్ కాలేజీలో, కడపలోని కేఎస్‌ఆర్‌ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించనున్నారు. 8, 9 తేదీల్లో తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న గాంధీరామ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్‌లో, 7, 9 తేదీల్లో ధర్మవరంలోని పశ్చముత్తు ఉమెన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో, 4, 6 తేదీల్లో ఒడిశాలోని బర్గార్‌లోని వికాస్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించేందుకు ఇస్రో ఏర్పాట్లు చేసింది.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,300 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,884 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.23 కోట్లు ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.




అప్పన్నకు ఘనంగా అమావాస్య తిరువీధి



సింహాచలం: అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సాయంత్రం తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. విశేషంగా హారతి అందించారు.

దసరా ఉత్సవాలకు చినవెంకన్న క్షేత్రం ముస్తాబు



ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాలకు ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం, క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయం, పరిసరాలను దేవస్థానం అధికారులు విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. గ్రామంలోని చిలుకూరి మహిళలు కుంకుళ్లమ్మవారిని తమ ఆడపడుచుగా భావించి ఏటా మాదిరిగా ఉత్సవాల ప్రారంభానికి ముందురోజు అయిన బుధవారం రాత్రి పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు, పూలు, పండ్లను సమర్పించారు. తొలిరోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.

సత్యదేవునికి పట్టువస్త్రాల సమర్పణ



అన్నవరం: దసరా ఉత్సవాలలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు అలంకరించేందుకు గాను విజయవాడకు చెందిన దాత రావాడ చిరంజీవిరావు రూ.మూడు లక్షల విలువైన పట్టువస్త్రాలు సమర్పించారు. వీటిలో 15 పట్టు చీరలు, 15 పట్టు పంచెలు ఉన్నాయి. దాత వద్ద నుంచి ఈ వస్త్రాలను ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్య శర్మ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాత సమర్పించిన పట్టు వస్త్రాలను దసరా వేడుకల పది రోజులు స్వామి, అమ్మవార్లకు, దుర్గామాతలకు అలంకరించి పూజలు చేస్తామని వివరించారు..

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి బుధవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యా సమాచారం

5న మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ కోర్సులకు ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ పి.సువర్ణలతాదేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఏపీ ఐసెట్-2024 లో అర్హత సాధించి, ఇప్పటివరకు ఏ ఇతర కళాశాలల్లో అడ్మిషన్ పొందని విద్యార్థినులు మాత్రమే ప్రవేశానికి అర్హులని వెల్లడించారు. విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి రావాలని సూచించారు. ఇతర వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రేపటి నుంచి పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : ఎస్వీయూ, మహిళా వర్సిటీలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు ఏపీపీజీ సెట్-2024 రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. రెండో విడత కౌన్సిలింగ్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గురువారం సీట్లు కేటాయించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో 4వ తేదీ నుంచి 7లోపు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకుని సంబంధిత కోర్సులో ప్రవేశం పొందాల్సి ఉంటుంది.

రేపు తడ ఐటీఐలో జాబ్ మేళా

తడ: తిరుపతి జిల్లా తడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 4వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీసిటీలోని బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలకు చేపట్టే ఈ మేళాలో 8వ తరగతి పైన విద్యార్హత, పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ జెరాక్స్‌తోపాటు బయోడేటా, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అడ్మిట్ కార్డు తీసుకురావాలని కోరారు. వివరాలను 9154449677 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సమాజంలో గురువులదే కీలకపాత్ర


కడప సెవెన్‌రోడ్స్:విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే గనుక.. సమాజం బాగులో వారి పాత్రే కీలకమని అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు ఎం.రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్ జిల్లా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అపుస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కలిగిన ప్రైవేటు ఉపాధ్యాయులను గుర్తించి గౌరవించాలన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కడప శాంతినికేతన్ స్కూల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఏలు, ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ డబ్బులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ మూడో తరగతి నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండాల్సిందేనన్నారు.

ఏపీటీఎఫ్ 80 వసంతాల జూబ్లీ వేడుకలు

కడప ఎడ్యుకేషన్: అక్టోబర్ 6 ,7, 8వ తేదీలలో విజయనగరంలో జరిగే ఓక్ జూబ్లీ వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లె అబ్దుల్లా కోరారు. ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కడప ఎన్జీవో హోంలో రాష్ట్ర మహా సభల గోడపత్రికలను(వాల్ పోస్టర్స్) ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభలకు ప్రముఖులు హాజరవుతారని, విద్యా ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం, సామాజిక శ్రేయస్సు, మహిళా సాధికారతపై సదస్సు జరుగుతుందని తెలిపారు.



శాక్తేయులకు అత్యంత ఆరాధనీయమైనది కామరూప లేదా కామాఖ్యాదేవి ఆలయం. ఇక్కడే దశమహావిద్యలనే పేరు గల కాళి, తార, భువనేశ్వరి, బగళాముఖి, ఛిన్నమస్త, భైరవి, ధూమావతి, కమలాంబిక, షోడశి, మాతంగి అనే పది వేర్వేలు ఆలయాలున్నాయి. ఒక్కో ఆలయమూ ఒక్కో విద్యకు ప్రసిద్ధమైనది. ప్రధాన ఆలయం కామాఖ్యాలయమే.

అష్టాదశ శక్తి పీఠాలలో అగ్రగణ్యం..

కామాఖ్యాలయం

సతీదేవి ఆత్మత్యాగానంతరం తీవ్రమైన వేదనతో తపస్సమాధిలో లీనమై ఉన్న పరమేశ్వరుని మనస్సును మార్చాలని దేవతలు సంకల్పిస్తారు. ఇందులో భాగంగా మన్మథుడు సమయం చూసుకుని, పూలబాణాలు వేసి, ఆయనకు తపోభంగం కలిగిస్తాడు. దాంతో ముక్కంటి తన మూడవకంటిని తెరచి మన్మథుణ్ణి మసి చేస్తాడు. మన్మథుడికే కాముడు అనే పేరు. కాముణ్ణి దహించిన ప్రదేశం కనుక దీనికి కామాఖ్య అనే పేరొచ్చిందంటారు. ఆ తర్వాత అమ్మవారి అనుగ్రహంతో మన్మథుడు తిరిగి రూపాన్ని పొందాడు. అయితే కేవలం ఆయన భార్య రతీదేవికి మాత్రమే రూపంతో కనిపిస్తాడు. ఇక్కడి బ్రహ్మపుత్రానదిలో భస్మకూటమనే పర్వతం ఉండటం శివుడు మన్మథుని భస్మం చేయడం, తిరిగి ఆయన రూపం పొందాడనడానికి ప్రతీకగా నిలుస్తుంది.


ప్రత్యేకతలకు ఆలవాలం...

ఎనిమిదవ శతాబ్దంలో నిర్మించినదిగా భావిస్తున్న ఈ ఆలయం 16వ శతాబ్దంలో అన్యమతస్థుల దాడుల్లో ధ్వంసం కాగా, 17వ శతాబ్దంలో కుచ్ బీహార్ రాజు నరనారాయణుడు పునర్నిర్మించాడని శాసనాధారాలున్నాయి. తేనెపట్టు ఆకారంలో ఉన్న ఆలయ శిఖరం గణేశుడు తదితర దేవీ దేవతల శిల్పాలతో కనువిందు చేస్తుంది. మాంత్రికులకు, తాంత్రికులకు, వామాచారులకు, క్షుద్రపూజలు చేసేవారికి ఈ ఆలయమే ఆధారం. కారణం ఇది సతీదేవి యోని భాగం పడిన ప్రదేశం. మూడు మంటపాలుగా నిర్మించి ఉంటుంది. అందులో మొదటి ప్రాకారంలో గుహలా ఉండే గర్భాలయంలో యోని చిహ్నం ఉన్న నల్లటి బండరాయి ఉంటుంది. దానికే పూజలు జరుగుతాయి.అయితే ఆ రూపం కనిపించకుండా భక్తుల దర్శనానికి ముందే పూలతో నింపేస్తారు. ఆ గుహ లోపల రాతి మీద ఎప్పుడూ జల వూరుతూ ఉంటుంది. అందువల్ల మూలవిరాట్టు ఎప్పుడూ తడిగా ఉంటుంది. గర్భాలయం అంతా చిత్తడిగా, జారుడుగా ఉంటుంది. ఆలయం బయటే శీతలాదేవి సన్నిధి ఉంటుంది. దీర్ఘవ్యాధులు ఉన్నవారు ఈమెను సేవించుకుంటే వాటినుంచి విముక్తి కలుగుతుందని ప్రతీతి.









పూజలు- ఉత్సవాలు...

అమ్మవారికి రోజూ చేసే పూజలు గాక దేవీ నవరాత్రులలో ప్రత్యేకంగా దుర్గాపూజ జరిపిస్తారు. ఇవిగాక ఫాల్గుణ మాసంలో దుర్గాడియల్ అని దుర్గాదేవికి ప్రత్యేక పూజ ఉంటుంది. అదేవిధంగా మానసా పూజ, పోహన్ బియా అంటే పుష్య మాసంలో కామేశ్వరుడికీ, కామేశ్వరీ దేవికీ కల్యాణం జరిపిస్తారు.

పసిపిల్లవానికి పాలు ఇస్తున్నట్లుగా ఉండే విగ్రహం పశ్చిమ ద్వారాన ఉంటుంది. అమ్మవారు భక్తులను ఎల్లప్పుడూ కన్నతల్లిలా కాపాడుతూ ఉంటుందని చెప్పేందుకు ప్రతీక ఇది.

ఈ ఆలయంలో అమ్మవారు సంవత్సరానికి ఒకసారి జూన్ రెండవవారంలో బహిష్టు అవుతారు. స్థానికులు దీనిని అంబుబాషి సమయం అంటారు. ఈ నాలుగురోజులపాటు ఆలయాన్ని మూసి ఉంచి, అయిదోరోజున తలుపు తెరుస్తారు. అంబుబాషి రోజులలో అమ్మవారి ఆలయంతో పాటు మిగతా ఆలయాలన్నిటినీ కూడా మూసి ఉంచుతారు.

గౌహతి నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో చట్టగామ్‌లో శీతకుండం దగ్గర గల చంద్రశేఖర పర్వతంపై భగవతి అమ్మవారి ఆలయం ఉంది. కుండం లో నిత్యం అగ్ని ప్రజ్వరిల్లే శక్తి పీఠం ఇది. నరకాసురుడు కామాఖ్యాదేవిని ఆరాధించటం వల్లే అంతటి బలపరాక్రమాలు పొందగలిగాడని పెద్దలు చెబుతారు.

అమ్మవారు, పరమేశ్వరుడు ఇక్కడ నిత్యం కామకేళిలో తేలియాడుతుంటారని, అందువల్లే అమ్మవారికి కామాఖ్య అనే పేరు వచ్చిందని చెబుతారు. అలాగే శివపార్వతులు ప్రతిరోజూ రాత్రిపూట ఆలయం అంతర్భాగంలో సర్పాల రూపంలో జూదం ఆడుతుంటారని విశ్వాసం. ఈ క్షేత్రంలోనే మరో ఐదు శైవాలయాలున్నాయి. అవి అఘోరేశ్వర, అమృతేశ్వర, కోటిలింగేశ్వర, సిద్ధేశ్వర, కామేశ్వరాలయాలు.

పిలవని పేరంటానికి వెళ్లి, కన్నతండ్రి చేత ఘోరపరాభవం పొందిన సతీదేవి, ఆ అవమాన భారంతో ఆత్మత్యాగం చేస్తుంది. ఇది తెలిసి, అక్కడకు చేరుకున్న శివుడు ఆమె శరీరాన్ని భుజాలమీదకు ఎత్తుకుని రుద్రతాండవం చేస్తుంటాడు. సతీదేవి శరీరం అక్కడ ఉన్నంతసేపూ శివుడిని ఆప శక్యం కాదని తెలిసిన విష్ణువు తన చక్రాయుధాన్ని ఉపయోగించి, ఆమె శరీరాన్ని ఖండఖండాలు చేస్తాడు. అవి 108 ఖండాలుగా భూలోకంలోని వివిధ ప్రదేశాలలో పడతాయి. ఆమె శరీరంలోని కీలకమైన భాగాలు పడిన ప్రదేశాలలో తిరిగి అత్యంత కీలకమైన ప్రదేశాలను గుర్తించి, ఆలయాలు నిర్మించారు పూర్వులు. అవే అష్టాదశ శక్తిపీఠాలు. వాటిలో అమ్మవారి యోనిభాగం నీలాచలం కొండలపై పడింది. అదే కామాఖ్యా పీఠంగా గుర్తింపు పొంది, కామాఖ్యాదేవి ఆలయంగా ప్రసిద్ధికెక్కింది.







కామాఖ్యలో ఇంకా ఏమేం చూడవచ్చు..?

కామాఖ్యాలయం నీలాచలం కొండలపై ఉందని తెలుసుకదా, అక్కడే భువనేశ్వరీ ఆలయం, వనదుర్గాలయం ఉన్నాయి. పైన చెప్పుకున్న ఐదు శివాలయాలూ, దశమహావిద్యలకూ సంబంధించిన ఆలయాలూ ప్రధానాలయానికి చేరువలోనే ఉంటాయి. ఇవిగాక శుక్లేశ్వర కొండలపై జనార్దనాలయం, లక్ష్మీ మందిరం, గ్రామదేవతా మందిరం, చక్రేశ్వరాలయం, విశ్వకర్మ మందిరం, కాశీపురంలో శివమందిరం, మహావీర్ అక్రాలయం, శని మందిరం, గోపాల మందిరం, కాళీమందిరం, హనుమాన్ మందిరం ఉన్నాయి. ఇంకా లోకనాథాలయం, శీతలామందిరం, నామ్ ఘర్ ఆలయం, గోశాల నేపాలీ మందిరం, రామ్ ఠాకూర మందిరం ఉన్నాయి. ఇవిగాక దిహింగ్ సరస్సు, బుద్ధ మందిరం, నౌకామందిరం, ఎల్విజిస్ మ్యూజియం, తోరుణామ్ పుకాన్ పార్క్, శ్రీ జలరామ్ మందిరాలను కూడా సందర్శించవచ్చు.

ఆలయానికి ఎలా వెళ్లాలి..?

దేశంలోని అన్ని ప్రధాన నగరాలనుంచి గువహతికి వెళ్లేందుకు, బస్సులు, రైళ్లు, విమానాలూ ఉన్నాయి. గువహతి రైల్వేస్టేషన్ నుంచి 6 కిలోమీటర్లు, ఏర్‌పోర్టునుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామాఖ్యాదేవి ఆలయానికి వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలున్నాయి.

– డి.వి.ఆర్. భాస్కర్

ఇతర విశేషాలు

ఎగుడు దిగుడు కొండలు, గుట్టలు, లోయలు ఉండే ఈ ప్రదేశానికి అసమ దేశం అని పేరు. అసమ కాస్తా అస్సాంగా, అసోమ్‌గా రూపాంతరం చెందింది. శ్రీహరి కొలువై ఉన్న ప్రదేశం కాబట్టి దీనికి హరిక్షేత్రం అని కూడా పేరు. అందుకే అష్టాదశ శక్తిపీఠాల స్తోత్రం లో హరిక్షేత్రే కామరూపా అని ఉంటుంది. ఇక్కడ అమ్మవారి రూపం కానీ, విగ్రహం కానీ ఏమీ ఉండవు. కామాఖ్యాదేవికి నలుపు రంగంటే ప్రీతి. జంతు బలులు ఇక్కడ పరిపాటి. అదీ నల్లటి జంతువులనే బలివ్వాలి. ఆడజంతువులను వధించరాదని నియమం. ఇది అమ్మవారి యోనిభాగం పడిన ప్రదేశం కావడం వల్ల శివుడు, అమ్మవారు నిత్యం కామకేళిలో మునిగి తేలుతూ ఉంటారని ప్రతీతి.

దేవీనవరాత్రులు

నవదుర్గా నమోస్తుతే!



నేటినుంచి ఆశ్వీయుజ మాసం ఆరంభం అవుతోంది. ఈ మాసంలో శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకూ తొమ్మిది రోజులను నవ రాత్రులు అంటారు. నవ రాత్రులంటే మహిళలు దేవిని స్మరిస్తూ పండగ చేసుకుంటారు. ఈ అమ్మవారి ఆరాధనా మహోత్సవాన్ని 'శరన్నవరాత్రి ఉత్సవాలు'గా, 'దేవీనవ రాత్రులు'గా పిలుస్తుంటారు. మహాశక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని ఈ తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది రూపాలలో అలంకరించి పూజించడం జరుగుతుంటుంది.

భక్తులు ఈ తొమ్మిదిరోజుల పాటు దీక్ష చేపట్టి, ఏకభుక్త వ్రతాన్ని ఆచరిస్తూ అమ్మవారిని పూజిస్తే అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయి. శరన్నవరాత్రులలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఎవరైతే తనని పూజిస్తారో,వాళ్లు తనకి అత్యంత ప్రీతిపాత్రులని అమ్మవారే స్వయంగా చెప్పినట్టుగా పురాణాలు వెల్లడిస్తున్నాయి. దేవీ నవరాత్రులు ఎంతో విశిష్టమైనవి, మహా పవిత్రమైనవి. ఈ తొమ్మిది రోజుల పాటు ఒక్కోరోజు ఒక్కో రూపంగా అలంకృతమైన అమ్మవారిని దర్శించుకోవడం వలన అనంతమైన పుణ్య ఫలాలు లభిస్తాయి. ఇలా తొమ్మిది రోజుల పాటు నవదుర్గలను ఆరాధించడం వలన ధనధాన్యాలు ... సంతాన సౌభాగ్యాలు ... సుఖశాంతులు చేకూరుతాయని పండితులు చెబుతారు.

ఇక దేవీ నవరాత్రి పూజలు చేయుట, అనునది అనాది కాలంగా వస్తున్న శాస్త్రవిధి. 'అశ్వనీ' నక్షత్రంలో కలిసి వచ్చిన పూర్ణిమ మాసమే 'ఆశ్వీయుజమాసం' అవుతుంది. ఈ మాసమందు 'దేవీ నవరాత్రుల'ను శరన్నవరాత్రులని పిలుస్తూ శుద్ధపాడ్యమి తిథితో ప్రారంభించి తొమ్మిది రోజులు ఈ నవరాత్రులు వైభవంగా చేస్తారు.

● ప్రథమాశైలపుత్రి, ● ద్వితీయా బ్రహ్మచారిణీ ● తృతీయాచంద్రఘంటీతి, ● కూష్మాండేతి చతుర్థికీ ● పంచమా స్కందమాతేతి ● షష్టాకాత్యాయనేతి చ ● సప్తమా కాళరాత్రిచ ● అష్టమాచాతి భైరవీ ● నవమా సర్వసిద్ధిశ్చాత్ నవదుర్గా ప్రకీర్తితా.

మూర్తులు వేరైనా మూలపుటమ్మ ఒకరే! అలంకారాలు వేరైనా అమ్మదయ అందరిపట్ల ఒకటే! హిందువులు అత్యంత ప్రీతిపాత్రంగా ఎంతో వైభవంగా నిర్వహించే పండుగలలో ఈ 'దసరావైభవం' ఒకటి. ఇది పదిరోజులు పండుగ అయినప్పటికి దేవిని రోజుకో అవతారంగా అలంకరించి అమ్మవారికి అర్చనలు చేసి, నవవిధ పిండివంటలతో నివేదనలుచేస్తూ విశేష పూజలతో పాటు నిత్యం శ్రీలలితా సహస్రనామ పారాయణ గావిస్తూ 'శరన్నవరాత్రులు' గా వ్యవహరిస్తారు. శ్రవణానక్షత్రయుక్త 'దశమి' తిథిన విజయదశమితో ఈ దసరావైభవాలు పూర్తిచేస్తారు. దసరాకు మరోపేరు 'దశహరా' అంటే! పది పాపాలను హరించేది అని అర్థం చెప్తారు దైవజ్ఞులు.ఆశ్వీయుజ మాసంలో శుక్లపక్షంలో పాడ్యమి, హస్తా నక్షత్రంలో కూడియున్న శుభదినాన ఈ దేవీ పూజ ప్రారంభించడం చాలా మంచిదని మార్కండేయ పురాణం చెబుతోంది. అందువల్ల ఈ రోజు నుంచి నవరాత్రులు ప్రారంభిస్తారు.

అందులో మొదటి మూడు రోజులు దుర్గారూపాన్ని ఆరాధించి అరిషడ్వర్గాలను తదుపరి మూడు రోజులు లక్ష్మీరూపాన్ని ఆరాధించి సిరిసంపదలను చివరి మూడు రోజులలో సరస్వతి రూపాన్ని ఆరాధించి జ్ఞానాన్ని పొందాలనిపెద్దలు చెబుతున్నారు.

దుర్గమ్మకు దసరా అలంకారాలు

● స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవి (పాడ్యమి) ● శ్రీ బాల త్రిపుర సుందరి (విదియ) ● శ్రీ అన్నపూర్ణా దేవి (తదియ) ● శ్రీ గాయత్రి దేవి (చవితి) ● శ్రీ లలిత త్రిపుర సుందరి (పంచమి) ● శ్రీ మహాలక్ష్మి దేవి (షష్టి) ● శ్రీ సరస్వతి దేవి (సప్తమి) ● శ్రీ దుర్గాదేవి (అష్టమి) ● శ్రీ మహిషాసురమర్దిని దేవి (నవమి) ● శ్రీ రాజ రాజేశ్వరి దేవి (దశమి)

ధర్మ సందేహాలు



భగవంతుని ధ్యానం చేసేటప్పుడు శుచిగా ఉండాలంటారు. నేను చాలాకాలం నుండి వాకింగ్ చేసేటప్పుడు భగవద్ధ్యానం చేస్తున్నాను. అది దోషమా?


'ధ్యానం' శుచిగా చేయడం శ్రేష్ఠం. దానికి ఆసనం, ప్రాణాయామం సమకూరాలి. అటు తరువాతనే ధ్యానం. అయితే, నడకలో చేసే దానిని 'స్మరణ' అంటారు. అది శ్రేష్ఠమైన విషయం. భగవత్ స్మరణ సర్వపాపహరం సర్వాభీష్ట ఫలప్రదం. అది నిరభ్యంతరంగా నడకలో చేయవచ్చు. మీరు చాలా కాలం నుండి చేస్తున్న భగవత్ స్మరణ మంచిదే. ధ్యానానికి గానీ, స్మరణకిగానీ ఆచమనం, సంకల్పం అవసరం లేదు. అవి లేకుండానే ధ్యాన–స్మరణలు చేయవచ్చు. అందులో దోషం ఏమీ లేదు. వాటికి తప్పక ఫలితం ఉంటుంది. పూజ' అనేది బాహ్యం, మానసికం అని రెండు విధాలు. మానసిక పూజకి దేవుడు ఎదురుగా ఉండనక్కర్లేదు. ఈ మానసిక పూజని కొంతమేరకు 'ధ్యానం' అని నిర్వచించవచ్చు. బాహ్య పూజకు ఎదురుగా దేవుని బింబం (పటంగానీ, విగ్రహంగానీ) ఎలాగూ అవసరమే కదా! ఆ పూజకు ఆచమనం, సంకల్పం వగైరాలు అవసరమే. బాహ్యపూజ వలన శరీర, మనశ్శుద్ధులు ఏర్పడి మానసికమైన భావన, స్మరణ,ధ్యానం వంటివి శీఘ్రంగా సిద్ధించే అవకాశం కలుగుతుంది.

ముప్పై మూడు కోట్ల దేవతలు ఉన్నారని అంటారు. నిజంగానే అంతమంది దేవతలున్నారా?

ముప్పైమూడు కోట్ల మంది దేవతలు ఉన్న మాట నిజమే. ఇక్కడ కోటి అంటే మనం అనుకునే నూరు లక్షలు కాదు. సంస్కృతం లో కోటి అంటే విభాగం అని అర్థం . మొత్తం ముప్పై మూడు రకాలయిన దేవతలు అని అర్థం వస్తుంది. వారు వరుసగా అష్ట వసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశ ఆదిత్యులు, ఇంద్రుడు, బ్రహ్మ (ప్రజాపతి) కలిపి మొత్తం ముప్పైమూడు మంది దేవతలు.

ప్ర'బోధ'

పూర్వ గురువులను గౌరవించడం నేర్చుకో!



బుద్ధుడికి మహా ప్రబోధకుడని పేరు. విషయాన్ని పూర్తిగా అవగతం చేయడం కోసం నిత్యజీవితంలోని ఎన్నో సంఘటనలను ఆయన ఉపమానాలుగా చెప్పేవాడు. దాంతో ఆ విషయం హృదయానికి చేరేది. మనసుపై ముద్ర వేసేది. ఒక రోజు బుద్ధుడు జేతవన విహారంలో ఉన్నప్పుడు, జైన మతానికి చెందిన ఒక సాధువు వచ్చాడు. బుద్ధుడికి వినయంగా నమస్కరించి'' భగవాన్! నేను ఇంతకాలం అజ్ఞానంలో గడిపాను. నాగురువులు అజ్ఞానులు, స్వార్థపరులు'' అంటూ తన గురువులను నిందిస్తూ, చివరగా... భగవాన్! తమరు అనుమతిస్తే నేను మీ శిష్యుడిగా ఉండగలను'' అని వేడుకున్నాడు. ఆ మాటలకు బుద్ధుడు చిరునవ్వు నవ్వుతూ ముందుగా నీవు నీ పూర్వ గురువులను గౌరవించడం నేర్చుకో. వారు చెప్పేది నీకు ఇప్పుడు నచ్చినా, నచ్చకపోయినా... ఒకప్పుడు వారు నీకు గురువులే! వారిపట్ల సంస్కారంతో జీవించు. ఆ తరువాత నా దగ్గరకు రా!'' అని చెప్పి పంపాడు.

అతను వెళ్ళిపోయాక అక్కడున్న భిక్షువులతో- ''భిక్షువులారా! గురువు పట్ల ప్రతి వారికీ అణకువ చాలా అవసరం. గురువు పట్లే కాదు... మనతో ఉండే ప్రతివారి పట్లా ఆ అణకువ ఉండాలి. మన మాట తీరే మన ప్రవర్తనకు అద్దం. మన నిజ స్వరూపాన్ని చక్కగా చూపిస్తుంది. మనం అడగకపోయినా ఎదుటివారి సుగుణాలను చెప్పి, దోషాల గురించి చెప్పనివారు మంచివారు. తమ గొప్పలు తాను చెప్పుకోకుండా... తమ తప్పులను తాము గుర్తించి ఎవరు చెప్పగలరో వారే సజ్జనులు. అలాంటివారు నిరంతరం అణకువగా ఉంటారు. ఎవరు నిరంతరం నవ వధువులా నైతిక బిడియాన్ని పాటిస్తారో, వారే యోగ్యులవుతారు'' అని బోధించాడు. శిష్యులు వినయంతో నమస్కరించారు.

ఇస్లాం వెలుగు



దానధర్మాలపై ఖురాన్ ఏం చెబుతోంది?

తమ సంపదను దైవ మార్గంలో ఖర్చు చేసే వారి ఉపమానం ఇలా ఉంటుంది: ఒక్క విత్తనాన్ని నాటితే అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింప జేస్తాడు. అల్లాహ్ అమితంగా ఇచ్చేవాడూ, అన్నీ తెలిసినవాడూను. అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని వ్యయం చేసి ఆ తర్వాత తమ దాతృత్వాన్ని మాటి మాటికి చాటుతూ గ్రహీతల మనస్సును గాయపరచని వారి ప్రతిఫలం వారి ప్రభువ వద్ద ఉంది. వారికి ఏ విధమైన భయం కానీ ఖేదం కాని ఉండవు. మనసును గాయపరిచే దానం కంటే మృదుభాషణం. క్షమాగుణం ఎంతో మేలైనవి. అల్లాహ్ అన్నింటికి అతీతుడు, అత్యంత సహనశీలుడూను.

విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొందడానికే తమ ధనం ఖర్చు చేసే వాని మాదిరిగా...... మీరు దెప్పి పొడిచి గ్రహీత మనస్సును గాయపరిచి మీ దానధర్మాలను మట్టిలో కలపకండి. అతడు చేసిన ధన వ్యయాన్ని ఈ విధంగా పోల్చవచ్చు: ఒక కొండ రాతిపై ఒక మట్టి పొర ఏర్పడి ఉంది. భారీ వర్షం దానిపై కురవగా ఆ మట్టి కాస్త కొట్టుకుపోయింది. చివరకు మిగిలింది ఉత్త కొండ రాయి మాత్రమే. ఇలాంటివారు తాము దానం చేస్తున్నామని భావించి చేసే పుణ్యకార్యం వల్ల వారికి ఏ ప్రయోజనమూ కలుగదు.


(దివ్య ఖుర్ఆన్: 2:261–264

వివరణ: మనం ఎవరికైనా దానం ఇచ్చి దెప్పి పొడవడం సరైన పద్ధతి కాదు. కుడి చేతితో దానం చేసిన విషయం ఎడమ చేతికి తెలియకూడదు అంటారు పెద్దలు. కాబట్టి మనం చాటుమాటుగా దానం చేయాలి. అది దేవుని ప్రీతి కోసం మాత్రమే చేయాలి. ప్రదర్శన బుద్ధి కోసమో పేరు ప్రఖ్యాతల కోసమో చేయకూడదు. మీరు చేసిన దానం దేవుడికి తెలుసు తీసుకున్న వాడికి తెలుసు అంతే కానీ మూడో వ్యక్తికి తెలియకుండా ఉండడమే దైవ భక్తికి నిదర్శనం.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

సువార్త

నిస్సహాయతలోనూ దేవుని వైపే!



పూర్వం ఊజు దేశంలో యోబు అనే యథార్థవంతుడున్నాడు. ఆయనకు భార్య, కుమారులు, కుమార్తెలు ఉన్నారు. పాడిపంటలు, సిరిసంపద గలవాడు.

ఒకరోజు దేవదూతలు దేవుని సన్నిధికి వచ్చారు. ఆ సమయంలో అపవాది/సైతాను కూడా ప్రత్యక్షపరచుకున్నాడు. దేవదూతలు మొదట వెళ్ళిపోగా సైతానుతో భగవంతుడు– నీవు ఎక్కడినుండి వచ్చావు? భూలోకంలో దోషరహితుడు, ధర్మాత్ముడైన నా సేవకుడైన యోబు అనే భక్తుణ్ణి చూశావా? అని అడగ్గా, 'నీ సేవకుడైన యోబును భూసంచారంలో చూశాను. అతడు నిస్వార్థంగా మిమ్మల్ని సేవిస్తున్నాడా? మీరనుగ్రహించిన సకల సంపద, సంతానం, ఆస్తిపాస్తులపై కంచె వేశారు కాబట్టే, మీయందు భయభక్తులు కలిగి వున్నాడు' అన్నాడు సైతాను. అందుకు దేవుడు నీవు మాత్రం అతనిపై చేయివేయొద్దు. అతని సంపదకు కారణమైన భూమి, సంతోషభరితులైన సంతానం నీ స్వాధీనంలో ఉంచాను కనుక అతని సహనాన్ని పరీక్షించుకోవచ్చునని సెలవిచ్చాడు దేవుడు.

అప్పుడు సైతాను, యోబు ఆస్తిపాస్తులను చూసే నాగలిని, ఎద్దులను, పొలము దున్నువాటినన్నిటినీ షబాయీయులు తోలుకొనిపోయారని, వారు నీ సేవకులను కత్తితో పొడిచి చంపారని దూత వచ్చి చెప్పాడు. అతడి మాటలు పూర్తి కాకముందే వేరొకడు వచ్చి– 'అయ్యా! కుమార్లు, కుమార్తెలు, పెనుగాలికి ఇళ్లు కూలిపోయి చనిపోయారని చెప్పాడు. అప్పుడు యోబు పైకి లేచి నేలపై బోర్లాపడి దేవునికి దండం పెట్టి నేను దిగంబరిగానే నా తల్లిగర్భం నుండి వచ్చాను. ఆ విధంగానే వెళ్ళిపోతానన్నాడు. ఇంత సంభవించినా యోబు దేవుని దూషించలేదు... నేరం మోపలేదు.

మరలా దేవదూతలు, సైతాను దేవుణ్ణి దర్శించడానికి వచ్చారు. మొదట దేవదూతలు వెళ్ళిపోయాక సైతానుతో ''నీవు నాతో అనవసరంగా యోబును నాశనం చేయించినా అతనిప్పటికీ నైతికత విడవలేదని అనగా, సైతాను దేహం కాపాడు చర్మం, ప్రాణం కాపాడు ఆత్మ వున్నదన్నాడు. అందుకు ప్రభువు అతని ప్రాణం జోలికి వెళ్ళవద్దన్నాడు.

అంతట సైతాను దేవుని సన్నిధి నుండి వెళ్ళిపోయాడు. యోబుకు నడినెత్తి మొదలుకొని అరికాలి వరకు వ్రణములతో నింపగా యోబు కురుపులను చిల్లపెంకుతో గోకుతున్నాడు. అంతట అతని భార్య – ''నీవు ఇంకను యథార్థతను వదలకయుందువా? దేవుని దూషించి మరణము కమ్ము'' అనెను. అందుకు యోబు – ''మూర్ఖురాలు మాటలాడునట్లు నీవు మాటలాడుచున్నావు; మనము దేవుని వలన మేలు అనుభవించుదుమా, కీడును మనము అనుభవింప తగదా?'' అంటూ... యోబు నోటి మాటతోనైనను పాపము చేయలేదు. తర్వాత మరొక రోజు తన ముగ్గురు మిత్రులు ఒకరి తర్వాత ఒకరు వచ్చి దూషించారు. యోబు సమయోచితమైన ప్రత్యుత్తరమిచ్చాడు. కానీ దేవుణ్ణి పల్లెత్తు మాట దూషించలేదు.

ఒకానొకరోజు దేవుడు సుడిగాలిలో ప్రత్యక్షమై భక్త యోబుకు నష్టపోయిన దానికంటే అధికంగా సిరిసంపదలు, సంతానం, సంతోషం అనుగ్రహించాడు.

దేవుడు సర్వశక్తిమంతుడు, న్యాయవంతుడు, దేవుని దృష్టిలో ఏ మనుష్యుడు నీతిమంతుడు కాడు. శ్రమ అనేది పాపఫలితమేకాక ప్రాయశ్చిత్తం కూడాను. కష్టాలలో, నిస్సహాయతలో దేవుని వైపు తిరగడం మానవ విజ్ఞతకు సంకేతం.

– కోట బిపిన్ చంద్రపాల్

ఐపీవోల సందడే సందడి



ఒకే రోజు 13 కంపెనీల క్యూ

- సెబీకి ప్రాస్పెక్టస్‌ల దాఖలు
- రూ. 8,000 కోట్ల సమీకరణకు సై

సెకండరీ మార్కెట్లను మించుతూ ప్రైమరీ మార్కెట్ సైతం సరికొత్త రికార్డులవైపు పరుగు తీస్తోంది. జనవరి నుంచి ఇప్పటికే 62 కంపెనీలు ఐపీవోలకురాగా.. తాజాగా ఒకే రోజు 13 కంపెనీలు సెబీని ఆశ్రయించాయి. వివరాలు చూద్దాం.. - సాక్షి, బిజినెస్‌డెస్క్

రిటైల్ ఇన్వెస్టర్ల దన్ను, సెకండరీ మార్కెట్ల జోష్ పలు అన్‌లిస్టెడ్ కంపెనీలకు ప్రోత్సాహాన్నిస్తోంది. దీంతో నిధుల సమీకరణతోపాటు.. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు క్యూ కడుతున్నాయి. వెరసి తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ఒకే రోజు 13 కంపెనీలు ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. ఈ జాబితాలో విక్రమ్ సోలార్, ఆదిత్య ఇన్ఫోటెక్, వరిండెరా కన్‌స్ట్రక్షన్స్ తదితరాలు చేరాయి. ఇవన్నీ కలసి ఉమ్మడిగా రూ. 8,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉన్నాయి. ఈ ఏడాది(2024) ఇప్పటివరకూ 62 కంపెనీలు రూ. 64,000 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. గతేడాది(2023) మొత్తంగా 57 కంపెనీలు ఉమ్మడిగా సమీకరించిన రూ. 49,436 కోట్లతో పోలిస్తే ఇది 29% అధికం!

జాబితా ఇలా

తాజాగా సెబీకి ప్రాథమిక పత్రాలు దాఖలు చేసిన కంపెనీల జాబితాలో విక్రమ్ సోలార్, ఆదిత్య ఇన్ఫోటెక్, వరిండెరా కన్‌స్ట్రక్షన్స్, అజాక్స్ ఇంజినీరింగ్, రహీ ఇన్‌ఫ్రాటెక్, విక్రన్ ఇంజినీరింగ్, మిడ్‌వెస్ట్, వినే కార్పొరేషన్, సంభవ్ స్టీల్ ట్యూబ్స్, జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, ఆల్ టైమ్ ప్లాస్టిక్స్ లిమిటెడ్, స్కోడా ట్యూబ్స్, దేవ్ యాక్సిలరేటర్ చోటు చేసుకున్నాయి. ఈ సంస్థలన్నీ కలసి రూ. 8,000 కోట్లవరకూ సమీకరించనున్నట్లు అంచనా. విస్తరణ ప్రణాళికలు, రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, ప్రస్తుత వాటాదారుల వాటా విక్రయం తదితర లక్ష్యాలతో కంపెనీలు ఐపీవో బాట పడుతున్నట్లు నిపుణులు వివరించారు.

సమీకరణ తీరిదీ

ఐపీవోలో భాగంగా సోలార్ మాడ్యూల్ తయారీ కంపెనీ విక్రమ్ సోలార్ రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.74 కోట్ల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఆదిత్య ఇన్ఫోటెక్ రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని జారీ చేయడంతోపాటు.. రూ. 800 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఇక వరిండెరా రూ. 900 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుండగా.. ప్రమోటర్లు రూ. 300 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈ బాటలో ఈపీసీ సంస్థ విక్రన్ ఇంజినీరింగ్ రూ. 900 కోట్ల విలువైన ఈక్విటీ జారీ సహా.. రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ ఆఫర్ చేయనున్నారు.

కారణాలున్నాయ్

ప్రైమరీ మార్కెట్ల జోరుకు పలు సానుకూల అంశాలు దోహదం చేస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. స్థూల ఆర్థిక పరిస్థితులు, రంగాలవారీగా అనుకూలతలు, నిధుల లభ్యత, రిటైల్‌సహా సంస్థాగత ఇన్వెస్టర్ల ఆసక్తి తదితరాలను ప్రస్తావించారు. దేశీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి భారీగా పెట్టుబడులు ప్రవహిస్తుండటం, యూఎస్‌లో వడ్డీ రేట్ల కోత సైతం ఇందుకు తోడ్పాటునిస్తున్నట్లు ఈక్విరస్ ఎండీ మునీష్ అగర్వాల్ తెలియజేశారు. కోవిడ్-19, సబ్‌ప్రైమ్ సంక్షోభం, 2011 సెప్టెంబర్ ఉగ్రదాడి తదితర అనూహ్య విపరిణామాలు సంభవిస్తే తప్ప మార్కెట్లు పతనంకాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో 2025లో మార్కెట్ సరికొత్త రికార్డులను నెలకొల్పడంతోపాటు.. మరిన్ని కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే వీలున్నట్లు తెలియజేశారు.



సెప్టెంబర్ మాసం... రికార్డ్

ప్రైమరీ మార్కెట్లో సెప్టెంబర్ మాసం సరికొత్త రికార్డుకు తెరతీసింది. నెలాఖరున(30న) ఏకంగా 13 కంపెనీలు సెబీ తలుపుతట్టడంతో మొత్తం ముసాయిదా ప్రాస్పెక్టస్‌లు దాఖలు చేసిన కంపెనీల సంఖ్య 41కు చేరింది. ఇది పబ్లిక్ ఇష్యూల చరిత్రలోనే అత్యధికం. ఇంతక్రితం 2010 సెప్టెంబర్‌లోనే అత్యధికంగా 34 కంపెనీలు సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేశాయి. నిజానికి 2024 మార్చితో ముగిసిన కాలానికి ఆడిటెడ్ ఆర్థిక ఫలితాల దాఖలుకు సెప్టెంబర్ 30తో గడువు ముగియనుంది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ యోచనలో ఉన్న పలు కంపెనీలు సెబీకి క్యూ కట్టినట్లు నిపుణులు పేర్కొన్నారు. ప్రైమ్ డేటాబేస్ వివరాల ప్రకారం సెప్టెంబర్ మాసంలోనే అత్యధికసార్లు కంపెనీలు ఐపీవోకు దరఖాస్తు చేయడం గమనార్హం!



సెబీకి కంపెనీల దరఖాస్తు ఇలా..

తేదీ	సంఖ్య
సెప్టెంబర్ 2024	41
సెప్టెంబర్ 2010	34
ఆగస్ట్ 2021	27
సెప్టెంబర్ 2007	26
సెప్టెంబర్ 2009	24
మార్చి 2010	22
సెప్టెంబర్ 2021	22
డిసెంబర్ 2006	20
సెప్టెంబర్ 2011	20
మార్చి 2006	19

భారత్‌పై పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం

ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్‌తో వాణిజ్యం డౌన్ ● గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ అంచనా

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ఫలితంగా ఇజ్రాయెల్, లెబనాన్, జోర్డాన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్యంపై ప్రభావం పడినట్లు పరిశోధనా సంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. ఈ కల్లోల పరిస్థితుల్లో, పశ్చిమాసియాలో వేగంగా మారిపోతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల పట్ల భారత్ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 2024 జనవరి-జూలై కాలంలో ఉద్రిక్తతలు ఎదుర్కొంటున్న దేశాలతో భారత వాణిజ్యం ప్రభావానికి లోనైనట్లు తెలిపింది. ''ఇజ్రాయెల్‌కు భారత్ నుంచి ఎగుమతులు 63.5 శాతం తగ్గిపోయాయి. జోర్డాన్‌కు 38.5 శాతం క్షీణించాయి. లెబనాన్‌కు సైతం 6.8 శాతం తగ్గాయి''అని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం మొదలు కాగా, అది ఇప్పుడు లెబనాన్, సిరియాకు విస్తరించిందని.. ప్రత్యక్షంగా జోర్డాన్, ఇరాన్‌పైనా ప్రభావం చూపిస్తున్నట్టు చెప్పారు. అదే సమయంలో సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్ ఈ వివాదానికి దూరంగా ఉన్నాయి. తటస్థంగా ఉండడంతో ఈ గల్ఫ్ దేశాలతో (జీసీసీ) భారత్ వాణిజ్యం ఈ ఏడాది జనవరి-జూలై మధ్య 17.8 శాతం పెరిగినట్టు తెలిపారు. మరోవైపు సూయిజ్ కెనాల్, రెడ్‌సీ వంటి కీలక నౌకా రవాణా మార్గాల్లో అవరోధాలతో.. హార్న్ ఆఫ్ ఆఫ్రికా వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాల్సి రావడంతో షిప్పింగ్ వ్యయాలు 15-20 శాతం మేర పెరిగినట్టు జీటీఆర్ఐ నివేదిక తెలిపింది. ''ఇది భారత కంపెనీల లాభాల మార్జిన్లను గణనీయంగా దెబ్బతీసింది. ముఖ్యంగా తక్కువ స్థాయి ఇంజనీరింగ్ ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు, టెక్స్‌టైల్స్,గార్మెంట్స్‌లపై ప్రభావం ఎక్కువగా ఉంది'' అనివెల్లడించింది.

అంతర్జాతీయంగా 'భారత్ బ్రాండ్'కు గుర్తింపు

- ఈ దిశగా ప్రోత్సాహకానికి పథకం
- దీనిపై ఉన్నత స్థాయి కమిటీ సంప్రదింపులు



న్యూఢిల్లీ: 'మేడ్ ఇన్ ఇండియా' లేబుల్‌తో అంతర్జాతీయంగా భారత్ బ్రాండ్‌కు ప్రచారం తీసుకొచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఒక పథకం ప్రకటించే అవకాశం ఉందని, దీనిపై అత్యున్నత స్థాయి కమిటీ పనిచేస్తున్నట్టు ఓ అధికారి వెల్లడించారు. మేడ్ ఇన్ జపాన్, స్విట్జర్లాండ్ మాదిరే మేడ్ ఇన్ ఇండియాకు బలమైన బ్రాండ్ గుర్తింపు తీసుకురావాలన్నది ఇందులోని ఉద్దేశమ్మని తెలిపారు. ''స్విట్జర్లాండ్ గురించి చెప్పగానే వాచీలు, చాక్లెట్లు, బ్యాంకింగ్ రంగం గుర్తుకొస్తుంది. ఇదే మాదిరిగా మనం ఏమి చేయగలం అన్న దానిపై సంప్రదింపులు కొనసాగుతున్నాయి. మనకు మెరుగైన సామర్థ్యాలు కలిగిన టెక్స్‌టైల్స్ తదితర కొన్ని రంగాలకే ఈ పథకాన్ని పరిమితం చేయాలా? తదతర అంశాలపై దృష్టి సారించాం''అని ఆ అధికారి తెలిపారు. భారత్ బ్రాండ్‌కు ప్రచారం కల్పించే విషయంలో నాణ్యత కీలక అంశంగా ఉండాలన్నది నిపుణుల సూచన. ప్రస్తుతం కేంద్ర వాణిజ్య శాఖ పరిధిలో 'ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్' (ఐబీఈఎఫ్) ఈ దిశగానే పనిచేస్తోంది. భారత ఉత్పత్తులు, సేవలకు అంతర్జాతీయంగా అవగాహన, ప్రచారం కల్పించడం కోసం కృషి చేస్తుండడం గమనార్హం. ఇప్పుడు భారత ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు తెచ్చే లక్ష్యంతో పథకంపై సమాలోచనలు చేస్తోంది.

నాణ్యతే ప్రామాణికంగా ఉండాలి..

''భారత బ్రాండ్ బలోపేతానికి కొన్ని చర్యలు తీసుకోవాలి. నాణ్యతలో నిలకడ, మన్నిక ప్రాధాన్యంగా ఉండాలి. ఉదాహరణకు అధిక నాణ్యతతో కూడిన జనరిక్ ఔషధాల తయారీతో భారత ఫార్మాస్యూటికల్ పరిశ్రమ అంతర్జాతీయంగా మంచి నమ్మకాన్ని గెలుచుకుంది''అని స్వతంత్ర పరిశోధన సంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. భారత్ ప్రతిష్ట కాపాడుకునేందుకు నాణ్యతలేని ఉత్పత్తుల సరఫరాకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

రియల్టీ పెట్టుబడులు జూమ్

జులై-సెప్టెంబర్‌లో రూ. 9,600 కోట్లు



న్యూఢిల్లీ: దేశీ రియల్టీ రంగం భారీస్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకుంది. 2024 జులై-సెప్టెంబర్ (క్యూ3)లో దేశ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు దాదాపు 1.15 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 9,600 కోట్లు) ఇన్వెస్ట్ చేశారు. రియల్టీ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా గణాంకాల ప్రకారం గతేడాది(2023) ఇదే కాలంలో కేవలం 79.34 కోట్ల డాలర్ల(రూ. 6,625 కోట్లు) పెట్టుబడులు లభించాయి. ఖరీదైన గృహాలు, కార్యాలయాలకు నెలకొన్న పటిష్ట డిమాండ్‌ను సొమ్ము చేసుకునే యోచనతో సంస్థాగత ఇన్వెస్టర్లు పెట్టుబడులకు తెరతీస్తున్నట్లు సంస్థ పేర్కొంది. వెరసి రియల్టీలో పెట్టుబడులు క్యూ3లో 45% ఎగసినట్లు వెల్లడించింది.

విభాగాల వారీగా..

రియల్టీ రంగంలో ఈ ఏడాది క్యూ3లో ఆఫీసుల విభాగం అత్యధికంగా 61.63 కోట్ల డాలర్లు(రూ. 5,150 కోట్లు) అందుకుంది. గత క్యూ3లో నమోదైన 7.91 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది ఏడు రెట్లు పైగా వృద్ధి. ఇక రెసిడెన్షియల్ విభాగంలోనూ 40 శాతం అధికంగా 38.48 కోట్ల డాలర్లు(రూ. 3,215 కోట్లు) ప్రవహించాయి. గృహ విభాగం గత క్యూ3లో 27.46 కోట్ల డాలర్ల పెట్టుబడులు మాత్రమే అందుకుంది. అయితే ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్ విభాగంలో పెట్టుబడులు ఏకంగా 72% క్షీణించాయి. 9.52 కోట్ల డాలర్ల(రూ. 795 కోట్లు)కు పరిమితమయ్యాయి. గతేడాది క్యూ3లో 34.03 కోట్ల డాలర్ల(రూ. 2,840 కోట్లు) పెట్టుబడులు ఈ విభాగంలో నమోదయ్యాయి. ఇక మిక్స్‌డ్ వినియోగ ప్రాజెక్టులకు మాత్రం పెట్టుబడులు రెట్టింపై 5.24 కోట్ల డాలర్ల(రూ. 438 కోట్లు)ను తాకాయి. గతేడాది క్యూ3లో 2.72 కోట్ల డాలర్లు మాత్రమే వచ్చాయి. డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, సీనియర్ హౌసింగ్, హాలిడే హోమ్స్, స్టూడెంట్ హౌసింగ్, స్కూల్స్ తదితర ప్రత్యామ్నాయ ఆస్తులలో ఎలాంటి పెట్టుబడులూ నమోదుకాలేదు. గత క్యూ3లో వీటికి 7.22 కోట్ల డాలర్ల పెట్టుబడులు లభించాయి. రియల్టీ రంగ మొత్తం పెట్టుబడుల్లో దేశీ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా 44% (0.5 బిలియన్ డాలర్లు)గా నమోదైంది. ఈ క్యూ3లో ప్రాంతాలవారీగా చూస్తే మొత్తం రియల్టీ పెట్టుబడుల్లో చెన్నై, ముంబై 57% వాటాతో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు డేటా వెల్లడించింది.

కొనసాగనున్న డిమాండ్

దేశీ రియల్టీ రంగంలో సంస్థాగత పెట్టుబడులు నిలకడగా కొనసాగుతుండటం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నట్లు కొలియర్స్ ఇండియా క్యాపిటల్ మార్కెట్స్ విభాగ ఎండీ పీయూష్ గుప్తా పేర్కొన్నారు.

డ్రోన్ల వినియోగంతో పెరిగిన సాగు ఉత్పత్తి

ఐవోటెక్ వరల్డ్, ఇఫ్కో భాగస్వామ్య ప్రయోజనం

న్యూఢిల్లీ: డ్రోన్ టెక్నాలజీ కంపెనీ ఐవోటెక్ వరల్డ్ ఏవిగేషన్, రైతుల కోపరేటివ్ సొసైటీ ఇఫ్కో మధ్య భాగస్వామ్యం.. సాగు ఉత్పాదకత పెంపునకు తోడ్పినట్టు ఈ సంస్థలు ప్రకటించాయి. 2023 డిసెంబర్‌లో ఈ సంస్థలు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా 500 డ్రోన్లను రైతులకు సమకూర్చాయి. సాగులో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన డ్రోన్ల సాయాన్ని అందించాయి. ఇది 11 రాష్ట్రాల పరిధిలో 500 రైతులపై సానుకూల ప్రభావం చూపించినట్టు ఈ సంస్థలు వెల్లడించాయి. అగ్రిబోట్ డ్రోన్ కస్టమర్లకు ఈ సంస్థలు ఇటీవలే ప్రత్యేక పరిమిత కాల ఆఫర్‌ను కూడా ప్రకటించాయి. దీని కింద రైతులకు ఎలాంటి గరిష్ట విస్తీర్ణం పరిమితి లేకుండా ఇఫ్కో డ్రోన్లను అందిస్తుంది. పంటల నిర్వహణ, సామర్థ్యాలను పెంచడం దీని ఉద్దేశ్యమని ఇవి తెలిపాయి. ఒక డ్రోన్ ఆరు ఎకరాలకు ఒక గంటలో స్ప్రే చేసే సామర్థ్యంతో ఉంటుందని, ఒకటికి మించిన బ్యాటరీ సెట్‌తో ఒక రోజులో ఒక డ్రోన్‌తో 25 ఎకరాలకు స్ప్రే చేయొచ్చని తెలిపాయి.

బిజినెస్ రీల్

విక్రయ రుసుము తగ్గించిన అమెజాన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ విక్రయ రుసుమును గణనీయంగా తగ్గించింది. ఉత్పత్తి విభాగాలనుబట్టి 3-12 శాతం శ్రేణిలో ఈ తగ్గింపు ఉందని కంపెనీ సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ మంగళవారమిక్కడ మీడియాకు వెల్లడించారు. విక్రేతల మార్జిన్లు పెరిగేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందన్నారు. అలాగే మెరుగైన ధరల్లో కస్టమర్లకు విక్రయించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా విక్రేతల సంఖ్య గతేడాదితో పోలిస్తే పెరిగి 14 లక్షల నుంచి 16 లక్షలకు చేరిందన్నారు. ఈ ఏడాది అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌ను సెప్టెంబర్ 27 నుంచి నిర్వహిస్తోంది.

చిన్న నగరాల నుంచే..

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌లో భాగంగా మొదటి రెండు రోజుల్లో 80 శాతం కస్టమర్ విజిట్స్ ద్వితీయ, ఆ కింది స్థాయి నగరాలు, పట్టణాల నుంచి నమోదైందని కంపెనీ తెలిపింది. 11 కోట్ల మంది తమ పోర్టల్‌ను సందర్శించారని వెల్లడించింది. స్మార్ట్‌ఫోన్స్ విక్రయాల్లో 75 శాతంపైగా, టీవీ ఆర్డర్లలో 80 శాతం, ఫ్యాషన్, బ్యూటీ విభాగంలో 60 శాతానికిపైగా అమ్మకాలు ఈ ప్రాంతాల నుంచే ఉన్నాయని వివరించింది. 8,000 మంది చిన్న, మధ్యతరగతి విక్రేతలు రూ.1 లక్షకుపైగా వ్యాపారం నమోదు చేశారని వెల్లడించింది.

ఆరు ఫార్మా కంపెనీలతో గీలియడ్ ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బయోఫార్మాస్యూటికల్ రంగంలో ఉన్న అమెరికా దిగ్గజం గీలియడ్ సైన్సెస్ తాజాగా జనరిక్ ఔషధాల తయారీలో ఉన్న ఆరు కంపెనీలతో నాన్ ఎక్స్‌క్లూజివ్, రాయల్టీ రహిత వాలంటరీ లైసెన్సింగ్ ఒప్పందం చేసుకుంది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, హెటిరో, వియాట్రిస్ అనుబంధ కంపెనీ మైలాన్, ఎమ్‌క్యూర్, ఈవా ఫార్మా, ఫిరోజ్‌సన్స్ ల్యాబొరేటరీస్ వీటిలో ఉన్నాయి. గీలియడ్ అభివృద్ధి చేసిన హెచ్ఐవీ చికిత్సలో వాడే లెనకాపావిర్ ఔషధాన్ని ఈ కంపెనీలు తయారు చేసి 120 తక్కువ, మధ్య స్థాయి ఆదాయ దేశాలకు సరఫరా చేస్తాయి.

వేణుగోపాల్ ధూత్‌కు సెబీ రూ.కోటి డిమాండ్ నోటీస్



ముంబై: వీడియోకాన్ ఇండస్ట్రీస్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ కార్యకలాపాలకు పాల్పడినందుకుగాను దాదాపు రూ.1.03 కోట్లు చెల్లించాలని పారిశ్రామికవేత్త వేణుగోపాల్ ధూత్, మరో రెండు సంస్థలకు క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ డిమాండ్ నోటీసులు పంపింది. 15 రోజుల్లోగా చెల్లింపుల్లో విఫలమైతే అరెస్టుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆయన ఆస్తులతో పాటు ఇతర సంస్థలను ఆస్తులనూ జప్తు చేస్తానని రెగ్యులేటర్ హెచ్చరించింది. ధూత్‌తో పాటు, ఎలక్ట్రోపార్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, వీడియోకాన్ రియల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ నోటీసులు అందుకున్న సంస్థల్లో ఉన్నాయి. 2017లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను 2021 సెప్టెంబర్‌లో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) తమపై విధించిన రూ. 75 లక్షల జరిమానాను చెల్లించడంలో ధూత్‌తో సహా ఈ సంస్థలు విఫలమైన నేపథ్యంలో తాజా డిమాండ్ నోటీసులు జారీ అయ్యాయి. ధూత్, మరో రెండు సంస్థలు ప్రచురితంకాని ప్రైస్ సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ (యూపీఎస్ఐ) వద్ద మార్కెట్ లావాదేవీలను నిర్వహించినట్లు గుర్తించిన నేపథ్యంలో సెబీ ఈ చర్యలు తీసుకుంది.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.34	$ 69.83
బ్రెంట్	74.12	$ 73.56

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.ల్లో)

3-10-2024	
విశాఖ	535-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

ఎన్‌పీఏలు తగ్గుతున్నాయ్ కానీ.. క్రెడిట్ కార్డ్, మైక్రో, వ్యక్తిగత రుణాలే సమస్య!


రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ నివేదిక



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ వ్యవస్థలో స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 2.5 శాతానికి మెరుగుపడుతుందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తెలిపింది. అయితే, వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్, బ్యాంకింగ్ మైక్రోఫైనాన్స్ (ఎంఎఫ్ఐ) రుణాల వంటి ఎటువంటి హామీ లేని (అన్‌సెక్యూర్డ్) రుణాలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఆయా విభాగాల్లో బ్యాంకింగ్ రుణాలు ఇప్పటికే ఒత్తిడిలో ఉన్నాయని పేర్కొంది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు నమోదయ్యింది. 2024-25లో ఈ రేటును 6.8 శాతంగా అంచనా వేయడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రుణ వృద్ధి రేటు కూడా ఇదే సంవత్సరాల్లో 16 శాతం నుంచి 14 శాతానికి తగ్గే అవకాశం ఉంది. అయితే గడచిన దశాబ్ద కాలంలో 14 శాతం రుణ వృద్ధి రేటు అతిపెద్ద మూడవ వేగవంతమైన పురోగతి రేటు.
- వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్, బ్యాంకింగ్ మైక్రోఫైనాన్స్ (ఎంఎఫ్ఐ) రుణాల వంటి అన్‌సెక్యూర్డ్ రుణాలకు అధిక రిస్క్ వెయిటేజ్ ఇవ్వాలన్న రెగ్యులేటరీ నిబంధనలతో ఇప్పటికే బ్యాంకింగ్ వీటిపై ఆచితూచి వ్యవహరిస్తున్నాయి.
- స్థూల ఎన్‌పీఏలు గతంలో బ్యాంకింగ్ వ్యవస్థ తీవ్ర ఎదురుదెబ్బలకు కారణమయ్యాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా గణనీయమైన పురోగతి కనబడింది. 2023-24లో ఈ రేటు 2.8 శాతం ఉంటే, 2024-25లో 2.5 శాతానికి తగ్గడం సానుకూల పరిణామం.
- అన్‌సెక్యూర్డ్ రుణాలను తీసుకుంటే స్థూల ఎన్‌పీఏలు 2023-24లో 1.5 శాతం ఉంటే, 2024-25లో ఈ రేటు 2 శాతానికి చేరే అవకాశం ఉంది.
- 30 రోజుల పాటు చెల్లించని రుణాలను ఇంకా స్థూల ఎన్‌పీఏలుగా గుర్తించబడనప్పటికీ, ఇవి కూడా కలుపుకుంటే వీటి తీవ్రత 2.1 శాతం నుంచి 2.5 శాతానికి పెరుగుతుంది.
- 2023-24లో సూక్ష్మ రుణ సంస్థల రుణ వ్యయాలు 2 శాతం ఉంటే, 2024-25లో ఇవి 3.5 శాతానికి పెరగనున్నాయి.

కార్పొరేట్ 'క్రెడిట్ ప్రొఫైల్'కు ఎకానమీ వృద్ధి బాసట



ఇదిలాఉండగా, అధిక ఆర్థిక వృద్ధి రేటు... 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో భారత్ కార్పొరేట్ క్రెడిట్ ప్రొఫైల్‌ను మెరుగుపరిచినట్లు క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. ముందుముందు మరింత మెరుగుపడుతుందన్న అభిప్రాయాన్నీ వ్యక్తం చేసింది. దాదాపు 7,000 కంపెనీలను రేటింగ్ ఇచ్చే క్రిసిల్ రేటింగ్స్... ఈ విషయంలో ఒక నివేదిక విడుదల చేస్తూ, క్రెడిట్ ప్రొఫైల్ పెరుగుదల నిష్పత్తి 2023 అక్టోబర్- 2024 మార్చి మధ్య 1.79 రెట్లు ఉండగా, ఏప్రిల్-సెప్టెంబర్‌లో ఇది 2.75 రెట్లు మెరుగుపడినట్లు తెలిపింది. గత ఆరు నెలల్లో 506 కంపెనీల రేటింగ్‌లను అప్‌గ్రేడ్ చేయగా, 184 డౌన్‌గ్రేడ్‌లు ఉన్నాయని వివరించింది. సీనియర్ డైరెక్టర్ సోమశేఖర్ వేమూరి దీనిపై మాట్లాడుతూ, భారత్ కార్పొరేట్ రంగంపై క్రిసిల్‌కు సానుకూల క్రెడిట్ అవుట్‌లుక్ ఉందని తెలిపింది. ప్రభుత్వ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, ప్రైవేట్ వినియోగం ఎకానమీ పురోగతికి దారితీసే అంశాలని పేర్కొంది. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వ్యవధిలో (ప్రథమార్థంలో) 38 శాతానికి పైగా రేటింగ్ అప్‌గ్రేడ్‌లు మౌలిక సదుపాయాలు లేదా సంబంధిత రంగాలకు చెందినవేనని తెలిపింది.



బుమ్రా... మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్

దుబాయ్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో ఆరు వికెట్లతో అదరగొట్టిన బుమ్రా... టీమిండియా ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను వెనక్కినెట్టి నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నాడు. బుధవారం విడుదల చేసిన టెస్టు బౌలింగ్ తాజా ర్యాంకింగ్స్‌లో 870 పాయింట్లతో బుమ్రా 'టాప్'లో నిలవగా... 869 పాయింట్లతో అశ్విన్ రెండో స్థానం దక్కించుకున్నాడు. వీరిద్దరితోపాటు టాప్–10లో భారత్ నుంచి రవీంద్ర జడేజా (6వ ర్యాంక్) కూడా నిలిచాడు. ఆస్ట్రేలియా పేసర్లు జోష్ హాజల్‌వుడ్, ప్యాట్ కమిన్స్ వరుసగా మూడో, నాలుగో స్థానాల్లో ఉన్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (792 పాయింట్లు) మూడో స్థానానికి ఎగబాకాడు. కెరీర్‌లో 11 టెస్టులు మాత్రమే ఆడిన 22 ఏళ్ల జైస్వాల్... అసాధారణ ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశాడు. బంగ్లాదేశ్‌తో కాన్పూర్ టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధ శతకాలు సాధించిన జైస్వాల్‌కు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కాగా.. భారత్ నుంచి విరాట్ కోహ్లి 6వ స్థానంలో, రిషభ్ పంత్ 9వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ 899 పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ వరుసగా 15వ, 16వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా 468 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా... అశ్విన్ (358 పాయింట్లు) రెండో ర్యాంక్‌లో, అక్షర్ పటేల్ ఏడో ర్యాంక్‌లో ఉన్నారు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు 120 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతుండగా.. ఆస్ట్రేలియా 124 పాయింట్లతో 'టాప్'లో ఉంది.

సర్ఫరాజ్ డబుల్ సెంచరీ

- ముంబై 536/9
- రెస్ట్ ఆఫ్ ఇండియాతో ఇరానీ కప్ పోరు

లక్నో: మిడిలార్డర్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్ (276 బంతుల్లో 221 బ్యాటింగ్; 25 ఫోర్లు, 4 సిక్సర్లు) రికార్డు డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా రెస్ట్ ఆఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రంజీ చాంపియన్ ముంబై భారీ స్కోరు చేసింది. బుధవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 138 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 536 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 237/4తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై రెండో రోజంతా అదే జోరు కనబర్చింది. రహానే, షమ్స్ ములానీ (5) త్వరగానే ఔటైనా... తనుశ్ కోటియాన్ (124 బంతుల్లో 64; 6 ఫోర్లు)తో కలిసి సర్ఫరాజ్ చెలరేగిపోయాడు. మంచి బంతులను గౌరవిస్తూనే చెత్త బంతులపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 183 పరుగులు జోడించారు. ఈ క్రమంలో ఇరానీ కప్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి ముంబై ఆటగాడిగా సర్ఫరాజ్ రికార్డు సృష్టించాడు. గతంలో ముంబై ఆటగాళ్లు వసీమ్ జాఫర్ (విదర్భ తరఫున), రవిశాస్త్రి, ప్రవీణ్ ఆమ్రే, యశస్వి జైస్వాల్ (రెస్ట్ ఆఫ్ ఇండియా తరఫున) ఇరానీ కప్‌లో డబుల్ సెంచరీలు నమోదు చేసినా... వీరెవరూ ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తూ ఈ ఘనత సాధించలేదు. టీమిండియా టెస్టు జట్టులో సుస్థిర స్థానం దక్కించుకోవాలని చూస్తున్న సర్ఫరాజ్ దేశవాళీల్లో భీకర ఫామ్ కొనసాగిస్తూ చెలరేగగా... సీనియర్ ప్లేయర్ అజింక్యా రహానే (234 బంతుల్లో 97; 7 ఫోర్లు, ఒక సిక్సర్) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. శార్దూల్ ఠాకూర్ (36; 4 ఫోర్లు, ఒక సిక్సర్) కూడా అండగా నిలవడంతో ముంబై భారీ స్కోరు చేసింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో ముకేశ్ కుమార్ 4, యశ్ దయాళ్, ప్రసిధ్ కృష్ణ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



టెస్టు కెప్టెన్సీకి సౌతీ గుడ్‌బై



ఆక్లాండ్: న్యూజిలాండ్ జట్టు టెస్టు కెప్టెన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేస్ బౌలర్ టిమ్ సౌతీ ప్రకటించాడు. సారథిగా కంటే ఒక బౌలర్‌గా తన ప్రదర్శనతో జట్టుకు విజయాలు అందించడం ముఖ్యమని భావించానని... అందుకే నాయకత్వ బాధ్యతలకు దూరం అవుతున్నట్లు అతను వెల్లడించాడు. శ్రీలంక చేతిలో 0–2తో టెస్టు సిరీస్ ఓడి స్వదేశం చేరుకున్న తర్వాత సౌతీ తన నిర్ణయాన్ని బయట పెట్టాడు. 'నేను ఎంతో ఇష్టపడే ఫార్మాట్‌లో కివీస్ కెప్టెన్‌గా వ్యవహరించడం నాకు దక్కిన అదృష్టం. రాజీనామా నా వ్యక్తిగత నిర్ణయం. కోచ్ గ్యారీ స్టెడ్‌తో ఈ విషయం చర్చించాను. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా నా జట్టు సహచరులకు, జూనియర్లకు అండగా ఉంటా. ఒక పేస్ బౌలర్‌గా మళ్లీ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి జట్టు విజయాలకు ఉపయోగపడటం నా ప్రథమ కర్తవ్యం' అని సౌతీ పేర్కొన్నాడు. 2022 డిసెంబర్‌లో టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన సౌతీ సారథ్యంలో కివీస్ 14 టెస్టులు ఆడింది. ఇందులో 6 మ్యాచ్‌లో గెలిచిన జట్టు 6 ఓడగా... మరో 2 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. అయితే జట్టు వైఫల్యంతో పాటు సౌతీ పేలవ ఆట కూడా అతని కెప్టెన్సీ తప్పుకునేందుకు కారణమైంది. గత 8 టెస్టుల్లో కలిపి 12 వికెట్లు మాత్రం తీసిన సౌతీకి భారత్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో తుది జట్టులో చోటు దక్కడం కూడా కష్టంగానే ఉంది. సౌతీ స్థానంలో లాథమ్‌ను కివీస్ బోర్డు కొత్త కెప్టెన్‌గా నియమించింది.


వచ్చే ఏడాది భారత్‌లో ఖోఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: ఖోఖో ప్రపంచకప్ తొలి ఎడిషన్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది జరగనున్న ఈ టోర్నమెంట్‌లో 16 పురుషుల, మహిళల జట్లు పాల్గొంటాయని భారత ఖోఖో సమాఖ్య బుధవారం వెల్లడించింది. 2032 వరకు ఖోఖోకు ఒలింపిక్ క్రీడగా గుర్తింపు తీసుకొచ్చే దిశగా ఇది కీలక ముందడుగు అని పేర్కొంది. 'ఖోఖో మూలాలు భారత్‌లో ఉన్నాయి. ప్రాచీన క్రీడలో ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా ఘన సాంస్కృతిక వారసత్వానికి తగిన గుర్తింపు లభిస్తుంది. మట్టి నుంచి ప్రారంభమై మ్యాట్ వరకు చేరిన ఈ క్రీడను ఇప్పుడు ప్రపంచంలో 54 దేశాలు ఆడుతున్నాయి. 2032 నాటికి ఖోఖోకు ఒలింపిక్ క్రీడగా గుర్తింపు దక్కేలా చేయడమే మా అంతిమ లక్ష్యం. అందులో ప్రపంచకప్ తొలి అడుగు' అని ఖోఖో సమాఖ్య అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ పేర్కొన్నాడు.




అల్‌కరాజ్‌దే పైచేయి


అల్‌కరాజ్


సినెర్

- వరుసగా మూడోసారి ప్రపంచ నంబర్‌వన్ సినెర్‌పై విజయం
- చైనా ఓపెన్‌లో విజేతగా నిలిచిన స్పెయిన్ స్టార్
- ఈ ఏడాది నాలుగో టైటిల్ సొంతం

బీజింగ్: ఈ ఏడాది పురుషుల టెన్నిస్‌లో భీకరమైన ఫామ్‌లో ఉన్న యానిక్ సినెర్, అల్‌కరాజ్ మరోసారి ముఖాముఖి పోరులో కొదమ సింహాల్లా పోరాడారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో కీలకదశలో పాయింట్లు రాబట్టిన స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్ పైచేయి సాధించాడు. తద్వారా ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)పై అల్‌కరాజ్ వరుసగా మూడోసారి గెలుపొంది ఈ సీజన్‌లో నాలుగో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. బుధవారం ముగిసిన చైనా ఓపెన్ ఏటీపీ–500 టోర్నీలో ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ చాంపియన్‌గా నిలిచాడు. 3 గంటల 21 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అల్‌కరాజ్ 6–7 (6/8), 6–4, 7–6 (7/3)తో డిఫెండింగ్ చాంపియన్ సినెర్‌ను ఓడించాడు. చైనా ఓపెన్‌కంటే ముందు ఈ సీజన్‌లో అల్‌కరాజ్ ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ, ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ టైటిల్స్‌ను సాధించాడు. సినెర్‌తో జరిగిన తుది పోరులో తొలి సెట్‌లో అల్‌కరాజ్ 5–2తో ఆధిక్యంలో నిలిచాడు. అయితే సినెర్ పుంజుకొని స్కోరును సమం చేశాడు. చివరకు టైబ్రేక్‌లో తొలి సెట్‌ను దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో అల్‌కరాజ్ కోలుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో సెట్‌లోనూ ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. తుదకు టైబ్రేక్‌లో అల్‌కరాజ్ పైచేయి సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌కు 6,95,750 డాలర్ల (రూ. 5 కోట్ల 84 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సినెర్‌కు 3,74,340 డాలర్ల (రూ. 3 కోట్ల 14 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 330 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



నగాల్‌కు చుక్కెదురు

తొలి రౌండ్‌లో ప్రపంచ 564వ ర్యాంకర్ చేతిలో ఓటమి

న్యూఢిల్లీ: షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్ ఏటీపీ–1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. నేరుగా మెయిన్ 'డ్రా'లో పోటీపడ్డ 27 ఏళ్ల నగాల్ తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోయాడు. చైనాలో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 83వ ర్యాంకర్ సుమిత్ నగాల్ 3–6, 3–6తో ప్రపంచ 564వ ర్యాంకర్ యిబింగ్ వు (చైనా) చేతిలో ఓడిపోయాడు. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశాడు. కేవలం రెండు విన్నర్స్ కొట్టిన నగాల్ ఎనిమిది అనవసర తప్పిదాలు చేశాడు. సుమిత్‌కు 23,250 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 19 లక్షల 52 వేలు)తోపాటు 10 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తర్వాత నగాల్ గాయం కారణంగా కొన్ని రోజులు ఆటకు దూరంగా ఉన్నాడు. స్వీడన్‌తో డేవిస్ కప్ మ్యాచ్ ఆడాల్సిన సమయంలో నగాల్ వెన్నునొప్పి కారణంగా జాతీయ జట్టుకు అందుబాటులో లేకుండాపోయాడు. నగాల్ గైర్హాజరీ అంశం వివాదాస్పదమైంది. డేవిస్ కప్‌లో జాతీయ జట్టుకు ఆడాలంటే 50 వేల డాలర్ల వార్షిక ఫీజు తనకు చెల్లించాలని నగాల్ డిమాండ్ చేసినట్లు అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ఆరోపించింది.

క్వార్టర్ ఫైనల్లో భారత్

నాన్‌చాంగ్ (చైనా): ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. టర్కీతో బుధవారం జరిగిన గ్రూప్ 'ఇ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 110–99 పాయింట్లతో విజయం సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ఈ టోర్నీలో ప్రయోగాత్మకంగా రిలే స్కోరింగ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ఇరు జట్ల మధ్య 10 మ్యాచ్‌లు జరుగుతుండగా... తొలుత 110 పాయింట్లు చేరిన జట్టు విజేతగా నిలుస్తుంది. టర్కీకంటే ముందు పెరూ, అజర్‌బైజాన్, మారిషస్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లోనూ భారత జట్టు గెలిచింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ఇండోనేసియాతో భారత్ తలపడుతుంది.



యువ భారత్‌దే తొలి టెస్టు

రెండు వికెట్లతో ఆస్ట్రేలియాపై విజయం

చెన్నై: వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత అండర్–19 జట్టు అనధికారిక టెస్టు సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. ఆస్ట్రేలియా జట్టుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి టెస్టులో యువ భారత్ రెండు వికెట్ల తేడాతో గెలిచి 1–0తో ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 110/4తో బుధవారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా అండర్–19 జట్టు 67.4 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. రిలీ కింగ్‌సెల్ (48; 7 ఫోర్లు, ఒక సిక్స్) టాప్ స్కోరర్ కాగా... ఎయిడెన్ ఓ కానర్ (38 బంతుల్లో 35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా ఆడాడు. యువ భారత బౌలర్లలో లెగ్‌స్పిన్నర్ మహమ్మద్ ఇనాన్ ఆరు వికెట్లతో అదరగొట్టాడు. కెప్టెన్ సోహమ్ పట్వర్ధన్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 212 పరుగుల లక్ష్యఛేదనలో యువభారత్ ఆకట్టుకుంది. 61.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసి గెలుపొందింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో వైభవ్ సూర్యవంశీ (1) విఫలం కాగా.. నిత్య పాండ్యా (86 బంతుల్లో 51; 3 ఫోర్లు), నిఖిల్ కుమార్ (71 బంతుల్లో 55 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధశతకాలతో అదరగొట్టారు. ఒత్తిడి పెరిగిపోతున్న సమయంలో భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించిన నిఖిల్ కుమార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఎయిడెన్ ఓ కానర్ 4, విశ్వ రామ్‌కుమార్ మూడు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య సోమవారం నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుంది.



బాబర్ ఆజమ్ రాజీనామా

- పాకిస్తాన్ వన్డే, టి20 జట్ల సారథ్య బాధ్యతల నుంచి వైదొలిగిన స్టార్



కరాచీ: పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు వన్డే, టి20 ఫార్మాట్‌లలో కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న బాబర్ ఆజమ్ ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. తాను కెప్టెన్సీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించాడు. బ్యాటింగ్‌పై మరింత దృష్టి పెట్టేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అతను వెల్లడించాడు. ఈ విషయంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి, టీమ్ మేనేజ్‌మెంట్‌కు గతంలోనే సమాచారం అందించినట్లు బాబర్ చెప్పాడు. 'పాకిస్తాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవం. అయితే అసలు బాధ్యత బ్యాటింగ్‌పై మరింత దృష్టి పెట్టాల్సి ఉంది. నాయకత్వం కారణంగా నాపై అదనపు భారం పడుతోంది. నా ఆటను మరింతగా ఆస్వాదిస్తూ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంతో పాటు కుటుంబానికి తగినంత సమయం కేటాయించడం కూడా అవసరం. ఈ రాజీనామా తర్వాత నా శక్తియుక్తులన్నీ బ్యాటింగ్‌పైనే కేంద్రీకరించగలను. నాకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. జట్టుకు ఒక ఆటగాడిగా అన్ని విధాలా ఉపయోగపడేందుకు నేను సిద్ధం' అని బాబర్ ఆజమ్ ఒక ప్రకటన విడుదల చేశాడు. అతని రాజీనామాకు ఆమోదం తెలిపిన పీసీబీ కొత్త కెప్టెన్‌ను త్వరలోనే నియమించనుంది. వచ్చే నెలలో పాక్ జట్టు 3 వన్డేలు, 3 టి20ల కోసం ఆస్ట్రేలియా వెళ్లనుంది. ఆలోగా కెప్టెన్ ఎంపిక పూర్తవుతుంది. జట్టులో మరో సీనియర్ ప్లేయర్ అయిన రిజ్వాన్‌కే వన్డే, టి20 కెప్టెన్సీ పగ్గాలు దక్కే అవకాశం ఉంది. సొంతగడ్డపై ఈ నెల 7 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో పాకిస్తాన్ తలపడుతుంది.

జాతిపిత బోధనలు సర్వదా స్ఫూర్తిదాయకం


ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద గాంధీజీకి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రికి ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఘనంగా నివాళులర్పించారు. సత్యం, సామరస్యం, సమానత్వంపై ఆధారపడి ఉన్న గాంధీజీ జీవితం, బోధనలు మనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. సత్యం, అహింసా సూత్రాలను జీవిత పర్యంతం పాటించిన గాంధీజీ ప్రపంచవ్యాప్తంగా రాజకీయ నాయకులను, సామాజిక కార్యకర్తలను, ప్రజలను కొన్ని తరాలుగా ప్రభావితం చేస్తూనే ఉన్నారని వివరించారు. ఈ మేరకు మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మరోవైపు దేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి తన జీవితాన్ని సైనికులకు, రైతులకు అంకితం చేశారని కొనియాడారు. జైజవాన్, జైకిసాన్ అనే నినాదం ఇచ్చారని గుర్తు చేశారు. నిరాడంబరత, నిజాయతీతో ఎనలేని గౌరవం సంపాదించుకున్నారని చెప్పారు. ఢిల్లీలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి సమాధులైన రాజ్‌ఘాట్, విజయ్‌ఘాట్ వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు.

నివాళులర్పించిన ఖర్గే, రాహుల్ గాంధీ

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తదితరులు బుధవారం నివాళులర్పించారు.


ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద గాంధీజీకి నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

హామీలను బీజేపీ ఏనాటికీ నెరవేర్చదు

- హరియాణాలో ఎన్నికల ప్రచారంలో ఖర్గే విమర్శలు

చండీగఢ్: బీజేపీ విసిరే ఎన్నికల హామీల వలలో పడొద్దని హరియాణా ఓటర్లకు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సూచించారు. బుధవారం హరియాణాలోని ఛర్ఖీ దాద్రీలోని బద్రాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే ప్రసంగించారు. ''నేడు గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జన్మదినం. సత్యం, అహింస గురించి మహాత్ముడు హితబోధ చేశారు. అయితే ఇప్పుడు అధికారంలో ఉన్న వాళ్లు ఎంతగా అబద్ధాలు చెబుతున్నారో నేను మాటల్లో చెప్పలేను. హామీలను బీజేపీ ఏనాటికీ నెరవేర్చదు. నమ్మకాన్ని వమ్ముచేయటంలో మోదీ సిద్ధహస్తుడు. ఎన్నో అబద్ధాలు చెప్పి తప్పుడు వాగ్దానాలిచ్చారు. వేదికపై ఉన్న హరియాణా మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌లకు కూడా ఇవి తెలుసు''అని ఖర్గే వ్యాఖ్యానించారు.



జవాన్లు, రైతుల గురించి వాళ్లకు తెలీదు

''లాల్‌బహదూర్ శాస్త్రి జై జవాన్, జై కిసాన్ అని నినదించారు. అయితే ఈ జవాన్లు, రైతుల గురించి బీజేపీకి బొత్తిగా తెలీదు. వాళ్లకు ఆర్‌ఎస్‌ఎస్ అజెండా గురించే తెలుసు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలో ఒక్కరు కూడా రైతు కాదు. అందుకే వాళ్లకు రైతుల కష్టాలు, కన్నీళ్లు తెలియవు. బీజేపీ నేతలకు రైతులను గాలికొదిలేసి అదానీ, అంబానీలకు సాయపడతారు. అందుకే రైతులకు దక్కాల్సిన కనీస మద్దతు ధరను పట్టించుకోకుండా బడా పారిశ్రామికవేత్తలు, ధనికుల రూ.16 లక్షల కోట్లను మాఫీచేశారు. మోదీని పదవిలోంచి దింపేదాకా చనిపోనని మాట్లాడినందుకే నన్ను ఆన్‌లైన్‌లో వెక్కిరిస్తున్నారు. ఎంతగా దూషించినా ఒక్కటి చెప్తా. మీ వాళ్లు అప్పటికి బతికుండి చూస్తారో లేదో తెలీదుగానీ కాంగ్రెస్ మళ్లీ అధికార పీఠంపై కూర్చోవడం ఖాయం''అని ఖర్గే అన్నారు. ''2019 ఏప్రిల్ మూడున మోదీ ఉగ్రవాది అని వ్యాఖ్యానించిన అదే చంద్రబాబునాయుడితో ఇప్పుడు బీజేపీ చేతులు కలిపింది. పైగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్‌పై అభాండాలు వేస్తున్నారు. ముందు మిమ్మల్ని మీరు(బీజేపీ) అద్దంలో చూసుకోండి. మీ మిత్రపక్షాలు కూడా ఇదే చెబుతున్నాయి''అని ఖర్గే అన్నారు.

దేరాల చుట్టూ హరియాణా రాజకీయం

అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేస్తున్న మఠాలు, దేరాలు

- ఈ దేరాలకు లక్షలాది అనుచరులు
- ఎన్నికల కోసం బాబాల ఆశీర్వాదం తీసుకుంటున్న నేతలు
- అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచిన ఆరుగురు సాధువులు

హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయం ఇప్పుడు దేరాల చుట్టూ తిరుగుతోంది. ఓట్ల వేటలో నాయకులు ఏ అవకాశాన్ని వదలటం లేదు. సాధువులు, దేరా బాబాల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ భక్తులను ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం దేరా బాబాలు, మఠాలకు చెందిన సాధువులకు లక్షలాది మంది అనుచరులు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, నగరాల్లో ఉన్నారు. ఈ అనుచరుల ఓటింగ్ దేరా, మఠాలు ఇచ్చే సందేశం ఆధారంగా ఉంటుంది. ఈ కారణంగా హరియాణా రాజకీయాల్లో దేరాలు, మఠాలు పెద్ద ఓటుబ్యాంకుగా మారాయి. అదే సమయంలో, ఇప్పటికే రాజకీయాల్లోకి వచ్చిన చాలామంది సాధువులు బ్యాలెట్ పోరులో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈనెల 5వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుగురు సాధువులు, దేరా, గురుద్వారాల నుంచి ఒక్కొక్కరు సేవకులు బరిలో నిలిచారు.

– సాక్షి, న్యూఢిల్లీ

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మహామండలేశ్వర్ దర్శన్ గిరి.. బర్వాలా నియోజకవర్గం నుంచి, స్వామి అగ్నివేష్ పానిపట్ నుంచి, సునీల్ జోగి జులానా నుంచి, అవదూత్‌నాథ్ ప్రుథ్లా నుంచి, కర్మయోగి నవీన్ చర్ఖీ దాద్రి నుంచి, బాబా బల్వాన్‌నాథ్ తోషం నుంచి బరిలో నిలిచారు. వీరితోపాటు బాబా భుమ్మన్ షా దేరాకు చెందిన సేవదార్ బల్దేవ్ కుమార్, గురుద్వారా బేగంపురా ట్రస్ట్‌కు చెందిన సత్నామ్ సింగ్ అంబాలా సిటీ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచారు.

హరియాణా గ్రామీణ ప్రాంతాలైన రోహ్‌తక్, ఝజ్జర్, బహదూర్‌ఘర్ చుట్టూ అనేక పెద్ద దేరాలు ఉన్నాయి. ఒక్క రోహ్‌తక్‌లోనే మూడు దేరాలు, మఠాలు ఉన్నాయి. అందులో ప్రధానమైన లక్ష్మణపురి దేరా (గోకర్ణ)కు ఎంతో చరిత్ర ఉంది. ఈ దేరా అధిపతి, జునా అఖాడాకు చెందిన ఉపాచార్య బాబా కపిల్ పూరీ మహారాజ్‌కు లక్షలాది మంది అనుచరులు ఉన్నారు. ఆయన శిష్యులు చాలా మంది రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. అంతేగాక ఈ దేరా ప్రభావం రాష్ట్రంలోని 20కి పైగా అసెంబ్లీ స్థానాలపై స్పష్టంగా కనిపిస్తోంది.

ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీ, మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, ఇతర కాంగ్రెస్ నాయకులు కూడా కపిల్ పూరీ మహారాజ్‌కు భక్తులే. ఈ దేరాతో పాటు బాబా బాలక్‌పురి దేరా అధిపతి మహామండలేశ్వర్ కర్ణపురి మహారాజ్‌కు సైతం మాజీ ముఖ్యమంత్రులు సహా అనేకమంది రాజకీయ నాయకులు శిష్యులుగా ఉన్నారు. మరోవైపు నాథ్ శాఖకు చెందిన బాబా మస్త్‌నాథ్ మఠం సైతం రోహ్‌తక్‌లోనే ఉంది. నాథ్ శాఖ జాతీయ ఉపాధ్యక్షుడు బాబా బాలక్‌నాథ్ ప్రస్తుతం ఈ మఠానికి నేతృత్వం వహిస్తున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నాథ్.. శాఖ జాతీయ అధ్యక్షుడుగా ఉన్నారు. ప్రస్తుతం ఈ మఠం రాజకీయాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపుతోంది. ఈ మఠానికి చెందిన బాబా బాలక్‌నాథ్ అల్వార్ నుంచి ఎంపీ అవగా.. గత రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో తిజారా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

మరోవైపు జీటీ బెల్ట్‌లో పంజాబ్, హరియాణాకు చెందిన దేరాలు చాలా కీలకంగా ఉన్నాయి. దేరా రాధాస్వామి బియాస్ సత్సంగ్ అనేక ప్రాంతాల్లో ప్రభావం చూపుతోంది. రాధాస్వామి సత్సంగ్ ప్రత్యక్షంగా ఏ పార్టీకి మద్దతు ఇవ్వకపోయినప్పటికీ... ఈ దేరా దళిత సమాజంలో బలమైన ఉనికిని కలిగి ఉంది. సీఎం నయాబ్ సైనీ, మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖులు అనేకసార్లు దేరా చీఫ్ గుర్విందర్ సింగ్ ధిల్లాన్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా నిరంకారి దేరా సైతం జీటీ బెల్ట్‌పై గణనీయమైన ప్రభావాన్ని చూపుతోంది. అంబాలా, జగాద్రి, కర్నాల్, కురుక్షేత్ర, గోహనా, సోనిపట్ సహా అనేక జిల్లాల్లో దేరాకు పెద్ద ఎత్తున అనుచరులు ఉన్నారు. దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన సిర్సాకు చెందిన దేరా సచ్చా సౌదా గత కొన్నేళ్లుగా చాలా వివాదాల్లో ఉంది, కానీ దాని ప్రభావం మొత్తం హరియాణాలో ఉంది. దేరా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ అత్యాచారం, హత్య కేసులో జీవిత ఖైదును అనుభవిస్తున్నప్పటికీ, అతను మధ్యమధ్యలో పెరోల్‌పై జైలు నుంచి బయటికి వస్తున్నారు. రామ్ రహీమ్ బుధవారమే 20 రోజుల పెరోల్‌పై విడుదలయ్యారు. హరియాణాలో అడుగుపెట్టకూడదని ఈసీ షరతు విధించింది.

ఇది అన్యాయం, అసత్యాలపై పోరాటం

- బీజేపీకి వ్యతిరేకంగా ఓటేసి గద్దె దించండి
- హరియాణా ఓటర్లకు ప్రియాంక గాంధీ పిలుపు

చండీగఢ్: పోలింగ్ జరిగే అక్టోబర్ ఐదున బీజేపీకి వ్యతిరేకంగా ఓటేసి అధికార పీఠం నుంచి ఆ పార్టీని కిందకు దింపాలని హరియాణా ఓటర్లకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జులానా పట్టణంలో ప్రచారసభలో ప్రియాంక ప్రసంగించారు. ''కురుక్షేత్ర యుద్ధంలో మాదిరి మీకు చక్కటి అవకాశం మరోసారి వచ్చింది. బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా ఆనాడు పోరాటం చేసినట్లే అలాంటి అవకాశం మీకు మళ్లీ దక్కింది. అన్యాయం, అసత్యాలు, దుర్మార్గాలపై మీరు పోరాడాల్సిన సమయమొచ్చింది. మీరంతా ఐక్యంగా నిలబడండి. హరియాణాలో పాలన ఎలా ఉందో మీరే ఆత్మపరిశీలన చేసుకోండి''అని అన్నారు. ''అగ్నివీర్‌లకు పెన్షన్ ప్రయోజనాలు లేవు. నాలుగేళ్ల తర్వాత ఉద్యోగం ఉండదు. మళ్లీ ఉపాధి వెతుక్కోవాల్సిందే. ఇవే మోదీ మీకిచ్చిన వరాలు''అని ప్రియాంక విమర్శించారు. ''రైతులు, జవాన్లు, మల్లయోధులు, మహిళలు ఇలా ప్రతి వర్గాన్ని పదేళ్లుగా బీజేపీ తప్పుదోవ పట్టిస్తోంది. ఢిల్లీ సరిహద్దుల్లో నెలల తరబడి ఉద్యమించిన రైతులను కలవడానికి మోదీకి ఐదు నిమిషాల తీరిక దొరకలేదా?. 24 పంటలకు మద్దతుధర ప్రకటిస్తే అందులో కనీసం 10 హరియణాలో అస్సలు పండించరు. మిమ్మల్ని నమ్మించి మోసం చేసేదెవరో తెలుస్తోందా?. ఈ గారడీని దేశమంతా చూస్తోంది. ఇప్పటికైనా మేల్కోండి. ఈ ప్రభుత్వాన్ని మార్చండి''అని ఓటర్లకు ప్రియాంక సూచించారు. ''వినేశ్ ఫొగాట్ న్యాయపోరాటం చేసింది. మోదీ కనీసం పిలిచి కలిసి టీ తాగి సమస్యపై చర్చించలేదు. వినేశ్‌కు యావత్ భారతావని అండగా నిలిచింది''అని అన్నారు.





గోవాలో యాత్ర ప్రారంభమైన దృశ్యం

నారీమణుల సాహసయాత్ర షురూ

- ప్రపంచాన్ని చుట్టిరానున్న ఇద్దరు నేవీ ఆఫీసర్లు

పనాజీ: భారత నావికాదళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులు అపూర్వ సాహస యాత్రకు శ్రీకారం చుట్టారు. ఎనిమిది నెలల్లో సముద్రంపై ప్రపంచాన్ని చుట్టిరావడానికి బుధవారం గోవా నుంచి బయలుదేరారు. వారు మొత్తం 21,600 నాటికల్ మైళ్ల (23,335 కిలోమీటర్లు) ప్రయాణిస్తారు. లెఫ్టినెంట్ కమాండర్లు దిల్నా, రూపా ఈ యాత్రకు పూనుకున్నారు. వారి ప్రయాణాన్ని చీఫ్ ఆఫ్ ద నావల్ స్టాఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి జెండా ఊపి ప్రారంభించారు. ఇద్దరు మహిళా అధికారులు వచ్చే ఏడాది మే నెలలో గోవాకు తిరిగివస్తారు. భారత నావికాదళానికి చెందిన ఐఎన్‌ఎస్‌వీ తరిణి నౌకలో వీరిద్దరూ ప్రయాణం ఆరంభించారు. సముద్రాల పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా వీరు ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. కేరళలోని కాలికట్‌లో జన్మించిన దిల్నా 2014లో, పుదుచ్చేరికి చెందిన రూపా 2017లో ఇండియన్ నేవీలో చేరారు.

అవసరాలకు మించి బియ్యం సేకరణ

- గత మార్కెటింగ్ సీజన్‌లో మొత్తంగా 5.25 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ
- ప్రస్తుత దేశ అవసరాలు 4.10 కోట్ల మెట్రిక్ టన్నులే
- అధిక బియ్యం సేకరణలో మొదటి స్థానంలో పంజాబ్, మూడో స్థానంలో తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ: గడిచిన సెప్టెంబర్‌తో ముగిసిన 2023–24 మార్కెటింగ్ సీజన్‌లో దేశ అవసరాలకు మించి బియ్యాన్ని సేకరించినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి రబీ, ఖరీఫ్ సీజన్‌లతో కలిపి మొత్తంగా 5.25 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించినట్లు ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ తెలిపింది. ఖరీఫ్ కాలంలో 4.63 కోట్ల టన్నులు, రబీలో 62.41 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించింది. కనీస మద్దతు ధర అందించి మొత్తం సేకరణ కోసం రూ.1.07 లక్షల కోట్లు వెచ్చించింది. నిజానికి ఈ మార్కెటింగ్ సీజన్‌లో 6.26 కోట్ల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కొన్ని రాష్ట్రాల్లో అతివృష్టి, మరికొన్ని చోట్ల అనావృష్టి కారణంగా బియ్యం సేకరణ లక్ష్యం తగ్గింది. ఆహార భద్రతా చట్టం కింద రేషన్ లబ్ధిదారులకు సరఫరాతోపాటు సంక్షేమ పథకాల కోసం ఏటా 4.10 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం సరిపోతుంది. అదనంగా సేకరించిన బియ్యాన్ని బఫర్ స్టాక్‌గా కేంద్రం నిల్వచేయనుంది. ఈ ఏడాది ప్రజా పంపిణీ వ్యవస్థ కింద బియ్యానికి బదులుగా 30లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలను సరఫరా చేయాలని నిర్ణయించింది. అత్యధికంగా పంజాబ్ నుంచి 1.24 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించారు. తర్వాతి స్థానాల్లో ఛత్తీస్‌గఢ్(83 లక్షల టన్నులు), తెలంగాణ(63.86లక్షల టన్నులు) నిలిచాయి. పదో స్థానంలో ఆంధ్రప్రదేశ్ (20.38లక్షల టన్నులు) నిలిచింది. ప్రస్తుత మార్కెటింగ్ సీజన్ (2024–25)లో కేంద్రం 4.83 కోట్ల మెట్రిక్ టన్నులను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రాల నుంచి బియ్యం సేకరణ ప్రక్రియను మొదలు పెట్టింది.



జన సురాజ్ పార్టీ స్థాపించిన ప్రశాంత్ కిశోర్

- బిహార్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న పీకే

పట్నా: ఎన్నికల వ్యూహకర్తగా పలు రాష్ట్రాల్లో పలు పార్టీలను విజయతీరాలు చేర్చిన ప్రశాంత్ కిశోర్ బిహార్‌లో నూతన రాజకీయ పార్టీని స్థాపించారు. జన సురాజ్ పార్టీ పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించినట్లు బుధవారం ప్రకటించారు. పట్నాలో జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి దేవేంద్రప్రసాద్ యాదవ్, రాజకీయనేతగా మారిన మాజీ దౌత్యవేత్త పవన్ వర్మ, మాజీ ఎంపీ మొనాజిర్ హసన్‌తదితర ప్రముఖుల సమక్షంలో పార్టీ వివరాలను వెల్లడిస్తూ ప్రశాంత్ మాట్లాడారు. ''విద్యా, ఉపాధి అవకాశాలు దక్కని బిహార్ ప్రజల సమస్యలపై గత రెండేళ్లుగా మేం పోరాటంచేస్తున్నాం. బిహార్‌లో విద్యావిధానం మెరుగుకు రూ.4 లక్షల కోట్లు అవసరం. మద్యనిషేధం కారణంగా ప్రభుత్వం ఏటా రూ.20,000 నష్టపోతోంది. మేం అధికారంలోకి రాగానే గంట సేపటికే నిషేధం ఎత్తేస్తాం''అని ప్రశాంత్ అన్నారు. మధుబనిలో పుట్టిన మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి మనోజ్ భారతిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే పార్టీ వ్యవస్థాగత ఎన్నికల దాకా ఆయనే ఆ పదవిలో కొనసాగుతారని ప్రశాంత్ తెలిపారు. నూతన రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పాటుకోసం జనాల మద్దతు కూడగట్టడం కోసం సరిగ్గా రెండేళ్ల క్రితం ప్రశాంత్ 'సత్యాగ్రహ'కార్యక్రమాన్ని మొదలెట్టడం తెల్సిందే.

వారంలో ఏడుగురు

అగ్రనాయకత్వాన్ని కోల్పోయిన హెజ్‌బొల్లా

నిఘా సమాచారం.. కచ్చితమైన దాడులతో ఏరివేస్తున్న ఇజ్రాయెల్

లెబనాన్‌లో అత్యంత బలంగా ఉన్న హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపునకు ఇజ్రాయెల్ దాడుల్లో కోలుకోలేని దెబ్బ తగిలింది. వారం రోజుల్లోనే ఏడుగురు అగ్రనాయకులను కోల్పోయింది. లెబనాన్ చేష్టలుడిగిపోయింది. మరోవైపు కచ్చితత్వంలో లక్ష్యాలను ఛేదించిన ఇజ్రాయెల్ అధికారులు తమ నిఘా వ్యవస్థ పనితీరును, సైనిక పాటవాన్ని చూసి సంబరాల్లో మునిగిపోయారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు అలముకున్నాయి. లెబనాన్‌లో బలీయ మిలటరీ, రాజకీయ శక్తిగా ఉన్న హెజ్‌బొల్లా శరాఘాతాల నుంచి తేరుకోవడానికి ప్రయత్నిస్తోంది. అధినేత హసన్ నస్రల్లా సహా హెజ్‌బొల్లాను స్థాపించిన 1980 నుంచి కీలక సభ్యులుగా ఉన్న పలువురిని వారం రోజుల్లో కోల్పోయింది. నస్రల్లా మినహా మిగతావారు బయటి ప్రపంచానికి అంతగా పరిచయం లేని వ్యక్తులే అయినప్పటికీ.. హెజ్‌బొల్లాలో వారి పాత్ర కీలకం. వీరిలో ఎవరేమిటో చూద్దాం..

– సాక్షి, నేషనల్ డెస్క్

నబిల్ కౌక్



కౌక్ శనివారం వైమానిక క్షిపణి దాడిలో మరణించారు. హెజ్‌బొల్లా సెంట్రల్ కౌన్సిల్ ఉప నాయకుడు. హెజ్‌బొల్లాను స్థాపించిన తొలినాళ్లలో 1980లలో దాంట్లో చేరారు. 1995–2010 మధ్య హెజ్‌బొల్లా దక్షిణ లెబనాన్ మిలటరీ కమాండర్‌గా పనిచేశారు. మీడియాతో తరచూ మాట్లాడేవారు. మద్దతుదారులను ఉద్దేశించి ఉపన్యసించేవారు. హెజ్‌బొల్లా మిలిటెంట్ల అంత్యక్రియల సందర్భంగా భావోద్వేగ ప్రసంగాలు చేసేవారు. నస్రల్లాకు వారసుల్లో ఒకరిగా కౌక్‌ను పరిగణించేవారు.

ఇబ్రహీం అకీల్



హెజ్‌బొల్లా అగ్రశ్రేణి కమాండర్. మెరికల్లాంటి రాద్వాన్ ఫోర్సెస్‌కు నాయకుడు. రాద్వాన్ ఫోర్సెస్‌ను తమ సరిహద్దుల్లోంచి వెనక్కినెట్టాలని ఇజ్రాయెల్ చాన్నాళ్లుగా ప్రయత్నిస్తోంది. అత్యున్నత సైనిక మండలి 'జిహాద్ కౌన్సిల్'లో అకీల్ సభ్యుడు. ఎన్నో ఏళ్లుగా అమెరికా వాంటెడ్ లిస్ట్‌లో ఉన్నాడు. 1983లో బీరుట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో పేలుళ్లలో అకీల్ పాత్ర ఉందని అమెరికా హోంశాఖ పేర్కొంది. అమెరికన్లు, జర్మన్లను బందీలుగా పట్టుకోవడంలో ముఖ్య భూమిక పోషించాడని తెలిపింది.

హసన్ నస్రల్లా



1992 నుంచి హెజ్‌బొల్లా నాయకుడిగా ఉన్నారు. ఇజ్రాయెల్‌లో పలు యుద్ధాల్లో హెజ్‌బొల్లాకు సారథ్యం వహించారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లాను ప్రబల రాజకీయ, సైనికశక్తి తీర్చిదిద్దారు. పశ్చిమాసియాలో పలు ప్రాంతీయ సంఘర్షణల్లో పాలుపంచుకుంటూనే రాజకీయ శక్తి ఎదిగింది. పారామిలటరీ దళంగా రూపుదిద్దుకుంది. 2011లో సిరియా తిరుగుబాటు కాస్తా అంతర్యుద్ధంగా మారింది. సిరియా అధ్యక్షుడు బషర్ అసద్‌ను అధికారంలో ఉంచడంలో హెజ్‌బొల్లా కీలకపాత్ర పోషించింది. ఇరాక్, యెమెన్‌లలోనూ (ఇరాన్ అండదండలున్న) సాయుధ తిరుగుబాటు గ్రూపులు తమ శక్తిసామర్థ్యాలను మెరుగుపర్చుకోవడానికి నస్రల్లా సారథ్యంలోని హెజ్‌బొల్లా సాయపడింది. లెబనాన్‌లో నస్రల్లాను ఆరాధించేవారు, విరోధించేవారు సమపాళ్లలో ఉంటారు. 2000 సంవత్సరంలో దక్షిణ లెబానాన్‌కు ఇజ్రాయెల్ నుంచి విముక్తి కల్పించిన హీరోగా మద్దతుదారులు నస్రల్లాను కీర్తిస్తారు. గుట్టలుగా ఆయుధాలను పోగేసుకొని.. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శకులు అంటారు. టెహరాన్ ఎజెండాకు అనుగుణంగా హెజ్‌బొల్లా పనిచేస్తోందని వారి ఆరోపణ.

అలీ కరాకీ



దక్షిణాది వ్యవహారాలకు బాధ్యుడు. హమాస్‌కు మద్దతు, ఇజ్రాయెల్‌పై పోరులో దక్షిణాది దళాలకు నాయకత్వం వహించాడు. హెజ్‌బొల్లా నాయకత్వంలో ముఖ్యుడని అమెరికా అలీ కరాకీని అభివర్ణించింది. ఇతని గురించి బయటి ప్రపంచానికి తెలిసింది తక్కువే. ఇజ్రాయెల్ బాంబుదాడుల్లో నస్రల్లాతో పాటు చనిపోయాడు.

ఇబ్రహీం కొబైసీ



హెజ్‌బొల్లా క్షిపణి యూనిట్‌కు నాయకుడు. 2000 సంవత్సరంలో ఉత్తర సరిహద్దుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ సైనికులను కిడ్నాప్ చేసి హతమార్చడం కొబైసీ పథకరచనే అని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. నాలుగేళ్ల తర్వాత యుద్ధఖైదీల మార్పిడి కిందట ఈ ముగ్గురు సైనికుల మృతదేహాలను హెజ్‌బొల్లా ఇజ్రాయెల్‌కు అప్పగించింది.

మొహమ్మద్ సురౌర్



హెజ్‌బొల్లా డ్రోన్ విభాగం చీఫ్. ఇజ్రాయెల్‌తో గాజాపై విరుచుకుపడ్డాక.. ప్రస్తుత యుద్ధంలో తొలిసారిగా హెజ్‌బొల్లా దాడులకు డ్రోన్లకు వాడింది. సురౌర్ నేతృత్వంలో ఇజ్రాయెల్ లోపలి భూభాగాల్లోకి వెళ్లి.. పేలిపోయే విధంగా డ్రోన్లను వాడారు. అలాగే గూఢచర్యానికి కూడా హెజ్‌బొల్లా డ్రోన్లను వినియోగించింది. ఇజ్రాయెల్ ప్రధానంగా హెజ్‌బొల్లా ప్రయోగించే రాకెట్లు, క్షిపణులపై దృష్టి పెట్టగా.. డ్రోన్ల ద్వారా ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలను ఛేదించి హెజ్‌బొల్లా దాడులు చేసింది.

అహ్మద్ వెహబే




రాద్వాన్ ఫోర్సెస్ కమాండర్. రెండు దశాబ్దాల కింద ఈ దళాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి దీన్ని ఉన్నతశ్రేణి దళంగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. బీరుట్ దక్షిణ శివారులో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో అకీల్‌తో పాటు వెహబే కూడా మరణించాడు. వీరు తలదాచుకున్న భవనం పూర్తిగా నేలమట్టమైంది.

మిగిలింది వీరే..

అగ్రనాయకత్వంలో అతికొద్ది మంది మిగిలి ఉన్నారు. నస్రల్లా తర్వాతి స్థానంలో ఉన్నది నయీం కస్సెమ్. అత్యంత సీనియర్. 1991 నుంచి హెజ్‌బొల్లాకు డిప్యూటీ లీడర్‌గా ఉన్నారు. హషీం సైఫిద్దీన్ హెజ్‌బొల్లా సెంట్రల్ కౌన్సిల్ అధిపతి. నస్రల్లాకు సోదరుడైన హషీం హెజ్‌బొల్లా సారథ్య బాధ్యతలు చేపడతారని భావిస్తున్నారు. బతికి ఉన్న అగ్రనేతల్లో మరో ఇద్దరు.. తలాల్ హమీహే, అబూ అలీ రెదాలు. వీరిందరిపై ఇజ్రాయెల్ ఇప్పుడు గురిపెట్టింది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ-మెయిల్ sakshieducation@gmail.com

భారత సమాఖ్య నిర్మాణం-పని విధానం





ఏ దేశ రాజ్యాంగమైనా ఆనాటి పరిస్థితులను ప్రతిబింబిస్తుంది అని మన మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పేర్కొన్నారు. ఆయన మాటలు వాస్తవీకరణ పొందాలంటే.. మారుతున్న దేశ కాలమాన పరిస్థితులకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. 50 ఏళ్ల రాజ్యాంగ పనితీరును అధ్యయనం చేసేందుకు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య నేతృత్వంలో రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ రెండేళ్ల తర్వాత 2002లో నివేదిక సమర్పించింది. ఈ కమిషన్ రాజ్యాంగం పని విధానాన్ని మొత్తం అధ్యయనం చేసే సందర్భంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల తీరును విశ్లేషించడమే కాకుండా పలు సూచనలు చేసింది. 2007లో మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మదన్‌మోహన్ పూంఛీ కమిషన్ కేంద్ర-రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి 2010 మార్చిలో నివేదిక సమర్పించింది. వీరప్ప మొయిలీ నేతృత్వంలోని రెండో పరిపాలనా సంస్కరణల కమిషన్ కూడా కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై ప్రత్యేక నివేదికను రూపొందించింది.

భారతదేశం - అర్ధ సమాఖ్య

భారతదేశ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రాజ్యాంగ నిర్మాతలు.. మన రాజ్యాంగాన్ని ఏకకేంద్ర, సమాఖ్య లక్షణాల కలయికగా రూపొందించారు. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి సమాఖ్య విధానాన్ని ఆమోదిస్తూనే దేశ విభజన కాలంనాటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ బలమైన కేంద్రానికి అవకాశం కల్పించే ఏకకేంద్ర లక్షణాలకు రాజ్యాంగంలో చోటు కల్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించిన కాంగ్రెస్ పార్టీ.. రాజ్యాంగ రచనలో కూడా కీలక పాత్రను నిర్వహించింది. స్వాతంత్ర్యానికి పూర్వం కేంద్రీకరణ ధోరణిని సమర్థించిన కాంగ్రెస్ ఆలోచనా విధానం రాజ్యాంగంలోనూ ప్రతిబింబిస్తుంది. భిన్నత్వానికి నిలయమైన మనదేశంలో ఏకత్వాన్ని సాధించాలంటే కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉండటమే ఏకైక పరిష్కార మార్గంగా కాంగ్రెస్ విశ్వసించి.. బలమైన కేంద్రీకృత ధోరణిని అనుసరించింది. అందుకే కె.సి.వేర్ మన రాజ్యాంగాన్ని విశ్లేషిస్తూ 'భారతదేశం బలమైన ఏకకేంద్ర లక్షణాల బలహీనమైన సమాఖ్యయే గానీ బలమైన సమాఖ్య లక్షణాలు గల బలహీనమైన ఏకకేంద్రం కాదు' అని వ్యాఖ్యానించారు. అంటే 'భారతదేశం ఒక అర్ధ సమాఖ్య వంటిది' అని పేర్కొన్నారు.

భారతదేశం - సహకార సమాఖ్య

గ్రాన్‌విలే ఆస్టిన్, డి.ఎస్. బెనర్జీలు మన దేశాన్ని ఒక సహకార సమాఖ్యగా వర్ణించారు. అధికరణ 252 ప్రకారం రెండు అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు కోరినప్పుడు.. రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం శాసనం చేయడం, అధికరణ 258 ప్రకారం కేంద్రం.. రాష్ట్రాలను సంప్రదించి కొన్ని నిర్మాణపరమైన బాధ్యతలను అప్పగిస్తే రాష్ట్రాలు వాటిని నిర్వర్తించడం, కేంద్రానికి-రాష్ట్రాలకు, రాష్ట్రాలు-రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పెంపొందించే ఉద్దేశంతో అధికరణ 263 ప్రకారం అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అధికరణ 285 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆస్తులపై రాష్ట్రాలు పన్నులు విధించకుండా, అధికరణ 289 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులపై కేంద్రం పన్నులు విధించకుండా రాజ్యాంగ పరంగా చేసిన ఏర్పాట్లు మనదేశాన్ని ఒక సహకార సమాఖ్యగా వర్ణించడానికి కారణమయ్యాయి.

బలమైన కేంద్రీకృత ధోరణి

సర్ ఐవర్ జెన్నింగ్స్ వంటి వారు మనదేశాన్ని ఒక బలమైన కేంద్రీకృత ధోరణి గల సమాఖ్యగా వర్ణించారు. అధికరణ 249 ప్రకారం రాజ్యసభ ప్రత్యేక తీర్మానం చేస్తే, రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశానికి జాతీయ ప్రాముఖ్యత ఉందని భావిస్తే ఆ అంశంపై శాసనం చేసే అధికారం కేంద్రానికి ఉంది. జాతీయ అత్యవసర పరిస్థితిలో అధికరణ 250 ప్రకారం కేంద్రం.. రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా శాసనం చేయవచ్చు. 365 అధికరణను అనుసరించి కేంద్రం జారీ చేసిన ఆదేశాన్ని సదరు రాష్ట్రం తప్పనిసరిగా పాటించాలి. లేకుంటే ఆ రాష్ట్రంపై చర్య తీసుకునే అధికారం కేంద్రానికి ఉంది. అధికరణ 356 ద్వారా విధించే రాష్ట్రపతి పాలన కేంద్ర ప్రభుత్వం వద్ద ఉండే వజ్రాయుధం వంటిది. అందుకే 356 అధికరణను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర ప్రభుత్వాల పాలిట చావు ఉత్తర్వు వంటిదని పేర్కొన్నారు.

వాస్తవికమైన సమాఖ్య

ప్రముఖ అమెరికన్ పాలనా శాస్త్రవేత్త పాల్ ఆపిల్‌బీ, అలెగ్జాండ్రి విజ్ వంటి వారు మన సమాఖ్యను వాస్తవికమైన సమాఖ్యగానే పేర్కొన్నారు. గ్రాన్‌విలే ఆస్టిన్ మరొక సందర్భంలో భారత సమాఖ్య నిర్మాణంలో రాజ్యాంగ నిర్మాతల వివేకం దాగి ఉందని వ్యాఖ్యానించారు. 7వ షెడ్యూల్‌లో పొందుపరిచిన అధికారాల పంపిణీ జాబితాలో పేర్కొన్న అంశాల ప్రాముఖ్యాన్ని అనుసరించి మాత్రమే జరిగిన అధికారాల పంపిణీగా పేర్కొంటారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ఉండే సమన్వయానికి నిదర్శనం ఉమ్మడి జాబితా.

రాజ్యాంగ - రాజ్యాంగేతర సంస్థల ప్రభావం

స్వాతంత్ర్యానంతరం మన దేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను అనుసరించింది. సామాజిక, ఆర్థిక ప్రణాళికలు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. 1950లో ఏర్పడిన ప్రణాళికా సంఘం.. జాతీయ ప్రణాళికలను రూపొందించడంతోపాటు ప్రాంతీయ ప్రయోజనాలను నిర్ణయించేది. కానీ ప్రణాళికా సంఘంలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. ప్రణాళికా ముసాయిదాను ఆమోదించే జాతీయాభివృద్ధి మండలిలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ.. అందులో కూడా కేంద్రం ప్రభుత్వానిదే ఆధిపత్యం. ప్రణాళిక లక్ష్యాలను దృష్ట్యా కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆదాయ వనరులను పంపిణీ చేసే కేంద్ర ఫైనాన్స్ కమిషన్‌లో కూడా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేదు. ఈ రెండూ కూడా మన సమాఖ్య పని తీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆర్థికపరమైన ఈ కేంద్రీకరణ దృష్ట్యా ప్రముఖ రాజ్యాంగ, ఆర్థిక నిపుణుడు కె. సంతానం మన దేశం సమాఖ్య విధానాన్ని అనుసరించాలని కోరుకున్నప్పటికీ, వాస్తవంలో ఏకకేంద్ర విధానాన్నే అనుసరిస్తుందని పేర్కొన్నారు. దీనికి గల ప్రధాన కారణం ఆర్థిక అంశాల కేంద్రీకరణే. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన నీతిఆయోగ్‌లో రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రాతినిధ్యం కల్పించడం కీలక అంశం.

వాస్తవిక సమాఖ్యతో మనం విభేదించే అంశాలు

ప్రపంచంలో అత్యుత్తమమైన సమాఖ్యకు పర్యాయపదంగా నిలిచే అమెరికా సమాఖ్యతో మనదేశం పలు విషయాల్లో విభేదిస్తుందనే అంశం సుస్పష్టం. భారతదేశం ఏక పౌరసత్వాన్ని, ఒకే రాజ్యాంగం, ఏకీకృత న్యాయ వ్యవస్థను అనుసరిస్తుంది. అమెరికాలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సెనేట్‌లో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం లభిస్తుంటే మన రాజ్యసభలో పెద్ద రాష్ట్రాలకు ఎక్కువ, చిన్న రాష్ట్రాలకు తక్కువ ప్రాతినిధ్యం కల్పించారు. అమెరికా బలమైన రాష్ట్రాలను ఏర్పాటు చేస్తే మనం బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మన దగ్గర అవశిష్ట అధికారాలను కేంద్రానికి కట్టబెట్టారు. వాస్తవిక సమాఖ్యకు భిన్నంగా మన రాజ్యాంగం ప్రధానంగా అదృఢమైంది. సూత్రబద్ధమైన సమాఖ్య కాకపోడంతో మన రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని వినియోగించలేదు.

కేంద్ర-రాష్ట్రాల వివాదాలు- పరిష్కార మార్గాలు

1967 సాధారణ ఎన్నికల తదనంతరం వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్షాలకు చెందిన ప్రభుత్వాలు రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చాయి. దీంతో 1966లో ఏర్పాటు చేసిన మొదటి పరిపాలనా సంస్కరణల కమిషన్ నుంచి ఎం.సి. సీతల్‌వాడ్ కమిటీని ప్రత్యేకంగా కేంద్ర - రాష్ట్ర సంబంధాలు, వివాదాల అధ్యయనం కోసం ఇందిరాగాంధీ ప్రభుత్వం నియమించింది. సీతల్‌వాడ్ కమిటీ సమూల మార్పులను సూచించనప్పటికీ.. కొన్ని కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. కేంద్రం తరచుగా రాష్ట్రాల విషయాల్లో జోక్యం చేసుకోకుండా చర్యలు చేపట్టాలని, అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేయాలని పేర్కొంది. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ సూచనలను కేంద్రం తప్పనిసరిగా పాటించాలని కోరింది. గవర్నర్లుగా వివాదాస్పదం కాని వ్యక్తులను నియమించాలని సూచించింది. 1967లో తమిళనాడులో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం పి.వి. రాజమన్నార్ నేతృత్వంలో కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి ప్రధాన కారణం సీతల్‌వాడ్ కమిటీ సూచనలు రాష్ట్రాలకు సంతృప్తిని ఇవ్వకపోవడమే. రాజమన్నార్ కమిటీ .. రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించడం కోసం రాజ్యాంగాన్ని సవరించాలని పేర్కొంది. ఉమ్మడి జాబితాలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను కేంద్రానికి కేటాయించి మిగిలిన అధికారాలన్నీ రాష్ట్రాలకు బదలాయించాలని కోరింది. ప్రణాళికా సంఘంలో సమూల మార్పులు చేయాలని సూచించింది. ఎక్కువ ఆర్థిక వనరులను కల్పించడం కోసం విదేశీ ఎగుమతులు, దిగుమతులపై విధించే సుంకాల్లో రాష్ట్రాలకు కూడా వాటా కల్పించాలని కోరింది.

1980లో చోటు చేసుకున్న రాజకీయ మార్పుల నేపథ్యంలో 1983లో ఇందిరాగాంధీ ప్రభుత్వం సర్కారియా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై అనేక అంశాలతో కూడిన సవివరమైన నివేదికను రాజీవ్‌గాంధీ ప్రభుత్వానికి సమర్పించింది. గవర్నర్ వ్యవస్థ వివాదాస్పదం కాకుండా ఉండటం కోసం పలు సూచనలు చేసింది. 356 అధికరణను చివరి అస్త్రంగా మాత్రమే వినియోగించాలని కమిషన్ పేర్కొంది. ఆదాయ పన్నుపై విధించే సెస్, కార్పొరేట్ ట్యాక్స్‌లో రాష్ట్రాలకు వాటా కల్పించాలని సూచించింది. అంతర్ రాష్ట్ర వ్యాపార వాణిజ్యంపై చట్టాలు చేసేటప్పుడు, ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్రం శాసనాలు చేసే సందర్భంలో రాష్ట్రాల అభిప్రాయాలను, ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై వ్యాఖ్యానించే సందర్భంలో అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ద్వారా కేంద్రం లేదా రాష్ట్రాలు సహకార సమాఖ్య ఏర్పాటు కోసం కృషి చేయాలని సూచించింది.

కేంద్ర - రాష్ట్రాల మధ్య వివాదాలు - కారణాలు

గడిచిన ఆరు దశాబ్దాలలో కేంద్ర-రాష్ట్రాల సంబంధాల తీరును పరిశీలిస్తే పలు సందర్భాల్లో వివాదాలు, సమస్యలు కనిపిస్తాయి. 1967లో నాలుగో సాధారణ ఎన్నికల అనంతరం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. ఎనిమిది రాష్ట్రాల్లో కాంగ్రెసేతర పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అప్పుడే రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనే డిమాండ్ ప్రారంభమైంది. ప్రధానమైన సంక్షేమ శ్రేయోవాద అంశాల సంబంధిత బాధ్యతలన్నీ రాష్ట్రాలకు అప్పగించగా ఆర్థిక వనరులన్నీ కేంద్రం వద్ద ఉండేవి. క్రమంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు అధ్వాన్నంగా తయారయ్యాయి. దాంతో రాష్ట్రాలు నిరంతరం కేంద్రంపై ఆధారపడాల్సి వచ్చింది. గవర్నర్ వ్యవస్థ కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలకు మరో కారణం. రాజ్యాంగం గవర్నర్లకు విచక్షణాధికారాలను కల్పించింది. అయితే గవర్నర్లు వాటిని విచక్షణ రహితంగా వినియోగించడం ప్రధాన సమస్యగా పరిణమించింది. ఏ రాజకీయ పార్టీ శాసనసభలో మెజార్టీ సాధించలేని సందర్భంలో ముఖ్యమంత్రి నియామకం గవర్నర్ విచక్షణాధికారంపైనే ఆధారపడి ఉంటుంది. 1952 తమిళనాడు గవర్నర్ ప్రకాశ్ మొదలు.. జార్ఖండ్‌లో గవర్నర్ సయ్యద్ సిబ్తరజి.. శిబూ సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించడం వంటివి గవర్నర్లు తమ అధికారాలను విచక్షణ రహితంగా వినియోగించడానికి నిదర్శనాలు.

రాష్ట్ర శాసనసభలో మెజార్టీని కోల్పోయిన సందర్భంలో సదరు ప్రభుత్వానికి తమ మెజార్టీ నిరూపించుకునే అవకాశాన్ని కల్పించకుండా వాటి రద్దు చేయడం మరో సమస్య. 1984లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు ప్రభుత్వానికి శాసనసభలో మెజార్టీ ఉన్నప్పటికీ.. మెజార్టీ నిరూపించుకునే అవకాశం ఇవ్వకుండానే అప్పటి గవర్నర్ ప్రభుత్వాన్ని రద్దుచేసి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా నియమించారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లో అప్పటి గవర్నర్ రమేష్ బండారీ బీజేపీకి చెందిన కల్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దుచేసి జగదంబికా పాల్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు (ఈ నియామకాన్ని అలహాబాద్ హైకోర్టు నిలిపివేయడంతోపాటు సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది).


కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలకు మరో కారణం 356 అధికరణ దుర్వినియోగం. రాజ్యాంగంలో అత్యంత వివాదాస్పద అధికరణ 356. కారణం దాన్ని వినియోగించిన తీరు వివాదాస్పదం కావడమే. 1959లో కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని ఈ అధికరణతో రద్దు చేశారు. 1977లో కేంద్రంలో అధికారంలో ఉన్న జనతా ప్రభుత్వం 9 రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై ఈ అధికరణను ప్రయోగించింది. 1980లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ ప్రభుత్వం 9 రాష్ట్రాల్లోని జనతా ప్రభుత్వాలను రద్దు చేసింది. 1989లో కర్ణాటకలో ఎస్.ఆర్. బొమ్మై ప్రభుత్వాన్ని, నాగాలాండ్‌లో ఎస్.సి. జమీర్ ప్రభుత్వాన్ని రద్దు చేయడాన్ని 1994లో సుప్రీం కోర్టు 'ఎస్.ఆర్. బొమ్మై/యూనియన్ ఆఫ్ ఇండియా' మధ్య జరిగిన వ్యాజ్యంలో అధికరణ 356 దుర్వినియోగం మన సమాఖ్య విధానానికి భంగకరం అని పేర్కొంది. అంతేకాకుండా సమాఖ్య విధానం మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని కూడా వ్యాఖ్యానించింది.


రాజ్యాంగ - రాజ్యాంగేతర సంస్థల పని విధానానికి సంబంధించి ముఖ్యంగా ప్రణాళికా సంఘం, కేంద్ర ఫైనాన్స్ కమిషన్‌ల ఏకఛత్రాధిపత్యాన్ని రాష్ట్రాలు తమ ప్రయోజనాలకు పెద్ద ఆటంకంగా భావిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కేంద్రం రాష్ట్రాలపై ఆధిపత్యాన్ని కొనసాగించడం లేదా తరచుగా జోక్యం చేసుకోవడం కూడా మరో సమస్య. 1967లో దుర్గాపూర్ ఇనుము ఉక్కు కర్మాగారంలో కార్మికుల సమ్మె సందర్భంగా కనీ సం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే కేంద్రం సాయుధ బలగాలను మోహరించింది. దీంతో అప్పటి ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి జ్యోతిబసు రాజీనామా చేస్తాననడం గమనించదగిన అంశం.


అత్యధిక కెలోరిఫిక్ విలువ గల పదార్థం




1. ఒక సెకండ్ల లోలకం పొడవు 100 సెం.మీ. దాని పొడవును మార్చిన డోలనావర్తన కాలం ఒక సెకనుకు మారినప్పుడు దాని పొడవు? (సెం.మీ.లలో)
   1) 100 2) 50 3) 25 4) 75
2. అత్యంత కచ్చితంగా కాలాన్ని కొలిచే సాధనాలు?
   1) చేతి గడియారాలు
   2) పరమాణు గడియారాలు
   3) నీటి గడియారాలు 4) పైవన్నీ
3. విమానాల తయారీలో ఇమిడి ఉన్న సూత్రం?
   1) పాస్కల్ సూత్రం 2) బాయిల్ సూత్రం
   3) ఆర్కిమెడీస్ సూత్రం 4) బెర్నౌలీ సూత్రం
4. నీటి కాఠిన్యతకు కారణమైనవి
   1) కాల్షియం, మెగ్నీషియంల బైకార్బొనేట్లు
   2) కాల్షియం, మెగ్నీషియంల క్లోరైడ్లు, సల్ఫేట్లు
   3) కాల్షియం, మెగ్నీషియంల నైట్రేట్లు
   4) కాల్షియం, మెగ్నీషియంల కార్బొనేట్లు
5. 1986లో కనిపించిన హేలీ తోకచుక్క మళ్లీ ఏ సంవత్సరంలో కనిపిస్తుంది?
   1) 2062 2) 2022 3) 2046 4) 2056
6. వేసవిలో తారురోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు దూరంగా నీరు ఉన్నట్లు కనిపిస్తుంది. దీనికి కారణం?
   1) కాంతి పరావర్తనం 2) కాంతి ధృవణం
   3) సంపూర్ణాంతర పరావర్తనం
   4) కాంతి వివర్తనం
7. 0 డిగ్రీల సెంటీగ్రేడు వద్ద గాలిలో ధ్వనివేగం 332 మీ/సె. అయిన 1 డిగ్రీ సెంటీగ్రేడు ఉష్ణోగ్రత పెరిగితే అప్పుడు గాలిలో ధ్వని వేగం (మీ/సెలలో)
   1) 332.608 2) 332
   3) 330.608 4) 332.680
8. కిందివాటిలో తిర్యక్ తరంగాలు
   1) స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు
   2) కాంతి తరంగాలు 3) నీటి తరంగాలు
   4) కాంతి, నీటి తరంగాలు
9. అత్యధిక కెలోరిఫిక్ విలువ గల పదార్థం?
   1) అరటి పండు 2) గోధుమలు
   3) మాంసం 4) వేరుసెనగ
10. ఆల్ఫా, బీటా, గామాల నిష్పత్తి
    1) 3 : 2 : 1 2) 1 : 2 : 3
    3) 1 : 3 : 2 4) 2 : 1 : 3
11. దూరపు వస్తువుల్ని మాత్రమే చూడగలిగి, దగ్గరి వస్తువుల్ని చూడలేనప్పుడు దృష్టి సవరణకు ఏ కటకాన్ని ఉపయోగిస్తారు?
    1) కుంభాకార 2) పుటాకార
    3) ద్వి పుటాకార 4) పైవన్నీ
12. న్యూటన్ మూడో గమన సూత్రం ఆధారంగా పనిచేసేది?
    1) హెలికాప్టర్ 2) రైలు
    3) రాకెట్ 4) విమానం
13. విశ్వ గురుత్వ స్థిరాంకం 'G'కు ప్రమాణం
    1) Nm^2Kg^2 2) Nm^2Kg^{-2}
    3) N^2m^2Kg 4) $Nm^{-2}Kg^{-2}$
14. పెట్రోలియంలో పెట్రో అనగా లాటిన్‌లో ?
    1) నూనె 2) రాయి
    3) మండుట 4) వాసన
15. 0.1 కిలోగ్రాముల బరువున్న ఒక పక్షి భూమికి 10 మీటర్ల ఎత్తులోని చెట్టు కొమ్మపై ఉన్న దాని స్థితిశక్తి?
    1) 4.9 జౌల్స్ 2) 9.8 జౌల్స్
    3) 20 జౌల్స్ 4) 0.1 జౌల్స్
16. ఓడలలో లంగరును పైకెత్తుటకు ఉపయోగించేది?
    1) స్క్రూ జాక్ 2) విండ్‌లాస్
    3) కాప్‌స్టన్ 4) వించ్
17. ద్రవాల విశిష్ట సాంద్రతను కనుగొనడానికి ఉపయోగించే పరికరం?
    1) లాక్టో మీటర్ 2) హైడ్రో మీటర్
    3) పైరో మీటర్ 4) బారో మీటర్
18. విద్యుదయస్కాంతాల తయారీకి ఉపయోగించేది?
    1) ఉక్కు 2) మెత్తని ఇనుము
    3) నిక్రోమ్ 4) మాంగనీస్
19. ఫెర్రో అయస్కాంతాల సాపేక్ష ప్రవేశ్య శీలత?
    1) $\mu_r \le 1$ 2) $\mu_r > 1$
    3) $\mu_r = 1$ 4) $\mu_r >> 1$
20. కిందివాటిలో విద్యుత్ విశ్లేషణ అనువర్తనానికి ఉదాహరణ
    1) ఎలక్ట్రో ప్లేటింగ్ 2) ఎలక్ట్రో టైపింగ్
    3) లోహాల శుద్ధి 4) పైవన్నీ
21. లెడెన్ జాడీ అనేది ఒక
    1) కెపాసిటర్ 2) అమ్మీటర్
    3) వోల్ట్‌మీటర్ 4) ఓల్టా మీటర్
22. నిరోధానికి గుర్తు



23. డైనమో ఏ నిబంధన ఆధారంగా పనిచేస్తుంది?
    1) లెంజ్ నియమం
    2) ఫ్లెమింగ్ కుడిచేతి నిబంధన
    3) ఆంపియర్ 4) మాక్స్‌వెల్
24. ఒక రేడియో ధార్మిక మూలకం అర్ధ జీవిత కాలం 6.93 రోజులు. దాని విఘటన స్థిరాంకం?
    1) 0.1 $రోజు^{-1}$ 2) 00.1 $రోజు^{-1}$
    3) 100 రోజులు 4) 1000 రోజులు
25. కింది వాటిలో ఐసోబార్
    1) ${}_1H^1, {}_1H^2, {}_1H^3$
    2) ${}_{10}Ne^{20}, {}_{10}Ne^{21}, {}_{10}Ne^{22}$
    3) ${}_6C^{13}, {}_7N^{13}$ 4) ఏదీకాదు
26. కింది వాటిలో యంత్ర భాష
    1) బేసిక్ 2) కోబాల్
    3) ఫోర్ట్రాన్ 4) అసెంబ్లర్
27.  సంకేతం
    1) p-n-p ట్రాన్సిస్టర్
    2) n-p-n ట్రాన్సిస్టర్
    3) p-p-n ట్రాన్సిస్టర్
    4) n-p-p ట్రాన్సిస్టర్
28. వాయు స్థిరాంకం R విలువ
    1) 0.0821 లీ-అట్మా.$మోల్^{-1}k^{-1}$
    2) 8.314×10^7 ఎర్గ్$మోల్^{-1}k^{-1}$
    3) 1.987 కేల్.$మోల్^{-1}k^{-1}$ 4) అన్నీ
29. కింది వాటిలో సరైంది
    1) 3p<4s<4p<3d 2) 3p<4s<4d<2s
    3) 3s<3p<4s<3d 4) 4p<3d<5p<6s
30. ఆర్బిటాల్ ప్రాదేశిక దృగ్విన్యాసాలను తెలియజేసే క్వాంటం సంఖ్య
    1) ప్రధాన క్వాంటం సంఖ్య
    2) అజిమూతల్ క్వాంటం సంఖ్య
    3) అయస్కాంత క్వాంటం సంఖ్య
    4) స్పిన్ క్వాంటం సంఖ్య
31. పరమాణు సంఖ్య 57 నుంచి 70 వరకు గల మూలకాల్ని ఏమంటారు?
    1) లాంథనైడ్స్ 2) ఆక్టినైడ్స్
    3) ఛాల్కో జెన్స్ 4) హాలోజెన్స్
32. ఆక్సైడ్‌లతో పాటు పెరాక్సైడ్‌లను ఏర్పరిచే మూలకం
    1) Be 2) Ba 3) Ca 4) Sr
33. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఫార్ములా
    1) $CaSo_4\ 2H_2o$ 2) $CaSo_4 ½ H_2o$
    3) $CaSo_4$ 4) $Ca\ Co_3$
34. కోణీయ ఆకృతి గల అణువు
    1) నీరు 2) బెంజీన్
    3) అమ్మోనియా 4) బేరియం క్లోరైడ్
35. అంతరణుక హైడ్రోజన్ బంధాలు గల అణువుకు ఉదాహరణ
    1) HF 2) సాలిసిలిక్ ఆమ్లం
    3) 0- నైట్రో ఫినాల్ 4) 0- క్లోరో ఫినాల్
36. $H_2+I_2 \rightleftharpoons 2HI$ చర్యకు k_p, k_c మధ్య సంబంధం
    1) $k_p < k_c$ 2) $k_p = k_c$
    3) $k_p > k_c$ 4) $k_p >> k_c$
37. STP వద్ద 1 మోల్ వాయువు ఆక్రమించు ఘనపరిమాణం
    1) 2.24 లీటర్లు 2) 0.224 లీటర్లు
    3) 22.4 లీటర్లు 4) 224 లీటర్లు
38. క్షార గుణం కలిగిన మానవ శరీర ద్రవం
    1) ఉమ్మి 2) మూత్రం
    3) జఠర రసం 4) రక్తం
39. 750 మిల్లీ లీటర్ల 0.4 మోల్‌ల NaOH ద్రావణంలో NaOH ఉన్న మోల్‌ల సంఖ్య?
    1) 0.03 2) 0.3 3) 3.1 4) 0.4
40. అత్యంత శ్రేష్ఠమైన బొగ్గు
    1) బిట్యుమస్ 2) ఆంథ్ర సైట్
    3) సెమీ బిట్యుమస్ 4) లిగ్నైట్
41. కిందివాటిలో ఏరోమాటిక్ సమ్మేళనం



42. కిందివాటిలో మెటామెరిజం సాదృశ్యకాలు
    1) nబ్యూటేన్, ఐసో బ్యూటేన్
    2) 1- క్లోరో బ్యూటేన్, 2- క్లోరో బ్యూటేన్
    3) 1- ప్రొపనోల్, మిథాక్సీ ఈథేన్
    4) ఇథాక్సీ ఈథేన్, మిథాక్సీ ప్రొపేన్
43. 96 శాతం ఆల్కహాల్‌ను ఏమంటారు?
    1) వాష్ 2) రెక్టిఫైడ్ స్పిరిట్
    3) అబ్సల్యూట్ ఆల్కహాల్ 4) వెనిగర్
44. మూడు క్షారాల వరుసను ఏమంటారు?
    1) కోడన్ 2) ట్రాన్ స్క్రిప్షన్
    3) రెప్లికేషన్ 4) ట్రాన్స్‌లేషన్
45. నీటిలో కరిగే విటమిన్
    1) A 2) D 3) E 4) C
46. ద్రగలన ప్రక్రియకు ఉపయోగించే కొలిమి
    1) రివర్బరేటర్ 2) షాఫ్ట్
    3) బ్లాస్ట్ 4) ఓపెన్‌హార్త్
47. అల్నికో మిశ్రమ లోహ సంఘటనం
    1) Fe+C 2) Fe+Al+Ni+Co
    3) Fe+Ni+Cr+Mn 4) Fe+cr+Ni
48. ముఖానికి వాడే పౌడర్‌లో ఉన్న ఫాటీ ఆమ్ల లవణం
    1) K^+ 2) Na^+ 3) Mg^{2+} 4) Li^+
49. దృశ్య పరికరాలు, విద్యుత్ బల్బుల తయారీలో ఉపయోగించే గాజు
    1) సోడా గాజు 2) పైరెక్స్ గాజు
    3) క్వార్ట్జ్ గాజు 4) ఫ్లింట్ గాజు
50. టాల్క్ రసాయన నామం
    1) మెగ్నీషియం సిలికేట్
    2) మెగ్నీషియం కార్బొనేట్
    3) మెగ్నీషియం ఆక్సైడ్
    4) కాల్షియం సిలికేట్
51. ఆస్పరిన్ మందు నిర్మాణం



52. వల్కనైజేషన్ ప్రక్రియలో రబ్బరును ఏ మూలకంతో కలుపుతారు.
    1) ఫాస్ఫరస్ 2) సిలికాన్
    3) జింక్ 4) సల్ఫర్
53. రెండు విషయాల మధ్య ఎలాంటి సంబంధం లేదని చెప్పే ప్రకల్పన
    1) నల్ ప్రకల్పన
    2) ప్రకటనాత్మక ప్రకల్పన
    3) ప్రాగుక్తి ప్రకల్పన 4) ప్రశ్నా ప్రకల్పన
54. జ్ఞాన సముపార్జనకు దోహదపడేది
    1) తర్కం 2) స్పందన
    3) కంఠస్థం 4) అధికారత్వం
55. సౌర గడియారం, నీటి గడియారాలను మొదటి సారిగా తయారు చేసింది?
    1) బాబిలోనియన్లు 2) చైనీయులు
    3) ఈజిప్టియన్లు 4) గ్రీకులు
56. ఆన్ ది రివల్యూషన్ ఆఫ్ ద సెలెస్టియల్ స్పియర్స్ అనే గ్రంథ రచయిత?
    1) కోపర్నికస్ 2) గెలీలియో
    3) అరిస్టాటిల్ 4) గ్రాహంబెల్
57. విద్యుత్ జనరేటర్ ఆవిష్కర్త
    1) ఆయర్‌స్టడ్ 2) మాక్స్‌వెల్
    3) బ్రోగ్లీ 4) ఫారడే
58. తరగతిలో బోధనాభ్యసనా కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో వచ్చే ప్రవర్తనా మార్పులు
    1) ఆశయాలు 2) లక్ష్యాలు
    3) స్పష్టీకరణలు 4) విలువలు
59. భావావేశ రంగంలో అత్యున్నత లక్ష్యం
    1) వ్యవస్థాపన
    2) శీల స్థాపన
    3) విలువ కట్టడం
    4) ప్రతిస్పందించడం
60. దోషాలను గుర్తించుట అనేది ఏ లక్ష్యానికి చెందిన స్పష్టీకరణ
    1) నైపుణ్యం 2) జ్ఞానం
    3) అవగాహన 4) వినియోగం
61. ఒక విద్యార్థి సాంద్రత, సాపేక్ష సాంద్రతల మధ్య తేడాల్ని గుర్తించాడు. అతడిలో నెరవేరిన లక్ష్యం
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వినియోగం 4) నైపుణ్యం
62. NTSE అనగా
    1) నేషనల్ టాలెంట్ సైన్స్ ఎడ్యుకేషన్
    2) నేషనల్ టాలెంట్ సైన్స్ ఎగ్జామ్
    3) నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్
    4) నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ ఎంట్రన్స్
63. విద్యార్థి కేంద్ర పద్ధతి కానిది
    1) ఉపన్యాస పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్ట్ పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
64. సహజ పరిసరాల్లో సమన్వను సాధించే పద్ధతి
    1) హ్యూరిస్టిక్ పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) నియోజన పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి
65. ప్రయోగశాలలోని వస్తువుల్ని విద్యార్థులకు ఇచ్చేటప్పుడు వాటి వివరాలను ఏ రిజిస్టర్‌లో పొందుపరుస్తారు?
    1) ఇష్యూ రిజిస్టర్ 2) ఆర్డర్ రిజిస్టర్
    3) రిక్వైర్‌మెంట్ రిజిస్టర్ 4) స్టాక్ రిజిస్టర్

సమాధానాలు

1) 3	2) 2	3) 4	4) 2	5) 1
6) 3	7) 1	8) 4	9) 4	10) 2
11) 1	12) 3	13) 2	14) 2	15) 2
16) 3	17) 2	18) 2	19) 4	20) 4
21) 1	22) 2	23) 2	24) 1	25) 3
26) 4	27) 1	28) 4	29) 3	30) 3
31) 1	32) 2	33) 2	34) 1	35) 1
36) 2	37) 3	38) 4	39) 2	40) 2
41) 4	42) 4	43) 2	44) 1	45) 4
46) 3	47) 2	48) 3	49) 4	50) 1
51) 2	52) 4	53) 1	54) 3	55) 3
56) 1	57) 4	58) 2	59) 2	60) 3
61) 2	62) 3	63) 1	64) 4	65) 1

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

కోడ్ భాషలో DIESEL ను ఏ విధంగా రాస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రీజనింగ్

కోడింగ్ - డీకోడింగ్

1. ఒక ప్రత్యేక భాషలో 'EXERCISE' అనే పదాన్ని 'MTMVYRCM' గా రాస్తే అదే కోడ్ భాషలో 'RICE' అనే పదాన్ని ఏ విధంగా రాస్తారు.

- ఇందులో ఆంగ్ల పదంలోని అక్షరాలకు, కోడ్ పదంలోని అక్షరాలకు మధ్య సంబంధాన్ని కనుక్కోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రశ్నా పదం RICEలో ఉన్న అన్ని అక్షరాలు ఇచ్చిన పదం 'EXERCISE'లో ఉన్నాయి. దీని ఆధారంగా జవాబు కనుక్కోవచ్చు.

E X E R C I S E
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
M T M V Y R C M

కాబట్టి RICE కోడ్ VRYM

2. ఒక కోడ్ భాషలో BOARDను 40గా రాస్తే అదే కోడ్ భాషలో TUBEను ఏ విధంగా రాస్తారు?

- BOARD అనే పదంలోని అక్షరాల స్థాన విలువల మొత్తం 40

BOARD→ 2 + 15 + 1 + 18 + 4 = 40

అదే విధంగా

TUBE → 20 + 21 + 2 + 5 = 48

∴ TUBE కోడ్ 48

3. ఒక ప్రత్యేక కోడ్ భాషలో SOLVE THE PROBLEMS IN DOMESTIC SYSTEMను VROYH WKH SUREOHPV LQ GRPHVWLF VBVWHPగా రాస్తే అదే కోడ్ భాషలో కింది పదాలను ఏ విధంగా రాస్తారు?

a) HEN
b) INTER
c) MANGO

- HEN, INTER అనే రెండు పదాల్లోని అక్షరాలన్నీ పైన ఇచ్చిన ఆంగ్ల వాక్యంలో వచ్చాయి. కాబట్టి వాటికి కేటాయించిన కోడ్‌ల ఆధారంగా సమాధానం కనుక్కోవచ్చు.

a) HEN కోడ్ KHQ. అదేవిధంగా
b) INTER కోడ్ LQWHU, కానీ
c) MANGO అనే పదంలోని A, G అనే అక్షరాలు ఇచ్చిన ఆంగ్ల వాక్యంలో రాలేదు. కాబట్టి ఇప్పుడు ఇచ్చిన ఆంగ్ల వాక్యంలోని అక్షరాలకు, వాటి కోడ్ అక్షరాలకు మధ్య సంబంధాన్ని కనుక్కొని, దాని ఆధారంగా MANGO కోడ్ కనుక్కోవాలి.

ఆంగ్ల వాక్యంలోని ప్రతి అక్షరం, దాని తర్వాత మూడో అక్షరంతో కోడ్ చేసి రాశారు. కాబట్టి MANGO కోడ్ PDQJR అవుతుంది.

4. ఒక ప్రత్యేక కోడ్ భాషలో 'PUBLIC'ను 'QVCMJD'గా రాస్తే, అదే కోడ్ భాషలో 'OPINION'ను ఏ విధంగా రాస్తారు?

- PUBLIC అనే పదంలోని ప్రతి అక్షరాన్ని తర్వాత అక్షరంతో కోడ్ చేశారు.

P U B L I C
↓ ↓ ↓ ↓ ↓ ↓
Q V C M J D

అదే విధంగా OPINION అనే పదంలోని ప్రతి అక్షరాన్ని దాని తర్వాత అక్షరంతో కోడ్ చేయాలి.

O P I N I O N
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
P Q J O J P O

5. ఒక ప్రత్యేక కోడ్ భాషలో BRIGHTను 'CTLKMZ'గా రాస్తే, అదేకోడ్ భాషలో SUPERను ఏ విధంగా రాస్తారు?

- BRIGHT పదంలోని అక్షరాలను వరుసగా ఒకటో, 2వ, 3వ, 4వ, 5వ, 6వ అక్షరాలతో కోడ్ చేశారు.

B R I G H T
+1↓ +2↓ +3↓ +4↓ +5↓ +6↓
C T L K M Z

అదేవిధంగా

S U P E R
+1↓ +2↓ +3↓ +4↓ +5↓
T W S I W

∴SUPER ను TWSIW గా రాయవచ్చు.

6. ఒక ప్రత్యేక కోడ్ భాషలో 'STUDY'ని 'RSTCX'గా రాస్తే, అదే కోడ్ భాషలో CLASSను ఏ విధంగా రాస్తారు.

- STUDY అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని కంటే ముందున్న అక్షరంతో కోడ్ చేశారు. అదేవిధంగా CLASSను రాస్తే

C L A S S
↓ ↓ ↓ ↓ ↓
B K Z R R

∴CLASS కోడ్ BKZRR అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో PETROLను OBOKFA గా రాస్తే అదే కోడ్ భాషలో DIESEL ను ఏ విధంగా రాస్తారు?

- PETROLలోని ప్రతి అక్షరాన్ని వరుసగా దాని కంటే 1వ, 3వ, 5వ, 7వ, 9వ, 11వ స్థానాల్లో ముందున్న అక్షరంతో కోడ్ చేశారు.

P E T R O L
−1↓ −3↓ −5↓ −7↓ −9↓ −11↓
O B O K F A

అదేవిధంగా

D I E S E L
−1↓ −3↓ −5↓ −7↓ −9↓ −11↓
C F Z L V A

∴DIESELను CFZLVAగా రాయవచ్చు.

8. ఒక కోడ్ భాషలో LOVEను OLEVగా రాస్తే, అదే కోడ్‌భాషలో MARRIAGEను ఏ విధంగా రాస్తారు?

- ఈ ప్రశ్నకు మూడు సరైన సమాధానాలు ఉన్నాయి. అవి
  - LOVEఅనే పదంలో వరుసగా ప్రతి జత అక్షరాలను తారుమారు చేస్తూ రాస్తే OLEV వచ్చింది. అదే విధంగా MARRIAGEని రాస్తే MA RR IA GE→AMRRAIEG అవుతుంది.
  - మరో కోణంలో LOVE అనే పదంలోని సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో, చివరి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాశారు. అదేవిధంగా MARRIAGE అనే పదంలోని 8 అక్షరాల్లో మొదటి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాస్తే RRAM అవుతుంది. అదేవిధంగా చివరి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాస్తే EGAI అవుతుంది.
    ∴MARRIAGE కోడ్ RRAMEGAI అవుతుంది.
  - మరో కోణంలో LOVE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తిరోగమన స్థానాక్షరంతో కోడ్ చేశారు.
    L తిరోగమన స్థానాక్షరం O
    O తిరోగమన స్థానాక్షరం L
    Vతిరోగమన స్థానాక్షరం E
    E తిరోగమన స్థానాక్షరం V

అదే విధంగా MARRIAGE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తిరోగమన స్థానాక్షరంతో కోడ్ చేస్తే

M A R R I A G E
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
N Z I I R Z T V

∴ MARRIAGE కోడ్ NZIIRZTV అవుతుంది.

9. ఒక ప్రత్యేక కోడ్ భాషలో నలుపు అంటే ఎరుపు; ఎరుపు అంటే నీలం; నీలం అంటే ఆకుపచ్చ; ఆకుపచ్చ అంటే తెలుపు; తెలుపు అంటే నలుపు; అయితే ఆ కోడ్ భాషలో బొద్దింక రక్తం రంగును దేనితో సూచిస్తారు?

- ఇలాంటి ప్రశ్నలు వచ్చినప్పుడు, ముందుగా చివర ఇచ్చిన ప్రశ్నకు, సమాధానం కనుక్కోవాలి. తర్వాత ఈ పదాన్ని కోడ్‌భాషలో దేనితో సూచిస్తారో తెలుసుకోవాలి.
- పై ప్రశ్నలో బొద్దింక రక్తం తెలుపు రంగులో ఉంటుంది. ఆ కోడ్ భాషలో తెలుపును నలుపుతో సూచిస్తారు.

∴ జవాబు: నలుపు



10. కోడ్ భాషలో ప్రిన్సిపాల్ అంటే విద్యార్థి; విద్యార్థి అంటే తండ్రి; తండ్రి అంటే ఉపాధ్యాయుడు; ఉపాధ్యాయుడు అంటే డాక్టర్; డాక్టర్ అంటే ఇంజినీర్ అయితే ఆ కోడ్ భాషలో తరగతిలో బోధించే వ్యక్తిని ఏమని పిలుస్తారు?

- తరగతిలో బోధించే వ్యక్తిని ఉపాధ్యా యుడు అంటారు. ఆ కోడ్ భాషలో ఉపాధ్యాయున్ని డాక్టర్ అంటారు

∴ జవాబు: డాక్టర్

11. SPACE అంటే TQBDF అయితే PURSE అంటే?

1) QTSRF 2) OTQRD
3) QVSTF 4) ESRUP

- SPACE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తర్వాత అక్షరంతో కోడ్ చేస్తే TQBDF వచ్చింది. అదే విధంగా PURSE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తర్వాత అక్షరంతో కోడ్ చేస్తే QVSTF వస్తుంది

∴ జవాబు: (3)

12. ఒక కోడ్ భాషలో vin min hin అంటే How are you? అని; hin fin vin అంటే Where are you? అని అర్థం. అయితే ఆ కోడ్ భాషలో
(a) How
(b) are కోడ్ పదాలను కనుక్కోండి?

- (a) How

How అనే పదం మొదటి వాక్యంలో మాత్రమే ఉంది. మొదటి వాక్యంలో How మినహా మిగిలిన రెండు పదాలు, రెండో వాక్యంలో కూడా ఉన్నాయి. కాబట్టి How కోడ్ min అవుతుంది. ఎందుకంటే min అనే పదం రెండో కోడ్ వాక్యంలో పునరావృతం కాలేదు.

(b) are

are అనే పదంతో పాటు మరో పదం youలు రెండు వాక్యాల్లో పునరావృతం అయ్యాయి. కాబట్టి వీటి కోడ్‌లు కూడా పునరావృతం అవుతాయి. రెండు కోడ్ వాక్యాల్లో vin, hin అనే రెండు పదాలు పునరావృతం అయ్యాయి.

కాబట్టి are కోడ్ vin లేదా hin అవుతుంది.

13. ఒక కోడ్ భాషలో MANGOను 13-1-14-7-15గా రాస్తే, అదేకోడ్ భాషలో GRAPESను ఏ విధంగా రాస్తారు?

- MANGO పదంలోని ప్రతి అక్షరాన్ని, ఆంగ్ల అక్షరాల వరుస క్రమంలో దాని స్థాన విలువతో కోడ్ చేశారు. అదేవిధంగా

GRAPES కోడ్ 7-18-1-16-5-19

14. ఒక కోడ్ భాషలో TABLEను 21-3-5-16-10గా రాస్తే, అదే కోడ్ భాషలో CHAIR ను ఏ విధంగా రాస్తారు?

- TABLE అనే పదంలోని అక్షరాల స్థాన విలువకు వరుసగా 1, 2, 3, 4, 5లను కలిపి రాశారు.

T→ 20+1=21
A→ 1+2=3
B→ 2+3=5
L→ 12+4=16
E→ 5+5=10

అదే విధంగా

C→ 3+1=4
H→ 8+2=10
A→ 1+3=4
I → 9+4=13
R→18+5=23

∴ CHAIR కోడ్ 4-10-4-13-23

15. ఒక కోడ్ భాషలో TREATMENTను 123415361గా రాస్తే, అదే కోడ్ భాషలో
a) MEAT
b) RENTలను ఏ విధంగా రాస్తారు?

- T R E A T M E N T
1 2 3 4 1 5 3 6 1

∴ MEAT కోడ్ - 5341
RENT కోడ్ - 2361

16. ఒక కోడ్ భాషలో STATEను 1-2-1-2 -5గా రాస్తే అదే కోడ్‌భాషలో COUNTRYని ఏ విధంగా రాస్తారు.

- STATE అనే పదంలోని అక్షరాల స్థాన విలువలో ఒకే ఒక అంకె ఉంటే అదేవిధంగా, రెండంకెలు ఉంటే ఆ అంకెల మొత్తంగా కోడ్ చేస్తూ రాశారు.

S స్థాన విలువ 19
→ 1 + 9 = 10 → 1 + 0 = 1
T స్థాన విలువ 20→2+0=2
A స్థాన విలువ 1
T స్థాన విలువ 20→2+0=2
E స్థాన విలువ 5

కాబట్టి STATE కోడ్ 1-2-1-2-5

C స్థాన విలువ - 3
O స్థాన విలువ -15→1+5=6
U స్థాన విలువ - 21→2+1=3
N స్థాన విలువ - 14→1+4=5
T స్థాన విలువ - 20→2+0=2
R స్థాన విలువ - 18→1+8=9
Y స్థాన విలువ - 25→2+5=7

∴COUNTRY కోడ్ 3-6-3-5-2- 9-7

17. WINTERను 24-8-15-19-6-17గా రాస్తే, SUMMERను ఏ విధంగా రాస్తారు?

- WINTER అనే పదంలోని అక్షరాల స్థాన విలువలకు వరుసగా +1, -1, +1, -1, +1, -1 చేస్తూ కోడ్ చేశారు.


W→ 23+1=24
I → 9-1=8
N→ 14+1=15
T→ 20-1=19
E→ 5+1=6
R→ 18-1 =17

అదేవిధంగా

S→ 19+1 = 20
U→ 21-1 = 20
M→ 13+1 = 14
M→ 13-1 = 12
E→ 5+1 = 6
R→ 18-1 = 17

∴ SUMMER కోడ్
20-20-14- 12-6-17

What is the meaning of the phrase 'substantial moderation'



BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No 1-10): Read the following passage carefully and answer the questions that follow.

Five years ago, any sign of weakness in the Rupee would have been the cue for RBI officials, ministers and sundry economic commentators to lash out at Indian households for their unreasonable and unpatriotic love for gold.

And it is true that gold imports had a big role to play in India's yawning trade deficit and precarious balance of payments position in 2013.

But as the Rupee has entered shaky territory again it is oil rather than gold that has been the hot topic of debate. There's good reason for this shift.

A break down of India's import bill suggests that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. In fact, data suggest that the Indian saver's love affair with gold may be well past its prime.

When India faced a run on the Rupee and a widening trade deficit in 2013, its annual gold import bill had topped $50 billion for the second year running. Between FY10 and FY13, India saw consistently high demand for gold jewellery, bars and coins despite **galloping** global gold prices.

The bloated the country's gold import bill from about $28 billion in FY10 to a record $56 billion in FY12.

But gold imports have since seen **substantial moderation** from those excessive levels. In FY18, India's dollar outgo on gold imports amounted to just $34 billion, having shrunk 40 percent from the peak six years ago. Lest you think this is an **aberration**, gold imports have hovered in a narrow range of $27 billion to $35 billion for five years now. Bullion accounted for nearly 12 percent of the country's import bill in FY12. But its contribution is now down to about 7 percent.

This explains why debates around the current account deficit no longer **obsess** over the yellow metal.

Trends in domestic demand, tracked by the World Gold Council, show that Indian consumers have been cutting back on the volume of gold purchases in the last five years. In the years from 2010 to 2012, the consumers accumulated anywhere between 900 and 1,000 tonnes of bullion a year. Jewellery accounted for about two-thirds of this volume, with bars and coins making up a third.

In the last five years though, bar and coin demand has halved from 355 tonnes in 2012 to 164 tonnes in 2017. Jewellery demand, after rising from 595 tonnes to 662 tonnes between 2012 to 2015, has flat-lined, slipping back to 573 tonnes in 2017.

As a result, aggregate domestic demand for gold has fallen by 20 percent between 2012 and 2017.

So, what has made Indian consumers cold-shoulder their favorite asset? Several factors seem to be at play.

Indian gold buyers view bullion as much as an investment as an item of adornment. We all know that any investment is most sought-after when its returns are soaring. So it was with gold.

In the five years following the global financial crisis in 2008, gold churned out bumper returns for Indian investors who hoarded it, thanks to a global flight to safe-haven assets and a steadily depreciating Rupee.

With domestic gold holders earning a 20 percent plus return for five consecutive years until 2013, investment demand for the yellow metal sky-rocketed. Gold is also seen as a hedge against inflation and the runaway price-spike in this period also **stoked** demand.

But with the global stock and bond markets staging a recovery from 2013, and inflation flagging, gold began to lose its **mojo**. As the Rupee stabilized, domestic gold investments suffered three consecutive years of negative returns from 2015 to 2017, dousing investor interest. Purchases of bars and coins, which topped 340 tonnes in 2013, had crashed to 164 tonnes by 2017.

1. The author of the passage asserts that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. Then who is the real culprit?
   1) Major steps of economic reforms taken by the incumbent government.
   2) Price hike of crude oil in global market and its impact of Indian economy.
   3) Exemption of petrol and diesel from GST
   4) All (1), (2) and (3)
   5) Only (1) and (2)
2. What is the meaning of the phrase 'substantial moderation' as used in the passage?
   A) Remarkable downward trend
   B) Noticeable upward movement
   C) Either upward or downward trend
   1) Only A 2) Only B 3)Only C
   4) None of these
   5) Other than those given as options
3. What was the impact of Indian households' unreasonable and unpatriotic love for gold in 2013 on Indian economy?
   A) Due to excessive demand by Indian household the government earned huge revenue through taxation resulting in improvement in Indian economy.
   B) The unreasonable demand of gold by Indian household gave rise to a situation of trade deficit.
   C) As a result of excessive demand of gold in Indian bullion market the balance of payments position improved.
   1) Only A 2) Only B 3) Only C
   4) Both A and B
   5) All A, B and C
4. Find the incorrect statement on the basis of the given passage.
   1) Bullion accounts for about 7 per cent of the country's import bill as of now.
   2) The consistent high demand for gold jewellery, bars and coins bloated the country's gold import bill to a record $56 billion in FY12.
   3) As per the observation of the World Gold Council, Indian consumers showed heightened inclination towards purchase of yellow metal in the last five years.
   4) Between 2012 to 2017 the aggregate domestic demand for gold has come down by 20 percent.
   5) None of the above
5. Why did people prefer to invest in gold rather than in other class of investments during the period following the global financial crisis in 2008 till 2013? Answer on the basis of the given passage.
   1) Because gold gave attractive returns on its sale
   2) Because the investment in gold was seen as a hedge against inflation
   3) Because of easy liquidity of gold
   4) Only (1) and (2)
   5) All (1), (2) and (3)

Directions (Q.No 6-8): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold as used in the passage.

6. **Obsess**
   1) Repulse 2) Dominate
   3) Exude 4) Distract 5) Rely
7. **Stoked**
   1) Slumped2) Declined
   3) Surged 4) Supplied5) Relied
8. **Mojo**
   1) Poison 2) Price
   3) Junk 4) Life 5) Charm

Directions (Q.No 9-10): Choose the word which is MOST OPPOSITE in meaning of the word printed in bold as used in the passage.

9. **Galloping**
   1) Jumping2) Running
   3) Speedy 4) Halted 5) Flying
10. **Aberration**
    1) Conformity 2) Peculiarity
    3) Delusion 4) Weirdness
    5) Deviation

Directions (Q.No 11-15): Read each sentence to find out whether there is any grammatical or idiomatic error in it. The error, if any, will be in one part of the sentence, the number of that part is the answer. If there is "No error", the answer is 5. (Ignore errors of punctuation, if any).

11. (1) It is amazing how concern for / (2) the common man and the inconvenience caused to them / (3) has suddenly become / (4) a huge issue for the Opposition. / (5) No error
12. (1) Casting aspersions on the suitability / (2) of Donald Trump as president of the United States/ (3) amounts to disrespecting / (4) the American people's verdict. / (5) No error
13. (1) While Modi continues his harangue, / (2) some BJP members are behaving like Nero/ (3) playing the fiddle / (4) while Rome burnt. / (5) No error
14. (1) For India to remain a constitutional democracy / (2) we need a Supreme Court that operates/ (3) as an effective check on majority / (4) legislative and executive power. / (5) No error
15. (1) The Indian embassy in Beijing has now asked / (2) the government to consider extending / (3) the March 31 deadline for NRI / (4) as many cannot travel to India before then. / (5) No error

KEY

1) 2 2) 1 3) 2 4) 3 5) 4
6) 2 7) 3 8) 5 9) 4 10) 1
11) 2 (Replace 'them' with 'him' 12) 5
13) 4 (Replace 'burnt' with 'burns')
14) 3 (Replace 'majority' with majoritarian')
15) 3 (Replace 'NRI' with 'NRIs')

ఉద్యోగాలు

ఎడ్‌సిల్ లిమిటెడ్‌లో 20 పోస్టులు

ఢిల్లీలోని ఎడ్‌సిల్ లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 20.
- పోస్టుల వివరాలు: సీనియర్ కన్సల్టెంట్-01, కన్సల్టెంట్-మేనేజ్‌మెంట్-03, సివిల్ ఇంజనీరింగ్-02, సాఫ్ట్‌వేర్ డెవలపర్-04, పబ్లికేషన్ అండ్ బ్రాండింగ్ ఎక్స్‌పర్ట్-01, అకౌంటెంట్-03, ఐటీ స్టాఫ్-06.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- ఎంపిక విధానం: విద్యార్హతలు, పని అనుభ వం, రాతపరీక్ష, ఇంటర్వ్యూ, పీపీటీ ఆధారంగా

ముఖ్య సమాచారం:

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులకు చివరితేది:14.10.2024.
- వెబ్‌సైట్: https://www.edcilindia.co.in/

యూపీఎస్సీ-ఈసీఈ-2025 పరీక్ష

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా రైల్వే, టెలికాం, డిఫెన్స్ సర్వీస్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగాలు పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు.

మొత్తం ఖాళీల సంఖ్య: 232.

- విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
- అర్హత: పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, బీఈ/బీటెక్ చదివి ఉండాలి. లేదా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) ఇన్‌స్టిట్యూట్ ఎగ్జామినేషన్స్ ఎ, బి విభాగాలు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అసోసియేట్ మెంబర్‌షిప్ ఎగ్జామినేషన్ పార్ట్స్ 2, 3/సెక్షన్లు ఎ, బి అర్హత సాధించాలి. లేదా ఎలక్ట్రానిక్స్-టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూషన్(ఇండియా) గ్రాడ్యుయేట్ సభ్యత్వ పరీక్ష పాసై ఉండాలి.
- వయసు: 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక విధానం: స్టేజ్-1(ప్రిలిమినరీ/స్టేజ్-1) ఎగ్జామ్, స్టేజ్-2(మెయిన్/స్టేజ్-2) ఎగ్జామ్, స్టేజ్-3(పర్సనాలిటీ టెస్ట్), మెడికల్ టెస్ట్ సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులకు చివరితేది: 08.10.2024.
- ప్రిలిమినరీ/స్టేజ్-1 పరీక్ష తేది: 09.02.2025.
- వెబ్‌సైట్: https://-upsc.gov.in/.